# ప్రభాత్

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార త్రైమాసిక పత్రిక

సంపుటి - 17　　సంచిక - 2　　ఏప్రిల్ - జూన్ 2004　　వెల - 10 రూపాయలు

**ఈ సంచికలో....**


- సీకంపోసా మూడో మహాసభ రిపోర్టు ... 8
- సీపీఎన్ (ఎం) డాక్యుమెంటు
  వైరుధ్యాలను సరిగా పరిష్కరించడం ద్వారా ... 11
- గోబెల్స్ తరహా అబద్ధాలు
  నేపాల్ విప్లవ పురోగమనాన్ని ఆపలేవు ... 16
- పోరుబాటలో ముందడుగేస్తున్న దండకారణ్య ప్రజలు ... 17
- మావో వ్యాసాలు ... 29
- సామ్రాజ్యవాదులు – కాఫీ సంక్షోభం ... 32
- హైతీపై అమెరికా దురాక్రమణను ఖండించండి ... 36
- అమరులకు శ్రద్ధాంజలి ... 37


లోక్‌సభ ఎన్నికల విశ్లేషణ


## కూటమేదైనా ప్రభుత్వ మౌలిక విధానాలలో మార్పేమీ ఉండబోదు !

## ప్రజాయుద్ధ పంథాలో పోరాడడమే నేటి ప్రత్యామ్నాయం !!

14వ లోక్‌సభకు జరిగిన ముందస్తు ఎన్నికల ఫలితాలు భాజపా నాయకత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ)ని గద్దె దించాయి. 22 పార్టీల కలయికతో గద్దెనెక్కిన కూటమి ఎన్నికల నాటికి 16కు తగ్గింది. ఈ కూటమికి నాయకత్వం వహించిన భాజపా ఎన్నికల ప్రచారంలో భాగంగా ముందుకు తెచ్చిన పలు విధానాలను, ప్రజాకర్షక నినాదాలను ఎన్నికల స్టంటుగా భావించిన ఓటర్లు దానికి గట్టిగా బుద్ధి చెప్పారు. 'ఫీల్ గుడ్', 'షైనింగ్ ఇండియా' (భారత్ ఉదయ్), అటల్ ఫ్యాక్టర్, సినీ తారల విస్తృత పర్యటనలు, భాజపాలోని 'టాప్ టెన్' పర్యవేక్షణలో సాగిన హైటెక్ ప్రచారం ఇవేవీ ఓటర్లను ఆకర్షించలేకపోయాయి. ఈ కూటమి ముందుకు తెచ్చిన సోనియా విదేశీయత సమస్య, రామమందిర సమస్య, ఐదేళ్లలో సాధించిన ప్రగతి అంటూ చెప్పుకున్న అన్ని విషయాలనూ ఓటర్లు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. గుజరాత్ నరమేధాన్ని, విద్య కాషాయీకరణను, మతోన్మాదాన్ని రెచ్చగొట్టే సంఘ్ పరివార్ చర్యలను, కరువు తాండవిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, తరచుగా నిత్యావసర వస్తువుల ధరల్ని పెంచడాన్ని, నిరుద్యోగ నిర్మూలనకు ఎలాంటి చర్యలు చేపట్టని ప్రభుత్వ విధానాలను, లాభాలార్జిస్తున్న ప్రభుత్వ పరిశ్రమల అమ్మకాన్ని, కార్మికులను పని లోంచి తొలగించడాన్ని, అప్పుల పాలైన రైతుల ఆత్మహత్యలను అరికట్టలేకపోవడాన్ని ఓటర్లు మర్చిపోలేదని ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ఎక్కడికక్కడే రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు, కేంద్రంలో ఎన్‌డీఏ చేపట్టిన/చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగి వేసారిన ఓటర్లు చాలా వరకు ఆ ప్రభుత్వాలకూ, ఎన్‌డీఏకూ వ్యతిరేకంగా ఓటు చేసిన ఫలితంగా కాంగ్రెస్ నాయకత్వంలోని 'సంయుక్త ప్రగతిశీల కూటమి' (యూపీఏ) అధికారంలోకి వచ్చింది. 14 పార్టీల కలయికతో ఏర్పడిన ఈ కూటమికి సోనియా గాంధీ (!) నాయకత్వం వహిస్తుండగా ప్రభుత్వానికి మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి అయ్యాడు. ఏ కూటమిలో ఏ పార్టీలున్నా ఇవన్నీ గత 52 సంవత్సరాలుగా ఏదో రూపంలో ఈ దేశ ప్రజలను పాలిస్తున్నవే. ఇవి కేంద్రంలో పొత్తులేర్పర్చుకోవడం, రాష్ట్రాల్లో చాలా వరకు తమ సొంత బలంపై ప్రభుత్వాలను ఏర్పర్చడం చూస్తూనే ఉన్నాం. వీరెవరు ఏ పార్టీలో ఉండి, ఏ పొత్తులో ఉండి ఎక్కడ అధికారాన్ని వెలగబెడుతున్నా ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కాలేదు. వీరెవరూ పరిష్కరించలేరు. ఏ కూటమి ఎన్నికయినా అదనపు పన్నుల భారం, ధరల పెరుగుదల, నిరుద్యోగం పెరుగుదల, అప్పుల భారం, ఆకలి, పేదరికం, ఉచిత విద్యా వైద్య సౌకర్యాలు లభించకపోవడం వంటి సమస్యలు ప్రజలకు తప్పేవి కావు.

దేశంలో ఏ ఒక్క బూర్జువా, రివిజనిస్టు పార్టీ కూడా తమ సొంత బలంపై ప్రజలను పాలించలేదని ఏ ఏటికాయేడు దిగజారిపోతున్న వాటి తీరుతెన్నులే తెలియజేస్తున్నాయి. గత దశాబ్ద కాలంగా ఈ ధోరణి ప్రబలంగా ముందుకు వస్తోంది. దేశంలో నేటికీ 'జాతీయ' పార్టీలుగా మిగిలిన ఆరింటిలో ఏ ఒక్కటీ ఆ స్థితిలో లేదని దిగజారుతున్న వాటి పరిణామాలే తెలుపుతున్నాయి. కాకపోతే ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఆలస్యంగా గుర్తించి తన 'పచ్‌మఢీ' మహాసభ నిర్ణయాలను వదులుకోక తప్పలేదు. పదేళ్లుగా అధికారానికి ముఖం వాచిన కాంగ్రెస్ కేంద్రంలో అధికారాన్ని చేపట్టాలన్న తహతహతో అనివార్యంగా పొత్తులకు దిగింది. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ), లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ), నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ), ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే), తెలంగాణా రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్), ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) మొదలైన పార్టీలతో ఎన్నికలకు ముందే పొత్తు కుదుర్చుకున్న ఫలితంగా కాంగ్రెస్ పార్టీ 145 సీట్లు గెల్చుకోగల్గింది. దాని కూటమికి మొత్తం 220 సీట్లు రావడంతో అది అతి పెద్ద కూటమిగా అవతరించింది. అయినప్పటికీ అధికారాన్ని చేపట్టడానికి కావల్సినంత మెజారిటీ దానికి లేనే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రివిజనిస్టులు తమ స్వభావరీత్యానే కాంగ్రెస్ పట్ల ఉడుతాభక్తిని ప్రదర్శించారు. అప్పటికే అక్కడక్కడ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీతో సీట్ల సర్దుబాటు చేసుకున్న రివిజనిస్టులు ఈసారి అపూర్వస్థాయిలో

**జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు గ్రామగ్రామాన అమరవీరుల వారాన్ని జరుపుకుందాం !**




62 సీట్లు గెల్చుకొని కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారు. కాంగ్రెస్‌కు లేని గుణాలన్నీ ఉన్నట్టుగా జనాల ముందు పెట్టి తమ తుంపిర్ల బలంతో ఈసారి లాభపడిన రివిజనిస్టులు కాంగ్రెస్‌కు మద్దతునిచ్చి తమ ప్రభుభక్తిని చాటుకున్నారు. అయితే కష్టకాలంలో కాంగ్రెస్‌తో అంటకాగడం 1969 నుండీ వీరు చేస్తూ వస్తున్నదేనని రివిజనిస్టుల చరిత్ర తెలిసిన వారికి విడిగా చెప్పాల్సిన పనే లేదు. అయితే ఇంతకాలం విరుద్ధ కూటములలో ఉంటూ వచ్చిన సీపీఐ, సీపీఎంలు ఇప్పుడు సెక్యులర్ పేరుతో ఒకే గూటికి రావడం విశేషం. అలాగే వీరి మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పర్చిన యూపీఏకు దాన్ని నడిపించడంలో పెద్ద ఇబ్బందులేమీ ఉండవని కాంగ్రెస్ పార్టీ ఆర్థిక వ్యవహారాల సెల్ కార్యదర్శి జైరాం రమేష్ స్పష్టం చేశాడు. రివిజనిస్టు పార్టీల ప్రణాళికల్లో, కాంగ్రెస్ పార్టీ ప్రణాళికల్లో మౌలికమైన తేడాలేమీ లేవన్నాడు. ఇదీ రివిజనిస్టు పార్టీల అసలు నైజం!


అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం ఆరంభ శూరత్వంగా పలు వాగ్దానాలు చేసేస్తోంది. గతంలో ఎన్‌డీఏ కూడా ఇంతకు మించే ఇలాంటి వాగ్దానాలు చేసిందన్న విషయం మరచిపోవద్దు. ఇప్పుడు యూపీఏ పోటాను రద్దు చేస్తామంది. అయితే దీని స్థానంలో మరేదైనా చట్టం మాత్రం అవసరమని గృహమంత్రి సెలవిచ్చాడు. స్థూల దేశీయోత్పత్తిలో విద్యారంగానికి 6 శాతం, వైద్య రంగానికి 3 శాతం కేటాయిస్తామన్నారు. రానున్న ఐదేళ్లలో రెవెన్యూ లోటు లేకుండా చేస్తామంటున్నారు. వచ్చే మూడేళ్లలో గ్రామీణ ప్రాంతానికి రెట్టింపు అప్పులు అందజేసి రైతాంగాన్ని ఆదుకుంటామంటున్నారు. నిరుద్యోగులకు ఏటా 100 రోజుల పని దినాలు కల్పిస్తామంటున్నారు. అభివృద్ధికాముక, ఉపాధికాముక, మదుపుపూరిత దృష్టితో సగటు మనిషి అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పుతూనే ఉదారవాద విధానాల దిశలో కృషి చేస్తుందని సూటిగానే చెప్పారు. ఇదే అసలు విషయం. ఈ దేశంలో నూతన ఆర్థిక విధానాల రూపకల్పనకు తొలిసారిగా పూనుకున్నది మేమే అంటూ కాంగ్రెస్ పార్టీ నేటికీ సగర్వంగా చెప్పుకుంటుంది. నూతన ఆర్థిక విధానాలంటే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలే. వీటికి లోబడి ఏ ప్రభుత్వం పని చేసినా అది ఎంత వేగంగా వాటిని అమలు చేస్తుందనే విషయంలోనే తేడా తప్ప అవన్నీ యదావిధిగానే కొనసాగుతాయి. ఈ విధానాలే ఇన్నేళ్లుగా ప్రజలను పీడిస్తున్నాయి. ఈ దేశంలో ఎన్నడెరుగని విధంగా ఐదు వేలకు పైగా రైతాంగం ఆత్మహత్యలకు పూనుకున్నది ఈ విధానాల ఫలితంగానే. కొత్త కొత్త రూపాల్లో కార్మికులను ఉద్యోగాల నుండి తొలగిస్తున్న విధానాలివి. విద్యా-వైద్యం సగటు మనిషికి అందకుండా చేస్తున్న విధానాలివి. బహుళజాతి కార్పొరేషన్లచే నకిలీ ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు అందిస్తూ, పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా చేస్తూ రైతును డబ్ల్యూటీవో విధానాలకు కట్టిపడేసే దివాళా తీయిస్తున్న విధానాలు ఇవి. దేశంలో లెక్కలేనన్ని అవినీతి కుంభకోణాలను సృష్టిస్తున్న విధానాలివి. వీటి దుష్ఫలితాలను భరించలేని ప్రజలు సమ్మెలకు, ధర్నాలకు, మిలిటెంటు పోరాటాలకు పూనుకుంటే వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్న విధానాలివి. పౌర, ప్రజాస్వామ్య హక్కులను సహించనివివి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజా వ్యతిరేక సామ్రాజ్యవాద అనుకూల విధానాలు ఇవి. వీటికి లోబడి ఏ ప్రభుత్వం పని చేసినా అది తీసుకునే ప్రతి నిర్ణయం, చేపట్టే ప్రతి చర్యా అంతిమంగా ప్రజలకు భారంగానే మారుతుంది.

ఈ దేశాన్ని 'స్వాతంత్ర్యా'నంతరం నుండి ఇప్పటి వరకు అధిక కాలం పాలించింది కాంగ్రెస్ పార్టీయే. 1990 దశకం వచ్చేసరికి ఈ పార్టీ పూర్తి పతనావస్థకు చేరుకుంది. పార్టీని నడిపించడానికి సమర్థవంతమైన నాయకత్వం కూడా లేని దుర్దశకు చేరుకుంది. ఈ స్థితి నుండి బయటపడడానికి అది చేస్తున్న కసరత్తుల్లో భాగంగానే ప్రస్తుతం దాని నాయకత్వంలో యూపీఏ ఆవిర్భవించిందని పైన చూశాం. కేంద్రంలో పరిస్థితి ఇలా ఉండగా అనేక రాష్ట్రాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కానీ తాను కేంద్రంలో ఉండి పరిపాలించినపుడు గానీ, ఇప్పుడు అది పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో గానీ అది ఇవ్వాళ ఎన్ని వాగ్దానాలు చేస్తున్నా ప్రజల జీవిత విధానాల్లో ఎలాంటి మార్పు రాలేదు. దినదినం ప్రజల జీవన పరిస్థితులు దిగజారి పోవడానికీ, దేశం అప్పులపాలు కావడానికీ, ప్రజల్లో దారిద్ర్యం, అవిద్య, ఆకలిచావులు పెరగడానికి అది మొదటి నుండి అవలంబిస్తున్న విధానాలే కారణం. ఆ విధానాలనే వేగంగా కొనసాగించిన ఎన్‌డీఏ ఆ దుష్పరిణామాలను మరింత తీవ్రం చేసింది. ఇప్పుడు ఆ కాంగ్రెస్ నాయకత్వంలోనే అధికారాన్ని చేపట్టిన యూపీఏ కూడా గతానికి భిన్నంగా ఏ మాత్రం చేయదని నెలరోజుల్లో అది తీసుకున్న నిర్ణయాలే వెల్లడి చేస్తున్నాయి. పోటా స్థానంలో మరో చట్టం తెస్తామంటున్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాసు ధరలు పెంచేశారు. కోల్ ఇండియాలో 80 వేల మంది కార్మికులను, ఎస్ఈసీఎల్‌లో 10 వేల మంది కార్మికులను, బీసీసీఎల్‌లోని వేలాది కార్మికులను త్వరలో తొలగించే పథకాలు సిద్ధమవుతున్నాయి. రివిజనిస్టుల రాజకీయాలను నిజంగానే నమ్ముతున్నవారు ప్రస్తుత యూపీఏ ప్రభుత్వానికి వారి (రివిజనిస్టుల) సమర్థన ఉన్నందున ప్రజాహిత విధానాలను చేపట్టడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కానీ కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో అవి దశాబ్దాలుగా చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను వారు నిజాయితీతో చూడగలిగితే త్వరలోనే అసలు విషయాన్ని గ్రహించగలుగుతారు. బూర్జువా పార్టీలకు, రివిజనిస్టు పార్టీలకు మౌలిక విషయాల్లో పూర్తి అంగీకారం ఉండే పొత్తులేర్పర్చుకుంటున్నాయని గుర్తిస్తారు. అంతేకాదు, ప్రజలను మోసగించడంలో రివిజనిస్టులు ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తారన్న విషయాన్ని కూడా మర్చిపోగూడదు.

ఎన్‌డీఏకు నాయకత్వం వహించిన భాజపా తన ఓటమికి దారితీసిన కారణాలను తెల్చుకోవడంలో ఇప్పుడు కొట్టుకు చస్తోంది. చాలా కాలంగా కొనసాగుతున్న దాని అంతర్గత కుమ్ములాటలు ఇప్పుడు బహిరంగంగా ముందుకు వస్తున్నాయి. భాజపాలోని ఉదారవాదులకూ, తీవ్రవాదులకూ మధ్య ఘర్షణగా అవి వ్యక్తమవుతున్నాయి. ఇంతకాలం వీరి తగవులన్నీ అధికారం అనే ముసుగు చాటున పేరుకుపోతూ వచ్చాయి. మధ్యమధ్యలో 'సంఘ్ పరివార్'కు చెందిన స్వదేశీ జాగరణ్ మంచ్ ఎన్‌డీఏ ఆర్థిక విధానాలను విమర్శించినా, విశ్వ హిందూ పరిషత్ నాయకుడు అశోక్ సింఘల్, ప్రవీణ్ తొగడియాలు రామమందిరం విషయంలో వాజ్‌పేయిని తిట్టిపోసినా, పాకిస్తాన్‌తో స్నేహం విషయంలో శివసైనికులు ధ్వజమెత్తినా, వాజ్‌పేయి విధానంపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కావలిసినన్ని

చురకలంటిస్తూ వచ్చినా వాటన్నిటి పరాకాష్టగానే ఇప్పుడు కుమ్ములాటలు బహిరంగమయ్యాయి. జూన్ 20న ముంబాయిలో జరుగనున్న భాజపా జాతీయ కార్యవర్గ సమావేశాలు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. గుజరాత్ నరమేధం, నరహంతక మోదీ ప్రస్తుత చర్చలకు సహజంగానే కేంద్ర బిందువయ్యాడు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణంలోనే ఆర్ఎస్ఎస్ అధికార ప్రతినిధి రాంమాధవ్ మాట్లాడుతూ 'సంఘ్ మూల సిద్ధాంతాల నుండి భాజపా దూరమైన ఫలితంగానే ఓటమి సంభవించింది' అని అన్నాడు. దాదాపుగా సంఘ్ పరివార్‌కు చెందిన అనుబంధ సంస్థలన్నీ ఇదే అంచనాతో ఏకీభవిస్తూ మాట్లాడాతున్నాయి. అయోధ్య, హిందుత్వ విడిచి ఓడినామని అద్వానీ కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పాడు. అంటే వీరు మరోసారి దేశం మీదికి తమ హిందూ మతోన్మాద ఉగ్రరూపాన్ని బహిరంగంగా ప్రదర్శించనున్నారని గ్రహించవచ్చు. కాంగ్రెస్ హయాంలో 33 వేల మతోన్మాద ఘర్షణలు జరిగాయని చెబుతూ ముక్తార్ అబ్బాస్ నక్వీ తమ గుజరాత్ నరమేధాన్ని సమర్థించుకుంటున్నారు. వీరి ప్రమాదాన్ని భారత ప్రజలు ఎన్నడూ విస్మరించగూడదు. ప్రతిపక్షంలో ఐదేళ్లు భరించలేమని కూడా అంటున్నారు. అంటే వీరు తిరిగి అధికారంలోకి రావడానికి ఎంతటి నీచానికైనా ఒడిగడుతారని అర్థం చేసుకోవాలి. అసలు సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడంలో మహా తెలివైన భాజపా నేతలు ఇప్పుడు యూపీఏ చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలను పోరాడకుండా చేయడానికి పోటా కొనసాగింపుకు, కళంకిత మంత్రులకు ఉద్వాసనకు ఉద్యమిస్తామంటున్నారు. హిందుత్వ, అయోధ్యలను ముందుకు తెస్తామంటున్నారు. వీరి మోసపు ప్రచారాలను, ప్రజా వ్యతిరేక ఉద్యమాలను ప్రజలు ఎండగడుతూ వీరి అసలు ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడాలి.

14వ లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, కర్నాటక, సిక్కిం రాష్ట్రాల విధానసభలకు కూడా ఎన్నికలు జరిగాయి. వీటిలో మూడు రాష్ట్రాల్లో అధికారంలోనున్న పార్టీలకు వ్యతిరేకంగా ఫలితాలు రాగా ఒరిస్సాలో మాత్రం తిరిగి బీజేడీయే అధికారంలోకి వచ్చింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిదేళ్లు పరిపాలన సాగించిన తెలుగుదేశం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. సైబర్ జార్‌గా వార్తల్లోకెక్కిన చంద్రబాబు నాయుడు ఆస్ట్రేలియాకు చెందిన మాకిన్‌సే అండ్ కంపెనీ సలహాలతో అప్పులపై అప్పులు తెస్తూ, దీర్ఘకాల పథకాలను రూపొందిస్తూ 'విజన్ 2020', 'స్వర్ణాంధ్రప్రదేశ్' అంటూ ఊదరగొట్టాడు. ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని విధంగా ప్రచారాన్ని చేపట్టి అందుకు 350 కోట్ల రూపాయల




ప్రజాధనాన్ని దుర్వినియోగపర్చాడు. ఇంటా, బయటా 75,000 కోట్ల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని 'రుణాంధ్రప్రదేశ్'గా దిగజార్చాడు. ప్రపంచ బ్యాంకు సంస్కరణల ఎజెండాతో దానికి నమ్మినబంటుగా పని చేశాడు. ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా పేరు పొందాడు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని పెంచడంలో శ్రద్ధ చూపిన ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల సమస్యలను తీర్చడంలో ఘోరంగా విఫలమై అన్ని సెక్షన్ల ప్రజల వ్యతిరేకతకు గురయ్యాడు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా జరుగనన్ని రైతాంగ ఆత్మహత్యలు ఆంధ్రప్రదేశ్‌లో జరిగాయి. మూడు వేల మంది రైతులు పంటలు చేతికి రాక, అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యలకు పాల్పడితే పంచాయితీ రాజ్ శాఖా మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా (ప్రభుత్వం వేసే ముష్టి) దొరుకుతుందని రైతులు చస్తున్నారన్నాడు. రైతాంగం పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గ వైఖరి ఇది. రాష్ట్రాన్ని అంతర్జాతీయ ద్రవ్య సంస్థలకు తాకట్టు పెడుతూ అప్పులు తెచ్చి సింగపూర్, మలేషియా, చైనా నమూనాలో అభివృద్ధి చేస్తానని ప్రజలను పీడించుకుతింటూ, ప్రజా ఉద్యమాల అణచివేతకు ప్రయోగశాలగా రాష్ట్రాన్ని మార్చడాన్ని ఖండిస్తూ, తన తొమ్మిదేళ్ల పోలీసు పాలనలో 1400 మంది విప్లవకారులను పొట్టన పెట్టుకోవడానికి ప్రతిగా సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] నాయకత్వంలోని పీజీఏ దాడి చేయడంతో బెంబేలెత్తిపోయిన తెలుగుదేశం పార్టీ నక్సలైట్లపై రెఫరెండం అంటూ ముందస్తు ఎన్నికలకు దిగింది. కానీ, ప్రజలు మేం నక్సలైట్ల పక్షమేనని చెప్పకనే చెప్పి తెలుగుదేశాన్ని ఓడించారు.

అన్ని వర్గాల ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తిని సొమ్ము చేసుకుంటున్న కాంగ్రెస్ కేంద్రం తరహాలోనే రాష్ట్రంలో పొత్తులకు దిగి మూడింట రెండొంతులకు పైగా మెజారిటీతో గెల్చింది. దశాబ్ద 'సన్యాసాన్ని' భరించిన కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చింది. కాబట్టి అది ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయాల్సిందిగా ప్రజలు దానిని కచ్చితంగా డిమాండ్ చేయాలి. అది తెలుగుదేశం పార్టీ లాగే ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడడాన్ని ప్రజలు ధైర్యంగా ప్రతిఘటించాలి. కాంగ్రెస్ గత విధానాలెరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు దాని ప్రజాకర్షక నినాదాలతో, హామీలతో మోసపోగూడదు. కాంగ్రెస్‌తో పొత్తుకు దిగిన తెలంగాణా రాష్ట్ర సమితి సాధించే తెలంగాణా భౌగోళికంగా ఒక ప్రత్యేక రాష్ట్రాన్ని సాధిస్తుందేమో గానీ నెత్తురోడుతున్న తెలంగాణాకు అది ఇంకెలాంటి న్యాయం చేయదు. దేశంలోనే రైతాంగ పోరాటానికి తలమానికంగా నిల్చిన తెలంగాణా ఆంధ్ర ప్రజలు ప్రజాయుద్ధ పంథాలోనే తమ అన్ని సమస్యలు పరిష్కరించుకోవాలి.

ప్రజాయుద్ధ పంథాలోనే సమస్యలు పరిష్కరించుకోవడం ఏనాటికానాడు దేశవ్యాప్తంగా బలంగా ముందుకొస్తోంది. దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో ప్రజాయుద్ధం సంఘటితపడుతూ విస్తరిస్తోంది. ప్రజాయుద్ధం విస్తరిస్తున్న మేరకు బూటకపు ఎన్నికల బహిష్కరణ నినాదం ప్రజలను చైతన్యవంతం చేస్తోంది. అలాగే తమ జాతి డిమాండ్ల కోసం పోరాడుతున్న కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ ఎన్నికల తంతును వరుసగా బహిష్కరిస్తూనే వస్తున్నారు. మరోవైపు దేశ ప్రజలకు ఈ దోపిడీ వర్గ పార్టీల పట్లా, వీటి బూటకపు ఎన్నికల పట్లా భ్రమలు పోతున్నాయని పడిపోతున్న ఎన్నికల శాతాలే తెలుపుతున్నాయి. పోలింగ్‌లో 35-40 శాతానికి మించి ఓటర్లు పాల్గొనడం లేదు. చాలా చోట్ల తమ సమస్యల పరిష్కారానికి ఎన్నికల బహిష్కరణ ఒక పోరాట రూపమని కూడా ప్రజలు భావించి అమలు చేస్తున్నారు. ఇలాంటి స్థితిలో రిగ్గింగు, బూతుల స్వాధీనం, దొంగ ఓట్లతో ఓట్ల శాతాన్ని పెంచుకోవడం పాలక పార్టీలకు పరిపాటయ్యింది. ఈసారి ఎన్నికల్లో ఎంతటి హింస పెచ్చరిల్లిందో మీడియా వార్తలు వెలుగులోకి తెచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోనైతే గతంలో ఎన్నడెరుగని విధంగా

ఎన్నికల పార్టీలే హింసకు పాల్పడ్డాయన్ని వార్తలు వచ్చాయి. కాశ్మీర్‌లోనైతే 'ఉగ్రవాదుల' పేరుతో ఎన్నికల పార్టీల గూండాలే పోలీసు క్యాంపులపై కూడా ఫైరింగ్‌లు చేసి బూతులు స్వాధీనపర్చుకున్నారని పత్రికలు రాశాయి. ఇలా దేశవ్యాప్తంగానే జరిగిన ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తే అది బూటకమైందనీ, అప్రజాస్వామికమైందనీ నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఆసక్తే ఓటరులో లేకుండా పోయింది. మరోవైపు సమస్యలు దినదినం తీవ్రం అవుతూ వారిని మిలిటెంటు పోరాటాలవైపు నెడుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో వారిని వ్యవసాయ విప్లవ రాజకీయాలతో చైతన్యవంతం చేయాల్సిన కర్తవ్యం విప్లవ పార్టీల పైనే ఉంది. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథానే సరైన ప్రత్యామ్నాయమని వారికి బోధించాలి. ఆంధ్ర, బీహార్, ఝార్ఖండ్, బాలాఘాట్-గోందియా, దండకారణ్యంలలో ప్రజలు 'విప్లవ ప్రజా కమిటీ'లను ఎన్నుకుంటూ గ్రామస్థాయిలో తమ ప్రభుత్వాన్ని తామే నడుపుకుంటున్నారనీ వాటినే నమూనాగా తీసుకొని పోరాడాలని దేశ ప్రజలందరికీ అర్థం చేయించాలి. భూస్వామ్య, బడా బూర్జువా, సామ్రాజ్యవాద శక్తులకు చెందిన ఈనాటి పార్లమెంటరీ పార్టీలన్నీ వారి దోపిడీ యదేచ్ఛగా సాగడానికే పాటు పడుతున్నాయి. కాబట్టి ఆ మూడు శక్తుల దోపిడీని నిర్మూలించడం ద్వారానే ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి దారి సుగమం అవుతుంది.

14వ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దండకారణ్య ప్రజల అనుభవాన్ని కూడా తెలుసుకుందాం. ఛత్తీస్‌గఢ్ విధానసభకు జరిగిన ఎన్నికల సందర్భంగా కొనసాగిన పోలీసు నిర్బంధం ఇంకా ప్రజలను వేధిస్తుండగానే లోకసభ ఎన్నికలు వారిపై విరుచుకుపడ్డాయి. ప్రజలను భయకంపితులను చేయడంలో పరమ దుర్మార్గులుగా పేరు తెచ్చుకున్న పంజాబ్ కమాండోలను ఈసారి దండకారణ్యానికి రప్పించారు. సరిహద్దు భద్రతా దళాలు దిగాయి. మార్చ్ '03 నుండి ఉన్న కేంద్ర రిజర్వు పోలీసు బలగాలకు తోడు అదనపు బలగాలను తెచ్చారు. అదనపు రాష్ట్ర పోలీసు బలగాలను తరలించారు. మూడు బలగాలను తరలించారు. మూడు డజన్ల సైనిక హెలికాప్టర్లను గగనతలంపై తిప్పారు. వాటికి మిషన్ గన్నులు బిగించి వదిలారు. విధానసభ ఎన్నికల సందర్భంగా కొనసాగిన పాశవిక నిర్బంధానికి అనేక రెట్లు మించిన నిర్బంధాన్ని ఈసారి అమలు చేసారు. లోక్‌సభ ఎన్నికలను దండకారణ్య పోరాట ప్రజలు బహిష్కరించనివ్వబోమన్న పంతంతో ఈ ప్రాంతాన్ని ఒక యుద్ధభూమిగా మలిచారు. ఫిబ్రవరి 28 నుండి ఏప్రిల్ 25 వరకు (ఇక్కడ ఎన్నికలు ఏప్రిల్ 20కు, రీపోలింగ్ 23కు పూర్తయింది.) ఇక్కడ 112 ఎన్‌కౌంటర్లు జరిగాయని పోలీసులే తెలుపుతున్నారంటే పరిస్థితి ఎంత ఉద్రిక్తంగా తయారయ్యిందో ఊహించుకోవచ్చు. (విధానసభ ఎన్నికల సందర్భంగా 33 ఎన్‌కౌంటర్లు జరిగాయి.) ఈసారి కాల్పుల్లో నలుగురు పోలీసులు చావగా 18 మంది గాయపడ్డారు. (విధానసభ ఎన్నికల సందర్భంగా జరిగిన కాల్పులలో 12 మంది పోలీసులు చావగా నలుగురు గాయపడ్డారు) పోలీసులచే రివార్డు ప్రకటించబడిన ప్రజాసంగాల నాయకులను 10 మందినీ, మరో 320 మంది సాధారణ కార్యకర్తలనూ ఈసారి ఎన్నికల సందర్భంగా అరెస్టు చేశారు. ఇంతే కాదు, కేంద్ర అర్ధసైనిక బలగాలు వచ్చీ రావడంతోనే ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించడానికి పూనుకున్నాయి. మాడ్ డివిజన్లోని ఇంద్రావతి ఏరియాలో ఇద్దరు వివాహిత యువతులపై అత్యాచారానికి పూనుకున్నారు. ఇందులో కామ్రేడ్ బుధ్రిని తర్వాత చంపేసి ఎన్‌కౌంటర్లో మహిళా నక్సలైటును హతమార్చామని ప్రకటించారు. ఇదే సందర్భంగా చైతు అనే మరో గ్రామస్తుడిని కూడా కొట్టి చంపారు. వీరు ధర్మ, పల్లి అనే గ్రామాలకు చెందిన వారు. దక్షిణ బస్తర్ డివిజన్‌లో సంతోష్ అనే విద్యార్థి ఆర్గనైజర్‌ను కాల్చి చంపారు. ఇలా ముగ్గురు కామ్రేడ్స్‌ను అర్ధ సైనిక బలగాలు పొట్టన పెట్టుకున్నాయి. అలాగే వీరి దౌర్జన్యాలకు ఇక్కడి అన్ని సెక్షన్ల ప్రజలు గురయ్యారు. మహిళలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్థులు, ఠేకేదార్లు మొదలైన వారంతా నిర్బంధ బాధలను అనుభవించారు. ఒకవైపు తీవ్రమైన పోలీసు నిర్బంధాన్ని అమలు చేస్తూనే ప్రభుత్వం విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దుష్ప్రచారాన్ని కొనసాగించింది. ఓట్లు వేయకూడదని నక్సలైట్లు ప్రజలను బెదిరిస్తున్నారనీ, గ్రామాలు ఖాళీ చేయిస్తున్నారనీ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసింది. తాను ఏర్పర్చిన గ్రామ సురక్షా సమితులను కూడా ఈసారి ప్రత్యేకించి అప్రమత్తం చేసింది. వారు కొన్ని చోట్ల పార్టీ, పీజీఏ కార్యకర్తలను హతమార్చడానికి కూడా సిద్ధమయ్యారు. ఇలా ప్రభుత్వ బహుముఖ దాడి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దండకారణ్య వ్యాప్తంగా తీవ్రమైంది. అయినప్పటికీ ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు.

14వ లోక్‌సభ ఎన్నికలకు నెల రోజుల ముందు నుండే అన్ని డివిజన్లలో ప్రజా సంఘాల కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలు, పీజీఏ సైనికులు, జనతన సర్కార్లు (విప్లవ ప్రజా కమిటీలు), మిలిషియా ఎన్నికల బహిష్కరణ ప్రచారాన్ని చేపట్టాయి. కరపత్రాలనూ, బుక్‌లెట్లనూ విస్తృతంగా పంచారు. పోస్టర్లు అంటించారు. బ్యానర్లు కట్టారు. అడవిలో, గ్రామాల్లో ఎక్కడ చూసినా ఎన్నికల బహిష్కరణ నినాదం వినవచ్చేది. అనేక సభలూ, సమావేశాలూ జరిగాయి. ఈసారి 'చేతనా నాట్య మంచ్' విడుదల చేసిన ప్రత్యేక క్యాసెట్, రూపొందించిన పాటలు, కళా రూపాలు ప్రజలను ఎంతగానో ఆకర్షించాయి. మిలిషియా, ప్రధాన, సెకండరీ బలగాలు, పార్టీ కార్యకర్తలు ప్రజలకు అండగా నిలిచి ఎన్నికల బహిష్కరణను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రచారానికి వచ్చే ఏ ఒక్క పార్టీని కూడా గ్రామీణ ప్రాంతంలో అడుగుపెట్టనివ్వలేదు. 98 స్థలాల్లో మందుపాతరను పేల్చి హంతక పోలీసు బలగాలకు బుద్ధి చెప్పి ప్రజలకు ధైర్యాన్నిచ్చారు. వారి నుండి కొన్ని ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. 22 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విస్తృతమైన పోలీసు బందోబస్తుతో పోలింగ్ బూతులను ఏర్పర్చి ఎన్నికల అధికారులను హెలికాప్టర్లలో తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీనితో పోలీసు బలగాలే చాలా చోట్ల యంత్రాల మీటలను నొక్కాయి. వీటి బందోబస్తుకు వచ్చిన పోలీసులు అమాయక ఆదివాసీ ప్రజలను పరుగెత్తే వీలు లేకుండా రెక్కలు వెనక్కి విరిచికట్టి వారిని మానవ కవచాలుగా పెట్టుకొని కాలినడకన సాగించారు. ఇంతచేసినా వారి పంతం నెగ్గలేదు. అనేక గ్రామాల్లోని ప్రజలు ఎన్నికలను బహిష్కరించి 'మా ఓట్లతో మా సర్కార్‌ను ఎన్నుకుంటాం మీ సర్కార్‌ను కాద'ని ప్రకటించారు. ఒక్క డౌలా ప్రాంతంలోనే 80 గ్రామాల ప్రజలు ఎన్నికల్లో పాల్గొనలేదంటే దండకారణ్య వ్యాప్తంగా ఎన్నికలు బహిష్కరించిన గ్రామాలు వందల సంఖ్యలోనే ఉంటాయి.

అక్కడక్కడ రోడ్డు సైడ్ గ్రామాల్లో, పట్టణాల్లో జరిగిన పోలింగ్‌ను 35 శాతంగా ప్రకటించారు. పోలీసు నిర్బంధమే లేకుంటే ఇక్కడ 5 శాతం పోలింగ్ కూడా జరగదని నిర్ద్వంద్వంగా చెప్పొచ్చు. ప్రస్తుతం విస్తృత గ్రామీణ ప్రాంతంలో జరిగిందిదే. పార్టీ ఇచ్చిన ఎన్నికల బహిష్కరణ పిలుపును స్వీకరించి దృఢంగా అమలు చేసిన విప్లవ ప్రజానీకానికి డీకేఎస్‌జెడ్‌సీ విప్లవాభినందనలు తెలుపుతోంది. గ్రామాల్లో ఏర్పర్చుకుంటున్న జనతన సర్కార్లను సంఘటితపర్చుకుంటూ దండకారణ్యాన్ని వీరోచిత పోరాటాల ద్వారా విముక్తి ప్రాంతంగా మలచుకుందామని ప్రజలను కోరుతూ భారత పీడిత ప్రజానీకానికి ఆదర్శంగా నిలవాలని ఆశిస్తోంది. ★

ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల బహిష్కరణ రిపోర్టు

# పోలీసు, అర్ధ సైనిక బలగాల పాశవిక నిర్బంధాన్ని ధిక్కరిస్తూ ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికలను బహిష్కరించిన బస్తర్ ప్రజలు !

గడచిన నవంబర్, డిసెంబర్ నెలల్లో దేశంలోని ఐదు రాష్ట్రాలలో – ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం – విధానసభ ఎన్నికలు జరిగాయి. నవంబర్ 1, 2000న కొత్త రాష్ట్రంగా ఏర్పడిన ఛత్తీస్‌గఢ్ విధానసభకు ఇవి తొలి ఎన్నికలు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దక్షిణ బస్తర్, ఉత్తర బస్తర్, బస్తర్, సర్గూజ ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులను చేసి ఓట్లు వేయించుకోవాలని నిర్ణయించుకుంది. ఎలాగైనా ఎన్నికల తంతు జరిగిందనిపించి పార్లమెంటరీ వ్యవస్థకు ప్రాణం పోయాలని వెర్రిగా ప్రయత్నించింది. అందుకే బస్తర్ ప్రాంతంలోని ఉత్తర్ బస్తర్, మాడ్, పశ్చిమ బస్తర్, దక్షిణ బస్తర్ పరిధిలోని దంతెవాడ, బస్తర్, నారాయణపూర్, బీజాపూర్ జిల్లాలను అలాగే సర్గూజా ప్రాంతంలో కొన్నింటిని నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించి, మన ఉద్యమ ప్రాంతంలో ఉన్న బీజాపూర్, కుంట, నారాయణపూర్, భానుప్రతాప్‌పూర్, కేశ్‌కల్ నియోజక వర్గాలలోని పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వం సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా ప్రకటించింది . వేలాదిగా సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్, జిల్లా పోలీసు, ఎస్‌ఎఫ్ బలగాలను మోహరించింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలనే పేరుతో దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా (జమ్ము కాశ్మీర్ మినహా) 137 కంపెనీల అర్ధ సైనిక బలగాలను, 35 భారత వైమానిక దళ హెలికాప్టర్లను ప్రభుత్వం వినియోగించింది. విధానసభ ఎన్నికల నిర్వహణ కోసం ఈ ప్రాంతాన్ని రణరంగంగా మార్చివేసింది. బూటకపు ఎన్నికలను బహిష్కరించిన ప్రజలపైనా, ప్రజల పక్షాన నిలిచిన మిలిషియా, సెకండరీ, ప్రధాన బలగాలపైనా ఆకాశంలోంచి హెలికాప్టర్ల పహరా, భూమ్మీద కేంద్ర పోలీసు-అర్ధ సైనిక బలగాల తుపాకులతో విచ్చలవిడిగా కాల్పులు, టు ఇంచ్ మోర్టార్ షెల్లింగ్, గ్రేనేడ్ లాంచర్‌లనుపయోగించి ప్రభుత్వమే ఉద్రిక్త వాతావరణం సృష్టించి బూటకపు ఎన్నికల తతంగాన్ని పూర్తి చేసుకుంది.

విధానసభ ఎన్నికల్లో ప్రధాన బూర్జువా పార్టీలైన కాంగ్రెసు, బిజెపిలు ప్రజలను ప్రలోభపెట్టడానికి రకరకాల వాగ్దానాలు చేశాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గురించి అతిగా ప్రచారం చేసి అమాయక ఆదివాసీ ప్రజలను ఆకర్షించాలనీ విఫలయత్నం చేశారు. అభ్యర్థులంతా ప్రజాధనాన్ని నీళ్లల్లా ఖర్చు పెట్టి కోట్లాది రూపాయలు వృధాచేశారు. అయినా వీరి ప్రచారమంతా నారాయణపూర్, కుంట, భానుప్రతాప్‌పూర్, దోర్నపాల్, కోయిల్‌బేడా, భూపాల్‌పట్నం, బీజాపూర్ మొదలైన బ్లాక్, తాలూకా, పోలీసు జిల్లా కేంద్రాలకే పరిమితమయింది తప్ప మాడ్ గుట్టలపై గ్రామాలకు గానీ, కిష్టారం, బాసగూడెం, ఊసూర్, నేషనల్ పార్క్, మిర్తూల్, గంగలూర్ గ్రామీణ ప్రాంతాల్లో కానీ లేదా కోయిల్‌బేడా, రావుఘాట్, చార్‌గాం, డౌలా ప్రాంతపు గ్రామాల్లో గానీ కానరాలేదు. ప్రజాసంగ సభ్యులను అరెస్టు చేసి చిత్రహింసలు పెడ్తూ, పోలీసుల గస్తీ పెంచినా ఏ ఒక్క ఎన్నికల పార్టీ లోపలికి రావడానికీ, ఓట్లడగడానికీ సాహసం చేయలేకపోయింది. కొన్ని కూడలి ప్రాంతాల్లో మాత్రం పోలీసుల రక్షణతో సభలు నిర్వహించి, పోస్టర్లు వేశాయి. ఈ ఎన్నికల పార్టీలు కొన్ని బ్లాక్ కేంద్రాల్లోనయితే పోలింగ్ కార్యాలయాలను కూడా ఏర్పరచుకోలేకపోయాయి. లోతట్టు గ్రామాల్లోని పెత్తందార్లు, సర్పంచ్‌లు, పటేళ్లు, సచివ్‌లు వంటి ప్రజావ్యతిరేకులను కొందరిని చేరదీసి డబ్బుల మూటలు, సారా సీసాలు ముట్టచెప్పారు. ప్రధాన రహదారులపై గల గ్రామాలనూ, బ్లాక్ కేంద్రాలకు దగ్గర ఉన్న గ్రామాలనూ ఎంపిక చేసుకొని వీరు 'బకరా-భాత్' (మేక మాంసంతో అన్నం) పేరుతో విందు ఏర్పాటు చేసి సారా తాగించారు. అలాగే ఓట్లు వేయకుంటే పోలీసులు విమానాల్లో వచ్చి గ్రామాలపై బాంబులు వేస్తారనీ, ఇండ్లను తగులబెడతారనీ, మహిళలపై అత్యాచారాలు చేస్తారనీ, చంపుతారనీ... ఇలా అనేక రకాలుగా ప్రచారం చేసి భయాందోళనలు వ్యాపింపజేశారు. స్థానిక ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు, బూర్జువా, రివిజనిస్టు పార్టీల నాయకులు, పెత్తందార్లు అంతా కలసి దుష్ప్రచారానికి దిగారు. నక్సలైట్లు అభివృద్ధి వ్యతిరేకులూ, ప్రజాస్వామ్య వ్యతిరేకులూ, హింసావాదులూ, ఉగ్రవాదులూ అంటూ దుమ్మెత్తి పోశారు. స్థానిక పత్రికలు వాటన్నిటికీ అక్షరరూపం ఇచ్చి ప్రజల ముందుంచాయి. విప్లవోద్యమ ప్రాంతంతో పరిచయం లేని వారెవరైనా ఈ ప్రచారాన్ని చూసి సులభంగానే మోసపోతారు. ఎన్నికల ప్రచారం కోసం జగదల్‌పూర్‌కు వచ్చిన ప్రధాని అటల్ బిహారీ వాజపేయి కూడా నక్సలైట్లు బస్తర్ అభివృద్ధికి అడ్డంకి అని మాట్లాడాడు. బిజెపి అధికారంలోకి వస్తే తాము పోటాను అమలుపరుస్తామని బిజెపి నాయకులు ప్రసంగించారు. బస్తర్ రేంజి ఐజి సంత్‌కుమార్ పాశ్వాన్ రోజుకొక ప్రకటన ఇస్తూ దుష్ప్రచారం చేశాడు. నక్సలైట్ నాయకులు కాంగ్రెస్ నాయకులతో లాలూచీ పడి ఓట్లు వేయిస్తామని లక్షల రూపాయిల డబ్బు తీసుకున్నారనీ బిజెపి తప్పుడు ఆరోపణలు చేసింది. ప్రజల్లో విప్లవోద్యమంపై అపోహలు కల్పించడానికి రకరకాల అబద్ధాలతో ఇలాంటి ప్రచారం చేశారు.

విధానసభ ఎన్నికలకు తొమ్మిది నెలల ముందే అంటే 2003 మార్చ్ లోనే మూడు బెటాలియన్‌ల కేంద్ర అర్ధ సైనిక బలగాలని నక్సలైట్ల ఉద్యమ నిర్మూలనకని దించారు. దీనికి తోడు జోగి ప్రభుత్వం ఎన్నికలు శాంతిపూర్వకంగా నిర్వహించడానికంటూ వేలాది అర్ధ సైనిక బలగాల్ని నవంబర్ నాటికి మోహరించి, పొరుగు రాష్ట్రాల పోలీసు బలగాలతో కలిసి సంయుక్త గస్తీ పేర అణచివేత-నిర్మూలన కార్యక్రమం మొదలుపెట్టింది. గ్రామాలలో గస్తీని ముమ్మరం చేస్తూ కనపడ్డవారినల్లా అరెస్టు చేయడం, ప్రశ్నించడం, తప్పుడు కేసులు బనాయించి జైళ్లకు పంపడం వంటి వాటితో పాటు, కొన్ని గ్రామాలలో విచ్చలవిడిగా కాల్పులు కూడా జరిపారు. మహిళలపై అత్యాచారం చేశారు. పిజిఏ బలగాలు ప్రతిఘటించిన చోటయితే ఇక చెప్పనక్కరలేదు. ఉదాహరణకు, ఉత్తరబస్తర్ డివిజన్‌లోని కోయిలేబేడ దగ్గరి జరన్‌తరాయి వద్ద మన పిజిఏ బలగాలు అర్ధ సైనిక బలగాలపై జరిపిన దాడిని సాకుగా తీసుకొని పోలీసులు అక్కడే పొలం పనులు చేసుకుంటున్న రైతులు ఇద్దర్ని తీసుకొచ్చి కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌లో మరణించారని కథలు అల్లారు. పశ్చిమ బస్తర్ డివిజన్ బైరంగఢ్ ఏరియాలో హరియత్ అనే గ్రామం వద్ద మిలిషియా నుండి కాల్పులు ఎదుర్కొన్న పోలీసులు కసితో విచ్చలవిడిగా కాల్పులు జరపగా పొలంలో పనిచేసుకుంటున్న రైతు మహిళకు తొడలో తూటా దూసుకుపోయింది.

ఇలా బస్తర్ వ్యాప్తంగా వందల సంఖ్యలో జనాలను స్త్రీపురుష భేదం లేకుండా విధానసభ ఎన్నికలకు ముందే అరెస్టులు చేశారు. అక్రమ కేసులు పెట్టారు. నక్సలైట్ల ఆచూకీ కోసం అంటూ రైతులనే

గాకుండా ఉద్యోగులను, టీచర్లను, వ్యాపారస్తులను, డాక్టర్లను, చివరకు స్థానిక పోలీసులనూ, ఒకరిద్దరు ఠానేదార్లనూ కూడా అరాచకాలకూ, హింసకూ మారుపేరైన సిఆర్‌పిఎఫ్ బలగాలు హింసించాయి. దారిలో వస్తున్నది ఎవరన్నది చూడకుండా హింసించారు. జనం అడవికిగానీ, పొరుగూరికి చుట్టరికానికి గానీ, సంతకు గానీ, పొలం పనులకు గానీ వెళ్లలేని పరిస్థితిని సృష్టించారు. కాశ్మీరుని తలపింపజేశారు. ఈ దోపిడీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై, ఎన్నికల వ్యవస్థపై భ్రమలు కోల్పోయిన వారికి స్వచ్ఛందంగా ఎన్నికలు బహిష్కరించే హక్కు లేకుండా వారిపై తుపాకులు ఎక్కుపెట్టారు. హెలికాప్టర్ల పహరా నడుమ, పోలీసు, అర్ధ సైనిక బలగాల తుపాకీ సన్నీల కనుసన్నల్లో 'ప్రజాస్వామ్యం' పేర ఎన్నికల ప్రహసనం ఎట్టకేలకు డిసెంబర్ 3తో ముగిసింది.

## బూటకపు విధానసభ ఎన్నికల బహిష్కరణ ప్రచారం

స్పెషల్ జోనల్ కమిటీ బస్తర్‌లో ఎన్నికలను బహిష్కరించమని ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేసింది. పత్రికలకు ఇంటర్వ్యూలు ఇచ్చింది. దీనితో దండకారణ్యవ్యాప్తంగా బస్తర్‌లోని నాలుగు డివిజన్‌లలో నిర్బంధాన్ని లెక్క చేయకుండా సెప్టెంబర్ నెల నుండే ఎన్నికల బహిష్కరణ కేంపెయిన్ మొదలయింది.

**మాడ్ డివిజన్‌లో** స్థానిక సిఎన్‌యం, 10 రేంజి కమిటీలు, 10 కేంపెయిన్ దళాలు కలిసి 100 మందితో వారం రోజులు ఎన్నికల బహిష్కరణకై ప్రచారం చేశాయి. రెండు దఫాలుగా జరిగిన ప్రజా ప్రదర్శనలు, సభలలో 20 వేల వరకు జనం పాల్గొన్నారు. వందలాదిగా బ్యానర్లు కట్టారు. పోస్టర్లు వేశారు. వాల్‌రైటింగ్స్ కూడా చేశారు. పోలీసు, అర్ధ సైనికబలగాల నిర్బంధాన్ని నిరసిస్తూ మాడ్ డివిసి రెండు రోజులు (నవంబర్ 30, డిసెంబర్ 1) డివిజన్‌వ్యాప్తంగా బంద్ పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ఎన్నికల బహిష్కరణ ప్రచారంలో భాగంగా మిలిషియా కూడా కొన్ని సెంటర్లలో సాయుధ ప్రదర్శన చేసింది. ప్రజా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఓట్లు వేయొద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లో పోరాట పత్రిక 'భూంకాల్'ను ఎన్నికల సందర్భంలో ప్రత్యేక సంచికగా తీసి ప్రజల్లో విస్తృతంగా పంచారు.

**ఉత్తర్ బస్తర్ డివిజన్‌లో** ఎన్నికల బహిష్కరణ ప్రచారం మూడు దఫాలుగా జరిగింది. ర్యాలీలు, సభలు జరిగాయి. కరపత్రాలు, పోస్టర్లు, విస్తృతంగా వేశారు. బ్యానర్లు కట్టారు. కేంపెయిన్ బ్యాచ్‌లు ప్రచారం నిర్వహించాయి. డివిజన్‌వ్యాప్తంగా కెఎయంఎస్, డిఎకెయంఎస్‌ల 25 కేంపెయిన్ బ్యాచ్‌లలో 300 మంది స్త్రీపురుషులతో పాటు 10 మందితో కూడిన బాలల సంఘం బ్యాచ్, మూడు స్థానిక సిఎన్‌యం దళాలు, లోకల్ గెరిల్లా దళాలన్నీ ఎన్నికల బహిష్కరణ ప్రచారం చేశాయి. రోడ్ల కూడలి వద్ద వాల్ రైటింగ్స్ చేశారు. డివిజన్‌వ్యాప్తంగా 1300 పోస్టర్లు, 74 బ్యానర్లు కట్టారు. ప్రచారానికై ఓ ప్రయాణీకుల బస్సుకు బ్యానర్లు కట్టారు. ఎన్నికల బూటకత్వాన్ని ఎండగడ్తూ డివిజనల్ కమిటీ పత్రికా ప్రకటన ఇచ్చింది. ఎన్నికల బహిష్కరణ ర్యాలీలు-సభలలో 25 వేలకు పైగా ప్రజలు పాల్గొన్నారు. ఎన్నికల బహిష్కరణ సందర్భంలో గోండి పత్రిక 'బేరా'ను ప్రత్యేక సంచికగా తీసి ప్రజల్లో విస్తృత ప్రచారం గావించారు.

**పశ్చిమ బస్తర్ డివిజన్:** బీజాపూర్ నియోజకవర్గంలోని నాలుగు బ్లాకులు ఊసూర్, పట్నం, భైరంగఢ్, బీజాపూర్‌ల్లో ఎన్నికల బహిష్కరణ కేంపెయిన్ మూడు నెలలు విస్తృతంగా జరిగింది. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్నికల బహిష్కరణ ర్యాలీలు నిర్వహించి ప్రచారం చేశారు. ఎన్నికల బహిష్కరణపై డివిజన్‌వ్యాప్తంగా స్థానిక, డివిజన్ సిఎన్‌యం బృందాలు నిర్వహించిన సభల్లో 16 వేల మంది ప్రజలు, ప్రజాసంగాలు నిర్వహించిన సభలలో దాదాపు 33 వేలమంది – మొత్తం 49 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. ప్రతి సభలో, ప్రదర్శనలో 'బూటకపు ఎన్నికలని బహిష్కరించండి' 'ప్రభుత్వ నిర్బంధాన్ని ఓడిద్దాం. గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!' 'నిజమైన అధికార సంస్థలుగా జనతన సర్కార్ కమిటీలను సంఘటితపరుద్దాం' నినాదాల ద్వారా రాజకీయ సందేశం ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయడమైంది. ఇవే గాక వాల్‌రైటింగ్స్, దాదాపు 2100 పోస్టర్లు వేసి, 65 బ్యానర్లు కట్టారు. ఐదు వేల కరపత్రాలు పంచారు. వీటన్నింటిద్వారా బ్లాక్ కేంద్రాలలో, రోడ్‌సైడ్ గ్రామాలలో, సంతలలో, కర్సడ్ (మేళ)లలో ప్రచారం చేశారు. బూర్జువా పార్టీ నాయకుల దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. ప్రభుత్వ రేడియో, బూర్జువా పత్రికలు కూడా మన ఎన్నికల బహిష్కరణ ప్రచారం గురించి ప్రజలకు చెప్పక తప్పలేదు. డివిజన్‌వ్యాప్తంగా డిఎకెయంఎస్‌వి 84, కెఎయంఎస్‌వి 31 కేంపెయిన్ బ్యాచ్‌లు మొత్తం 115 బ్యాచీలతో 600 మంది రెండు విడతలుగా బహిష్కరణ ప్రచారం సాగించారు. డివిసి తరపున ఎన్నికల బహిష్కరణపై పత్రికా ప్రకటనతోపాటు, పత్రికా విలేఖర్లకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వడం జరిగింది. దక్షిణ, పశ్చిమ బస్తర్ డివిజన్‌ల సంయుక్త పత్రిక (గోండీ)అయిన 'పితూరి' ఎన్నికల ప్రత్యేక సంచికను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు.

**దక్షిణ బస్తర్ డివిజన్:** ఈ డివిజన్‌లో కుంట, బీజాపూర్ నియోజకవర్గాల పరిధిలోని నాలుగు ఏరియాలలో పామేడ్, జేగురుగొండ, కిష్టారం, కుంటల్లో ఎన్నికలను బహిష్కరించాలంటూ సెప్టెంబర్ నుండి ప్రచారం, ప్రదర్శనలు మొదలుపెట్టారు. ఎన్నికలను బహిష్కరించాలనే ప్రచారంలో భాగంగా డిఎకెయంఎస్ 63, కెఎయంఎస్ 23 బ్యాచ్‌లు, 27 మంది గల డివిజన్, రెండు లోకల్ సిఎన్‌యం బృందాలు, 150 మంది గల 15 గ్రామ సిఎన్‌యం బ్యాచ్‌లు సాంస్కృతిక ప్రదర్శనలు, ఉపన్యాసాలు ద్వారా గ్రామాలలో, సంతలలో ప్రచారం చేశాయి. అంతేగాక రేంజిల పరిధిలో కొన్ని చోట్ల బహిరంగ సభలు నిర్వహించారు. మొత్తం డివిజన్‌వ్యాప్తంగా 366 గ్రామాల్లో ప్రచారం జరిగింది. అలాగే 2 వేల కరపత్రాలు, 400 పోస్టర్లు, మూడు విడతలుగా వేసి ప్రచారం సాగించారు. 75 బ్యానర్లు కట్టడం, 50 ఆడియో క్యాసెట్లు పంపిణీ, 100 గ్రామాలలో వాల్ రైటింగ్స్ రాయడం, బస్సులకు, ఇతర వాహనాలకు పోస్టర్లు అంటించడం, బ్యానర్లు కట్టడం, నినాదాలు రాయడం లాంటి కార్యక్రమాలతో వివిధ రూపాలలో ప్రచారం చేశారు. ఈ అన్ని రూపాల్లోని ప్రచారం లక్ష మంది జనాలకు చేరింది.

## నిప్పులు చెరిగే నిర్బంధాన్ని ఎదిరిస్తూ విధానసభ ఎన్నికలను బహిష్కరించిన ప్రజలు

విధానసభ ఎన్నికలు డిసెంబర్ 1న జరిగాయి. కాని నవంబర్ 2వ వారం నాటికే వేలాది ఖాకీ బలగాలు నారాయణపూర్, జగదల్‌పూర్, దంతెవాడ, బీజాపూర్, కుంటకు చేరుకున్నాయి. గ్రామాలలో గస్తీ చేయడం, అరెస్టులతోపాటు అణచివేత-నిర్మూలనా కార్యక్రమం నాలుగు డివిజన్‌ల వ్యాప్తంగానూ ముమ్మరం చేశారు. దక్షిణ బస్తర్‌లో ఎర్రబోర్, పశ్చిమ బస్తర్‌లో నెల్సనార్, జాంగ్లల్లోని పోలీసు చౌకీలను కొత్తగా పెట్టారు. ఎన్నికల సందర్భంగా కొన్ని గ్రామాలలో స్కూళ్లు, ఆశ్రమాలలో బేస్ క్యాంపులు ఏర్పాటుచేసి ఒక్కొక్క దగ్గర ఓ కంపెనీ పోలీసు, పారా మిలటరీ బలగాలను మోహరించారు. ఉదాహరణకు మాడ్ గుట్టలపైన గార్పె, సోన్‌పూర్, ఆకబేడా, కుడిమేర్, పశ్చిమ బస్తర్‌లోని కెర్పె, చంద్రల్లో ఇలా మోహరించిన బలగాలు చుట్టుపక్కల కూడా గస్తీ చేశాయి. హెలిపాడ్‌లు నిర్మించి పోలింగ్ సిబ్బందిని, పోలీసు బలగాలను తరలించారు. ఆశ్రమాలలో ఉంటున్నపుడు విద్యార్థులను, గ్రామం నుండి గ్రామానికి వెళ్తున్నపుడు ప్రజలను పోలీసులు తమ కవచంగా వాడుకున్నారు. విధానసభ ఎన్నికల్లో ఇలాంటి అనుభవాలు జనాలకు ఎదురుగావడంతో

14వ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చాలా గ్రామాల ప్రజలు ముందే సర్దుకొని పోలీసులకు దొరక్కుండా తప్పుకొన్నారు. అయితే దీనిని పోలీసులు ఉల్టాగా నక్సలైట్లే ప్రజలను గ్రామాలు ఖాళీ చేయిస్తున్నారని దుష్ప్రచారం చేశారు.

విధానసభ పోలింగ్ నిర్వహణ కోసం మాడ్‌లో 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిలో 10 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు పూర్తిగా ఓట్లు బహిష్కరించారు. 20 కేంద్రాల్లో పోలీసుల భయంతో కొంతమంది ఓట్లు వేశారు. కాగా మిగిలిన 10 కేంద్రాలలో మాత్రం పోలీసు స్టేషన్‌లు, బ్లాక్, తాలూకా కేంద్రాలు వుండి వీటి దగ్గర పోలింగ్ కొంత ఎక్కువ శాతం జరిగింది. అంటే మాడ్‌లోని మొత్తం మూడు వందల గ్రామాలలో 75 గ్రామాలు పూర్తిగా ఎన్నికలను బహిష్కరించాయి. 150 గ్రామాలలో తక్కువ మంది, 5-10% మంది ఓట్లు వేయగా, 75 గ్రామాలలో కొంత ఎక్కువ, అంటే 25% పోలింగ్ అయ్యింది. కాని బస్తర్ కలెక్టర్ శైలేష్ పాఠక్ నక్సలైట్ల ఎన్నికల బహిష్కరణను ప్రజలు ఖాతరు చేయకుండా ఓట్లు వేశారని, మరికొన్ని గ్రామాలలో నక్సలైట్ల హింసకు భయపడి ప్రజలు గ్రామాలు వదలి పారిపోయారని దుష్ప్రచారం చేశాడు. వాస్తవానికి ఆదివాసీ ప్రజలు పంట కోతల కోసం పోడు దగ్గరకి వెళ్తారు. పగలు గ్రామాలలో ప్రజలు ఉండరు. ప్రజల జీవనం గురించి తెలియని వెర్రి కలెక్టర్ దీన్ని కూడా సాకుగా తీసుకొని పార్టీపై దుష్ప్రచారం చేశాడు. కొన్ని పోలింగ్ కేంద్రాలకు పోలీసు సిబ్బంది వెళ్లకుండాను, మరికొన్ని చోట్ల సిఆర్‌పిఎఫ్ బలగాలే యంత్రాల బటన్ నొక్కి 80 శాతం పోలింగ్ జరిగిందని లెక్కలు చూపాయి. ఉదా: కచ్చాపాల్, గట్టకల్ అనే గ్రామాలకు పోలింగ్ సిబ్బంది రానే రాలేదు కాని 80% పోలింగ్ జరిగినట్లు అధికార ప్రకటనలు జారీచేశారు. జిల్లా కేంద్రాల్లో, తాలూకా కేంద్రాల్లో కూడా ఇంత శాతం పోలింగ్ జరగలేదు. 20 కిలోమీటర్ల దూరం నుండి ఆదివాసీ ప్రజలు నడిచి వచ్చి 80 శాతం ఓట్లు వేశారంటే అంతకంటే ఆశ్చర్యం మరొకటి లేదు! ఇది నమ్మశక్యంగా లేదని బూర్జువా పత్రికలే ఈ ప్రహసనాన్ని బహిర్గతపరచాయి.

దక్షిణ బస్తర్ డివిజన్‌లోని మొత్తం పోలింగ్ బూతులు దాదాపు 80 వరకు ఉంటాయి. వీటిలో పోలీసు స్టేషన్‌లున్న 13 సెంటర్లలో, రోడ్డుపై గల 18 గ్రామాలలో మాత్రమే ఓట్లు పోలయ్యాయి. మిగతా 45 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు పూర్తిగా ఓట్లను బహిష్కరించారు. 10 గ్రామాలలో అయితే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లను మిలిషియా, ప్రజాసంగ కార్యకర్తలు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో తిరిగి పోలింగ్ డిసెంబర్ 3న కేవలం నాలుగు చోట్ల మాత్రమే పోలీసు బందోబస్తుతో జరిపారు. మిగతా అంతా మరో కంట పడకుండా గగనతలంపైనే రిగ్గింగ్ జరిగింది.

పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని దాదాపు 95 పోలింగ్ కేంద్రాలున్నాయి. వీటిలో 30 కేంద్రాలలో ప్రజలు పూర్తిగా బహిష్కరించారు. 25 కేంద్రాలలో బ్లాక్, తాలుకా, పోలీసు కేంద్రాలలో ఉన్నవాటిలోని కొన్ని గ్రామాలలో పోలీసుల నిర్బంధం మూలంగా ఓట్లలో ప్రజలు పాల్గొన్నారు. మిగతా గ్రామాలలో పాక్షికంగా ఓట్లు పోలయ్యాయి. 13 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ మిషన్ యంత్రాలను మిలిషియా, ప్రజాసంగాల కార్యకర్తలు స్వాధీనం చేసుకున్నారు. కేవలం ఒక్క బీజాపూర్ నియోజక వర్గంలోనే 35 ఓటింగ్ మిషన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఉత్తర బస్తర్ డివిజన్‌లోని దాదాపు 250 గ్రామాలలో 136 గ్రామాల వారు పూర్తిగా ఓట్లు బహిష్కరించారు. మిగతా గ్రామాలు బ్లాక్, పోలీసు స్టేషన్స్, రోడ్డు సైడ్‌వి కాగా నిర్బంధం, విచ్చలవిడి అరెస్టుల మూలంగా కొన్నిచోట్ల ప్రజలు ఓట్లు వేశారు. డివిజన్‌వ్యాప్తంగా 9 ఎలక్ట్రానిక్ మిషన్‌లను మిలిషియా స్వాధీనపరచుకున్నది.

మొత్తంగా డికెలోని నాలుగు డివిజన్‌లలో దాదాపు 100 పోలింగ్ కేంద్రాలలో పూర్తి బహిష్కరణ, అనేక వందల కేంద్రాలలో పాక్షికంగా ఎన్నికల బహిష్కరణ జరిగింది. పోలింగ్ లేదా రీపోలింగ్ జరిగిన గ్రామాల్లో కూడా పోలీసు, అర్ధ సైనిక బలగాల ఒత్తిడిల కారణంగా గానీ లేదా వాళ్లే మెషిన్‌లలో బటన్‌లు నొక్కి పోలింగ్ పూర్తి చేసుకున్న కారణంగా గానీ ఆ మాత్రమైనా ఓట్లు పడ్డాయన్నది వాస్తవం. ప్రజలు, పార్టీ, ప్రజా గెరిల్లా సైన్యం బహిష్కరణ ప్రచారం ముమ్మరంగా సాగించి డికె వ్యాప్తంగా 55ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి పోలింగ్‌ను బుల్లెట్‌పై బ్యాలెట్ విజయంగా చిత్రిస్తూ పోలీసు-ప్రభుత్వ అధికారులు బూర్జువా మీడియా ద్వారా డబ్బా కొట్టుకుంటున్నారు.

ఓట్ల సమయంలో నవంబర్ రెండవ వారం నుండి ప్రజలు, సంగాలు, మిలిషియా, పిజిఏ బలగాలు బూర్జువా పార్టీల ప్రచారాన్ని అడ్డుకున్నారు. పోలీసు అర్ధసైనిక బలగాలపై దాడులు చేశారు. పిజిఏలోని మూడు రకాల బలగాలు చేసిన దాడుల్లో దక్షిణ బస్తర్‌లో ఓ సిఆర్‌పిఎఫ్ జవాను, పశ్చిమ బస్తర్‌లోని మోదుగుపల్లి ఆంబుష్‌లో ఆరుగురు జిల్లా మరియు ఎస్ఎఫ్ బలగాల వారు చచ్చారు. ఉత్తర బస్తర్‌లో ఇద్దరు పోలీసులు, ఓ గోపనీయ సైనిక్ కుక్కచావు చావగా, ఎన్నికల సందర్భంగా చేసిన దాడుల్లో పోలీసుల నుండి ఎకె-47 రైఫిల్ ఒకటి, ఎస్ఎల్ఆర్‌లు ఐదు, రెండు గ్రేనేడ్‌లు, 340 తూటాలు, ఓ వైర్‌లెస్ సెట్ స్వాధీనం చేసుకున్నాయి. డజనుకు పైగా 'భద్రతా' బలగాలకు చెందిన వాళ్లు గాయపడ్డారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఉత్తర్ బస్తర్‌లో 2 జీపులను, పశ్చిమ బస్తర్‌లో ఓ టాటా సుమోను, ఓ మోటర్ సైకిల్‌ను, మాడ్‌లో ప్రచారానికి వచ్చిన సిపియం జీపును దగ్ధం చేశారు. డివిజన్‌లో కాంగ్రెసు, బిజెపిలే గాకుండా కొన్ని నియోజక వర్గాలలో రివిజనిస్టు పార్టీలైన సిపిఐ, సిపియంలు తమ అభ్యర్థుల్ని నిలబెట్టాయి. అలాగే గోండ్వానా గణతంత్ర పార్టీ, విద్యాచరణ్ శుక్లా ఎన్‌సీపీయే గాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా ఎన్నికల బరిలో దిగారు. కానీ ఏ అభ్యర్థి కూడా ఉద్యమ ప్రాంతంలోని లోపలి గ్రామాలకు వచ్చి ప్రచారం చేయడానికి సాహసించ లేదు. ప్రజలు, వీరి వాగ్దానాలకు, ఆకర్షణలకు, ప్రలోభాలకు లోనుగాకుండా ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఓట్లు బహిష్కరించారు. వీరందరికీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] విప్లవ జేజేలు తెలుపుతోంది.

మిలిషియా వందల సంఖ్యలో కదలి పోలీసు, మిలటరీ బలగాలపై అనేక దాడులు చేసింది. రెండు చోట్ల హెలిపాడ్లను ధ్వంసం చేసింది. రోడ్లపై అడ్డంకులు ఏర్పరచింది. పిజిఏ, మిలిషియా బలగాలు కేవలం ఎన్నికల రోజైన డిసెంబర్ 1 నాడే 50 చోట్ల చిన్నా పెద్దా దాడులు చేశాయి. సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్, బిఎస్ఎఫ్ వేల సంఖ్యలో మోహరించిన బలగాలను – ప్రజాస్వామ్యం పేరుతో, ప్రజలపై ప్రయోగించిన నిర్బంధం, అక్రమ అరెస్టులు, చిత్రహింసలు, మోర్టార్ షెల్స్, వైమానిక హెలికాప్టర్ల పహరా నడుమ – బస్తర్ ప్రజలు క్లేమోర్ బాంబులతో, బర్మార్లతో, గొడ్డలి, విల్లంబులు, రైఫిల్స్‌తో ప్రజాసంగాలు, పిజిఏలోని మూడు రకాల బలగాలతో కలసి దాదాపు డిసెంబర్ 3వ తేదీ వరకు 130కి పైగా దాడులు చేశారు. తాత్కాలిక పోలీసు క్యాంపులపై గ్రేనేడ్‌లు వేశారు. ఫైరింగ్ చేసి ఒకర్ని గాయపరచడమే గాకుండా, పోలీసుల సరఫరాలను అనేక చోట్ల అడ్డుకున్నారు. ప్రజాయుద్ధంలో భాగంగా శత్రు మూకల దాడులను ఓడిస్తూ రాబోయే పార్లమెంటరీ ఎన్నికల (ఏప్రిల్-మే 2004)ను బహిష్కరించాలనీ, 'ఫీల్ గుడ్', 'షైనింగ్ ఇండియా' అని కల్లబొల్లి కబుర్లు చెబుతూ అధికారంలో ఉన్న బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రారంభించిన బూటకపు ప్రచారాన్ని వమ్ముచేసి 14వ లోక్‌సభ బూటకపు ఎన్నికలను కూడా బహిష్కరించడానికి మరింత దృఢంగా నిలవాలనీ దండకారణ్య ప్రజలకు పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. ★

పత్రికా ప్రకటన

# లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దండకారణ్య ప్రజలపై పోలీసు, అర్ధ సైనిక బలగాలు అమలు చేసిన తీవ్ర నిర్బంధాన్ని ఖండించండి !

*తేది : 01/05/2004*

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దండకారణ్య ప్రజలపై ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు తమ పోలీసు, అర్ధ సైనిక బలగాల ద్వారా అమలు చేసిన తీవ్ర నిర్బంధాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) [పీపుల్స్‌వార్] దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఖండిస్తోంది. ఎన్నికలను ''శాంతియుతంగా'' నిర్వహించే పేరుతో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, పంజాబ్ కమాండో బలగాలను వేల సంఖ్యలో మొహరించి ప్రజల్లో భీభత్సాన్ని సృష్టించారు. పోలీసులు వందలాది మందిని పిల్లలూ, వృద్ధులూ, మహిళలూ అనే తేడా లేకుండా నిర్దాక్షిణ్యంగా హింసించారు. మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారు. వందలాది మందిని అరెస్టు చేసి జైళ్లల్లో నిర్బంధించారు. ఇండ్లను కూలగొట్టారు, ప్రజలను విపరీతంగా కొట్టి చంపేశారు. దండకారణ్యంలోని ఉత్తర బస్తర్, మాడ్, పశ్చిమ బస్తర్, దక్షిణ బస్తర్, గడ్చిరోలి ప్రాంతాల ప్రజలపై పోలీసు, అర్ధ సైనిక బలగాలు అమలు జరిపిన అమానవీయ అత్యాచారాలను ఖండించాల్సిందిగానూ, ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాపాడాల్సిందిగానూ ప్రజాస్వామ్య శక్తులందరికీ మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

బూటకపు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని మా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు దండకారణ్య ప్రజలు ఓట్ల నాయకులనూ, పార్టీలనూ పోరాట ప్రాంతాల్లోకి ప్రచారానికి రాకుండా అడ్డుకున్నారు. అంతకు ముందు జరిగిన ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికలను ప్రజలు పెద్ద ఎత్తున బహిష్కరించారు. లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలన్న మా పిలుపును విఫలం చేయడానికి కేంద్రం వేలాది అర్ధ సైనిక బలగాలను మొహరించి ఫాసిస్టు నిర్బంధాన్ని అమలు చేసింది. ఎన్నికలను బహిష్కరించేందుకు ప్రజలకు గల ప్రజాస్వామిక హక్కును హరించివేసే ప్రయత్నం చేసింది.

స్థానిక పోలీసుల మద్దతుతో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, పంజాబ్ కమాండో బలగాలు గ్రామాలపై దాడులు జరిపి, తోవలలో మాటు గాచి వచ్చిపోయే ప్రజలపై దాడి చేసి వందలాది మందిని అరెస్టు చేశాయి. వాళ్లను తీవ్ర హింసలకు గురి చేసి కొందరిని జైళ్లలో నిర్బంధించాయి. మాడ్ ప్రాంతంలో 76 మంది, ఉత్తర బస్తర్ ప్రాంతంలో 43 మంది, దక్షిణ బస్తర్‌లో ఆరుగురు, పశ్చిమ బస్తర్‌లో 30 మంది, గడ్చిరోలిలో 296 మంది పోలీసుల చేతిలో అరెస్టయ్యారు.

పోలీసు బలగాలు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తూ, ఇండ్లలోకి జొరబడి సామాన్లను చిందరవందర చేయడం, ఇండ్లను కూల్చడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డాయి. విలువైన సామాన్లనూ, నగదు డబ్బునూ, కోళ్లనూ, మేకలనూ ఎత్తుకెళ్లారు. మాడ్‌లోని కోహ్కమెట్టలో 2, సోన్‌పూర్‌లో 30, కుండ్లలో 2, కీహ్కాడ్‌లో ఒక ఇల్లు – మొత్తం 35 ఇండ్లను పోలీసులు ధ్వంసం చేశారు. సామాన్లు విసిరేశారు. కోహ్కమెట్ట ఆశ్రమ పాఠశాల తలుపులను విరగ్గొట్టి విద్యార్థుల సామాన్లను పాడు చేశారు. మాడ్ ప్రాంతంలో ఏడేళ్ల పిల్లవాడి నుండి వృద్ధుల వరకూ మొత్తం 85 మందిని తీవ్రంగా కొట్టి గాయపర్చారు. కోహ్కమెట్ట గ్రామ ఆశ్రమ పాఠశాలను పాయఖానాగా మార్చివేశారు.

పోలింగ్ సామాగ్రిని చేరవేసే సందర్భంగా పిల్లలనూ, మహిళలనూ పోలీసులు బలవంతంగా మానవ కవచంగా వాడుకున్నారు. వీరిలో చాలా మందిని ఇప్పటికీ వదిలిపెట్టలేదు. పోలింగ్ రోజున గ్రామాల్లో తిరుగుతూ కనబడ్డ వారినల్లా చావ బాదారు. ఓట్లు వేయకుంటే చంపి వేస్తామని బెదిరిస్తూ కొట్టారు. పోలీసు బలగాల భీభత్సకాండకు భయపడి ప్రజలు తమ ఇండ్లనూ, గ్రామాలనూ వదిలేసి అడవుల్లోకీ, దూర గ్రామాలకూ పారిపోయారు. వాస్తవం ఇది కాగా, మేమే గ్రామాలు ఖాళీ చేయించామనీ, మా భయం వల్లే ప్రజలు పారిపోయారంటూ మా పార్టీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పోలీసులు ప్రచారం చేశారు. నక్సలైట్లతో ఎదురుకాల్పుల సాకుతో పోలీసులు తమ గస్తీలో భాగంగా వస్తూ, పోతున్నప్పుడు, మకాం చేసినప్పుడు గ్రామాల పైనా, ఇండ్ల పైనా విచ్చలవిడిగా కాల్పులు, షెల్లింగ్ జరిపారు. దీనితో చాలా ఇండ్ల కప్పులూ, గోడలూ దెబ్బతినిపోవడంతో పాటు చేన్లూ, కల్లాలూ తగులబడిపోయాయి. దానితో చాలా కల్లాల్లో నిల్వ చేసిన పంటలు కాలిపోయాయి.

సీఆర్‌పీఎఫ్ బలగాలు ఇంద్రావతి ఏరియాలో తమ ఉన్మాదాన్ని నగ్నంగా ప్రదర్శిస్తూ ముగ్గురు మహిళలపై సామూహిక అత్యాచారం జరిపాయి. వీరిలో ఒకరిని కాల్చి చంపి ఎన్‌కౌంటర్లో మహిళా నక్సలైటు మృతి చెందిందని ప్రకటించాయి. కోహ్కమెట్ట గ్రామంలో ఒక మహిళ రాత్రిపూట కాలకృత్యాలు తీర్చుకోవడానికై ఇంట్లోంచి బైటికి రాగా ఆమెపై పోలీసులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ పాశవిక బలగాలు చిన్నపల్లి అనే గ్రామంలో దాడి చేసి ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాయి. ఒక మహిళ వీరి కబంధహస్తాల్లోంచి తప్పుకోగా, మరో మహిళ బుధ్రీని మాత్రం పోలీసులు కాల్చి చంపారు. ఎన్‌కౌంటర్‌గా ప్రకటించి శవాన్ని కూడా పూడ్చివేయించారు. బుధ్రీపై అత్యాచారం, హత్యకు నిరసనగా బైరంగఢ్‌లో ప్రదర్శన జరపడం కోసం పోతున్న వేలాది ప్రజలను పోలీసులు తుపాకులతో బెదిరించి తరిమేశారు. డోంత్రిబేడలో 20 ఏళ్ల యువతిని సీఆర్‌పీఎఫ్ వాళ్లు ఎత్తుకెళ్లగా ఇప్పటికీ ఆమె ఎక్కడుందో, ఏమైందో ఎవరికీ తెలియని పరిస్థితి. ఆదేర్ గ్రామస్తుడైన టొక్కాల్‌ను పోలీసులు పశువును బాదినట్టు బాది కట్టేసి తమతో తీసుకెళ్లారు. ఈయనను ఏం చేశారో ఇప్పటికీ తెలియదు.

బైరంగఢ్ తాలూకాలోని ఛోటే పల్లి గ్రామస్తులైన చైతు కోపాల్, మంగుడు, బుధ్రాంలను పోలీసులు అరెస్టు చేసి వాళ్లను అమానవీయ హింసలకు గురి చేశారు. వీరిలో చైతు అనే రైతు పోలీసులు దారుణంగా కొట్టిన దెబ్బలకు ప్రాణాలు విడిచాడు. అయితే పోస్ట్‌మార్టం రిపోర్టులో

అతను విరేచనాలతో చనిపోయినట్టుగా రాయించి కేసును తొక్కివేశారు. శవాన్ని గ్రామస్తులతో కాల్చి వేయించారు. చైతు హత్యకు నిరసనగా 5 వేల మంది ప్రజలు బైరంగఢ్‌లో ప్రదర్శన జరిపారు. మిగతా వాళ్లను పోలీసులు తప్పుడు కేసులతో జైలుకు పంపారు.

పారా మిలిటరీ బలగాలు సాధారణ ప్రజలనే కాకుండా వ్యాపారులను కూడా హింసించారు. సంతలపై దాడి చేసి వ్యాపారులనూ, దుకాణదార్లనూ కొట్టారు, వాళ్ల దుకాణాలను చిందరవందర చేశారు. పోలీసుల దౌర్జన్యాలను పత్రికలో రాశాడన్న కోపంతో నారాయణపూర్ విలేఖరి (దైనిక్ భాస్కర్) శీతల్ ప్రకాశ్ కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. మా పార్టీ ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తోంది. ఎన్నికల సందర్భంగా ఎస్‌పి ఆదేశాలు జారీ చేసి మాడ్ ప్రాంతంలోకి పత్రికలు వెళ్లకుండా కట్టడి చేశాడు. ఈ నిరంకుశ ఆదేశాన్ని ఖండించాలనీ, పత్రికా స్వేచ్ఛ కోసం గొంతెత్తాలనీ మా పార్టీ దిన పత్రికల యజమానులనూ, సంపాదకులనూ కోరుతోంది. పోలీసు బలగాలు అమలు చేసిన తీవ్ర నిర్బంధాన్నీ, వత్తిడులనూ, భీభత్సకాండనూ లెక్కచేయకుండా దండకారణ్య ప్రజలు పెద్ద ఎత్తున ఎన్నికలను బహిష్కరించారు. ప్రజల వ్యతిరేకత మూలంగా అనేక డజన్ల పోలింగ్ కేంద్రాలకు అసలు పోలింగ్ సిబ్బంది రానే లేదు. ఉదాహరణకు బస్తర్ జిల్లాలోని ఆదేర్, మురుంవేడ, గట్టకల్, జాట్లూర్, డుంగ, కుమ్మం, కచ్చాపాల్, వడపేంద, గుమ్మర్క, గోమంగల్, కల్లాజ, పల్లి, పొల్లెవాయ మొదలైన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ అధికారులెవ్వరూ రాలేదు. పోలింగ్ సిబ్బంది వచ్చిన చోట్లలో ప్రజలు ఓట్లు వేయనే లేదు. అయితే పోలీసు బలగాలు రిగ్గింగ్‌తో పోలింగ్ శాతాన్ని పెంచారు.

విలేఖరులూ, మానవహక్కుల కార్యకర్తలూ, పీయూసీఎల్ కార్యకర్తలూ, తదితర ప్రజాస్వామ్యవాదులూ దండకారణ్యంలోని పోరాట ప్రాంతాలను పర్యటించాల్సిందిగానూ, వాస్తవాలను వెలికి తీయాల్సిందిగానూ మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. ఎన్నికల సందర్భంగా పోలీసు, అర్ధ సైనిక బలగాలు అమలు చేసిన అమానవీయ అత్యాచారాలనూ, దౌర్జన్యాలనూ, హత్యలనూ బట్టబయలు చేయాల్సిందిగా కోరుతున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక, నిర్బంధ విధానాలకు వ్యతిరేకంగా నినదించాల్సిందిగా కోరుతున్నాం. పోరాట ప్రాంతాలలో ప్రజల ప్రజాస్వామ్య హక్కులకు మద్దతుగా నిలవాలనీ, జైళ్లలో బంధీలైన వాళ్లను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేయాలనీ మేం కోరుతున్నాం. బస్తర్‌లో ఏ దేశ సరిహద్దులున్నాయని సరిహద్దు భద్రతా దళాలను మోహరించావో చెప్పమని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరుతున్నాం. దండకారణ్యం నుండి అదనపు బలగాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయాల్సిందిగా కోరుతున్నాం.

*(కోస)*

కార్యదర్శి,

స్పెషల్ జోనల్ కమిటీ

సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]

దండకారణ్యం

# బీహారులోని నక్సలైట్ ఖైదీలపై జైలు అధికారుల దారుణ దాడి

*బీహారులోని బెవూర్ ప్రత్యేక జైలు అధికారులు ఖైదీలను చూడటానికి వచ్చినవారి నుండి డబ్బు గుంజుతుండడంతో ఆ జైలులోని ఖైదీలు దానికి అభ్యంతరం చెప్పసాగారు. దానితో మార్చి **2, 2004** ఉదయం సందర్శకులు వచ్చే సమయంలో స్పెషల్ బెవూర్ జైలు అధికారులు దారుణ లాఠీచార్జికి ఒడిగట్టారు. లాఠీచార్జికి బీహార్ మిలటరీ పోలీసుల సహాయం తీసుకున్నారు. ఆ లాఠీచార్జిలో బంధీ సంఘర్ష్ మంచ్ (బిఎస్‌యం - ఖైదీల పోరాట వేదిక) నాయకులను ప్రత్యేకంగా టార్గెట్ చేశారు. పిడబ్ల్యు నాయకుడు రవికుమార్ (బిఎస్‌యం అధ్యక్షుడు కూడా)ను, పిడబ్ల్యు కేంద్ర కమిటీ సభ్యుడు అరవింద్ కుమార్‌లను తీవ్రంగా గాయపరచారు. సుమారు **3** డజన్ల ఖైదీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో చాలామంది పిడబ్ల్యు, యంసిసిఐ, సిపిఎన్ (మావోయిస్టు)లకు చెందినవారే. గాయపడినవారిలో దేవనాథ్ ప్రసాద్ యాదవ్, రోషన్ కుమార్ యాదవ్, వినోద్ థాపా మొదలైన కామ్రేడ్స్ సిపిఎన్ (మావోయిస్టు)కు చెందిన వారు. వీరిలో చాలామందికి చేతులు కాళ్లు విరిగాయి, తలలు పగిలాయి.*

*జైలు పరిస్థితులు, జైలు అధికారుల లంచగొండితనంలకు వ్యతిరేకంగా బిఎస్‌యం చేసిన నిరంతర పోరాటానికి ప్రతీకారంగానే ఈ పాశవిక చర్యకు పూనుకున్నారు. జైలు మంత్రి బసవన్ భగత్ జైలును సందర్శించి ఖైదీల డిమాండ్లు అమలుపరచడానికి హామీలు ఇవ్వడం, కొన్ని సంస్కరణలు కూడా ప్రవేశపెట్టడంతో ఆ పోరాటం విరమించుకున్నారు. ఇది జైలు అధికారులను రెచ్చిపోయేట్టు చేసింది. దానితో వారు ప్రతీకారం తీర్చుకోవడానికే మార్చి **2** చర్యకు కుట్ర పన్నారు. అందువల్లనే బిఎస్‌యంకు చెందిన మావోయిస్టు నాయకులను ప్రత్యేకంగా టార్గెట్ చేశారు.*

*అప్పటినుండి గాయపడిన వారికి వైద్య చికిత్స నిరాకరించడమేగాక, వారిని వేర్వేరు వార్డులకు బదిలీ చేయడం ద్వారా వేరుగా ఉంచారు. వారికి సందర్శకులతో ములాకాత్‌లను నిరాకరించారు. లాఠీచార్జికి నిరసనగా జైలులో బుద్ధ విగ్రహం వద్ద రోజూ ధర్నాలు జరుగుతున్నాయి. **3**వ తారీఖున **300** మంది పాల్గొనగా, **4**న అది **450**కి పెరిగింది. ఈ ధర్నాలు బిఎస్‌యం బ్యానర్ కిందే జరిగాయి, కామ్రేడ్స్ అరవింద్, రవి, ఇతరులు ప్రసంగిస్తున్నారు. వారు నిర్దిష్టంగా చీఫ్ జైలరు ప్రదీప్ కుమార్ ఝా పైనా, ఆ దాడితో సంబంధం ఉన్న జైలర్లపైనా చర్యను డిమాండు చేస్తున్నారు. సరైన వైద్య చికిత్సను డిమాండ్ చేస్తున్నారు. గత డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నారు. తమ డిమాండ్లు సాధించేవరకు ధర్నాలు కొనసాగిస్తామని వాళ్లు శపథం చేశారు. **4**వ తేదీన పి.కె.ఝా జైలు తనిఖీకి వచ్చాడు. పిడబ్ల్యు మద్దతుదార్లు నినాదాలు చేస్తూ అతన్ని చాలా సేపటి వరకు ఘెరావ్ చేశారు.*

*ఈలోగా జైలు పోరాటం జైలు బయట పాట్నా వీధులకు పాకింది. మార్చి **5**న **500** మంది ప్రజలు జిల్లా కేంద్రానికి ర్యాలీగా వెళ్లి జాక్సన్ చౌక్ వద్ద జమయ్యారు. ఈ ర్యాలీని ఎఐపిఆర్ఎఫ్, ఎస్ఎఫ్‌పిఆర్, విద్యార్థి సంస్థలు, డిఎస్‌యులు నిర్వహించాయి. జైలు లోపలా, బయటా పోరాటం సాగుతోంది.* ✶

# దక్షిణాసియా మావోయిస్టు పార్టీల, సంస్థల సమన్వయ సమితి (CCOMPOSA) 3వ మహాసభ జయప్రదం

దక్షిణాసియా మావోయిస్టు పార్టీల సమన్వయ కమిటీ తన 3వ మహాసభను 2004 మార్చ్ 16-18 మధ్య విజయవంతంగా ముగించుకుంది. ఈ మహాసభకు ఏడుగురు సభ్యులు, ఇద్దరు అబ్జర్వర్లు హాజరయ్యారు. తమ తమ దేశాల్లో ప్రజాయుద్ధాలను తీవ్రపరచి, అభివృద్ధి చేసే సంకల్పంతో ప్రతినిధులు ఈ మహాసభను విజయవంతంగా ముగించారు.

ఈ మహాసభ నేపాల్‌లో దేశంలోని 80% భూభాగం మావోయిస్టుల అధీనంలో ఉండి నూతన ప్రపంచం ఆవిర్భవించబోతూ, ప్రజాయుద్ధం వ్యూహాత్మక ఎదురుదాడికి సంసిద్ధమవుతున్న సమయంలో జరిగింది. భారతదేశంలో ప్రజాయుద్ధం మరింత పురోగమిస్తుండగా, అలాగే రెండు అతిపెద్ద మావోయిస్టు పార్టీలు యంసిసిఐ, సిపిఐ (యం-ఎల్) [పీపుల్స్‌వార్]లు ఐక్యత వైపుగా మరింత ముందుకు సాగుతున్న సమయంలో జరిగింది. బంగ్లాదేశ్‌లో మావోయిస్టు పార్టీలు తమ ప్రజాయుద్ధాల్ని నూతన ప్రాంతాలకు విస్తరిస్తుండగా, భూటాన్‌లో నూతన మావోయిస్టు పార్టీ ఏర్పడ్డ సమయంలో జరిగింది.

***ఈ మహాసభకు హాజరైన 7 సభ్య సంస్థలు ఇవి – 1)*** **పిబిఎస్‌పి (సీసీ) [బంగ్లాదేశ్], 2) సిపిఈబి (ఎంఎల్) (రెడ్‌స్టార్) [బంగ్లాదేశ్], 3) ఎంసీసీఐ [భారతదేశం], 4) సీపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] [భారతదేశం], 5) సీపీఐ (ఎంఎల్) (నక్సల్బరీ) [భారతదేశం], 6) ఆర్‌సీసీఐ (ఎంఎల్ఎం) [భారతదేశం], 7) సీపీఎన్ (ఎం) [నేపాల్].** కాగా బంగ్లాదేశ్‌లోని 2 పార్టీలు, శ్రీలంకలోని ఒక పార్టీ టెక్నికల్ కారణాల వల్ల హాజరుకాలేకపోయాయి. అబ్జర్వర్లుగా హాజరయిన పార్టీలు బంగ్లాదేశ్ నుండి పిబిఎస్‌బి (యంబిఆర్‌యం), భూటాన్ నుండి నూతనంగా ఏర్పడిన భూటాన్ కమ్యూనిస్టు పార్టీ (యంఎల్‌యం).

మహాసభ అంతర్జాతీయ గీతాలాపనతో, ఆగస్టు 2002లో జరిగిన గత మహాసభ నుండి అమరులైన వారందరికి జోహార్లర్పిస్తూ ప్రారంభమైంది.

నేపాల్ ప్రజాయుద్ధంలో గత చర్చల రౌండ్ ముగిసినప్పటి నుండి 1500 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో రీజినల్ బ్యూరో సభ్యుడు, బెటాలియన్ కమిషనర్ కా.బివేక్, బెటాలియన్ కమాండర్ కా.ప్రహార్‌ల వంటి సీనియర్ కామ్రేడ్స్ ఉన్నారు. భారతదేశంలో గత మహాసభ నుండి పీపుల్స్‌వార్ 375 మంది, యంసిసిఐ 134 మంది అమరులయ్యారు. పీపుల్స్‌వార్ 8 మంది రాష్ట్ర స్థాయి కామ్రేడ్స్‌ను – కామ్రేడ్ రామకృష్ణ (వరంగల్), కామ్రేడ్ పద్మ (కరీంనగర్), కామ్రేడ్ ప్రసాద్ (అనంతపూర్), కామ్రేడ్ అనపురం కొమురయ్య (కరీంనగర్), కామ్రేడ్ అసీందాస్ (మిడ్నాపూర్, పశ్చిమ బెంగాల్); ఇద్దరు జిల్లా కార్యదర్శులను – కామ్రేడ్ లలిత (ఆదిలాబాద్), కామ్రేడ్ గంగన్న (అనంతపూర్) కోల్పోయింది. సిపిఇబి (యంఎల్) (రెడ్ ఫ్లాగ్) ఒక డిసియం సహా 15 మంది కామ్రేడ్స్‌ను కోల్పోయింది. పిబిఎస్‌బి (యంబిఆర్‌యం) కామ్రేడ్స్ నలుగురు అమరులయ్యారు.

ఈ సభ, కన్వీనర్ నేపాల్‌కు చెందిన కా.కిశోర్ ప్రవేశపెట్టిన సీకంపోసా కార్యకలాపాల రిపోర్టుతో ప్రారంభమైంది. దీని తరువాత తమ తమ దేశాల్లోని ప్రజాయుద్ధాల విస్తృత నివేదికలు లేదా దానికోసం తమ తయారీల గురించిన నివేదికలు ముందుంచారు. అంతిమంగా మహాసభ ప్రపంచ ప్రస్తుత పరిస్థితిపైన, దక్షిణాసియా దేశాలపైన ఒక రాజకీయ తీర్మానాన్ని ఆమోదించింది.

అంతర్జాతీయ స్థాయిలో తీవ్రంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభ పర్యవసానంగా ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదం, ముఖ్యంగా యుద్ధపిపాసి అమెరికా, దాడిని ముమ్మరం చేస్తోందని విశ్లేషించింది. దీని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతిఘటన పెరుగుతోంది. దక్షిణాసియాలో కూడా సామ్రాజ్యవాదులు, నిర్దిష్టంగా అమెరికా సామ్రాజ్యవాదులు, ఈ ప్రాంతంలోని ఆయా దేశాలపై తమ పట్టును బలంగా పెంచుకుంటున్నాయి.

దీనితో పాటు, నేపాల్‌కు అధికారులను పంపించడం ద్వారా సైనిక జోక్యం, పాకిస్తాన్‌లో సైనికపరంగా లోతుగా ప్రమేయాన్ని కల్గియుండడం, భారత విస్తరణవాదులతో వ్యూహాత్మక సంబంధం ఏర్పరచుకోవడం వంటి చర్యలకు అమెరికా సామ్రాజ్యవాదులు పూనుకుంటున్నారు.

దక్షిణాసియా దేశాల్లో ప్రజాయుద్ధాలు పురోగమిస్తుండటంతో, ఆయా ప్రభుత్వాలు క్రూరమైన రాజ్య నిర్బంధాన్ని సాగిస్తున్నాయి. నరహంతక జ్ఞానేంద్ర ప్రభుత్వం నేపాల్‌లో దారుణమైన ఊచకోతకు పాల్పడుతోంది. భారతదేశంలో పాలకులు క్రూరమైన పోటా చట్టాన్ని విధించారు. యంసిసిఐ, పీపుల్స్‌వార్, తదితర సంస్థలని నిషేధించారు. వందలాది బూటకపు ఎదురుకాల్పులకు పాల్పడ్డారు. 75 మంది నేపాలీ మావోయిస్టు నాయకులను చట్ట వ్యతిరేకంగా నేపాల్‌కు అప్పగించారు. కామ్రేడ్స్ కిరణ్, గౌరవ్ వంటి ఉన్నతశ్రేణి మావోయిస్టు నాయకులను కటకటాల వెనుక బంధించివుంటారు.

ఇంకా, సామ్రాజ్యవాదం, నిర్దిష్టంగా అమెరికా సామ్రాజ్యవాదం, దాని ఏజంటైన భారత విస్తరణవాదం దక్షిణాసియా ప్రజల ఉమ్మడి శత్రువులని తీర్మానం పేర్కొంది.

భారత్, బంగ్లాదేశ్‌లలో కొందరు కామ్రేడ్లకు ఉరిశిక్ష విధించడానికీ, కామ్రేడ్స్ కిరణ్, గౌరవ్‌లను అక్రమంగా అరెస్టు చేసి జైళ్ళో నిర్బంధించడానికీ, 75కు పైగా నేపాల్ మావోయిస్టు నాయకుల అరెస్టుకూ, వాళ్లను నేపాల్‌కు అప్పగించడానికీ, సంబంధిత దేశాలలో పెరుగుతున్న రాజ్య నిర్బంధానికి నిరసనగా నక్సల్బరీ వారం సందర్భంగా దక్షిణాసియా అంతటా ఉమ్మడి క్యాంపెయిన్‌ను నిర్వహించాలని సభ పిలుపునిచ్చింది.

అంతిమంగా రాజకీయ తీర్మానం, ఈ ప్రాంతంలోని మావోయిస్టు శక్తులను మరింత దృఢంగా ఐక్యపరచేందుకు, ఈ ప్రాంతంలోని పోరాటశక్తుల మధ్య ఐక్యతను మరింత గట్టిపరచేట్లు చేసి దక్షిణాసియాలోని ఆయా దేశాలను ప్రపంచ విప్లవానికి దృఢమైన కోటలుగా మల్చాలని శపథం బూనింది.

## సంతకాలు చేసినది


1) పీబీఎస్‌పీ (సీసీ) [బంగ్లాదేశ్]
2) సీపీఈబీ (ఎంఎల్) (రెడ్‌స్టార్) [బంగ్లాదేశ్]
3) ఎంసీసీఐ [భారతదేశం]
4) సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] [భారతదేశం]
5) సీపీఐ (ఎంఎల్) (నక్సల్బరీ) [భారతదేశం]
6) ఆర్‌సీసీఐ (ఎంఎల్ఎం) [భారతదేశం]
7) సీపీఎన్ (ఎం) [నేపాల్]

# వైరుధ్యాలను సరిగా పరిష్కరించడం ద్వారా (వ్యూహాత్మక) ఎదురుదాడి సన్నాహాలను నూతన శిఖరాలకు తీసుకెళ్లడంపై సమస్త శక్తులను కేంద్రీకరిద్దాం!

*(“ప్రస్తుత పరిస్థితి, మన చారిత్రక కర్తవ్యాలు”కు అనుబంధ తీర్మానం ఇది. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ ఛైర్మన్ కామ్రేడ్ ప్రచండ దీనిని ప్రవేశపెట్టగా కేంద్రకమిటీ పార్టీ పోలిట్ బ్యూరో ఆమోదించింది. – సంపాదకవర్గం)*

కేంద్ర కమిటీ గత ప్లీనం తర్వాత, ప్రత్యేకించి కాల్పుల విరమణ విచ్ఛిన్నమైన అనంతరం నెలకొన్న రాజకీయ, సైనిక పరిస్థితిని సమీక్షించి రానున్న రోజులకు అవసరమైన విధంగా విధానంలో, పథకంలో అవసరమైన మెరుగుదలను ప్రవేశపెట్టడానికై ఈ పోలిట్ బ్యూరో సమావేశం జరుపుకుంటున్నాం.

## 1. నేటి ప్రపంచ పరిస్థితిపై సమీక్ష




ప్రపంచ పరిస్థితిపై మన సిసి (సమావేశం) చేసిన విశ్లేషణలూ, నిర్ధారణలన్నీ నేటికీ వర్తించేవేననీ, సరియైనవేననీ స్పష్టమవుతోంది. ఇరాక్ యుద్ధం తర్వాత అమెరికా సామ్రాజ్యవాదం రోజురోజుకూ రాజకీయంగా ఒంటరైపోతూ తీవ్ర సైనిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ విషయం ఈమధ్య జరిగిన ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశంలోనూ, మెక్సికోలోని కాంకున్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ విశ్వ సమ్మేళనంలోనే కాకుండా ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా బలగాలకు వ్యతిరేకంగా పెంపొందుతున్న ప్రతిఘటన, అలాగే మధ్య ప్రాచ్యంలో శాంతి పేరుతో ముందుకు తెచ్చిన దివాళాకోరు ‘రోడ్ మ్యాప్’ విషయాల్లో మరింతగా నిరూపితమైంది. దక్షిణాసియాపై తన ఆధిపత్య పట్టు మరింత బిగించాలనే (అమెరికా) వ్యూహం ఈ సంక్షోభ నేపథ్యంలో సరికొత్త సమస్యలనెదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో అమెరికా సామ్రాజ్యవాదం పైనా, దాని దయాదాక్షిణ్యాలపై బతుకుతున్న రాచరిక సైనిక నియంతృత్వంపైనా సైద్ధాంతిక, రాజకీయ దాడులను కేంద్రీకరించాలన్న మన విధానం వాస్తవికమైందని ఈ పరిస్థితులు నిరూపిస్తున్నాయి. పైన పేర్కొన్న విధానం ప్రాతిపదికపై మన కేంద్రం (పార్టీ) చొరవ చేసిన ఫలితంగా ప్రపంచంలోని సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజారాశులతోనూ, కమ్యూనిస్టు విప్లవకారులతోనూ సంబంధాలు బలపడడం, విస్తరించడం మాత్రమే కాకుండా అమెరికా సామ్రాజ్యవాదంతో ఏదో ఓ స్థాయిలో విభేదిస్తున్న పలు తిరోగమనవాద శక్తులతో దౌత్య సంబంధాలు కూడా విస్తరించాయి.

## 2. దేశ రాజకీయ పరిస్థితి సమీక్ష

రాజ్యాంగసభ ద్వారా ప్రజల సార్వభౌమత్వాన్ని నెలకొల్పాలనే విషయంలో వెసులుబాటుతో కూడిన ఎత్తుగడల వల్లా, అలాగే చర్చల క్రమమంతటిలో చొరవతో వ్యవహరించిన ఫలితంగానూ రాజకీయంగా పార్టీ నూతన ఎదురుదాడి స్థితికి చేరుకుంది. మూడవ విడత చర్చల సందర్భంగా పాత రాజరిక పాలన ముందుకు తెచ్చిన కాలం చెల్లిన ‘‘అవగాహనా పత్రం’’, అలాగే అదే సమయంలో దొరాంబాలో అది కొనసాగించిన హత్యాకాండతో పార్టీ చర్చల నుండీ, కాల్పుల విరమణ నుండి వైదొలగి ప్రతిఘటనకు పురోగమించాలని చేసిన ప్రకటన దేశం లోపలే కాకుండా బయట కూడా పార్టీ రాజకీయ ప్రతిష్ఠను నిలబెట్టింది. ఈ క్రమమంతటిలో, వ్యూహాత్మక దృఢత్వాన్నీ, ఎత్తుగడల్లో వెసులుబాటునూ ఉన్నతంగా అమలు జరపడంలో పార్టీ పూర్తిగా జయప్రదమైంది.

పాశ్చాత్య సామ్రాజ్యవాదానికి ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి కీలుబొమ్మగా మారిన రాజరికపు (పాత ప్రభుత్వపు) రాజకీయ అస్తిత్వం ప్రస్తుతం ప్రజావ్యతిరేక రాచరిక సైనిక ఉగ్రవాదానికి దిగజారింది. రాజభవనం ఊచకోత తర్వాత పాత రాచరికం సామ్రాజ్యవాదుల చేత శాసింపబడుతూ సైనిక ఫాసిజంగా దిగజారిపోయిందని పార్టీ చేసిన విశ్లేషణా, నిర్ధారణా సరియైనవేనని మరింత కచ్చితంగా రుజువైంది.

పాత రాచరిక ప్రభుత్వంలో తమను కలుపుకోవాలని యాచిస్తున్న పార్లమెంటరీ రాజకీయ పార్టీలను చేర్చుకోవడంలో సైతం తమ అయిష్టతను ప్రదర్శించడం ద్వారా ఈ ఫ్యూడల్ శక్తులు తమకు బహుళ పార్టీ ప్రజాస్వామ్యం పట్ల ఉందని చెప్పుకుంటున్న నిబద్ధత బూటకమైందని బట్టబయలైంది. పాత ప్రభుత్వం తన సామ్రాజ్యవాద, ఫ్యూడల్ మొండివైఖరిని బాహాటంగా ప్రదర్శిస్తూ స్థానిక సంస్థలకు అర్థంపర్థం లేని నామినేషన్లు వేస్తున్నది. పార్లమెంటరీ ఎన్నికల నిర్వహణ గురించి గాలి కబుర్లు చెబుతున్నది. పార్లమెంటరీ రాజకీయ పార్టీల అస్తిత్వాన్ని సైతం సహించకుండా వాటిని సర్వనాశనం చేస్తూ, తన మిలటరీ ఫాసిజానికి సాధికారిత ముసుగు వేసుకోవడానికి తెలివిగా కుట్ర పన్నడం ఈ ప్రక్రియలో కనిపిస్తుంది. బడా పార్లమెంటరీ పార్టీల రాజకీయ నిష్క్రియత్వం క్రమంగా వాటిని వినాశనం వైపు తీసుకెళ్తోంది. 21వ శతాబ్దపు వర్తమాన ప్రపంచ నిర్దిష్ట పరిస్థితిలో చట్టబద్ధ రాజరికం అసంభవమన్న విషయాన్నీ, దేశంలో అంతర్యుద్ధం అభివృద్ధినీ అంచనా వేయలేని శక్తులు రాజకీయంగా అంతం కావడం సహజమే. నేపాల్‌లో బూర్జువా ప్రజాస్వామ్య విప్లవాన్ని జయప్రదం చేయడానికి శ్రామికవర్గ నాయకత్వం వెనుక సమీకృతులవడమో లేదా భూస్వామ్య, సామ్రాజ్యవాదులతో కుమ్మక్కైన మిలటరీ ఫాసిజానికి సంపూర్ణంగా లొంగిపోవడమో తప్ప మరో ప్రత్యామ్నాయం లేదన్న వాస్తవాన్ని గ్రహించడంలో అశక్తులు కావడమనేది పార్లమెంటరీ శక్తులకు శాపగ్రస్తంగా మారింది. దేశంలోని రాజకీయ పోరాటం పైకి త్రికోణీయంగా అగుపడుతున్నప్పటికీ సారాంశంలో, వర్గ పరిభాషలో రెండు ధ్రువాల మధ్యనే అని గత సిసి తీసుకున్న నిర్ణయం సరియైనదేనని నిరూపితమైంది.

పార్లమెంటరీ లొంగుబాటువాదాన్ని మధ్యేమార్గంగా బహిర్గతం చేస్తూ, విశాల ప్రజలతోనూ, వర్గాలతోనూ మమేకమవుతూ సైనిక ఫాసిజంపై దాడులను కేంద్రీకరించడమనే పార్టీ విధానాన్ని దృఢంగా ముందుకు తీసుకుపోవడం ఎంతో అవసరమని ఈ సందర్భంగా స్పష్టమవుతోంది.

## 3. కాల్పుల విరమణ నుండి వైదొలగిన తర్వాత సైనిక పరిస్థితిపై సమీక్ష

వ్యూహాత్మక ఎదురుదాడికీ, సార్వత్రిక సాయుధ తిరుగుబాటుకూ సన్నాహాల్లో భాగంగా గత సిసి రూపొందించిన వ్యూహాత్మక పథకం ఇంకా అమలు క్రమంలోనే ఉంది. కాబట్టి వెంటనే దానిపై సమగ్ర సమీక్ష సాధ్యం కాదు. అయినప్పటికీ, ఈ పథకంలో భాగంగా ప్రాథమిక దశ పూర్తయింది కనుక దానిని ప్రాథమికంగా క్రోడీకరించి భవిష్యత్ కోసం అందులో మెరుగుదలనూ, నిర్దిష్టత్వాన్నీ తేవడం సాధ్యమూ, అవసరమూ కూడా.

మొదటి దశలో వికేంద్రీకృత చర్యలకూ, రెండవ దశలో సాపేక్షికంగా కేంద్రీకృతమైన దాడులకూ, మూడవ దశలో భారీ, కేంద్రీకృత దాడులకూ పూనుకోవాలన్నదే సిసి రూపొందించిన పథకంలో ముఖ్యమైన అంశమని అందరికీ గుర్తుండే ఉంటుంది. మొదటి దశలో వికేంద్రీకృత దాడుల్లో భాగంగా శత్రువుకు నష్టాన్ని కల్గించడం, వాడి దూకుడుకు కళ్లెం వేయడం కోసం గ్రామీణ ప్రాంతాల్లో చిన్నా పెద్దా మాటు దాడులకు పూనుకోవడం అలాగే మైదాన ప్రాంతాల్లో (మధేశ్), పట్టణాల్లో చిన్నా పెద్దా రెయిడ్లు, కమెండో దాడులు, చిన్నా పెద్దా విధ్వంసక చర్యలను నిర్ణయించుకున్నాం.

నూతన ప్రారంభం మొదటి దశలో భాగంగా నిర్ణయించుకున్న చర్యలనూ, లక్ష్యాలనూ జయప్రదంగా పూర్తిచేసుకున్నాం. వికేంద్రీకృతమైన దాడులే అయినప్పటికీ దేశవ్యాపితంగా ఒక గొలుసు క్రమంలో జరిగిన అనేక రకాల, ముమ్మరమైన, సాహసోపేతమైన దాడులు శత్రు బలగాలను ఖంగు తినిపించి, గందరగోళానికి గురి చేసి ఆత్మరక్షణా స్థితిలోకి నెట్టాయి. రాజధాని, మధేశ్ (మైదాన ప్రాంతం), చిన్నా పెద్ద పట్టణాల్లో జయప్రదంగా, సాహసోపేతంగా నిర్వహించిన కమెండో దాడులు, విధ్వంసక చర్యలు నూతన ప్రారంభంలో అత్యంత ముఖ్యమైనవి, లాభప్రదమైనవి. ఈ తీవ్ర చర్యల ఫలితంగా శత్రువుకు రాజధానిలోనూ, ఇతర పట్టణాల్లోనూ, తెరాయి (మైదాన) గ్రామీణ ప్రాంతాల్లోనూ రక్షణ లేదన్న విషయం స్పష్టంగా రుజువయ్యింది. పర్వతాల్లోనైతే (పాత ప్రభుత్వం) ముందే తుడిచిపెట్టుకపోయింది. నూతన ప్రారంభంలో సాధించిన ఫలితాలు సార్వత్రిక సాయుధ తిరుగుబాటుకు సన్నాహాలు చేసుకునే లక్ష్యం దిశలో ముఖ్యమైన విజయాలు.

సంఖ్యాపరంగా చూసినపుడు రోడ్లపై మందుపాతరల పేలుడు చర్యలూ, ఆంబుష్‌లూ ఆశించిన విధంగానే జరిగాయి. అయితే సేతి, మహాంకాళీ ప్రాంతంలో తప్ప ఇతర ప్రాంతాలలో ఆశించిన గుణాత్మక ఆంబుష్‌లు జరగలేదు. అనుకోకుండా జరిగిన స్థావరయుద్ధ తరహా సంఘర్షణలలో రోల్పాలోని హాడింగ్, కోర్చవాంగ్‌లలో జరిగిన ఎన్‌కౌంటర్లు ముఖ్యమైనవి.

మొత్తంగా చూసినపుడు, కొత్త వ్యూహాత్మక పథకంలో భాగంగా నూతన ప్రారంభం జయప్రదంగా పూర్తయింది. అయితే గతంలో ప్రతి పథకం ప్రారంభంలోనూ కేంద్రీకృత పద్ధతిలో దిగ్భ్రాంతిని కలిగించే దాడుల్ని చేసే వాళ్లం. ఆఖరుకు శత్రువూ, ప్రజలూ కూడా దీనికే అలవాటు పడ్డారు. కాబట్టి ఈ కొత్త వ్యూహాత్మక పథకం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. శత్రువు తనకు భారీ నష్టాలు కలిగినప్పటికీ, ప్రజా విముక్తి సైన్యం (పీఎల్ఏ) 'బలహీనపడింద'నీ, తన స్వంత (రాయల్) సైన్యం 'విజయాన్ని' సాధిస్తున్నదనీ చెబుతూ ఈ నూతన ప్రక్రియ గురించి తప్పుడు ప్రచారం చేశాడు. మరోవైపు, శత్రువు పథకం ప్రకారం చేస్తున్న దుష్ప్రచారంతోనూ, అట్లాగే మన కొత్త పథకం సారాన్ని గురించిన సమాచారం తెలియనందువల్లనూ ప్రజల్లో ఒక సెక్షన్, ముఖ్యంగా పట్టణ మధ్య తరగతి మేధావులు కొంత గందరగోళంలో, అనుమానంలో పడ్డట్టుగా అనిపిస్తున్నది. ఆఖరుకు కొందరు విప్లవ కేడర్లు కూడా దిగ్భ్రాంతిని కలిగించే పెద్ద చర్యలు లేనందుకు నిరాశగా ఉన్నట్టున్నారు.

ఇలాంటి గందరగోళాలూ, అనుమానాలూ ఏవి ఉన్నప్పటికీ... కాల్పుల విరమణ ఒప్పందం విచ్ఛిన్నమైన తర్వాతి జాతీయ-అంతర్జాతీయ పరిస్థితిలో, మన స్వంత రాజకీయ చొరవ, శత్రువు చేసుకున్న కచ్చితమైన సన్నాహాలు, దేశవ్యాప్త ఎదురుదాడి కోసం మన సన్నాహాల వ్యూహం – వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకున్నప్పుడు మొదటి దశలో వికేంద్రీకృత చర్యలు నిర్వహించాలన్న మన విధానం పూర్తిగా సరైందనీ, వస్తుగతమైందనీ మనకు స్పష్టత ఉండాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఒకవేళ మనం మునుపటి రకం చర్యలు నిర్వహించినట్టయితే రాజకీయంగానూ, సైనికంగానూ దుష్ఫలితాలు సంభవించే ప్రమాదం ఉండేదన్న విషయంలోనూ మనకు స్పష్టత ఉండాలి. శత్రువు ఓటమి పాలవుతూ, ఆత్మరక్షణా స్థితిలో ఉన్నప్పటికీ తాను "విజయాలు సాధిస్తున్నాన"నీ, "దాడి స్థితిలో ఉన్నాన"నీ చేస్తున్న ఉల్టా ప్రచారంతో అంతిమంగా ప్రజాయుద్ధానికి లాభమే ఒనగూరుతుంది.

అయినప్పటికీ, నూతన పరిస్థితిలో ప్రస్తుత రూపాల్లో చర్యలను కొనసాగిస్తూనే, పెద్ద కేంద్రీకృత చర్యలను ఆర్గనైజ్ చేయడంపై కేంద్రీకరించాలి. తద్వారా అవి ఎదురుదాడికీ, సాయుధ తిరుగుబాటుకూ సన్నాహాల్లో ఒక గుణాత్మక పాత్రను పోషించగలుగుతాయి.

## 4. సైనిక చర్యల నిర్వహణలో మెరుగుదల

పర్వతాల్లోనే కాకుండా మధేశ్‌లోని మైదాన ప్రాంతాల్లో కూడా పాత రాజ్యాధికారం దేశంలోని మొత్తం గ్రామీణ ప్రాంతాలలో మౌలికంగా ధ్వంసమై పోయింది. ఇలాంటి అన్ని ప్రాంతాలూ పార్టీ నాయకత్వంలోకీ, ప్రభావంలోకీ వచ్చాయి. ఈ వాస్తవాన్ని మనతో పాటు దేశం లోపలా, బైటా ఉన్న మన శత్రువులు కూడా ఒప్పుకుంటున్నారు.

గొప్ప ప్రజాయుద్ధం అభివృద్ధి నుండి తలెత్తిన ఈ విధమైన స్థితిలో సాధారణ ప్రజలు సహజంగానే మనం ఎక్కువ సీరియస్‌గా ఉండాలనీ, బాధ్యతాయుతంగా మెలగాలనీ కోరుకుంటారు. కానీ కొన్ని సందర్భాల్లో మన సైనిక చర్యలలో కొన్ని రూపాలు ప్రస్తుత ఉద్యమాభివృద్ధి స్థాయికీ, (మన) బాధ్యతకూ, ప్రజల ఆకాంక్షలకూ అనుగుణంగా ఉండడం లేదు. మనం వెంటనే మన సైనిక చర్యల నిర్వహణా రూపాల్లో మెరుగుదల తేనట్టయితే ఆఖరుకు వ్యతిరేక ఫలితాలే వెలువడుతాయి. కాబట్టి తక్షణ సైనిక చర్యల సందర్భంగా మనం మన అవగాహననూ, ఆచరణనూ ఈ కింది విధంగా స్పష్టపర్చుకోవల్సిన అవసరం ఉంది :

### *ఏ) విధ్వంసం, నిర్మాణం గురించి*

పాత రాజ్యాధికారాన్ని ధ్వంసం చేయడం, ఒక కొత్త రాజ్యాధికారాన్ని నిర్మించడమే విప్లవం ప్రధాన లక్ష్యం. పాత రాజ్యాధికారం పూర్తిగా ధ్వంసమయ్యే దాకా, విప్లవం విజయవంతమయ్యే దాకా వ్యూహాత్మకంగా విధ్వంసమే ముఖ్యమైనది (పార్శ్వం)గా ఉంటుంది. అయినప్పటికీ పాత రాజ్యాధికారం ధ్వంసమైన ప్రాంతాలలో, స్థాయిలలో ఎత్తుగడలపరంగా, ఆచరణపరంగా నిర్మాణ(పార్శ్వ)మే ముఖ్యమైందవుతుంది. సాధారణంగా నిర్మాణ ప్రక్రియ విధ్వంసం నుండి మొదలవుతుంది. ఈ రెంటి మధ్య గతితార్కిక సంబంధం ఉంటుంది. కానీ మన ఆచరణలో సైనిక చర్యలకు సంబంధించిన కొన్ని రూపాలు విధ్వంసానికీ, నిర్మాణానికీ మధ్యన ఈ గతితార్కిక సంబంధాన్ని సరైన పద్ధతిలో వ్యక్తీకరించడం లేదు. ఉదాహరణకు, ఇప్పుడు మన నియంత్రణలోకీ, ప్రభావంలోకీ వచ్చిన గ్రామీణ ప్రాంతాలలో పాత గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) భవనాలను కాలబెట్టడం లాంటి కార్యకలాపాలను కొనసాగించడం; పోలీసు బలగాలు ఖాళీ చేసిన భవనాలను వాళ్లు తిరిగి వచ్చే అవకాశం ఏ మాత్రం లేనప్పటికీ పేల్చివేయడం; మన విధానాలనూ, నియమాలనూ పాటించడానికి సిద్ధంగా ఉన్న వ్యాపారుల, చిన్న పరిశ్రమాధిపతుల, తదితరుల ఆర్థిక సదుపాయాలను ధ్వంసం చేయడం; ధ్వంసం అంటే ఇక ఏ మాత్రం

పనికిరాని విధంగా పూర్తిగా ధ్వంసం చేయడం... ఇవన్నీ. వీటి వల్ల ప్రజల్లో మనకు వ్యతిరేకంగా అసంతృప్తి పెరిగి, దాన్ని శత్రువు ఉపయోగించుకోగల ప్రమాదం పెరుగుతుంది.

కాబట్టి, పాత రాజ్యాధికారం ధ్వంసమై పోయిన గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి, నిర్మాణ కార్యకలాపాల బాధ్యతనూ, భౌతిక మౌలిక సదుపాయాలను, ప్రకృతి వనరులను రక్షించే బాధ్యతనూ మనమే తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రజలను సంఘటితం చేయాలి. కొత్త తరహా అభివృద్ధి, నిర్మాణ కార్యకలాపాలపై మనం కేంద్రీకరించాలి. గతంలో పాత రాజ్యాధికారం, దాని యంత్రాంగం వాడుకున్న భవనాలనూ, నేలనూ, అడవినీ, ఇతర ఆర్థిక సదుపాయాలనూ మనం ఉపయోగించుకోవాలి. వాటిని ధ్వంసం చేయడానికి శత్రువు చేయగల ప్రయత్నాలకు వ్యతిరేకంగా మనం నిలబడాలి. రానున్న రోజుల్లో మనం మన మాటల్లోనూ, చేతలలోనూ దీన్ని తప్పకుండా రుజువు చేయాలి.

### *బీ) వర్గ శత్రువులనూ, గూఢచారులనూ నిర్మూలించడం గురించి*

వర్గ శత్రువులనూ, గూఢచారులనూ భౌతికంగా నిర్మూలించే విషయంలో, కేవలం ఎంపిక చేసిన వాళ్లనే, వీలైనంత తక్కువ మందిని, ప్రజలకు చెప్పి, వీలైన మేరకు వాళ్ల అంగీకారాన్ని తీసుకునే నిర్మూలించాలన్నది మన పార్టీ విధానంగా ఉన్నది. అట్లాగే ఎలాంటి క్రూర పద్ధతినీ అనుసరించగూడదు. ప్రస్తుత ఉద్యమాభివృద్ధి అవసరాలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ పద్ధతిలో కూడా మెరుగుదలను డిమాండ్ చేస్తున్నాయి. దీనర్థం భౌతిక నిర్మూలనల విషయంలో శత్రువు మనపై చేస్తున్న దుష్ప్రచారంలో మనం కొట్టుకుపోవాలని కాదు. అయినప్పటికీ, ఒక వ్యక్తిని నిర్మూలిస్తున్నప్పుడు మనం వర్గ విశ్లేషణనూ, ఆ వ్యక్తి చేసిన నేర స్వభావాన్నీ, నేరాన్ని నిరూపించడానికి అవసరమైన ప్రజాస్వామ్య, చట్టపరమైన ప్రక్రియ, నిర్మూలనా పద్ధతుల విషయాల్లో నిర్దిష్టమైన విధానాన్ని అభివృద్ధి చేసి దాన్ని అమలు చేయాలి. లేనట్టయితే దుష్ఫలితాలే వస్తాయి. గతంలో కొన్ని నిర్మూలనా చర్యలు చందాలు ఇవ్వలేదనీ, షెల్టర్ ఇవ్వలేదనీ, భోజనం పెట్టలేదనీ, మన ఉద్యమాన్ని రాజకీయంగా వ్యతిరేకించారనీ, గూఢచారి అన్న అనుమానంతోనూ, మన స్థానిక దళాల సభ్యులతో శత్రుత్వం కలిగి ఉన్నందువల్లా, తదితర తప్పుడు కారణాలతో చేశామన్న విషయాన్ని కేవలం శత్రువులూ, అవకాశవాదులూ చేస్తున్న నిరాధార ఆరోపణలుగా కొట్టివేయలేం. కాబట్టి, ఇక ముందు గ్రామీణ ప్రాంతాలలో ఎవరినైనా నిర్మూలించాలనుకున్నపుడు ఆ చర్యను ఏదైనా ప్రత్యేక దళంతో గానీ లేదా కొందరు నిర్దిష్ట వ్యక్తులతో గానీ కాకుండా ఒక కచ్చితమైన కనీస చట్టబద్ధ పద్ధతి ప్రకారమే నిర్వహించాలి. ఎర్ర భీభత్సం అంటే అరాచకం కాదన్న విషయాన్ని మన విధానాలలోనూ, ఆచరణలోనూ కచ్చితంగా వ్యక్తీకరింపజేయాలి.

### *సీ) శత్రు సైనికులపైనా, పోలీసు బలగాలపైనా చర్యల గురించి*

ప్రజాయుద్ధం ద్వారా పాత ప్రభుత్వపు ముఖ్య అంగమైన సాయుధ బలగాలను నిర్మూలించడమే ఏ విప్లవంలోనైనా అత్యున్నత కేంద్ర కర్తవ్యంగా ఉంటుందన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. అయినప్పటికీ, మనం సైనిక చర్యలలో సాధారణమైన, అందరికీ తెల్సిన రూపాలను అమలు చేస్తున్నప్పుడు వేరు వేరు పరిస్థితులలో వేరు వేరు పద్ధతులను అమలు చేస్తాం... చేయాలి. ఉదాహరణకు ఆంబుష్‌లు, మందుపాతర దాడులు, రెయిడ్లు, కమాండో దాడులు మొదలైన చర్యలలో ఎదురుకాల్పుల సందర్భంగా మనం శత్రువుకు వీలైనంత ఎక్కువగా నష్టాలు కలిగించి వాడిని ఓడించడంపై కేంద్రీకరిస్తాం... అలాగే చేయాలి. అయితే లొంగిపోయిన శత్రు సైనికుల, పోలీసుల పట్ల సుపరిచితమైన మన విధానం వాళ్ల పట్ల యుద్ధ ఖైదీలతో అనుసరించే మర్యాదకరమైన వైఖరిని అవలంబించడం, వాళ్లకు అర్థం చేయించి పోరాటంలో మనతో చేయి కలిపేందుకు గానీ లేదా ఇంటికి వెళ్లిపోవడానికి గానీ అవకాశం ఇవ్వడం. ఒంటరిగా దొరికినప్పుడు గానీ, సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు గానీ లేదా మరే సందర్భంలోనైనా గానీ ఎవరినీ కూడా కేవలం ఆ వ్యక్తి శత్రు సైన్యంలో లేదా పోలీసు బలగాల్లో పని చేస్తూ పొట్ట గడుపుకుంటున్నాడన్న కారణంతో నిర్మూలించడం ప్రజాయుద్ధ నియమానికీ, ఆచరణకూ వ్యతిరేకం. అంతిమంగా దీని ఫలితంగా శత్రువులో చీలికకు బదులుగా ఐక్యత పెంపొందుతుంది. కాబట్టి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో, శత్రు సైన్యంలో గానీ పోలీసు బలగాల్లో గానీ పని చేసే వ్యక్తి ఎప్పుడైనా సెలవులపై తన ఇంటికి వచ్చినప్పుడు అతన్ని భయపెట్టడం గానీ, చంపెయ్యడం గానీ చేయగూడదు. మన సిద్ధాంతాన్ని అర్థం చేయించాలి. అతను శత్రువు దగ్గర పనిని వదిలేసేలా ప్రోత్సహించాలి. శత్రు సైన్యంలోనూ, పోలీసు బలగాల్లోనూ పని చేస్తున్న వారి కుటుంబ సభ్యులకు అర్థం చేయించడం, వాళ్లను సంఘటితం చేయడం, వాళ్లకు రక్షణ కల్పించడం అనే మన సరైన విధానాన్ని తొలి నుండీ నొక్కి చెబుతూ వస్తున్నాం. ఇప్పటి నుండీ మనం వాళ్లు శత్రు సైన్యంలో పని చేస్తూ ఉన్నా లేదా వదిలేసి వచ్చినా వాళ్ల కుటుంబ సభ్యులు సురక్షితంగా ఉంటారన్న విషయాన్ని వాళ్లకు అర్థం చేయిస్తూ వాళ్లలో నమ్మకం కలిగించాలి.

లెక్కలేనన్ని అమానుష నేరాలకు పాల్పడ్డ వాళ్లనూ లేదా శత్రు సైన్యంలో గానీ, పోలీసు బలగాల్లో గానీ ఉన్నతాధికార్లుగా పని చేసిన వాళ్లనూ అరెస్టు చేయాలి. వాళ్లపై సెక్షన్ 'బీ'లో చెప్పిన విధంగా చర్య తీసుకోవాలి.

### *డీ) విపక్ష రాజకీయ నాయకులతోనూ, కేడర్లతోనూ వ్యవహరించడం గురించి*

విభిన్న తిరోగమనవాద, అవకాశవాద రాజకీయ పార్టీలతో మన విధానం సాధారణంగా వాళ్లను రాజకీయంగా బట్టబయలు చేయడంగా ఉంటున్నది. ఒక వ్యక్తికి వ్యతిరేకంగా భౌతిక చర్య ఒక ప్రత్యేక రాజకీయ పార్టీలో ఆ వ్యక్తికి సభ్యత్వం ఉందన్న కారణంతో కాకుండా ప్రజలకూ, ప్రజాయుద్ధానికీ వ్యతిరేకంగా ఆ వ్యక్తి చేసిన నేరాన్ని బట్టి చేపట్టాలని మనం భావిస్తూ వచ్చాం. అయితే అధికార, విపక్ష పార్టీలు వేరు వేరుగా తక్షణ ఎత్తుగడలపరమైన వైఖరిని కలిగి ఉంటాయి కాబట్టి మనం దానికి అనుగుణంగా వాటితో వ్యవహరిస్తూ వచ్చాం... దీన్ని ఇలాగే కొనసాగించాలి. తక్షణ, ఎత్తుగడల రీత్యానే అయినప్పటికీ మనతో వస్తుగతంగా దగ్గరగా ఉండే రాజకీయ పార్టీలతో మనం సముచిత సంబంధాలను నెలకొల్పుకోవడానికి ప్రయత్నించాలి.

గతంలో మనం వైరుధ్యాలను సరిగ్గా, పూర్తిగా అంచనా వేయకుండానే, పార్టీ విధానానికి వ్యతిరేకంగా కొన్ని చర్యలకు పాల్పడ్డాం. ఈ కొత్త పరిస్థితిలో మనం ఒకవైపు పైన పేర్కొన్న విధానాన్ని కచ్చితంగా పాటిస్తూనే మరో వైపు అలాంటి వాళ్లనెవరినైనా భౌతికంగా శిక్షించడం లేదా చర్య తీసుకోవడం అవసరమైన పక్షంలో పైన చెప్పిన ప్రజాస్వామ్య ప్రక్రియను పాటించేందుకు ప్రయత్నించాలి. ఎవరినైనా అరెస్టు చేస్తే ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రజలకు అందుకు కారణాలను వివరించి చెప్పాలి.

### *ఈ) చందాల వసూళ్ల గురించి*

మన చందాల వసూళ్ల పద్ధతిని శత్రువు ఒక పెద్ద చర్చనీయాంశంగా మార్చి మధ్య తరగతి వర్గాలలో గందరగోళం వ్యాపింపజేయడానికి ప్రయత్నిస్తున్నాడు. మన చందాల వసూళ్ల విధానాన్ని మరింత క్రమబద్ధం

చేస్తూ మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది. ఈ విధంగా మనం శత్రువు చేతిలో దీన్నొక ఆయుధం కానివ్వకుండా చేయగల్గుతాం. అలాగే మధ్య తరగతి వర్గాలను భయం నుండీ, అపోహల నుండీ బైట పడేయగల్గుతాం. చందాలు వసూలు చేసేటప్పుడు సంబంధిత వ్యక్తుల, సంస్థల వర్గాలను సరిగా విశ్లేషించి, వాళ్ల నేపథ్యాన్ని అధ్యయనం చేసి దానికనుగుణంగా వ్యవహరించడంలో గతంలో లోపాలు జరిగాయి. దీని మూలంగా డబ్బు వసూళ్ల విషయంలో చాలా అరాచకం పెంపొందింది. కాబట్టి భవిష్యత్‌లో ఈ అరాకత్వాన్ని లేకుండా చేయాలి. ప్రజల నుండి వర్గ ప్రాతిపదికన చందాలు వసూలు చేయడం కోసం ఆర్థిక సేకరణల ప్రక్రియను మరింత క్రమబద్ధం చేయాలి. దీని కోసం ఒక నిర్దిష్ట కొలమానం అవసరం. అలాగే శత్రువును శిక్షించడానికీ, వాడి నుండి పన్నులు వసూలు చేయడానికీ ఒక పద్ధతిని అభివృద్ధి చేయాలి.

చందాల, పన్నుల వసూళ్ల కార్యకలాపాలను (పార్టీ) రీజనల్ బ్యూరోలు తమ నియంత్రణలో ఉంచుకోవడం అవసరం.

*ఎఫ్) విభిన్న జాతీయ, అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థల గురించి*

గతంలో గ్రామీణ ప్రాంతాలలో పాత ప్రభుత్వపు ఆధిపత్యాన్ని దెబ్బతీసే సందర్భంగా కొద్దిగా తేడాను పాటించినప్పటికీ, అన్ని రకాల ఎన్జీవోలకూ, ఐఎన్జీవోలకూ వ్యతిరేకంగా సాధారణంగా మన విధానం దాడిపూర్వకంగానే ఉండింది. కానీ మారిన ప్రస్తుత పరిస్థితిలో ఈ విధానంలో కూడా మెరుగుదల తేవల్సిన అవసరం ఉంది.

పాత ప్రభుత్వంతో ప్రత్యక్షంగా రాజకీయ సంబంధం పెట్టుకోనివీ, గ్రామీణ ప్రాంతాల్లో మన విధానాలతో, పథకాలతో ఏకీభవించి పనిచేయడానికి ఇష్టపడేవీ అయిన ప్రభుత్వేతర సంస్థలతో సానుకూలంగా వ్యవహరించాలి. అట్లాగే అంతర్జాతీయ స్థాయిలో ప్రజాయుద్ధం పట్ల శత్రు వైఖరిని కలిగి ఉన్న అమెరికా సామ్రాజ్యవాదం నుండి ప్రత్యక్షంగా ఆర్థిక సహాయాన్ని పొందుతున్న అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థలను మినహాయించి, తటస్థ దేశాల లేదా ప్రజాయుద్ధంతో శత్రుపూరిత వైఖరిని అవలంబించని యూరోపియన్ యూనియన్, ఇతర దేశాలకు చెందిన అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థలపై ఎలాంటి భౌతిక చర్యలకు గానీ, బెదిరింపులకు గానీ పూనుకోగూడదు. సమస్యను చర్చల ద్వారా, పరస్పర సహకారం ద్వారా, సమన్వయం ద్వారా పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి.

## 5. భవిష్యత్ సైనిక పథకం గురించి

మన కేంద్ర కమిటీ గత సమావేశంలో తయారు చేసిన సైనిక పథకం సరైందనీ, దాని అమలు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందనీ ముందే చెప్పుకున్నాం. 'సాపేక్షిక కేంద్రీకరణ' అనే పదం కొంత గందరగోళాన్నీ, పీఎల్‌ఏ పైన వత్తిడినీ సృష్టిస్తున్నందున ఈ పథకంలో మెరుగుదల తెస్తూ సాపేక్షికంగా కేంద్రీకృతమైన చర్యల విధానాన్ని కొంత కాలం పాటు వదిలి పెడదాం. వాస్తవానికి సాపేక్షిక కేంద్రీకరణ తనంతట తానుగానే వికేంద్రీకృత చర్యలలో ఇమిడి ఉంటుందన్న విషయంలో మనం స్పష్టత కలిగి ఉండాలి. కాబట్టి, రానున్న పథకంలో వికేంద్రీకృత చర్యలను ఎలాంటి వత్తిడీ లేకుండా కొనసాగించాలి. కేంద్రీకృతమైన, కచ్చితమైన పెద్ద చర్యల కోసం సన్నాహాలు చేసుకోవాలి.

## 6. ప్రజా రాజ్యాధికారాన్ని ప్రవేశపెట్టడం గురించి


దేశంలోని గ్రామీణ ప్రాంతాలు ప్రజాయుద్ధం ప్రభావం, నియంత్రణల కిందికి వచ్చి, అంతర్జాతీయంగా ప్రచార, ప్రభావాలలో చెప్పుకోదగిన వృద్ధి జరిగిన ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మనం కింద పేర్కొంటున్న చర్యలు చేపడుదాం. తద్వారా పాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజకీయ జోక్యాన్ని కొత్త ఎత్తుకు ఎదిగింపజేద్దాం.

ఏ) ఐక్యరాజ్య సమితి, తదితర అంతర్జాతీయ వేదికలకు ప్రజల అధికారానికి ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేయాలి. సైనిక ఫాసిస్టు పాత ప్రభుత్వపు సోకాల్డ్ ప్రాతినిధ్యాన్ని వ్యతిరేకించాలి.

బీ) పాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొత్త రాజ్యాధికారానికి మద్దతునూ, సహకారాన్నీ అందించాలని ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఉన్న ప్రపంచ దేశాలన్నిటినీ లాంఛనమైన వార్తాలాపాల ద్వారా విజ్ఞప్తి చేయాలి.

సీ) దేశంలోని గ్రామీణ ప్రాంతాలన్నిటి బాధ్యతను తీసుకునేలా కొత్త రాజ్యాధికారపు విధానాన్నీ, పథకాన్నీ, కార్యక్రమాన్నీ క్రమబద్ధం చేయడం అవససరం. దీని కోసం ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నిటిలో ప్రజా ప్రభుత్వపు ఒక నిర్దిష్ట విధానాన్ని అమలు చేయాలి. తుది తిరుగుబాటుకు సన్నాహాలను త్వరితం చేయాలి. ✶


త్వరలో వెలువడనుంది!



విముక్తిపథంలో వెల్లువెత్తుతున్న

దండకారణ్య జనవాహిని

వెల : 15 రూపాయలు

దండకారణ్య ఉద్యమ ప్రచార కమిటీ ప్రచురణ

# కామ్రేడ్ గౌరవ్‌ను కలవడానికి వచ్చిన జర్మన్ ప్రతినిధివర్గానికి చేదు అనుభవం

సెప్టెంబర్ 2003లో తమిళనాడు పోలీసులు నేపాల్ కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు కా. గౌరవ్‌ను నకిలీ పాస్‌పోర్టును కలిగి ఉన్నాడన్న ఆరోపణపై చెన్నై విమానాశ్రయంలో అరెస్టు చేశారు. అప్పటి నుండీ ఆయన చెన్నై జైలులో నిర్బంధంలో ఉన్నాడు. మార్చి 24న ఆయనను కలవడానికి వచ్చిన అంతర్జాతీయ ప్రతినిధివర్గం చెన్నైలో దిగింది. వారిని రాహుల్ (కా. గౌరవ్ ప్రధాన వకీలు), లక్ష్మణ్ పంత్ (భారత్‌లో నేపాలీ ప్రజల హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు), రావుణ్ణి [డబ్ల్యుపిఆర్‌యం (దక్షిణాసియా)], మరికొందరు విమానాశ్రయంలోనే కలిసారు. రాగానే వాళ్లు కా. గౌరవ్‌ను కలిసే ప్రయత్నాలు ప్రారంభించారు. జైలులో వున్న కా. గౌరవ్‌ను అదే రోజు పగలు కలిసేందుకు అనుమతిని కోరుతూ పిటిషన్‌తో తమిళనాడు ప్రభుత్వ హోం కార్యదర్శి సైద్ మునీర్ హోడాను కలవడానికి వెళ్లారు. భారతదేశం ప్రజాతంత్ర దేశమనీ, జైలులో ఖైదీలను ఎవరైనా కలవవచ్చునీ హోడా పేర్కొన్నారు. అయితే తాము ముందే కా.గౌరవ్‌ను కలవడానికి అనుమతి కోరిన విషయం, దాన్ని జైలు సూపరింటెండెంట్ తమను విదేశీయులన్న కారణంతో తిరస్కరించిన విషయం ప్రతినిధివర్గం తెలియజేసింది. ఇది విన్న హోం కార్యదర్శి హోడా ఆశ్చర్యాన్ని నటించాడు. వెంటనే జైళ్ల అదనపు డైరెక్టర్ జనరల్‌కు ఫోన్ చేసి పిమ్మట ప్రతినిధివర్గం తాము కోరుకున్న సమయంలో కా. గౌరవ్‌ను కలవవచ్చని తెలియజేశాడు.

హోం మంత్రిత్వ శాఖ నుండి లభించిన ఈ హామీతో కా. గౌరవ్‌ను కలిసేందుకు చేసే కసరత్తు పూర్తి కాలేదు. డెలిగేషన్ తమ కారు వద్దకు వెళుతుండగా కా. గౌరవ్ ప్రధాన వకీల్ రాహుల్‌కు మొబైల్ ఫోన్‌లో పిలుపు వచ్చింది. డెలిగేషన్‌కు హోం కార్యదర్శి ఏదో చెప్పాలనుకుంటున్నాడని హోం కార్యదర్శి అసిస్టంటు చేసిన ఫోన్ అది. లైనులోకి వచ్చిన హోం కార్యదర్శి జైలులో ఎవరిని కలవాలనుకున్నా ముందుగా జర్మన్ కాన్సులేట్‌కు అభ్యంతరం లేదన్న ఉత్తరం ఒకటి ప్రతినిధులు చూపాల్సి ఉంటుందని చెప్పాడు.

మార్చి 25 ఉదయం ప్రతినిధివర్గం జర్మన్ కాన్సులేట్‌కు వచ్చింది. జైలులో ఉన్న వారిని సందర్శించడానికి తమకెలాంటి అభ్యంతరం లేదని హోం కార్యదర్శిని ఉద్దేశించి పేర్కొంటున్న ఉత్తరాన్ని జర్మన్ కాన్సులేట్ నుండి ప్రతినిధులు సంపాదించుకోగల్గారు. తిరిగి డెలిగేషన్ హోం కార్యదర్శి కార్యాలయానికి పయనమైంది, మధ్యాహ్నం 12 గంటలకు అక్కడికి చేరింది. హోం కార్యదర్శి "బిజీ"గా ఉన్నారని తెలియజేయడానికే వారిని ఒక గంటసేపు కూర్చోబెట్టారు. తర్వాత వారిని హోం శాఖకు చెందిన జైళ్ల డిప్యూటీ కార్యదర్శి కిరుబాకరన్ కార్యాలయానికి వెళ్లమని ఆదేశించారు. నియమాలు, పద్ధతులు స్పష్టమైన పిమ్మటనే అది సాధ్యం కాగలదు తప్ప వెంటనే జైలు ములాకాత్ ఏర్పాటు చేయడం సాధ్యం కాదని డిప్యూటీ కార్యదర్శి అన్నాడు.

ఇలా అందరి చుట్టూ తిప్పడం ద్వారా భారతదేశ అధికారులు జైలులో వున్న కా. గౌరవ్‌ను కలవకుండా ప్రతినిధివర్గాన్ని నిరోధించడానికి గాను కావల్సినన్ని అడ్డంకులు కల్పించే ప్రయత్నం చేశారని స్పష్టంగా అర్థమవుతుంది. అదే సమయంలో, వారు తాము చేస్తున్నదంతా భారతదేశం "ప్రజాస్వామికమైంది" అని చూపెట్టుకునే ప్రయత్నం కూడా చేశారు. వాళ్లు కలవడానికి అనుమతి నిరాకరిస్తే గనుక ఈ కేసులో వాళ్లు దాచిపెడుతున్నదేదో ఉందనీ, కా. గౌరవ్ సుదీర్ఘ నిర్బంధం "ప్రజాతంత్రమైనది" కాదనీ, ఘోర అన్యాయమనీ జాతీయ, అంతర్జాతీయ ప్రజానీకానికి ఇంకా స్పష్టమవుతుంది.

మార్చి 26 ఉదయం జైలును సందర్శించే ప్రయత్నానికి ముందుగా ప్రతినిధివర్గం కా. గౌరవ్ పాస్‌పోర్ట్ కేసు పెండింగ్‌లో ఉన్న కోర్టు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రాజన్ అల్లండూర్‌ను కలవడానికి వెళ్లింది. ఆ జడ్జ్ ప్రతినిధివర్గాన్ని కలవడానికి నిరాకరించాడు. కారణం తాను లాయర్లతో బహిరంగ కోర్టులో మాత్రమే చర్చిస్తాను తప్ప తన ఛాంబర్‌లో కాదని చెప్పాడు. కా. గౌరవ్ కేసుతో వ్యవహరిస్తున్న అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తాను అందుబాటులో ఉండటం లేదనీ, అందువల్ల తాను ప్రతినిధివర్గాన్ని కలవలేననీ అన్నాడు.

మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రతినిధివర్గం హోం కార్యదర్శి కార్యాలయానికి వాపసు వచ్చి ఎట్టకేలకు తమ జైలు సందర్శనకు అనుమతిని పొందగల్గారు. వెంటనే వారు కా. గౌరవ్‌ను నిర్బంధించిన జైలుకు రాహుల్‌తో కలిసి వెళ్లి కా. గౌరవ్‌తో ఒక గంట సేపు గడిపారు.

ఏకాంతతకు సంబంధించిన నియమాలకు భిన్నంగా, జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ వారి సంభాషణ అంతా వింటూ కూర్చున్నాడు. మధ్యలో తన పై అధికారులకు, ప్రతినిధివర్గం ప్రచురణ కోసం కా. గౌరవ్‌తో ఇంటర్వ్యూ చేస్తోందన్న వార్తను పంపించాడు. గౌరవ్‌కూ, ప్రతినిధివర్గానికీ మధ్య సంభాషణ రహస్యమైనది, జైలు అధికారులకు ఇందులో అడ్డుపుల్ల వేయడానికి ఎలాంటి అధికారం లేదని అంటూ రాహుల్ తీవ్ర అభ్యంతరం చెప్పాడు. ప్రతినిధులు కా. గౌరవ్‌ను భోజనవసతి గురించి వాకబు చేసేపుడు, మధ్యలో డిప్యూటీ సూపరింటెండెంట్ జోక్యం చేసుకొని, కా. గౌరవ్‌కు విదేశీయునికిచ్చే ఆహారం ఇస్తున్నామనీ, అంతా బాగానే ఉందనీ బుకాయించాడు. నిజానికి ఆయనకు వార్తాపత్రికలు గానీ, కనీసం ఫాన్ (చెన్నైలో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటిగ్రేడ్ పైనే ఉంది) గానీ, తదితర కనీస సౌకర్యాలు ఏవీ కూడా అనుమతించడం లేదు.

వాస్తవానికి జైల్లో పరిస్థితులు చాలా ఘోరంగా ఉన్నప్పటికీ, ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ జైలు హీన పరిస్థితులు తన విప్లవ ఉత్సాహాన్ని, ఆశావాదాన్నీ నీరుకార్చలేనంత దృఢ నిశ్చయంతో ఉన్నానని కా. గౌరవ్ చెప్పాడు. తనను నేపాల్ ప్రభుత్వానికైనా అప్పజెపుతామనీ లేదంటే ఇంతకన్నా ఘోరమైన పరిస్థితులుండే, విదేశీయుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జైలులో సుదీర్ఘ నిర్బంధానికైనా పంపిస్తామనీ అధికార్లు బెదిరిస్తూ వత్తిడి చేస్తున్నారని ఆయన ప్రతినిధివర్గానికి తెలియజేశాడు. ఆయన తమిళుల సమస్యను ప్రతినిధుల దృష్టికి తెచ్చారు. వాళ్లను భారత న్యాయస్థానాల్లో ఎలాంటి కేసులు లేదా ఆరోపణలు లేకుండానే గత 14 ఏళ్లుగా స్పెషల్ క్యాంపుల్లో నిర్బంధించి ఉంచారు.

మార్చి 17న చెన్నై ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు పత్రికాగోష్ఠి జరిగింది. చెన్నైలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా నుండి 15 మందికి పైగా జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ మొత్తం ఉదంతంపై పత్రికల్లోనూ, టీవీ ఛానెళ్లలోనూ వార్తలు ప్రసారమయ్యాయి.

**తాత్కాలిక ఆర్గనైజింగ్ కమిటీ**

**ప్రపంచ ప్రజా ప్రతిఘటనా ఉద్యమం (యూరప్)**

# గోబెల్స్ తరహా అబద్ధాలు నేపాల్ విప్లవ పురోగమనాన్ని అడ్డుకోలేవు !

*(ఇంటర్నెట్ వెబ్‌సైట్ల నుండి సేకరించిన వాస్తవ సమాచారంపై ఆధారపడిన రిపోర్టు ఇది. మావోయిస్టులు కూడా ఎఫ్‌యం రేడియో స్టేషన్‌లు నడుపుతున్నందున రాచరిక ప్రభుత్వం, దాని సామ్రాజ్యవాద మద్దతుదారుల వాస్తవాలను ఎక్కువ కాలం దాచి ఉంచలేరు. మావోయిస్టులు నడిపే రేడియో కేంద్రాలు గతంలో ఐదు ఉండగా, ఈ మధ్యనే ఒకటి పట్టుబడింది.)*

మార్చి 21 రాత్రి 10 గం.ల వేళ పిఎల్‌ఏ పశ్చిమ నేపాల్‌లోని మ్యాగ్డి జిల్లా కేంద్రం అయిన బేనిబజార్‌పై ఏకకాలంలో దాడులు చేసింది. రెండు నదుల సంగమ స్థలంలో ఉన్న దీనిపై మంచి సమన్వయంతో జరిగాయివి. ఆర్ఎన్ఏ (రాయల్ నేపాల్ ఆర్మీ)ని భయాందోళనకు గురిచేశాయి కూడా. ఇక్కడ 1300 బలగాలు ఉండగా, వీరిలో 300 మంది రోడ్లు నిర్మించే ప్రత్యేక కర్తవ్యంతో ఉన్నారు. ఈ జిల్లా కేంద్రం రోల్పా స్థావర ప్రాంతం నుండి కేవలం 150 కి.మీ. దూరంలోనే ఉంది.



160 మంది బలగాలు రక్షిస్తున్న కాంపౌండ్‌పై, పాలనాయంత్రాగపు ప్రధాన కార్యాలయాలు ఉన్న భవనాలపై మావోయిస్టు గెరిల్లాలు ఏకకాలంలో దాడి చేశారు. జిల్లా పోలీసు, జిల్లా పరిపాలనా యంత్రాంగం, జిల్లా అభివృద్ధి కార్యాలయాలను స్వాధీనపరచుకొని, అధికారులను అరెస్టు చేసి, కార్యాలయాలను పేల్చివేశారు. చాలా మంది సైనికులు పారిపోయారు, మరణించడమో, గాయపడటమో జరిగినవారి సంఖ్య సరిగా తెలియదు.

అయితే బలగాలు అధికంగా నివసించే సైనిక బ్యారెక్కులపై ప్రధాన దాడి జరిగింది. పోరాటం ప్రారంభమైన 2 గంటల్లోనే ఐదింటిలో నాలుగు బ్యారెక్‌లు గెరిల్లాల అధీనంలోకి వచ్చాయి. రెండు బ్యాంకులను స్వాధీనపరచుకున్నారు, మిగిలిన జిల్లా కేంద్ర కార్యాలయాలు మావోయిస్టుల అధీనమయ్యాయి. జైలును స్వాధీనపరచుకొని 31మంది ఖైదీలను విడుదల చేశారు. అయితే అధిక భాగం ఆయుధ సామాగ్రి, బ్యాంకుల నగదు ఉన్నటువంటి (నేపాల్ బ్యాంకుల్లో ఇప్పుడు నగదు ఉంచకుండా సైనిక బ్యారెక్స్‌లో పెట్టి అవసరమైనపుడు పగటి పూట మాత్రమే తీస్తున్నారు) 5వ ప్రధాన బ్యారెక్ స్వాధీనం కోసం పోరాటం మరో 12 గంటలు సాగింది. మావోయిస్టు అనుకూల వెబ్‌సైట్ ఆదివారం నాడు పేర్కొన్న దాని ప్రకారం బేనిబజార్‌లో శని-ఆదివారాల్లో సాగిన పోరాటంలో మావోయిస్టులు 150 ప్రభుత్వ బలగాలను మట్టుబెట్టి, రక్షణ బలగాల నుండి 137 ఆధునిక ఆయుధాలు స్వాధీనపరచుకున్నారు. ఒక 2-ఇంచ్ మోర్టార్, మూడు ఎల్‌యంజిలు, 15 ఇన్సాస్‌లు, ఒక యం-16, 8 ఎస్‌యంజిలు, ఎస్ఎల్ఆర్‌లు 35, .303 రైఫిళ్లు 70, పిస్టళ్లు 15, 47,000 రౌండ్ల తూటాలు స్వాధీనపరచుకొన్నారని తెలుస్తోంది. అలాగే మావోయిస్టులు పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్‌ను, జిల్లా ప్రధాన అధికారి సాగర్ మణి పరాజలితో పాటు 38 మంది అధికారులను బందీలుగా పట్టుకున్నారు. అయితే తర్వాత వీరిలో మొదటి ఇరువురు ఆర్ఎన్ఏ హెలికాప్టర్ గన్‌ఫైర్‌లో గాయపడటంతో మానవ హక్కుల సిబ్బందికి అప్పగించారు. మిగిలినవారు ఇప్పటికీ మావోయిస్టుల అధీనంలోనే ఉన్నట్టు రిపోర్టు. ప్రభుత్వం పెద్దెత్తున సంభవించిన ఈ నష్టాలను కప్పిపుచ్చుకోవడానికి గాను తాము 500 మావోయిస్టులను చంపామనే అభూత కల్పనలు సృష్టిస్తోంది.

అయితే కా. ప్రచండ ఆదివారం సాయంత్రం (మార్చి 21) జారీ చేసిన ప్రకటన ప్రకారం బేనిబజార్‌లో తమ బ్రిగేడ్ వైస్-కమాండర్‌తో సహా 46 మంది మావోయిస్టులు మాత్రమే అమరులయ్యారు. రాత్రి 10 గంటలకు ప్రారంభమై మర్నాడు మధ్యాహ్నం వరకూ ఈ చర్య కొనసాగినప్పటికీ అదనపు బలగాలు రావడానికి సాహసించలేదు. వెయ్యేసి మంది సైనిక బలగాలు మోహరించి ఉన్న పర్బత్, బాగ్‌లంగ్ జిల్లా ప్రధాన కార్యాలయాలు వాహనాలలో వెళితే కేవలం అర్థ గంట దూరంలోనే ఉన్నాయి. ఆ నది పొడవునా గల రెండు బ్రిడ్జిలను పేల్చివేశారు, బేనికి వచ్చే రోడ్లను మూసివేశారు. ఆ ఆపరేషన్ ముగిసిన తర్వాత మాత్రమే హెలికాప్టర్లు వచ్చి ఆ దగ్గర్లోని గ్రామాలపై విచ్చలవిడిగా బాంబుల వర్షం కురిపించి 26 మంది గ్రామస్థులను చంపేశాయి. అయితే ఇది ఇంకా కొనసాగుతోంది, కనుక నష్టాలు ఎక్కువగానే ఉండవచ్చు. తాము చెప్పే మృతుల సంఖ్యను పెంచుకోవడానికి గాను ఆర్ఎన్ఏ ఉన్మాదంతో జైలులోని మావోయిస్టు బందీలను ఈ ప్రాంతాలకు పట్టుకొచ్చి చంపివేస్తోంది.

రాజుకు వ్యతిరేకంగాను, రాచరికం రద్దు కోసం ప్రతిపక్ష పార్టీలు కూడా పాల్గొంటున్న ప్రజా ఉద్యమం సాగే సమయంలో ఈ పెద్ద దాడి జరిగింది. రాజుకు వ్యతిరేకంగా తీవ్రమవుతున్న నిరసనల్లో మార్చి 2న వేలాది మంది పాల్గొన్నారు. అదే సమయంలో పిఎల్ఏ సైనికదాడులు తీవ్రమయ్యాయి. బేని దాడి రెండు వారాల్లో జిల్లా కేంద్ర కార్యాలయాలపై మావోయిస్టులు చేసిన రెండవ అతి పెద్దదాడి. అంతకు ముందు నేపాల్‌కు తూర్పున గల భోజపూర్ జిల్లా కేంద్ర కార్యాలయంపై దాడిచేసి కనీసం 32 మంది సెక్యూరిటీ బలగాలను హతమార్చి, కమ్యూనికేషన్ టవర్‌ను పేల్చివేసింది.

అలాగే బేనిలో పోరాటం జరుగుతున్న రోజున మావోయిస్టులు చిట్వాన్‌లో మెహౌలీ విమానాశ్రయం కంట్రోల్ టవర్ వద్ద శక్తివంతమైన బాంబు పేల్చి ఆ భవనాన్ని ధ్వంసం చేశారు. ఆ రాత్రి జరిగిన పేలుడులో 25 మిలియన్ రూపాయల విలువగల యంత్ర సామగ్రి ధ్వంసమైందని భరత్‌పూర్‌లో మెహౌలీ విమానాశ్రయ ముఖ్యాధికారి పేర్కొన్నారు. పొరుగు జిల్లాల నుండి కూడా పోరాట వార్తలు కూడా వస్తున్నాయి. బాగ్‌లాంగ్ జిల్లా నరాలకుటి నుండి కూడా పోరాటం సాగుతున్న సమాచారం వస్తోంది. "ప్రగతిశీల రాజకీయ పరిష్కారం జరిగేదాకా కేంద్రీకృత, వికేంద్రీకృత సైనిక దాడులు కొనసాగుతాయ"ని కా. ప్రచండ ప్రకటించారు. ★

# పోరుబాటలో ముందడుగేస్తున్న దండకారణ్య ప్రజలు

*(కొన్ని అనివార్య కారణాల వల్ల గత రెండు సంచికల్లో పోరాట రిపోర్టులను పూర్తిగా వేయలేకపోయినందుకు చింతిస్తున్నాం. ఈ సంచికలో గత 8-9 నెలల పోరాట రిపోర్టులన్నిటినీ ప్రచురిస్తున్నాం. ఇవి పాఠకులు దండకారణ్య ఉద్యమాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయని ఆశిస్తున్నాం. ఆలస్యం మూలంగా కలిగిన అసౌకర్యానికి క్షమించాల్సిందిగా పాఠకులను కోరుతున్నాం. – సంపాదకవర్గం)*

## మాడ్ డివిజన్

### ప్రజా శత్రువు కుమ్మ డాడీకి మరణశిక్ష

కుమ్మ డాడీ ఇంద్రావతి ఏరియాలోని తాకిలోడ్ గ్రామం వాడు. వీడు పేరుమోసిన ప్రజా శత్రువైన పొదియా పటేల్‌కు కుడి భుజంగా ఉండేవాడు. కొద్ది సంవత్సరాల క్రితం పొదియా పటేల్‌ను ప్రజల తీర్పు మేరకు గెరిల్లాలు హతమార్చారు. డాడీ పేరు వింటేనే ఒకప్పుడు చుట్టుపక్కల ప్రజలు భయపడేవాళ్లు. ఈ ప్రాంతంలో విప్లవ కార్యకలాపాలు రెగ్యులర్‌గా లేనప్పుడు వీడు ఆడింది ఆట, పాడింది పాటగా ఉండేది. కానీ ఇక్కడి గ్రామాలలో ప్రజా సంఘాలు ఏర్పడడంతోనే వీడి దౌర్జన్యాలకు కళ్లెం పడింది. మొదట్లో సంఘ కార్యకలాపాలను అడ్డుకోవడానికి డాడీ ప్రయత్నించినందుకు ఒకసారి, ఆ తర్వాత పంచాయితీ డబ్బు దిగమింగినందుకు మరోసారి – రెండు సార్లు సంఘం వీడిని హెచ్చరించింది. వీడు కొంత మందిపై చేయి చేసుకున్నాడు కూడా.

డాడీ కుటుంబమంతా ప్రజలకు వ్యతిరేకంగానే ఉండేది. వీడి సోదరుడైన బోటి (టీచర్)ను ప్రజలు గ్రామం నుండి బహిష్కరించారు. వాడి ఆస్తులన్నిటినీ స్వాధీనం చేసుకున్నారు. క్రమంగా డాడీ రహస్యంగా పోలీసులకు సమాచారం అందజేయడం మొదలు పెట్టాడు. గత సంవత్సరం ఆగస్టు 15 నాడు ప్రజలు నల్లజెండా ఎగురవేసి నిరసన దినం జరుపుకోగా వీడు పోలీసులకు ఈ సమాచారం అందించాడు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందు పోలీసులు ఇంద్రావతి ఏరియాలో పాశవిక హింసాదౌర్జన్యాలకు పాల్పడ్డారు. ఒక వివాహిత మహిళ బుధ్రిపై సామూహిక అత్యాచారం జరిపి చంపేశారు. ఆ తర్వాత ఎన్‌కౌంటర్ కథనల్లారు. మరో రైతు చైతును పోలీసులూ, సీఆర్‌పీ జవాన్లూ కలిసి విపరీతంగా కొట్టి చంపారు. ఈ అమానుష చర్యలకు వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజలు బైరంగఢ్‌లో ప్రదర్శన జరపడానికి బయలుదేరగా ముందే డాడీ పరుగెత్తుకెళ్లి పోలీసులకు ఈ విషయం చెప్పాడు. ఆ తర్వాత పోలీసులు పెద్ద సంఖ్యలో వచ్చి తుపాకులు గురిపెట్టి ప్రజలను చెదరగొట్టారు. ఈ ఘటన తర్వాత స్థానిక ప్రజలూ, పార్టీ వీడిని ఇక వదిలేది లేదని నిశ్చయించుకున్నారు. ప్రజల నిర్ణయం మేరకు పీజీఏ సభ్యులు ఏప్రిల్ ఆఖరు వారంలో ఈ ప్రజా శత్రువును హతమార్చి పీడ విరగడ చేశారు.

### డౌల ఏరియాలో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేసిన ప్రజలు

డౌల (ధౌడాయి) పోలీసు స్టేషన్‌కు 4-5 కిలోమీటర్ల పరిధిలో గల గ్రామాలైన మరగడ, సులుంగ, కనార్‌గాంలలో పోలీసులు పథకం ప్రకారం ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను తయారు చేసుకున్నారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో విప్లవ ప్రజా సంఘాల నిర్మాణం, ఉద్యమ ప్రభావం సాపేక్షికంగా బలహీనంగా ఉన్నాయి. దీన్ని ఆసరా చేసుకొని పోలీసులు కొందరు జులాయి యువకులను పోగు చేసి వాళ్లకు రకరకాల ఆశలు చూపి ఇన్‌ఫార్మర్లుగా తయారు చేసుకున్నారు. ఆందోళనకరమైన విషయం ఏమంటే పోలీసులు అమాయక విద్యార్థుల్ని కూడా తమ హేయమైన కుట్రలో భాగం చేశారు. వీళ్లలో చాలా మంది 20-22 ఏళ్ల వయస్సు గల చదువుకున్న నవ యువకులే. వీళ్లకు పోలీసులు ట్రెయినింగ్ కూడా ఇచ్చారు. వీళ్లతో జిల్లా ఎస్‌పీ రహస్యంగా సమావేశమై గెరిల్లా దళాల కదలికల సమాచారాన్ని సేకరించాలనీ, ఇతర గ్రామాల విద్యార్థులను కూడగట్టి ఈ నెటవర్క్‌ను పెంచాలనీ, తప్పిపోయిన పశువులను వెదికే సాకుతో ఇతర గ్రామాలకు వెళ్లి అక్కడ విశ్వాసపాత్రులైన వాళ్లను ఇన్‌ఫార్మర్లుగా మల్చుకోవాలనీ, ఉద్యమం బలంగా ఉన్న గ్రామాలకు ఏదో ఒక సాకుతో వెళ్లి అక్కడి వాళ్లతో సంబంధాలు ఏర్పర్చుకొని సమాచారం సేకరించాలనీ బాధ్యతలు అప్పగించాడు. వీళ్లకు 2 నుండి 4 వేల రూపాయల దాకా వేతనం కూడా ఇచ్చారు.

అయితే ఈ కుట్రను ప్రజలు పసిగట్టారు. సులుంగ గ్రామం వాడైన జాగులు అనే వ్యక్తిపై ప్రజలకు అనుమానం కలిగింది. వాడిని పీజీఏ దళం అరెస్టు చేసి తీవ్రంగా ప్రశ్నించింది. వాడు మొత్తం విషయం కక్కేశాడు. పోలీసులు ఎవరెవరిని ఇన్‌ఫార్మర్లుగా మార్చుకున్నారో వాళ్లందరి పేర్లూ చెప్పేశాడు. పార్టీ నిర్ణయంపై దాదాపు 150 మంది మిలిషియా సభ్యులు రాత్రికి రాత్రే పై మూడు గ్రామాలపై దాడులు జరిపి ఇన్‌ఫార్మర్లందరినీ అరెస్టు చేశారు. అదే రోజున, అంటే డిసెంబర్ 16, 2003న 15 గ్రామాల ప్రజలను సమీకరించి ప్రజా కోర్టు నిర్వహించారు. మొత్తం 3,000 మంది ప్రజలు ఇందులో పాల్గొన్నారు. వీళ్లలో మహిళలూ, యువజనులూ, స్కూలు విద్యార్థులూ, టీచర్లూ ఉన్నారు. ప్రజాకోర్టులో ఇన్‌ఫార్మర్లు తమ నేరాలన్నీ ఒప్పుకొని పోలీసులు తమను ఎలా లోబర్చుకున్నదీ, ఏ విధంగా ట్రెయినింగ్ ఇచ్చిందీ వివరంగా చెప్పారు. ఆ తర్వాత ఇందులో లాల్‌సాయి అనే కరడుగట్టిన ఇన్‌ఫార్మర్‌ను చంపాలనీ, మిగతా వాళ్లను హెచ్చరించి వదలాలనీ ప్రజలు తీర్పునిచ్చారు. వీళ్లకు పోలీసులు ఇచ్చిన డబ్బులన్నీ ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. చివరన, తమ వాళ్లనే ఇన్‌ఫార్మర్లుగా మార్చుకొని తమనే అణచివేయడం కోసం ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలు వ్యతిరేకిస్తూ నినదించారు.

### పోలీసు ఇన్‌ఫార్మర్ బుధ్రాం మిలిషియా చేతిలో ఖతం

మాడ్ డివిజన్‌లోని ఆస్‌నార్ గ్రామానికి చెందిన బుధ్రాం గత సంవత్సర కాలంగా పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. ఇది బైట పడితే ప్రజలు చంపేస్తారన్న భయంతో వీడు గ్రామం వదిలేసి ఓర్చాలో మకాం వేశాడు. ఓర్చాలో వీడు పోలీసు రక్షణలో ఉండసాగాడు. అక్కడ జరిగే సంతకు వచ్చి పోయే వాళ్లను వీడు పోలీసులకు చూపించి వాళ్లకు దళంతో, సంఘంతో సంబంధాలున్నాయంటూ ఆరోపణలు చేసే వాడు. పోలీసులు వీడి సహాయంతో ప్రజలను పలు విధాలుగా వేధించేవాళ్లు. ఆస్‌నార్, ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వీడు పెద్ద తలనొప్పిగా తయారయ్యాడు. దీనితో ప్రజలు వీడినెలాగైనా హతమార్చాలని నిశ్చయించుకున్నారు. పార్టీ ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ మిలిషియా సభ్యులతో ఒక యాక్షన్ టీంను ఏర్పాటు చేసి వీడిని అంతమొందించే బాధ్యతను అప్పగించింది. ఈ టీం సభ్యులు మే 26న ఓర్చాలోనే వీడిపై సాంప్రదాయ ఆయుధాలతో సాహసోపేతంగా దాడి చేసి చంపేశారు. ఈ చర్యతో ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకోగా ప్రజా శత్రువులు మాత్రం పోలీసుల రక్షణ కూడా తమను ప్రజల చేతిలో చావు నుండి రక్షించలేదని వణికిపోయారు.

పత్రికా ప్రకటన

# మాడ్ ప్రాంతంలో పోలీసు నిర్బంధాన్ని ఖండించండి !
# 'భూంకాల్' అమరుల స్తూపాన్ని నష్టపర్చడాన్ని నిరసించండి !!

*తేదీ : 29/02/2004*

*గత వారం సీఆర్‌పీ బలగాలూ, నారాయణపూర్ పోలీసు జిల్లా బలగాలూ సంయుక్తంగా మాడ్ ప్రాంత ఆదివాసులపై తీవ్ర నిర్బంధ క్యాంపెయిన్‌ను నడిపారు. అనేక మంది అమాయక ప్రజలను నక్సలైట్లుగా పేర్కొంటూ అరెస్టు చేశారు. వందల సంఖ్యలో వచ్చిన పోలీసు, సీఆర్‌పీ బలగాలు ఇక్కడి ఓకనార్, నేల్‌నార్, బెరెవాడ, ఇర్పనార్, కద్దేర్, టాహ్కాడోండ్, సోన్‌పూర్, పైలిపాడ్, బెచ్చ, కిహ్కాడ్, బాసింగ్, డోండ్రిబేడ మొదలైన గ్రామాలలో దాడులు జరిపి వందలాది మందిని తీవ్రంగా హింసించారు. డజన్ల కొద్ది అమాయక ప్రజలను అరెస్టు చేసి కేవలం 25 మందినే అరెస్టు చేసినట్టుగా ప్రకటించారు. కద్దేర్, టాహ్కాడోండ్ గ్రామాలలో పోలీసులు కొట్టిన దెబ్బల వల్ల చాలా మంది తలలే పగిలిపోయాయంటే వాళ్ల అమానుషత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. మరి కొందరిని పోలీసులు కత్తులతో పొడిచి గాయపర్చారు. నేల్‌నార్ గ్రామంలో మహా భూంకాల్ అమరుల స్మృతిలో ప్రజలు నిర్మించుకున్న స్తూపాన్ని పోలీసులు తమ బాయినెట్లతో పొడిచి నష్టపర్చారు. ఈ మధ్యనే దాదాపు 10 వేల మంది ప్రజలు ఈ గ్రామంలో సమావేశమై భూంకాల్ పోరాటంలో అసువులు బాసిన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా జోహార్లర్పించారు. ఈ సభలో పాల్గొన్న ప్రజలు భూంకాల్ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ నేడు సాగుతున్న ప్రజాయుద్ధాన్ని దృఢంగా కొనసాగించాలని ప్రతిన బూనారు. ఇది దోపిడీ పాలకవర్గాలకూ, వాళ్ల రక్షకులైన పోలీసు బలగాలకూ మింగుడు పడడం లేదు. బీజేపీ రమణ్‌సింగ్ ప్రభుత్వం ఒకవైపు ఆదివాసుల సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకుంటూనే మరోవైపు ఆదివాసులపై క్రూర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. దాని పోలీసులు నేల్‌నార్ గ్రామంలో భూంకాల్ అమరుల స్తూపాన్ని నష్టపర్చి తమను తాము ఆంగ్ల సైన్యాల వారసులుగా నిరూపించుకున్నారు.*

*రమణ్‌సింగ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ దారుణ నిర్బంధ చర్యలను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. పోలీసులు అరెస్టు చేసిన నిర్దోషులైన ప్రజలందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది. ప్రజలు కట్టుకున్న స్తూపాలను ధ్వంసం చేసే విధానాలకు ప్రభుత్వం స్వస్తి చెప్పకపోయినట్టయితే ప్రజలు అనివార్యంగా ప్రభుత్వం నిర్మిస్తున్న దొంగ నాయకుల స్తూపాలను కూలగొట్టాల్సి వస్తుంది. ఇందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే ప్రభుత్వం సీఆర్‌పీ బలగాలను పెద్ద ఎత్తున మోహరించి బస్తర్ ప్రాంతమంతటా భయంకర నిర్బంధాన్ని అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నది. ప్రజలపై నిర్బంధాన్ని నిలిపివేయాలనీ, సీఆర్‌పీ బలగాలను వెనక్కి పంపించాలనీ, లేదంటే ప్రజా గెరిల్లా సైన్యం నాయకత్వంలో ప్రజలు జరిపే ప్రతిఘటనా చర్యలను ఎదుర్కోవల్సి వస్తుందని మేం ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.*

*(పాండు)*

కార్యదర్శి,

మాడ్ డివిజనల్ కమిటీ

సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]

## క్రూర పెత్తందారు మన్ను‌పై ఆర్థిక దాడి

మాడ్ డివిజన్ ఇంద్రావతి ఏరియాలోని ఊత్ల గ్రామానికి చెందినవాడు మన్ను. వీడికి గ్రామంలో ఎన్నో స్థిర, చరాస్తులున్నాయి. వీడు గ్రామంలోని పేదలకు ధాన్యం, డబ్బూ వడ్డీపై ఇస్తూ ఉండేవాడు. ఇవి తిరిగి చెల్లించని వాళ్ల భూముల్ని వీడు కాజేసేవాడు. ఈ విధంగా అనేక మంది భూముల్ని వీడు గుంజుకున్నాడు. తన మాట వినని వాళ్లను కొట్టడం కూడా మన్ను చేసేవాడు. వీడు రెండు నిరుపేద కుటుంబాలకు చెందిన 8 మంది సభ్యులను దాదాపు వెట్టి కూలీలుగా మార్చుకొని తన ఇంట్లో ఉంచుకున్నాడు. కేవలం రెండు పూటలు తిండి పెడుతూ వీళ్ల శ్రమను వీడు చాలా ఏళ్లుగా దోచుకుంటున్నాడు. గ్రామంలోని ఇతరుల శ్రమను కూడా దోచుకుంటున్నాడు. వీడిని తన ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి చెప్పాలని స్థానిక ప్రజా సంఘాలు రెండు సార్లు హెచ్చరించాయి. అయినప్పటికీ వీడిలో మార్పు రాలేదు. ప్రజలను తిట్టడం, కొట్టడం కూడా కొనసాగించాడు. ఈ మధ్యన వీడు మరింత బరితెగించి తన కుటుంబంలో తలెత్తిన గొడవల్లో తన స్వంత చెల్లిని ఉరిపెట్టి చంపేశాడు. ఈ ఘటన తర్వాత స్థానిక ప్రజా సంఘాలు వీడి ప్రజా వ్యతిరేక నేరపూరిత చర్యలపై ప్రజాకోర్టు నిర్వహించాయి. హెచ్చరికల వల్ల ఏ ఫలితం రాలేదన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజాకోర్టు వీడిని ఆర్థికంగా దెబ్బ తీయాలన్న తీర్పునిచ్చింది. ఈ తీర్పు ప్రకారం ఫిబ్రవరి 30న 18 గ్రామాలకు చెందిన మిలిషియా సభ్యులు, సాధారణ ప్రజలు... మొత్తం 500 మంది దాడి చేసి వీడి ఇంటి నుండి దాదాపు 600 బస్తాల ధాన్యం, 4 గొడ్లు, తదితర సామాన్లు స్వాధీనం చేసుకొని పంచుకున్నారు. 8 ఎకరాల భూమిని ప్రజలకు పంచారు. వీడి దగ్గర చాలా ఏళ్లుగా వెట్టి చాకిరీ చేస్తున్న కుటుంబాలకు విడిగానే భూమి, ధాన్యం, గొడ్లూ తీసి ఇచ్చారు. ఈ ఘటన తర్వాత చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో ఉత్సాహం వెల్లి విరిసింది. సంఘటిత శక్తి ద్వారా ఎంతటి క్రూర పెత్తందారునైనా లొంగదీయగలమన్న విశ్వాసం వాళ్లలో ఇనుమడించింది.

## ఇన్‌ఫార్మర్ మహేష్‌కు మరణదండన

డౌల ఏరియాలోని నరియ (నారాయణపూర్ తాలూకా) గ్రామానికి చెందిన ఆదివాసీ యువకుడు మహేష్. వీడు 9వ తరగతి దాకా చదివి మానేశాడు. ఆ తర్వాత ఆవారాగా తిరగడం మొదలు పెట్టాడు. పోలీసులకు కావల్సింది సరిగ్గా ఇలాంటి వాళ్లే! వీడిని చాలా తేలికగా ఇన్‌ఫార్మర్‌గా మార్చుకున్నారు. వీడు ప్రతి రోజు చుట్టపక్కల గ్రామాల్లో, ప్రత్యేకించి

విప్లవ కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉండే గ్రామాల్లో ఏదో ఒక వంకతో తిరగడం మొదలు పెట్టాడు. దళాలకూ, ప్రజా సంఘాలకూ సంబంధించిన ఏ చిన్న సమాచారం దొరికినా దాన్ని పోలీసులకు చేరవేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఒకనాడు వీడు ఒక గ్రామానికి రాగా అక్కడి ప్రజా సంఘ కార్యకర్తలకు వీడి కదలికలపై అనుమానం వచ్చింది. వాడిని వెంటనే అరెస్టు చేసి గట్టిగా నిలదీయడంతో నిజం కక్కేశాడు. ఆ తర్వాత ప్రజాకోర్టును ఏర్పాటు చేయగా అందులో పాల్గొన్న 200 మంది ప్రజలు వీడి స్వభావాన్నీ, వీడు పోలీసుల చేతిలో పనిముట్టుగా చురుకుగా పని చేయడాన్నీ పరిగణనలోకి తీసుకుంటూ చంపేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే అమలు చేశారు.

## బూటకపు రిపబ్లిక్ దినాన్ని నిరసిస్తూ 'నల్ల దినం' పాటించిన డౌల ఏరియా ప్రజలు

జనవరి 26న మాడ్ డివిజన్‌లోని డౌల ఏరియాలో ప్రజలు నల్ల జెండాలు ఎగురేసి బూటకపు రిపబ్లిక్ దినం పట్ల తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనేక గ్రామాల్లో గోడలపై నినాదాలు రాశారు. ఏరియాలో మొత్తం 4 చోట్ల డీఏకేఎంఎస్, కేఏఎంఎస్‌ల నాయకత్వంలో సభలు జరిగాయి. వీటిలో మొత్తం 4,000 మంది ప్రజలు పాల్గొన్నారు. తోయనార్, గోటబేనూర్, డండవండ్, మోహనార్ గ్రామాల్లో జరిగిన ఈ సభల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఒక విశేషం. ఈ సభలలో ప్రసంగించిన వక్తలు ఈ రిపబ్లిక్ బూటకమని స్పష్టం చేశారు. మన దేశంలో పీడిత ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యమే లేదని వక్తలు విమర్శించారు. మన దేశ పాలకవర్గాలు విదేశీ సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల కనుసన్నలలో నడుచుకుంటూ దేశ సార్వభౌమత్వాన్ని ఘోరంగా దిగజార్చారనీ, ఈ రిపబ్లిక్ బూటకమనీ, ఈ రాజ్యాంగం మనది కాదనీ వక్తలు ప్రజలకు వివరించి చెప్పారు. నూతన ప్రజాస్వామిక విప్లవ మార్గంలో ముందడుగు వేస్తూ ప్రస్తుత రాజ్యాంగాన్ని రద్దు చేసి కార్మిక-కర్షక రాజ్యాంగాన్ని తయారు చేయడం, మన దేశాన్ని ప్రజల నిజమైన రిపబ్లిక్‌గా మార్చడం మన ముందున్న ప్రధాన కర్తవ్యమని ప్రజలకు చెప్పారు.

## ప్రజలను భయపెట్టి ఓట్లేయించిన వాళ్లకు హెచ్చరిక

పోయిన డిసెంబర్ 1న జరిగిన విధానసభ ఎన్నికల సందర్భంగా డౌల ఏరియాలో కొన్ని గ్రామాల్లో ప్రజా వ్యతిరేకులైన కొందరు పెత్తందార్లు ప్రజలను రకరకాలుగా బెదిరించి ఓట్లేసేలా చేశారు. ఆ తర్వాత ప్రజలు ప్రజా సంఘాల నాయకత్వంలో ఈ ప్రజా వ్యతిరేకులను ప్రజాకోర్టుకీడ్చారు. జత్తపార అనే గ్రామానికి చెందిన ఏడుగురు, కజ్జం వాళ్లు నలుగురు, కోసల్‌పార కొత్వాలు, గొంగ్ల సర్పంచ్ – వీళ్లందరినీ ప్రజాకోర్టులో ప్రజలు నిలదీశారు. వీళ్లు నీళ్లు నములుతూ ప్రజల ముందు తప్పు ఒప్పుకున్నారు. మరోసారి దోపిడీ ప్రభుత్వం తరఫున నిలబడితే సహించేది లేదని ప్రజలు వీళ్లకు హెచ్చరిక చేసి వదిలేశారు.

## పోలీసు ఇన్‌ఫార్మర్ గుడ్రాల్‌ను హతమార్చిన ప్రజా సైనికులు

డౌల ఏరియా బేనూరు పారయైన బట్‌పాల్ నివాసి గుడ్రాల్ చాలా కాలంగా ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. ఇక్కడికి దగ్గర్లోని ఫరస్‌గాం అనే ఊళ్లోని సంఘ కార్యకర్తలను వీడు పోలీసులతో అరెస్టు చేయించడమే కాకుండా పోలీసుస్టేషన్లో వాళ్లను పోలీసులకన్నా క్రూరంగా హింసించాడు. ఇన్నర్, డండవండ్, కల్‌బట్టి, వాకజార్ తదితర గ్రామాల సంఘ కార్యకర్తలను పోలీసులతో అరెస్టు చేయించడంలో వీడిదే ప్రముఖ పాత్ర. వీడిని ఇలాంటి ప్రజా వ్యతిరేక పనులు మానుకోవాల్సిందిగా హెచ్చరిస్తూ స్థానిక ఏరియా పార్టీ కమిటీ పోస్టర్లు వేసినా వీడికి చీమ కుట్టినట్టు కూడా కాలేదు. బేనూర్‌లో పోలీసు స్టేషన్ ఉండగా తననెవ్వరూ ఏమీ చేయలేరని వీడు విర్రవీగుతూ ఉండేవాడు. ఆ తర్వాత పీజీఏ సభ్యుల యాక్షన్ టీం ఒకటి బేనూర్‌లోనే వీడిని హతమార్చడమే గాకుండా వీడి నుండి ఒక 12 బోర్ తుపాకీనీ, మరో భర్మార్‌నూ జప్తు చేసుకొని విజయవంతంగా తిరిగివచ్చారు.

## స్కూలు చప్రాసీ ముసుగులో ఉన్న ముగ్గురు ఇన్‌ఫార్మర్లకు మృత్యుదండన

దండకారణ్య విప్లవోద్యమాన్ని తుదముట్టించే వ్యూహంతో పోలీసులు అనేక హేయమైన కుట్రలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేసుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఈ మధ్యన ప్రజలకు పట్టుబడ్డ ముగ్గురు ఇన్‌ఫార్మర్లు ఆశ్రమ పాఠశాలల్లో చప్రాసీలుగా పనిచేస్తున్నారు. పోలీసులు వీళ్లకు పథకం ప్రకారమే చప్రాసీ ఉద్యోగాలిప్పించారు. వీళ్లు ఎవరికీ అనుమానం రాకుండా గ్రామాల్లో ఉంటూ విప్లవోద్యమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం సేకరించగలరని పోలీసులు ఆశించారు. కానీ ఎల్లకాలం ప్రజల కళ్లు గప్పగలమని భావించడం వాళ్ల అవివేకమే తప్ప మరేమీ కాదు. ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల దృష్టిలో పడకుండా శత్రువు ఎల్లకాలం దాగి ఉండడం అసాధ్యం. ఎందుకంటే దండకారణ్యంలో విప్లవోద్యమం నిలబడింది సరిగ్గా ఆ ప్రజల బలంపైన్నే. డౌల ఏరియా ప్రజలు ఇలాంటి వాళ్లను ముగ్గురిని పట్టుకొని పోలీసులు పన్నిన పెద్ద కుట్రను విఫలం చేశారు.

కోహ్కామెట్ట ఏరియా ముర్‌నార్ గ్రామం వాడైన మంగల్, ఇంద్రావతి ఏరియా ఓర్ఛకు చెందిన సంతు, బంగారు... వీళ్లు ముగ్గురూ పోలీసు ఇన్‌ఫార్మర్లు. అయితే ఈ ముగ్గురినీ పోలీసులు కుట్రపూరితంగా డౌల ఏరియాలోని డండవండ్, కొంగెర గ్రామాలలో స్కూలు చప్రాసీలుగా నియమించారు. వీళ్లు విద్యార్థులనూ, తమ బంధువులనూ ఇన్‌ఫార్మర్లుగా మార్చసాగారు. కొంత మందిని వీళ్లు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసు అధికార్లతో పరిచయం చేయించారు. వీళ్లు గెరిల్లా దళం రాకపోకలకు సంబంధించిన సమాచారాన్ని ప్రతి ఐదు రోజులకోసారి పోలీసు స్టేషన్‌కు అందజేసేవాళ్లు. వీళ్లపై ప్రజలకు అనుమానం మొదలైంది. ప్రజలిచ్చిన సమాచారంతో గెరిల్లాలు వీళ్లను అరెస్టు చేసి ప్రశ్నించారు. గట్టిగా నిలదీసేసరికి వీళ్లు వాస్తవాలు ఒప్పుకోక తప్పలేదు. వీళ్లలో సంతు, బంగారులకు పోలీసులు ఆయుధాలు కూడా ఇచ్చారు... ఈ విషయం కూడా వీళ్లు ఒప్పుకున్నారు. వెంటనే గెరిల్లాల టీం ఒకటి ఓర్ఛాలోని వీళ్ల ఇండ్లపై ఆయుధాల కోసం దాడి చేసింది. కానీ అప్పటికే వీళ్లను అరెస్టు చేసిన సమాచారం ప్రచారం కావడంతో పోలీసులు ముందే వీళ్ల ఇండ్లలోంచి ఆయుధాలు తీసుకెళ్లారు. ప్రజాకోర్టులో వీళ్ల నేరాలను విచారించిన తర్వాత ముగ్గురికీ మరణశిక్ష విధించి అమలు చేశారు.

## పోలీసులకు తొత్తుగా మారిన పెత్తందారుకు హెచ్చరిక

మాడ్ డివిజన్ బాసింగ్ గ్రామ పటేల్ మొదటి నుండీ ప్రజా వ్యతిరేకిగా ఉన్నాడు. ఈ గ్రామంలో విప్లవ ప్రజా సంఘాలు ఏర్పడ్డ నాటి నుండీ వీడు వాటికి వ్యతిరేకంగానే ఉంటూ వచ్చాడు. స్థానిక పార్టీ వీడికి గతంలో కూడా చాలా సార్లే హెచ్చరిక చేసింది. అయినా వీడిలో మార్పు రాలేదు. మొన్నటి ఛత్తీస్‌గఢ్ ఎన్నికల సందర్భంగా ఎవరు ఓట్లేయకపోతే వాళ్లు నక్సలైట్లని పోలీసులకు చెబుతానని వీడు ప్రజలను బెదిరించాడు. నిజానికి వీడికి ముందు నుండే పోలీసులతో

సంబంధాలున్నాయి. చాలా మంది పోలీసుల వేధింపులనెదుర్కోవల్సి వస్తుందని భయపడి ఓట్లేశారు. ఆ తర్వాత ఈ ఏరియాలో సీఆర్పీ, పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహించడానికి వచ్చినపుడు వీడు వాళ్లకు తోవలు చూపిస్తూ సహాయపడ్డాడు. దీనితో స్థానిక పార్టీ ఫిబ్రవరి 27న 10 గ్రామాల ప్రజలను సమీకరించి ప్రజాకోర్టును ఏర్పాటు చేసింది. అందులో వీడి అరాచక, ప్రజా వ్యతిరేక చర్యలపై వివరంగా చర్చించారు. ప్రజలు ఈ పటేట్‌ను కఠినంగా హెచ్చరించి వదిలేశారు. మరోసారి పోలీసులకు సహకరించినట్లైతే మరణశిక్ష తప్పదని స్పష్టం చేశారు. ప్రజల సంఘటిత శక్తి ముందు తల వంచుతూ పటేల్ తన తప్పులను ఒప్పుకున్నాడు... క్షమించమని ప్రజలను వేడుకున్నాడు.

## కోళ్ల పందాలకు వ్యతిరేకంగా ప్రచారం

ఆదివాసీ ప్రాంతాలలో కోళ్ల పందాలు నిర్వహించడం మొదటి నుండీ ఆచారంగా ఉంది. అయితే ప్రజలు విప్లవ ప్రజా సంఘాలలో సంఘటితం అవుతున్న క్రమంలో వీటికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసే కృషి ప్రారంభమైంది. ప్రజా సంఘాలు క్రియాశీలంగా పని చేస్తున్న చోట ఇవి పూర్తిగా బందయినప్పటికీ, ఇంకా కొన్ని ప్రాంతాలలో ఇవి ఇప్పటికీ నడుస్తున్నాయి. మాడ్ డివిజన్‌లోని డౌల ప్రాంతంలో కోళ్ల పందాలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం తేవడానికి కేఏఎంఎస్, డీఏకేఎంఎస్‌ల నాయకత్వంలో కృషి జరిగింది. గ్రామగ్రామాన వీటికి వ్యతిరేకంగా ప్రచారం చేసిన తర్వాత ఒక పెద్ద సభ జరిపారు. దీనిలో దాదాపు 3 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలో ముఖ్యంగా కోళ్ల పందాల వల్ల వచ్చే దుష్ఫలితాల గురించి వివరించారు. పేద ప్రజలు చాలా మంది డబ్బులు కోల్పోవడం, చిన్న చిన్న తగవులు కొట్లాటకు దారి తీసి ప్రజల మధ్య ఐక్యత దెబ్బతినడం వంటి నష్టాల గురించి వక్తలు మాట్లాడారు. ఈ సభలో హాజరైన ప్రజలు ఆర్థికంగా నష్టదాయకమైనవీ, కొట్లాటకు కారణమైనవీ అయిన కోళ్ల పందాలను నడువనివ్వమని సంకల్పించుకున్నారు. ఆ తర్వాత ఈ ఏరియాలోని టోటిమడమనార్, వయానార్, ఏమ, మంగ్‌వాల్, ఈనార్, డౌల, మైమగవాడి, కోసల్‌పార, భోత, కనార్‌గాం, కడియనార్, వెడమకోట, డండ్‌పండ్, కరమెరి, గొంగ్ల, ఆధి గ్రామాలలో కోళ్లపందాలు పూర్తిగా ఆపేశారు. ఈ క్యాంపెయిన్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో క్రియాశీలంగా పాల్గొనడం ముఖ్యమైన విశేషం.

## మద్యనిషేధం కోసం ఉద్యమించిన మహిళలు

మాడ్ డివిజన్ డౌల ఏరియాలో జరిగే వారం సంతలలో కల్లు, సారా, లందల అమ్మకాన్ని బంద్ పెట్టాలని మహిళలు ఆందోళన చేపట్టారు. కేఏఎంఎస్ నాయకత్వంలో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. కేఏఎంఎస్ కార్యకర్తలు గ్రామగ్రామానికీ తిరిగి వీటి దుష్ఫలితాలను గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. వీటికోసం మగవాళ్లు పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేయడంతో పాటు తప్పతాగి వచ్చి ఆడవాళ్లను కొట్టడం మామూలైంది. కాబట్టి ప్రజా సంఘాల కార్యకర్తలు సంతల్లో కల్లు, సారాల అమ్మకాన్ని పూర్తిగానే బంద్ చేయాలని కోరారు. ఈ ప్రచారానికి ముఖ్యంగా మహిళల నుండి మంచి స్పందన వచ్చింది.

## పశ్చిమ బస్తర్ డివిజన్

## ప్రజా వ్యతిరేకి తెల్లం ఘట్టయ్య ఇంటిపై దాడి

పశ్చిమ బస్తర్ డివిజన్ మద్దేడ్ ఏరియా కమరిగూడెం నివాసి తెల్లం ఘట్టయ్య మొదటి నుండీ ప్రజా వ్యతిరేకిగా, విప్లవ వ్యతిరేకిగా నిలిచాడు. 1991-92 సమయంలో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా తిరోగమనవాదులు నడిపిన జనజాగరణ్ అభియాన్‌లో వీడు పాల్గొన్నాడు. అప్పుడు వీడు గ్రామ సర్పంచ్‌గా ఉండేవాడు. ఆ తర్వాత జనజాగరణ్ అభియాన్‌ను ప్రజలు ఓడించారు. ఆ సందర్భంగా ప్రజల తీర్పు మేరకు వీడిని కొట్టి వదిలారు. ప్రజల వత్తిడి మూలంగా వీడు సర్పంచ్ పదవికి రాజీనామా ఇచ్చాడు. కానీ వీడు ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మళ్లీ సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. రెండోసారి సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత వీడు అనేక అక్రమాలకు పాల్పడ్డాడు. ప్రజల పేరుతో ప్రభుత్వం నుండి డబ్బులు తెచ్చి కాజేయడం, 'పనికి ఆహారం' పథకం కింద వచ్చే బియ్యాన్ని చేజిక్కించుకొని వ్యాపారులకు అమ్ముకోవడం, ఈ అవినీతి చర్యలను వ్యతిరేకించిన వాళ్లను కొట్టడం ఘట్టయ్యకు మామూలయ్యింది. ఈ గ్రామంలో తెల్లం భీమ, కోర్స బాబుల్, గోటె సమ్మయ్య అనే మరో ముగ్గురు కూడా వీనికి తొత్తులుగా వ్యవహరిస్తూ ప్రతి దాంట్లోనూ వీడికి మద్దతునిస్తూ వస్తున్నారు. గ్రామానికి దళం వస్తే వీళ్లు మీటింగుకు వెళ్లవద్దనీ, అన్నం తీసుకెళ్లవద్దనీ ప్రజలను వత్తిడి చేసేవాళ్లు. ఎందుకంటే ప్రజలు దళం దగ్గరికి వెళ్తే వాళ్లలో చైతన్యం పెరుగుతుందనీ, దానితో తమ అటలిక సాగవనీ వీళ్లకు బాగా తెలుసు.

ఈ నేపథ్యంలో స్థానిక పార్టీ, ప్రజా సంఘాలు ఘట్టయ్య ఇంటిపై దాడి చేసి మొత్తం ఆస్తులన్నిటినీ స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచి వీడికి తగిన గుణపాఠం నేర్పాలని నిర్ణయించాయి. ఆగస్టు 1, 2003న దాదాపు 150 మంది ప్రజలు వీడి ఇంటిపై దాడి చేసి 5 బస్తాల ధాన్యం, 10 ఆవులు, 2 బర్రెలు, 5 మేకలు, ఇతర సామాన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఈ నలుగురినీ కొట్టి మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు చవి చూడాల్సి ఉంటుందని హెచ్చరించి వదిలారు.

## పోలీసు ఇన్‌ఫార్మర్ కుడియం ఘట్టీ ఇంటిపై ప్రజల దాడి

పశ్చిమ బస్తర్ డివిజన్ మద్దేడ్ ఏరియా నూకన్‌పల్లి గ్రామం ఆవపల్లి-బీజాపూర్ రోడ్డుపై ఉంటుంది. ఈ గ్రామంలో గతంలో కూడా కొందరు పోలీసు ఇన్‌ఫార్మర్లుగా మారగా వారిలో కొందరిని గెరిల్లాలు హతమార్చారు. ఈ మధ్యన ఇక్కడి కుడియం ఘట్టీ అనే వాడు పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా మారాడు. పోలీసులు ఈ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించినప్పుడు వీడు వాళ్లకు గైడ్‌గా పని చేశాడు. వీడితో పాటు ఈ గ్రామంలో వీడి సోదరుడూ, గ్రామ సర్పంచూ అయిన గన్ను, ఉప సర్పంచ్ గురాన్, సునీల్, ఎర్మోన్ అనే వాళ్లు... మొత్తం ఐదుగురు పోలీసు ఇన్‌ఫార్మర్లుగా తయారయ్యారు. ఆవపల్లి ఠాణేదారుతో వీళ్లకు మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. స్థానిక పార్టీ వీళ్లందరినీ అరెస్టు చేసి ప్రజాకోర్టులో శిక్షించాలని నిర్ణయించి గెరిల్లాలను పంపించి వీళ్లందరినీ అరెస్టు చేయించింది. అయితే ఆ రోజున సునీల్ గ్రామంలో లేనందున వాణ్ని పట్టుకోలేకపోయారు. ఎట్లాగైనా ప్రజాకోర్టులో కఠిన శిక్ష తప్పదని ఆలోచించి వీరిలో ముఖ్యుడైన ఘట్టీ ఎలాగోలా గెరిల్లాల కళ్లు గప్పి పారిపోయాడు. దానితో గెరిల్లాలు మిగిలిన ముగ్గురిని హెచ్చరించి వదిలేశారు. ఇక ఘట్టీ పోలీసులతోనే ఉండసాగాడు.

ఆ తర్వాత ఘట్టీ ఇంటిపై ఆర్థిక దాడి చేసి వాడికి గుణపాఠం నేర్పాలని ప్రజలు అభిప్రాయపడ్డారు. ఆగస్టు 2003లో వీడి ఇంటిపై ప్రజలు పీజీఏ నాయకత్వంలో దాడి చేసి 11 మేకలు, 11 ఆవులు, తదితర సామగ్రి జప్తు చేసుకొని పంచుకున్నారు. వాడి ఇంటిని కూడా ప్రజలు ధ్వంసం చేశారు.

## ఆగస్టు 15న 'నల్ల దినం' జరుపుకున్న పశ్చిమ బస్తర్ ప్రజలు

ఆగస్టు 15, 1947 బూటకపు స్వాతంత్ర్యాన్ని ఎండగడ్తూ పశ్చిమ బస్తర్‌లోని నేషనల్ పార్క్, భైరంగఢ్ ఏరియాల్లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఆగస్టు 15న కేవలం అధికారం తెల్లవాళ్ల చేతిలోంచి నల్లవాళ్ల చేతిలోకి వచ్చిందే తప్ప పేద ప్రజలకు ఎలాంటి స్వాతంత్ర్యం రాలేదని ప్రజలకు అర్థం చేయిస్తూ గ్రామగ్రామాన పోస్టర్లు అంటించారు. అనేక పాఠశాలలలో విద్యార్థులు మూడు రంగుల జెండాలను తొలగించి నల్ల జెండాలెగురేశారు.

భైరంగఢ్ ఏరియాలో మిర్తుల్‌కు చుట్టుపక్కల గల 9 స్కూళ్లలో నల్ల దినం జరుపుకున్నారు. ఒక స్కూల్లో 150, మరో స్కూల్లో 220... ఇలా మొత్తం సభలలో 1,080 మంది పాల్గొన్నారు. ఈ సభలలో వక్తలు బూటకపు స్వాతంత్ర్యాన్ని గురించి ప్రజలకు వివరంగా చెప్పారు. నేషనల్ పార్క్ ఏరియాలో కెర్పె, సెంద్ర, సాగుమెట్ట, తోయనార్, అన్నాపూర్ స్కూళ్లలో ప్రజా సంఘాల రేంజ్ కమిటీల ఆధ్వర్యంలో ప్రజలు నల్ల జెండాలు ఎగురేసి బూటకపు స్వాతంత్ర్యాన్ని నిరసించారు.

కెర్పె గ్రామంలో 300 మందితో సభ జరిగింది. ఇందులో విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఊరేగింపు తీసి బూటకపు స్వాతంత్ర్యానికి నిరసనగా నినాదాలు చేశారు. సాగుమెట్టలో 100 మంది, సెంద్రలో 150 మంది విద్యార్థులు, ఇతర ప్రజలు నల్ల జెండాలు ఎగురేసి ఊరేగింపు తీశారు. అన్ని చోట్ల ప్రజా సంఘాల నాయకులు హాజరైన ప్రజలను ఉద్దేశిస్తూ మాట్లాడారు. వాళ్లు ప్రభుత్వం ఒకవైపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుతూనే మరోవైపు తమ హక్కుల కోసం పోరాడుతున్న వాళ్లను 'నక్సలైట్లు'గా పేర్కొంటూ జైళ్లల్లో పెడుతున్నదనీ, హతమారుస్తున్నదనీ విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పి ఇప్పటికి 56 ఏండ్లు గడిచినప్పటికీ తిండి, బట్ట, ఇల్లు వంటి కనీస సౌకర్యాలు కూడా తీరలేదంటే ఇదెలాంటి స్వాతంత్ర్యమో అర్థం చేసుకోవచ్చని వక్తలు విమర్శించారు. నిజమైన స్వాతంత్ర్యం పోరాడి సాధించుకోవాల్సి ఉందని వాళ్లు ప్రజలకు వివరించారు.

## ప్రజల సమిష్టి శ్రమతో పూర్తయిన చెరువు మరమ్మత్తు

నేషనల్ పార్క్ ఏరియాలోని కెర్పె గ్రామంలో గతంలో దోపిడీ ప్రభుత్వం నిర్మించిన చెరువు ద్వారా ఈ గ్రామంతో పాటు చుట్టుపక్కల గల మొత్తం మూడు గ్రామాల పశువులకు వేసవిలో నీళ్లు లభించేవి. అయితే పోయిన సంవత్సరం (2003) వర్షాలు అధికంగా పడడంతో చెరువు కట్టకు గండి పడడంతో చెరువు పూర్తిగా ఎండిపోయింది. దాంతో ప్రజలు గండి పూడ్చే పనిని తామే స్వయంగా చేపట్టాలని సంకల్పించారు. నేడు దండకారణ్యంలో గ్రామగ్రామాన ఏర్పడుతున్న ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ప్రజలు తమ అభివృద్ధికి బాటలు వేసుకుంటున్నారు. అందులో భాగంగానే ఈ గ్రామ ప్రజలు కూడా ఈ పని కోసం దోపిడీ ప్రభుత్వం వైపు చూడాల్సిన పని లేదని నిర్ణయించారు. అయితే ఈ గ్రామంలోని కొందరు సాంప్రదాయ పెద్దలు ఈ మరమ్మత్తు పని కోసం దోపిడీ ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేయాలని మాట్లాడారు. దాంట్లో ఇలాంటి వాళ్లకు తినడానికి కమిషన్ దొరికే అవకాశం ఉంటుందన్నది స్పష్టమే. కానీ మెజారిటీ ప్రజలు వీళ్లకు వ్యతిరేకంగా నిలవడంతో వాళ్ల ప్రతిపాదన వీగిపోయింది. చుట్టుపక్కల గల 9 గ్రామాల నుండి 300 మంది ప్రజలు వరుసగా రెండు రోజుల పాటు పని చేసి ఈ చెరువును మరమ్మత్తు చేశారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే ప్రజలు రెండు రోజుల పాటు తినడానికి బియ్యం వగైరా ఎవరివి వాళ్లే తమ ఇండ్లలోంచి తెచ్చుకొని పని పూర్తి చేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలలో తమ సంఘటిత శక్తి ద్వారా ఎలాంటి పనినైనా పూర్తి చేసుకోగలమన్న ఆత్మవిశ్వాసం పెరుగుతోంది.

## కరువును ఎదుర్కోవడానికి నడుం బిగించిన ప్రజలు

గత సంవత్సరం నేషనల్ పార్క్ ఏరియాలో పంటలు దెబ్బతినడంతో ప్రజలు అనేక ఇక్కట్ల పాలయ్యారు. ఒక్క పూట తిండికే తంటాలు పడాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితిలో స్థానిక ప్రజా సంఘాలు ముందుకొచ్చి ప్రజలకు తిండి గింజలు ఇవ్వాలని ఏరియాలోని ధనిక, మధ్య తరగతి రైతులకు విజ్ఞప్తి చేశాయి. దీనికి స్పందిస్తూ చాలా మంది ప్రజలు తమ వద్ద మిగులుగా ఉన్న ధాన్యం ఇచ్చారు. అంతా కలిపి 190 బస్తాలయింది. ఈ ధాన్యాన్ని తిండికి లేని నిరుపేద కుటుంబాలకు ఇంటికి బస్తా చొప్పున పంచి పెట్టారు. ఇంతే కాకుండా నగదు రూపంలో కూడా కొంత చందా వసూలైంది. ఈ డబ్బుతో 96 క్వింటాళ్ల బియ్యం కొని ఆకలితో ఉన్న కుటుంబాలకు పంచారు.

దోపిడీ ప్రభుత్వం 'పనికి ఆహారం' పథకం కింద కొన్ని పనులు మొదలు పెట్టినప్పటికీ వాటితో కొంత మందికి మాత్రమే లాభం జరిగింది. వీటిలో ఎక్కువ భాగం అధికారుల జేబుల్లోకే వెళ్లింది. ఈ పథకం కింద విడుదలైన బియ్యాన్ని పెద్ద ఎత్తున సేట్ల దుకాణాలకు తరలించడం మామూలైంది. దానితో స్థానిక ప్రజలు ఈ బూటకపు అభివృద్ధి కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ 160 క్వింటాళ్ల బియ్యం జప్తు చేసుకొని పంచుకున్నారు.

అదే విధంగా మిర్తుల్ ఏరియాలో కూడా ప్రజలు ప్రజా సంఘాల నాయకత్వంలో కరువు సమస్యను పరిష్కరించుకోవడానికి వ్యాపారుల నుండీ, ధనిక రైతుల నుండీ చందా వసూలు చేశారు. మొత్తం 100 బస్తాల ధాన్యం, 100 బస్తాల బియ్యం వసూలయ్యాయి. వీటిని కరువు తీవ్రంగా ఉన్న కుటుంబాలకు పంచారు. ప్రతి కుటుంబానికి దాదాపు 15 కిలోల చొప్పున బియ్యం వచ్చాయి.

## ఉత్తర బస్తర్ డివిజన్

## ప్రత్యేక బస్తర్ రాష్ట్రం కోసం నినదించిన ప్రజలు

నవంబర్ 1, 2003న ఛత్తీస్‌గఢ్ స్థాపనాదినం సందర్భంగా బస్తర్ ప్రజలు ప్రత్యేక బస్తర్ రాష్ట్రం కావాలన్న తమ డిమాండ్‌ను ముందుకు తెస్తూ చాలా చోట్ల ఊరేగింపులూ, ప్రదర్శనలూ వగైరా నిర్వహించారు. ఉత్తర బస్తర్ డివిజన్ కడిమె ఏరియాలో ఒక సభ జరిగింది. ఇందులో 100 మహిళలతో పాటు 600 మంది ప్రజలు పాల్గొన్నారు.

కేస్కల్ ఏరియాలో బార్దా ఎల్‌జీఎస్ నాయకత్వంలో ఉరందబేడ రేంజ్‌లోని పోల్బలో ఒక పెద్ద సభ జరిగింది. ఇందులో 29 గ్రామాల నుండి 1,020 మంది పురుషులూ, 644 మంది స్త్రీలూ పాల్గొన్నారు. సభకు ముందు ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపులో ప్రత్యేక బస్తర్ రాష్ట్ర డిమాండ్‌తో ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానిక చేతనా నాట్య మంచ్ కళాకారులు తమ పాటలతో, నాట్య ప్రదర్శనలతో ప్రజలను బాగా ఉత్సాహపర్చారు. ఆ తర్వాత ఊరేగింపు సభా స్థలానికి చేరుకుంది. హాజరైన ప్రజలంతా వక్తల ఉపన్యాసాలను శ్రద్ధగా విన్నారు. సభలో ప్రజా సంఘాల నుండి డీఏకేఎంఎస్ రేంజ్ కమిటీ అధ్యక్షుడు కామ్రేడ్ సోను, సభ్యుడు కామ్రేడ్ అనిల్, కేఏఎంఎస్ అధ్యక్షురాలు కామ్రేడ్ జానకి మాట్లాడారు. ఆ తర్వాతా స్థానిక ఎల్‌జీఎస్ కమాండర్ కామ్రేడ్ జైమతి, ఏరియా కమిటీ కార్యదర్శి కామ్రేడ్ సుభాష్ మాట్లాడారు. వాళ్లు బస్తర్ చరిత్రను తడుముతూ ప్రత్యేక బస్తర్ రాష్ట్ర డిమాండ్ ఎలా న్యాయమైందో ప్రజలకు వివరించారు. సభ చివర్లో సీఎన్ఎం సాంస్కృతిక

యోధులు కార్యక్రమాలిచ్చారు. బస్తర్ ప్రజల గత పోరాటాల పైనా, బూటకపు ఎన్నికల పైనా వాళ్లు చిన్న చిన్న నాటకాల్ని కూడా ప్రదర్శించారు.

ప్రత్యేక బస్తర్ రాష్ట్ర డిమాండుకు మద్దతుగా కిస్కోడో గ్రామంలో కూడా ఒక ర్యాలీ జరిగింది. ఇందులో 150 మహిళలతో సహా మొత్తం 700 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డీఏకేఎంఎస్ రేంజ్ కమిటీ నాయకత్వం వహించింది. ర్యాలీ తర్వాత జరిగిన సభలో రేంజ్ కమిటీ నాయకులు ప్రసంగించారు. వాళ్లు ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ విలీనాన్ని అన్యాయమని పేర్కొన్నారు. తొలి నుండీ బస్తర్‌కు ప్రత్యేక ఉనికి, గుర్తింపు ఉన్నాయని వాళ్లు చెప్పారు. బస్తర్ సంపదలను విచ్చలవిడిగా, అడ్డూ అదుపూ లేకుండా దోచుకోవడం కోసమే పాలక వర్గాలు ప్రత్యేక బస్తర్ రాష్ట్ర డిమాండును తిరస్కరిస్తున్నాయని వక్తలు సూటిగా విమర్శించారు. ఆఖరున సీఎన్ఎం కళాకారులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలిచ్చి ప్రజలను ఉత్సాహపర్చారు.

అంతాగఢ్ రేంజ్‌లో కూడా ధౌస అనే గ్రామంలో ప్రజలు ర్యాలీ నిర్వహించి ప్రత్యేక బస్తర్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీ తర్వాత సభ కూడా జరిగింది. ఇందులో మొత్తం 9 గ్రామాల నుండి 250 స్త్రీపురుషులు పాల్గొన్నారు. డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ రేంజ్ కమిటీ నాయకులు సభలో ప్రసంగించారు. వాళ్లు బస్తర్ ప్రజల అభీష్టానికి విరుద్ధంగా బస్తర్‌ను ఛత్తీస్‌గఢ్‌లో కలిపివేయడాన్ని పాలకవర్గాల కుట్రగా అభివర్ణిస్తూ, ప్రత్యేక బస్తర్ రాష్ట్ర సాధన కోసం ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని నొక్కి చెబుతూ మాట్లాడారు.

## డీఏకేఎంఎస్ ఉరందబేడ రేంజ్ మహాసభ జయప్రదం

ఉత్తర బస్తర్ డివిజన్ కేస్కల్ ఏరియాలోని ఉరందబేడ రేంజ్‌లో సెప్టెంబర్ 2003లో డీఏకేఎంఎస్ రేంజ్ మహాసభ జయప్రదంగా జరిగింది. మొదట రేంజ్ కమిటీ అధ్యక్షుడు కామ్రేడ్ సోను డీఏకేఎంఎస్ జెండానెగురేసి మహాసభను ప్రారంభించాడు. సభలో డీఏకేఎంఎస్ ప్రణాళికపై చర్చ జరిగింది. అలాగే స్థానిక సమస్యలపై కూడా లోతుగా చర్చ జరిగింది. ఆ తర్వాత కొన్ని తీర్మానాలు కూడా చేశారు. ముఖ్యంగా బలవంతపు పెళ్లిళ్లకు వ్యతిరేకంగా, పెళ్లిళ్లలో ఖర్చు తగ్గించాలనీ, కోళ్ల పందాలను నిరుత్సాహపర్చి క్రమంగా బంద్ చేయించాలనీ తీర్మానాలు జరిగాయి. ప్రజా సమస్యలపై ప్రజా పోరాటాలను తీవ్రం చేయాలనీ, పెద్ద సంఖ్యలో ప్రజలను పోరాటాల్లోకి సమీకరించాలనీ కూడా సభ తీర్మానించింది. పోరాటాలను పెంపొందింపజేస్తూ సంఘాన్ని పటిష్టం చేయాలనే సంకల్పంతో ప్రతినిధులంతా తమ తమ గ్రామాలకు మరలిపోయారు.

## దక్షిణ బస్తర్ డివిజన్

## భూస్వామి బొడ్డ మంగు భూమిని స్వాధీనపర్చుకున్న ప్రజలు

దక్షిణ బస్తర్ డివిజన్‌లోని బాసగూడెం ఏరియాలో ప్రజలు తమ సంఘాల నాయకత్వంలో గ్రామాలలోని దుష్ట పెత్తందార్లకూ, దోపిడీ ప్రభుత్వానికీ, పోలీసు బలగాలకూ వ్యతిరేకంగా పోరాడుతూ అనేక విజయాలు సాధిస్తున్నారు. ఇటీవల భూస్వామి బొడ్డ మంగు భూములను జప్తు చేసుకోవడం అందులో ఒకటి.

దర్బ గ్రామానికి చెందిన బొడ్డ మంగు సర్పంచ్‌గానూ, పెత్తందారుగానూ పేరు మోసిన వాడు. వీడు తొలి నుండీ ప్రజలపై పెత్తనం చేస్తూ వస్తున్నాడు. వీడి కుటుంబంలోని ఇతర సభ్యులు ప్రభుత్వ ఉద్యోగాలలో ఉన్నారు. వీడికి 40 ఎకరాల భూమి ఉంది. 100కు పైగా పశువులున్నాయి. వీడి తమ్ముడైన బొడ్డ దుడ్వాల్‌కు 30 ఎకరాల భూమి ఉంది. వీరిద్దరినీ తమ దౌర్జన్యాలను మానుకోవల్సిందిగా ప్రజా సంఘాల నాయకత్వంలో ప్రజలు పలు మార్లు హెచ్చరించారు. అయినప్పటికీ వీళ్లలో ఏ మార్పూ రాలేదు. దానితో వీళ్లిద్దరినీ ప్రజాకోర్టులో హాజరుపర్చారు. ఈ ప్రజాకోర్టుకు చుట్టుపక్కల 10 గ్రామాల నుండి 900 మంది ప్రజలు, 20 మంది గెరిల్లాలు హాజరయ్యారు. మంగుకు తన్ని బుద్ధి చెప్పాలనీ, వీళ్లిద్దరి నుండీ స్థిర, చరాస్తులను స్వాధీనం చేసుకోవాలనీ ప్రజాకోర్టు నిర్ణయించింది.

ఆ తర్వాత ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ చేతుల్లో ఎర్రజెండాలు పట్టుకొని ఊరేగింపుగా వీళ్ల భూములపైకి వెళ్లారు. ఇందులో స్థానిక చేతనా నాట్య మంచ్ కళాకారులు కూడా పాల్గొని తమ పాటలతో, ప్రదర్శనలతో ప్రజలను ఉత్సాహపర్చారు. ప్రజలు మంగు నుండి 20 ఎకరాల భూమి, 20 పశువులు, వాడి తమ్ముడి నుండి 10 ఎకరాల భూమి స్వాధీనపర్చుకున్నారు. ఈ పోరాటం ప్రజలను బాగా ఉత్సాహపర్చగా, చుట్టుపక్కల ప్రాంతాలలో ప్రజలపై పెత్తనం చేసే దోపిడీదార్లకు వణుకు పుట్టించింది.

## డిసెంబర్ 6న మతోన్మాద వ్యతిరేక దినం

డిసెంబర్ 6, 2003న కిష్టారం ఏరియాలో చాలా గ్రామాల్లో ప్రజలు మతోన్మాద వ్యతిరేక దినం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సభలూ, సమావేశాలూ జరుపుకున్నారు. హిందూ మతోన్మాదానికి నిరసనగా నల్ల జెండాలు కూడా ఎగురవేశారు.

డిసెంబర్ 6, 1992న సంఘ్ ముఠాకు చెందిన బీజేపీ, శివసేన, బజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ మొదలైన హిందూ మతోన్మాద సంస్థలు బాబ్రీ మసీదును కూల్చివేశాయి. దేశంలో హిందూ దురంహకారాన్ని రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోవడం కోసమే ఇవి ఈ ఘాతుకానికి పాల్పడ్డాయి. ఆ తర్వాత జరిగిన అల్లర్లలోనూ, ఇంకా అనేక సందర్భాలలో జరిగిన అల్లర్లలో అనేక మంది అమాయక ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. ముస్లింలతో పాటు, క్రైస్తవులపైన కూడా హిందూ మతోన్మాదుల దాడులు పెరిగిపోతున్నాయి. దానితో మైనారిటీ మతాల ప్రజల అస్తిత్వానికే ముప్పు వచ్చింది. ఆదివాసీ ప్రాంతాల్లోకి హిందూ మత సంస్థలు వేగంగా చొచ్చుకొస్తున్నాయి. ఆదివాసీ సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తూ వాళ్లను బలవంతంగా లేదా మాయమాటలతో మోసం చేసి హిందువులుగా మార్చుకుంటున్నారు. 2002లో గుజరాత్‌లో జరిగిన నరమేధంలో రెండున్నర వేలకు పైగా ముస్లిం ప్రజలను హతమార్చిన ఉదంతం మన దేశంలో మతోన్మాదం ఎంత భయావహ రూపం దాల్చిందో తెలుపుతుంది. ఇలాంటి నేపథ్యంలో డిసెంబర్ 6న హిందూ మతోన్మాద వ్యతిరేక దినం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది.

పార్టీ పిలుపుపై చిన్న కెడ్వాల్ గ్రామంలో జరిగిన సభలో 110 మంది ప్రజలు, 25 మంది పీజీఏ సభ్యులు పాల్గొన్నారు. సభా ప్రారంభానికి ముందు నల్లజెండానెగురవేసారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఊరేగింపు తీశారు. ఆ తర్వాత సభలో స్థానిక కామ్రేడ్స్ ప్రసంగించారు. బూర్గులంక, ఎలమగొండ గ్రామాలలో కూడా ఇదే విధంగా సభలు జరిగాయి. వీటిలో వరుసగా 230, 150 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ గ్రామాల్లో కూడా ప్రజలు నల్లజెండాలు ఎగురవేసి ప్రభుత్వ మతోన్మాద విధానాలకు నిరసన తెలిపారు. హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

## పోలీస్ ఇన్‌ఫార్మర్ కర్టం గంగాల్‌కు ప్రజల చేతిలో మరణశిక్ష

దక్షిణ బస్తర్ డివిజన్ కుంట ఏరియా ఎర్రబోరుకు సమీపంలోని వొడ్డినగూడెం గ్రామానికి చెందిన కర్టం గంగాల్ అనే పోలీసు ఇన్‌ఫార్మర్‌ను

ప్రజలు పీజీఏ మద్దతుతో డిసెంబర్ 31, 2003 నాడు హతమార్చారు. వీడికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి – విప్లవోద్యమాన్ని అణచివేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కొత్త పోలీసు స్టేషన్లు నిర్మించ తలపెట్టింది. అందులో ఒకటి ఎర్రబోరులో నిశ్చయమైంది. అయితే ప్రజల నుండి ప్రతిఘటన వస్తుందని తలచిన ప్రభుత్వం పోలీసుల రక్షణలో నెల రోజుల లోపునే స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. నిర్మాణం జరిగేటప్పుడు 30 మంది స్థానిక పోలీసులు, 50 మంది సీఆర్‌పీఎఫ్ వాళ్లు ఉండేవాళ్లు. ఒక వైపు స్టేషన్‌ను నిర్మిస్తూనే పోలీసులు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకునే ప్రయత్నాలు కూడా ముమ్మరం చేశారు. ముఖ్యంగా స్థానిక భాషతో, రీతిరివాజులతో పరిచయం ఉన్న పోలీసులను ఈ పనికి ప్రత్యేకించి కేటాయించారు. వీళ్లు ప్రత్యేకించి చదువుకున్న నిరుద్యోగులనూ, లంపెన్‌లనూ, కల్లుసారా అమ్మే మహిళలనూ డబ్బుల ఆశ చూపి ఇన్‌ఫార్మర్లుగా మార్చుకున్నారు. ఈ విధంగా పోలీసులు మూడు నెలలలోగా 20కి పైగానే మందితో సంబంధాలు ఏర్పర్చుకున్నారు. వీళ్లలోనే ఒకడు కర్టం గంగాల్. వీడు ఎర్రబోరు సంతకు పోయినప్పుడు పోలీసులు వీడితో సంబంధాలు ఏర్పర్చుకున్నారు.

మొదట్లో వీడికి కూరగాయలు తేవడం వంటి మామూలు పనులు మాత్రమే పోలీసులు చెప్పేవాళ్లు. ఆ తర్వాత క్రమక్రమంగా ఇన్‌ఫార్మర్‌గా మారమని ప్రోత్సహించారు. వీడికి 500 రూపాయల నగదు, కొత్త బట్టలు ఇచ్చారు. గంగాలు వీటి మాయలో పడిపోయాడు. వీడికి ప్రత్యేకించి కొన్ని పనులు అప్పగించారు – శబరి నదిని దాటి బస్తర్‌లోకీ, ఒరిస్సాలోకీ ప్రవేశించే దళాల సమాచారం సేకరించి చెప్పడం, ఎర్రబోరుకు సమీపంలోకి దళం వస్తే వెంటనే సమాచారం ఇవ్వడం, చుట్టుపక్కల గ్రామాలలో 8వ తరగతి వరకు చదివిన నిరుద్యోగ యువకులను రహస్యంగా కలుస్తూ వాళ్లను ఇన్‌ఫార్మర్లుగా మారమని ప్రోత్సహించడం, పోలీసుస్టేషన్ ముందర నాకాలో ఉంటూ వచ్చిపోయే వాళ్లలో సంఘ సభ్యులనూ, క్రియాశీల కార్యకర్తలనూ గుర్తు పట్టి చూపించడం. సంఘ సభ్యుణ్ని పట్టిస్తే 1,500 రూపాయలు, సంఘ నాయకుణ్ని పట్టిస్తే 2,000 రూపాయలు బహుమతిగా ఇస్తామని చెప్పారు. ఈ ఆశతో వీడు మరాయిగూడెం గ్రామ పటేల్‌ను సంఘ సభ్యుడని చెప్పి పోలీసులకు పట్టించాడు. ఇతన్ని పోలీసులు 3, 4 రోజుల దాకా బాగా కొట్టి ఆ తర్వాత వదిలేశారు. ఇంకా చాలా మందిని పట్టించాలన్న ఆశతో గంగాల్ ఉండగా, వీడి కార్యకలాపాల గురించి ప్రజల నుండి స్థానిక గెరిల్లా దళానికి సమాచారం దొరికింది.

వెంటనే వీడిని అరెస్టు చేయాలని పార్టీ నిర్ణయించింది. సంఘ సభ్యులూ, మిలిషియా సభ్యులూ, సాధారణ ప్రజలూ మొత్తం 200 మంది డిసెంబర్ 29 నాడు వీడి ఇంటిపై దాడి చేసి పట్టుకొచ్చారు. వీడిచ్చిన సమాచారంతో మరి కొందరు అనుమానాస్పద వ్యక్తులను కూడా పట్టుకున్నారు. మరుసటి రోజు స్థానిక పార్టీ శాఖ ఎర్రబోరుకు చుట్టుపక్కల గల 20 గ్రామాల ప్రజలను పిలిచి ప్రజాకోర్టు ఏర్పాటు చేసింది. రెండు రోజుల పాటు నడిచిన ఈ ప్రజాకోర్టులో మొత్తం 1,000 మంది ప్రజలు పాల్గొన్నారు. అందులో వీడిని విచారించగా పైన పేర్కొన్న వివరాలన్నీ వీడు వెల్లడించాడు. ఎర్రబోరులో పోలీసులు పన్నుతున్న కుట్రలనూ, వాళ్లతో కుమ్మక్కైన వాళ్ల వివరాలనూ వీడు ప్రజలకు చెప్పాడు. ఆఖరున ప్రజాకోర్టు ఏకగ్రీవంగా వీడికి మరణశిక్ష విధించాలని తీర్పునిచ్చింది. విప్లవోద్యమానికి వ్యతిరేకంగా వీడు పాల్పడ్డ విద్రోహానికి ఇదే సరైన శిక్ష అనీ, వీడిని క్షమించేది లేదనీ ప్రజాకోర్టు స్పష్టంగా ప్రకటించింది. ఆ తర్వాత వీడిని ప్రజలే కొట్టి చంపేశారు.

ఆ తర్వాత, పోలీసులతో చేతులు కలిపిన మరి కొందరు ఇన్‌ఫార్మర్లను ప్రజాకోర్టు తీర్పులో భాగంగా తన్ని వదిలేశారు. ఈ సందర్భంగా, అక్కడ హాజరైన ప్రజలు పోలీసుల కుట్రలను ఓడించి తీరుతామని ప్రకటించారు.

## ప్రజా మిలిషియా చేతిలో ఖతమైన ప్రజా శత్రువు, గోపనీయ సైనికుడు సుక్కాల్

సుక్కాల్ పశ్చిమ బస్తర్ డివిజన్ గంగలూరు ఏరియాకు చెందిన వాడు. అక్కడ ఉంటూనే వీడు పోలీసుల ఏజెంటుగా తయారయ్యాడు. స్థానిక పార్టీ వీడిని హతమార్చాలని నిర్ణయించింది. అయితే వీడికి అనుమానం రావడంతో అక్కడి నుండి పారిపోయి వచ్చి దోర్నపాల్ ఏరియాలో మున్నికుంట గ్రామంలో స్థిరపడ్డాడు. అక్కడ సర్పంచ్, పటేల్‌లతో దోస్తీ చేసి ఉండడానికి జాగ సంపాదించాడు. అక్కడికి దగ్గర్లోని గగన్‌పల్లి అనే గ్రామంలోని ఓ మహిళను పెళ్లి చేసుకున్నాడు. వీళ్లకు పిల్లలు కూడా కలిగారు. ఈ విధంగా నాలుగైదు ఏళ్లు గడిచాయి. ఇక్కడ కూడా వీడు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తూనే ఉన్నాడు. ప్రజల నుండి స్థానిక పార్టీకి వీడి గురించి సమాచారం లభించింది. అయితే వీడికి భార్యపిల్లలున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఒకసారి హెచ్చరించి బాగు పడడానికి ఓ అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత వీడు భార్యాపిల్లలనొదిలేసి దోర్నపాల్ పారిపోయి అక్కడే ఉండసాగాడు. అక్కడే ఉంటూ స్థానిక సంఘాల, పార్టీ కార్యకలాపాల సమాచారం సేకరించి పోలీసులకు అందజేయసాగాడు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వీడి ఉనికే ప్రమాదకరంగా తయారైంది. పనులపై దోర్నపాల్ వెళ్లే వాళ్లను వీడు పోలీసులకు పట్టించి వేధింపులకు గురి చేయించేవాడు. దానితో స్థానిక ప్రజల అభీష్టం మేరకు వీడిని హతమార్చాలని పార్టీ నిర్ణయించింది. పీజీఏ గెరిల్లాలు వీడి కోసం ఒకటి, రెండు సార్లు ప్రయత్నాలు కూడా చేసినప్పటికీ అవి సఫలం కాలేదు. ఆఖరుకు సెప్టెంబర్ 15, 2003న పీజీఏ బేస్‌ఫోర్స్‌కు చెందిన మిలిషియా సభ్యులు కచ్చితమైన సమాచారంతో వీడిని తన ఇంట్లోనే పట్టుకొని అంతమొందించారు. వీడు తన భార్యాబిడ్డలను చూసి పోవడానికి వచ్చాడన్న సమాచారం వాళ్లు ముందే సేకరించుకున్నారు. ఈ దాడితో ప్రజా శత్రువులకు ఏనాటికైనా ప్రజల చేతులో శిక్ష తప్పదని పీజీఏ హెచ్చరిక చేసింది.

## గోపనీయ సైనికుడు పూనెం నాగేష్‌కు తప్పని కుక్కచావు

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం దండకారణ్య విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో తీవ్రమైన నిర్బంధాన్ని కొనసాగిస్తున్నది. అందులో భాగంగా ఇన్‌ఫార్మర్లనూ, కోవర్టులనూ తయారు చేసుకోవడానికి అది పడరాని పాట్లు పడుతున్నది. దక్షిణ బస్తర్ డివిజన్ బాసగూడెం రేంజ్‌లోని లింగగిరి గ్రామం వాడైన పూనెం నాగేష్‌ను పోలీసులు హోంగార్డుగా చేర్చుకున్నారు. గత ఆరు నెలలుగా వీడు బాసగూడెం ఠాణేదారు ఆధ్వర్యంలో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. వీడికి నెలకు 1,800 రూపాయలు వేతనంగా ఇస్తున్నారు. వీడు గ్రామంలో డీఏకేఎంఎస్ శాఖకు కార్యదర్శిగా కూడా ఎన్నికయ్యాడు. ఒక వైపు ప్రజా సంఘంలో ఉంటూనే మరోవైపు వీడు చాలా పకడ్బందీగా శత్రువుకు సమాచారం చేరవేస్తూ వచ్చాడు. సీబీఐలో పని చేసే ఒక అధికారితో కూడా వీడికి సంబంధాలున్నాయి. అయితే ప్రజలకు వీడిపై అనుమానం వచ్చింది. పార్టీకి ప్రజల నుండి సమాచారం తెల్సింది. వెంటనే పీజీఏ దళం పూనెం నాగేష్‌ను అరెస్టు చేసి ప్రశ్నించగా వీడు నాలుగు సార్లు పోలీసులకు సమాచారం చేరవేసినట్టు ఒప్పుకున్నాడు. ప్రజా సంఘంలో సభ్యులుగా ఉన్న వాళ్లందరి పేర్లనూ పోలీసులకు చెప్పిన విషయాన్ని కూడా వీడు ఒప్పుకున్నాడు. ఆ తర్వాత 18 గ్రామాల ప్రజలను సమీకరించి ప్రజాకోర్టు ఏర్పాటు చేసి వీడి కుట్రను ప్రజల్లో బట్టబయలు చేశారు. ప్రజాకోర్టు వీడిని చంపెయ్యాలని ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. దానితో ఫిబ్రవరి 9న వీడిని ప్రజా మిలిషియా దళం జేగురుగొండ పట్టణంలో పోలీసుస్టేషన్‌కు 10 నిమిషాల దూరం దాకా తీసుకెళ్లి చంపేసింది.

## గడ్చిరోలి డివిజన్

### ఆంధ్ర ప్రజలారా ! మీకు అండగా మేమున్నాం

భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) [పీపుల్స్‌వార్] కేంద్ర కమిటీ పిలుపు మేరకు దండకారణ్య వ్యాప్తంగా జరిగినట్టుగానే గడ్చిరోలిలో కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజలపై నాయుడు ప్రభుత్వం కొనసాగిస్తున్న పాశవిక నిర్బంధకాండకు వ్యతిరేకంగా మార్చ్ 2003లో నిరసన వారం జరిగింది. భామ్రాగడ్ ఏరియాలో రెండు చోట్ల సభలు జరిగాయి. ఒక చోట 6 గ్రామాల ప్రజలు 300 మంది, మరో చోట 4 గ్రామాల ప్రజలు 200 మంది హాజరైనారు. స్థానిక పార్టీ ఏరియా కమిటీ సభ్యులు సభను ఉద్దేశించి మాట్లాడారు. భారత విప్లవోద్యమానికి ఆంధ్రప్రదేశ్ విప్లవ రైతాంగ పోరాటం తలమానికం అన్నారు. గత 30 ఏళ్లుగా అక్కడి ప్రజానీకం వీరోచితమైన త్యాగాలతో తమ సమస్యలపై పోరాడుతున్నారు. ఆ విప్లవోద్యమం దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించి అక్కడి ప్రజలకు ప్రేరణగా నిల్చి వారిని విప్లవోన్ముఖులను చేయడంలో గొప్ప పాత్ర వహించింది. మన దండకారణ్య ఉద్యమానికి ఆంధ్ర రాష్ట్ర విప్లవోద్యమంతో విడదీయరాని అనుబంధం ఉంది. ఆ ఉద్యమంపై తొలి నుండి సాగుతున్న అణచివేత చర్యలు తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో తీవ్రమైనాయి. 1400 మంది విప్లవకారులను పోలీసులు పొట్టన పెట్టుకున్నారు. అనేక వందల విప్లవ సానుభూతిపరుల కుటుంబాలను అనేక రకాలుగా హింసిస్తున్నారు. విప్లవోద్యమంతో ఏమాత్రం సంబంధం ఉందని ఎవరి గూర్చి ఏ మాత్రం ఉప్పందినా వారిని పోలీసులు చెప్పనలవి కాని యాతనలకు గురి చేస్తున్నారు. అక్కడి రైతాంగం నిత్యం నిర్బంధంలోనే తమ సమస్యలపై పోరాడుతున్నారు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలకు, బహుళజాతి కంపెనీలకు అమ్ముడుపోయిన చంద్రబాబు నాయుడి ప్రభుత్వ విధానాలతో ప్రజలు ఎడతెరపి లేకుండా ధైర్యంగా పోరాడుతున్నారు. అందుకే వారిని పోలీసులు సహించడం లేదు. ఆ ఉద్యమాలను సహించడం లేదు. వాటిని తుదముట్టించడానికే కుట్రలు జరుగుతున్నాయి. కానీ వాటిని సాగనివ్వకుండా పోరుపథంలో నిల్చిన ఆ వీర ప్రజానీకానికి మనం అండగా నిలబడుదాం. విప్లవ పోరాటాల మధ్య అనుబంధాన్ని వ్యక్తం చేద్దాం. విప్లవ ప్రజల సమైక్య ప్రతిఘటనకు, మనం వీలైన అన్ని రూపాలలో పూనుకుందాం అని వక్తలు మాట్లాడారు. అంతిమంగా ప్రజలందరూ ఎర్రజెండాలతో "ఆంధ్ర ప్రజలారా మీరు ఒంటరిగా లేరు", "పోరాడే ప్రజలందరి లక్ష్యం ఒక్కటే", "నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి", "ఆంధ్ర, బీహార్, ఝార్ఖండ్, దండకారణ్య రైతాంగ పోరాటాలు వర్ధిల్లాలి", "దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మల్చుకుందాం" అని గోండీలో నినదించారు. ఆ రోజు భగత్సింగ్ వర్ధంతి కూడా కలిసి రావడంతో ప్రజలు ఆ విప్లవ వీరుడికి ఘనంగా నివాళులర్పించారు.

అక్కడ సమావేశమైన జనం ఆ ప్రాంతంలో పెచ్చరిల్లిపోతున్న ప్రజా ద్రోహుల గురించి కూడా చర్చించుకున్నారు. గడ్చిరోలిలో పోలీసులు చేపడుతున్న అణచివేత చర్యలలో పాలు పంచుకుంటూ జనాలను వేధించుకు తింటున్న ద్రోహులను శిక్షించాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత ఈ ప్రాంతంలోని మోడుస్కే పటేల్‌ను, గట్ట గ్రామ పటేల్ గోట సత్తును, దుబ్బగూడెం పటేల్‌ను, గోట్‌పాడ్ పటేల్‌ను, ఖియర్‌లో వికాస్‌ఖండ్ అధ్యక్షుడు (సభాపతి) రామ బోగామిని, రాంజీలకు తీవ్రంగా దేహశుద్ధి చేసి ప్రజాతీర్పును వినిపించారు. మరోసారి ఎలాంటి ప్రజా వ్యతిరేక చర్యలకు పూనుకున్నా, పోలీసులకు సహకరించినా తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

### అటవీశాఖ వాహనాలు దగ్ధం

సిరొంచ ప్రాంతంలోని ఆసరెల్లి రేంజ్‌లో అటవీశాఖకు చెందిన ఒక జీపునూ, ఒక ట్రాక్టర్‌నూ ఆగస్టు 24, 2003న ప్రజలు సోమన్‌పల్లి గ్రామం వద్ద కాల్చివేశారు. ఈ ప్రాంతంలో అటవీశాఖ వాళ్ల దోపిడీదౌర్జన్యాలు పెచ్చరిల్లిపోయాయి. దీనికి ముందు వాళ్లను తమ కార్యకలాపాలన్నిటినీ ఆపుకోవాల్సిందిగా ప్రజలు హెచ్చరించారు. కొందరు ప్రజా వ్యతిరేక అధికార్లను తన్నారు. అయినా అటవీశాఖ అధికార్లు అనేక కుయుక్తులతో తమ కార్యకలాపాలను కొనసాగించాలని చూస్తున్నారు. గ్రామంలో గుడి కట్టడానికని 20 వేల రూపాయల డబ్బు ఇచ్చారు. ఇది ప్రజలకు మరో రూపంలో లంచం ఇవ్వడమే. ప్రజల నుండి లంచాలు వసూలు చేయడం, కర్రలు తెస్తే కేసులు పెట్టడం, దౌర్జన్యాలకు పాల్పడడం వంటి కార్యకలాపాలు మరోసారి మొదలయ్యాయి. ఇవన్నీ ఒకప్పుడు ఈ ప్రాంతంలో విప్లవోద్యమం కొనసాగిన సమయంలో నిలిచిపోయాయి. వీళ్ల పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ ఇంత కాలం ఓపిక వహించారు. చాలా ఏళ్ల విరామం తర్వాత ఈ ప్రాంతానికి గెరిల్లా దళం తిరిగి రావడంతో ప్రజలు గెరిల్లాల మద్దతుతో అటవీశాఖ వాళ్ల వాహనాల్ని కాల్చివేసి బుద్ధి చెప్పారు. రైతులపై మోపిన కేసులన్నిటినీ ఎత్తేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.

### ప్రజా వ్యతిరేక సర్పంచ్ పోయం బాపుకు ప్రజల చేతిలో తన్నులు

సిరొంచ ఏరియా ఆసరెల్లి రేంజ్ సేతలపల్లి సర్పంచ్ పోయం బాపును ప్రజలు ఏప్రిల్ 2, 2003న ప్రజాకోర్టులో విచారించి దెబ్బలు కొట్టి గుణపాఠం నేర్పారు. వీడు ప్రభుత్వం నుండి అప్పులు, ఇండ్లు ఇప్పిస్తానని చెప్పి ఒక్కో వ్యక్తి నుండి 5 వేల రూపాయలు వసూలు చేశాడు. గ్రామ పంచాయితీకి ప్రభుత్వం నుండి మంజూరయ్యే డబ్బును వీడు విచ్చలవిడిగా తన స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నాడు. తనకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వాళ్లను కొట్టడం వీడికి అలవాటుగా ఉండేది. చాలా విరామం తర్వాత ఈ ప్రాంత ప్రజలు మన పార్టీ నాయకత్వంలో మరోసారి సంఘటితపడనారంభించడంతో వీడికి కాళ్ల కింది నేల కదిలినంత పనైంది. దాంతో వీడు గెరిల్లా దళాన్ని కలిసిన వాళ్ల పేర్లు పోలీసులకు చెబుతానని బెదిరించసాగాడు. స్థానిక పార్టీ వీడిని రెండు సార్లు హెచ్చరించి తన పద్ధతులు మార్చుకోమని చెప్పింది. అయినా వీడిలో ఎలాంటి మార్పు రాలేదు. అవినీతికర పనులనూ, బెదిరింపులనూ కొనసాగించాడు. దాంతో విసుగు చెందిన ప్రజలు పంచాయితీ నిర్వహించి వీడికి దెబ్బలతో బుద్ధి చెప్పారు. ఈ సందర్భంగా అక్కడ హాజరైన ప్రజలనుద్దేశించి పార్టీ బాధ్యులు ప్రసంగించారు. ప్రభుత్వ సంస్కరణల తతంగాన్ని వ్యతిరేకించాలనీ, వీటితో ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కావనీ, వీటి పేరుతో వస్తున్న డబ్బులతో బాగుపడుతున్నది అవినీతిపరులైన అధికార్లూ, నాయకులేననీ వివరించారు. సర్పంచ్ బాపు తన తప్పులను మన్నించమని ప్రజలను వేడుకొని మారేందుకు మరో అవకాశం ఇవ్వాల్సిందిగా కోరాడు.

### ట్రాక్టర్‌తో దున్నే రేటును తగ్గించుకున్న ప్రజలు

భామ్రాగడ్ తాలూకా తాడిగాం రేంజ్‌లో ప్రజలు తమ సంఘటిత శక్తితో ట్రాక్టర్‌తో దున్నే రేటును తగ్గించుకున్నారు. ట్రాక్టర్ల యజమానులు రైతుల నుండి దున్నేందుకు రేటు గంటకు 300 రూపాయల చొప్పున తీసుకునే వాళ్లు. ఇది చాలా ఎక్కువని తలచిన ప్రజలు దీన్ని తగ్గించుకోవడం కోసం ఏకమయ్యారు. స్థానిక పార్టీ చొరవతో ప్రజలు ఇందు కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ నాయకత్వంలో ప్రజలు భామ్రాగఢ్, తాడిగాం ప్రాంతాల ప్రజలు ట్రాక్టర్ల యజమానులను పిలిపించి చర్చలు జరిపారు. ఇందులో దాదాపు 50 మంది పాల్గొన్నారు. ప్రజల ఐక్యతకు తలొగ్గుతూ ట్రాక్టర్ల యజమానులు దున్నే రేటును 300 రూపాయల నుండి 250 రూపాయలకు తగ్గించడానికి ఒప్పుకున్నారు. సంఘటిత శక్తితో తమ సమస్యలేవైనా పరిష్కరించుకోగలమన్న విశ్వాసాన్ని ప్రజల్లో ఈ పోరాటం ఇనుమడింపజేసింది.

# పోలీసు రాజ్యంలో పోలీసులు నిర్వచించిందే నేరం !

*గడ్‌చిరోలి డివిజన్‌లో పోలీసు నిర్బంధం గూర్చి 'ప్రభాత్' పత్రికను క్రమం తప్పకుండా చదివే వారికి చాలా వరకు తెలిసే ఉంటుంది. అక్కడ పోలీసు రాజ్యమే సాగుతోంది. ఖాకీలదే కానూన్ నడుస్తోంది. దానికి అడ్డూ అదుపూ లేదు. అందులో భాగమే కోఠి ఘటన.*

*భ్రామాగఢ్ ఏరియాలో పేన్‌కోఠి ఓ మోస్తరు పెద్ద గ్రామం. ఇక్కడ **10**వ తరగతి వరకు పాఠశాల ఉంది. పోలీసు స్టేషన్ ఉంది. రెండూ పొరపాటునైనా పక్కపక్కనే ఉండకూడదు గానీ దండకారణ్యంలో మాత్రం కావాలనే అలా నిర్మిస్తున్నారు.*

***18** ఫిబ్రవరి **2002** నాడు పిజిఏ గెరిల్లాలు పోలీసు స్టేషన్‌పై కాల్పులు జరిపారు. అక్కడ జరుగుతున్న బూటకపు పంచాయితీ ఎన్నికలను బహిష్కరించడంలో భాగంగా జరిగాయి కాల్పులు. కాల్పుల్లో ఎవరూ గాయపడలేదు, ఏ నష్టమూ లేదు. కానీ తెల్లవారి మాత్రం పాఠశాల ఉపాధ్యాయుల్లో ఒకరైన సడ్మెక్ గురూజీని పోలీసులు అరెస్టు చేశారు.*

*ఎందుకు? అతడు చేసిన నేరమేంటి?*

*అతడి ఇంటి పక్కనుండే పిజిఏ సైనికులు వచ్చి ఫైరింగ్ చేశారనీ, వారితో సడ్మెక్ కుమ్మక్కయి కాల్పులు జరిపించాడనే ఆరోపణ మోపి పోలీసులు ఆయనను కటకటాల్లోకి తోశారు. రెండేళ్లు దాటినా అతడు విడుదలకు నోచుకోవడం లేదు.*

*పోలీసులు చెప్తున్నది అబద్ధమని ఆ గ్రామంలోని పసిపిల్లలు కూడా చెప్తారు. ఆ గురూజీ ఆ ఊళ్లో గత **20** ఏళ్లుగా పనిచేస్తున్నాడు. అతడికి పాఠశాల, పిల్లలే సర్వస్వం. అలాంటి గురూజీని అరెస్టు చేయడం వెనుకనున్న ఏకైక కారణం అతడి అన్న కొడుకు పీజీఏలో ఒక ప్లాటూన్ కమాండర్ కావడమే. ఇది పోలీసుల ప్రతీకార చర్య తప్ప మరేం గాదు. పోలీసుల దుశ్చర్యలు అంతటితో ఆగలేదు.*

*ఆ గురూజీ కుటుంబానికి ఎలాంటి ఆర్థిక సహాయం అందకపోవడంతో పూర్తిగా వీధుల పాలయ్యింది. కాలేజి చదువుతున్న గురూజీ కూతురు మధ్యలోనే చదువు ఆపాల్సి వచ్చింది. చదువుకున్న కొడుక్కి తుమ్మిరికోడిలో గురూజీ ఉద్యోగమే దొరికింది. కానీ అదీ 'మూన్నాళ్ల ముచ్చటే' అయింది. ఎందుకంటే ఒక రోజు ఆ కొడుకు కోఠి ఠాణాకు వెళ్లి తన తండ్రి అక్రమ అరెస్టు గూర్చి స్థానిక దరొగను ప్రశ్నించాడు. అదే నేరమైంది. దరొగ నీ అంతు చూస్తానన్నాడు. దీనితో అతడు గురూజీ ఉద్యోగానికి వెళ్లడమే మానుకున్నాడు. దీనికి గల కారణం కూడా చూద్దాం.*

*ఆ ప్రాంతంలో పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడైన చిన్న మెట్టామి స్మృతులు అప్పటికి ఇంకా జనం గుండెల్లో మెదలుతూనే ఉన్నాయి. గడ్చిరోలి పోలీసులు ఎంతకైనా తెగిస్తారు. ఎవరినైనా అరెస్టు చేస్తారు, ఎవరినైనా హత్య చేయిస్తారు. ఎవరికైనా నక్సలైటు పేరు తగిలించి డ్రెస్సు ఎక్కిస్తారన్న పోలీసుల స్వభావాన్ని తన **22** ఏళ్ల జీవితంలో చూస్తున్న ఆ కొడుకు నిత్యం ఒంటరిగా ఇంటి నుండి - హీందెవాడ - తుమ్మిరికోడి వరకు **18** కి.మీ. వెళ్లడానికి సాహసించలేదు. దారిలో కోఠి ఠాణాను దాటక తప్పదు. వాళ్లేం చేస్తారోనన్న భయంతో అతడు తన ఉద్యోగానికి స్వస్తి చెప్పాడు. ఇదీ కొడుకు స్థితి.*

*గడ్‌చిరోలిలో ఉన్న ఉపాధ్యాయులు మొదట్లో ఈ రెండు సమస్యలపై కొంత కదలినా పోలీసు ఉన్నతాధికారుల బెదిరింపులతో వెనక్కి తగ్గారు. కానీ ఉద్యోగులపై పోలీసుల నేరపూరితమైన దాడులు మాత్రం ఆగడం లేదు. **2002** మధ్యలో లైహిరి (ఇదీ భ్రామాగఢ్ ప్రాంతమే)లో ఒక గురూజీని అరెస్టు చేశారు. అతనిపై జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు మాలు కోపా జోగామి హత్య కేసు నమోదు చేశారు. **(**మాలు **10** ఫిబ్రవరి, **2002** నాడు పిజిఏ బలగాల చేతిలో ఖతమయ్యాడు**)**. ఈ తప్పుడు ఆరోపణపై అరెస్టయిన గురూజీ నేటికీ కటకటాల వెనకే ఉన్నాడు.*

*ఈ గురూజీలు విడుదలకు నోచుకోవడం లేదు. పోలీసులు వీరిపై పోటా మోపనున్నారన్న వార్తలు కూడా వెలువడుతుండడం ఆ ప్రాంతంలోని ఉద్యోగులను మరింత భయాలకు గురిచేస్తున్నది.*

*గడ్‌చిరోలి డివిజన్‌లోని ఉద్యోగులకు - గురూజీలు, అంగన్‌వాడి కార్యకర్తలు, మలేరియా నిర్మూలన కార్యకర్తలు, పంచాయితీ సచీవ్‌లు మొదలైన వారికి సైతం ఎలాంటి భద్రత లేదు. ఎప్పుడు ఎవరిపై పోలీసుల వేటు ఏ రూపంలో పడుతుందో వాళ్లకే తెలుస్తుంది. రోజురోజుకూ భద్రత, రక్షణ కరువవుతున్న ఉద్యోగవర్గం సమరశీల పోరాటాల ద్వారా సంఘటితమైతేనే తమ న్యాయమైన హక్కులను కాపాడుకోగలరని మనవి.* ✶

## పోలీసు ఇన్‌ఫార్మర్ బాబురావు తలాండేకు మరణశిక్ష

గడ్చిరోలి డివిజన్ పెరిమిలి ఏరియాలో జింజిగాం అనే ఊళ్లో బాబురావు తలాండే ఒక ధనిక రైతుగా ఉండేవాడు. వీడికి గ్రామ ప్రజలతో అస్సలే సరిపడేది కాదు. ఎవరైనా వీడి తప్పుడు పనులను వ్యతిరేకిస్తూ మాట్లాడితే వాళ్లను కొట్టడం చేస్తుండేవాడు. ఈ విధంగా వీడు దాదాపు ఐదారుగురు గ్రామస్తులను చిన్న చిన్న కారణాలతో కొట్టాడు. 2001లో స్థానిక గెరిల్లా దళం వీడిని ఇలాంటి పనులు మానుకోవాలని చెబుతూ హెచ్చరిక చేసింది. అయినప్పటికీ వీడిలో ఎలాంటి మార్పు రాలేదు. ఆ తర్వాత వీడు పోలీసు ఏజెంటుగా పని చేయసాగాడు. స్థానిక ప్రజా సంఘాల గురించీ, గెరిల్లా దళం కదలికల గురించీ వీడు పోలీసులకు సమాచారం చేరవేస్తుండే వాడు. ఎవరైనా వీడిని వ్యతిరేకిస్తే బెదిరించడం, భయపెట్టడం చేస్తుండేవాడు.

మార్చ్ 2003లో వీడిని ప్రజల, స్థానిక పార్టీ నిర్ణయంపై గెరిల్లా దళం వీడిని కొట్టి పోలీసు ఏజెంట్‌గిరీ మానుకొమ్మని హెచ్చరించింది. బాగు పడడానికి చివరి అవకాశం ఇచ్చింది. అయినా కూడా వీడు మొండికేశాడు. గ్రామానికి ఎప్పుడు దళం పోయినా వీడు పోలీసులకు సమాచారం తప్పక ఇస్తుండే వాడు. ఆ తర్వాత పోలీసులు వచ్చి గ్రామస్తులను బాగా వేధింపులకు గురి చేస్తుండే వాళ్లు. దళం మీ గ్రామానికి వచ్చిందని మాకు తెల్సుననీ, మీలో ఎవరెవరు దళాన్ని కలిసారో కూడా తెల్సుననీ అంటూ పోలీసులు ప్రజలను చాలాసార్లు కొట్టారు. దానితో ప్రజలు వీడిని ఇకపై క్షమించగూడదనీ, వీడు బతికుండడం విప్లవోద్యమ పురోగమనానికి తీవ్ర ఆటంకమనీ భావించారు. ప్రజల డిమాండ్‌పై స్థానిక పార్టీ వీడిని తప్పక అంతమొందించాలని నిశ్చయించింది. పీజీఏ సైనికులు డిసెంబర్ 1న వీడిని హతమార్చి పీడ విరగడ చేశారు. ✶

## గడ్చిరోలి డివిజన్లో పోలీసు ఉద్యోగి అరెస్టు – విడుదల

*అక్టోబర్ 2003లో గడ్చిరోలి డివిజన్‌లో పీజీఏ దళం మాలెవాడ పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సురేష్ క్గిరేను అరెస్టు చేసి ఐదు రోజుల పాటు నిర్బంధంలో ఉంచుకొని విడుదల చేసింది. సురేష్ తన భార్యతో కలిసి ఒక బస్సులో పోతున్నాడన్న సమాచారం ప్రజల ద్వారా పీజీఏ దళానికి చేరింది. వెంటనే గెరిల్లాలు బస్సాపి అతన్ని అరెస్టు చేశారు. అయితే సురేష్ విప్లవకారులకు వ్యతిరేకంగా ఎలాంటి నిర్బంధ చర్యలలో ప్రత్యక్షం పాల్గొన్నవాడు కానందువల్లా, అట్లాగే అతను నిరాయుధుడిగా ఉండడం వల్లా పీజీఏ తన నియమాలకు అనుగుణంగా అతనికి ఎలాంటి హానీ తలపెట్టగూడదని నిర్ణయించుకుంది. అయితే ఈ సందర్భాన్ని పీజీఏ సాధారణ పోలీసు ఉద్యోగులలో వారి పట్ల దోపిడీ ప్రభుత్వ నీతి ఎలాంటిదో అర్థమయ్యేలా చక్కగా ఉపయోగించుకుంది. సురేష్‌ను అదుపులోకి తీసుకుంటూ పీజీఏ ప్రభుత్వం ముందు ఈ ఏరియాలో పోలీసులు అరెస్టు చేసిన రైతులందరినీ వెంటనే విడుదల చేయాలని షరతు విధించింది. ఈ ఏరియాలోని చాలా మంది రైతులు నెలల తరబడి తప్పుడు కేసుల్లో జైళ్లలో ఉండిపోయారు. అయితే ప్రభుత్వం దృష్టిలో ఒక సాధారణ పోలీసు ఉద్యోగి ప్రాణానికి విలువేముంది? మొదట పోలీసు అధికార్లు తమ బలగాలను పంపించి సురేష్‌ను విడిపిస్తామని ప్రకటనలు చేసారు. అయితే ఈ ప్రయత్నాలు విఫలమైన తర్వాత వాళ్లు కుతర్కాలకు దిగి సురేష్‌తో నక్సలైట్లకు ముందు నుండే సంబంధాలున్నాయనీ, అతను నక్సలైట్లను కలవడానికే వెళ్లాడనీ ప్రకటనలు జారీ చేశారు. సురేష్‌ను విడిపించడంలో ఎలాంటి ఉత్సాహాన్నీ ప్రదర్శించకుండా అతని కిడ్నాప్ అంతా ఒక నాటకమని నిరూపించడానికి పోలీసు అధికార్లు నానా అగచాట్లు పడ్డారు. గెరిల్లాల కస్టడీలో ఉంటూ సురేష్ రేడియోలోనూ, పేపర్లలోనూ ఈ ప్రకటనలన్నీ విన్నాడు. క్రమంగా అతడు తాను ఇప్పటి దాకా ఏ ప్రభుత్వం కోసమైతే పని చేశాడో ఆ ప్రభుత్వం తన విడుదల కోసం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదన్న విషయాన్ని అర్థం చేసుకున్నాడు. పీజీఏ గెరిల్లాలు సురేష్‌కు విప్లవ రాజకీయాల గురించీ, తమ లక్ష్యం గురించీ అర్థం చేయించారు. ముందే నిర్ణయించుకున్న ప్రకారం అతన్ని విడుదల చేశారు.*

*తన విడుదల తర్వాత పత్రికల వాళ్లకు సురేష్ విడుదల చేసిన ప్రకటన గమనించదగింది. తనకు ప్రభుత్వంపై విశ్వాసం ఎగిరిపోయిందని ఆయన ప్రకటించాడు. నక్సలైట్లు పోరాడుతున్న లక్ష్యం సరైంది. నక్సలైట్ల ఆచరణ గురించి ఇప్పటి దాకా తనకూ, తన లాంటి పోలీసు ఉద్యోగులకూ అధికార్లు చెప్పిందంతా తప్పే. వాళ్లు చెబుతున్నట్టుగా నక్సలైట్లు దొంగలూ కాదు, గూండాలూ కాదు... క్రమశిక్షణతో పని చేస్తున్న నిజమైన ప్రజా సేవకులు అంటూ ఆయన తన ప్రకటనలో పేర్కొన్నాడు.*

*పరిమిత స్థాయిలోనే అయినప్పటికీ సాధారణ పోలీసు ఉద్యోగులలో వర్గ చైతన్యం కలిగించే దిశగా పీజీఏ ముందడుగు వేయగల్గింది. సురేష్ పీజీఏ కస్టడీలో ఉండగా పోలీసు అధికార్లు చేసిన ప్రకటనలతోనూ, విడుదల తర్వాత సురేష్ చేసిన ప్రకటనలతోనూ సాధారణ పోలీసులు వాస్తవాలను ఓ మేరకైనా తెల్సుకోగలిగారు. ఈ ఉదంతంలో ప్రభుత్వం అనుసరించిన మొండివైఖరి ద్వారా తాను సాధారణ పోలీసు ఉద్యోగుల ప్రయోజనాలకు వ్యతిరేకినని నిరూపించుకున్నట్లైంది. సురేష్ స్థానంలో ఎవరైనా పెద్ద అధికారి గానీ, నాయకుడు గానీ, డబ్బున్న వ్యాపారి గానీ ఉండి ఉంటే ప్రభుత్వం స్పందన ఇలా ఉండేది కాదన్నది అందరికీ తెల్సిన సత్యమే. ✶*

*(......... 30వ పేజీ తరువాయి)*

దూకడానికి వారిని ప్రోత్సాహపరచాలి. ఇది "కేడర్లను చక్కగా ఉపయోగించడం" కిందికి వస్తుంది. కేడర్లను ఉపయోగించే విషయంలో మన జాతీయ చరిత్ర అంతటిలోనూ, ఖచ్చితంగా పరస్పర విరుద్ధమైన రెండు పంథాలు ఉన్నాయి. ఒకటి "వారి వారి శక్తిసామర్థ్యాలను బట్టి వ్యక్తులను నియమించడం"; మరొకటి, "ఆశ్రిత పక్షపాతంతో వ్యక్తులను నియమించడం". మొదటిది నిజాయితీ అయిన మార్గం; రెండోది నిజాయితీ కొరవడిన మార్గం. కేడర్ల విధానంలో కమ్యూనిస్టు పార్టీకి తప్పనిసరిగా ఉండవలసిన ప్రమాణం – ఒక కేడరు పార్టీ పంథాను నిశ్చయంగా అమలుచేస్తాడా లేదా, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటాడా, ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయా, తన బాధ్యతలను స్వయంగా గుర్తించే సామర్థ్యం ఉందా, చురుకుగా ఉంటాడా, కష్టపడి పనిచేస్తూ నిస్వార్థంగా ఉంటాడా అన్నదే కావాలి. "శక్తిసామర్థ్యాలను బట్టి వ్యక్తులను నియమించడం" అంటే అర్థం ఇదే. "ఆశ్రిత పక్షపాతంతో వ్యక్తులను నియమించే" పద్ధతి ననుసరించేవాడు, తన చుట్టూ తన ఇష్టులను చేరదీసి ఒక చిన్న ముఠా కట్టి చివరకు పార్టీకి ద్రోహిగా మారి శిబిరానికే దూరమౌతాడు. ఇది మనకొక ముఖ్యమైన గుణపాఠం. దీనినుండి, ఇటువంటి చారిత్రక గుణపాఠాల నుండి హెచ్చరిక తీసుకొని, కేంద్ర కమిటీ, అన్ని స్థాయిలలో నాయకులూ కేడర్లను నియమించే విధానంలో నిజాయితీ అయిన సూటియైన మార్గాన్నే చేపట్టి, మోసపూరితమైన కుత్సితమైన పంథాను తిరస్కరించి ఆ విధంగా పార్టీ సమైక్యతను పటిష్టం చేయడం తమ గురుతర బాధ్యతగా చేసుకోవాలి.

కేడర్ల గురించి మంచిగా శ్రద్ధ తీసుకోవడం ఎలాగో మనం తెలుసుకోవాలి. దానికి అనేక మార్గాలున్నాయి.

*మొదటిది :* వారికి గైడెన్సు ఇవ్వాలి. దీని అర్థం, వారి పనిలో వారికి స్వేచ్ఛ ఇవ్వాలి. అందువల్ల వారికి బాధ్యతలను స్వీకరించే ధైర్యం వస్తుంది. అదే సమయంలో వారికి సమయానుకూలంగా ఆదేశాలను ఇస్తూ ఉండాలి. అందువల్ల, పార్టీ రాజకీయ పంథా ననుసరించి వారు తమ సామర్థ్యాన్నీ చొరవనూ సంపూర్ణంగా వినియోగించగలుగుతారు.

*రెండవది :* వారి స్థాయిని పెంచాలి. దీని అర్థం, వారికి అధ్యయనం చేసే అవకాశం ఇవ్వాలి. దీనివల్ల వారు తమ సిద్ధాంత అవగాహనను, పనిచేసే సామర్థ్యాన్ని పెంచుకోగలుగుతారు.

*మూడవది :* వారి పనిని సరిచూసి వారు తమ అనుభవాన్ని క్రోడీకరించుకొని, సాధించిన విజయాలను మరింత ముందుకు తీసుకుపోయి తప్పులను సరిదిద్దుకోవడానికి వారికి సహాయపడాలి. తనిఖీ చేయకుండా పనిని అప్పగించడమూ, తీవ్రమైన పొరపాట్లు జరిగినపుడు మాత్రమే వాటిని గమనించడమూ – ఇది కేడర్ల గురించి శ్రద్ధ వహించడానికి సరైన మార్గం కాదు.

*నాలుగవది :* సాధారణంగా, పొరపాట్లు చేసిన కేడర్లతో నచ్చజెప్పి, వారు తమ పొరపాట్లను సరిదిద్దుకోడానికి సాయంజేసే పద్ధతిని అవలంభించాలి. తీవ్రమైన తప్పులను చేస్తూ కూడా గైడెన్సు తీసుకోవడానికి తిరస్కరించే వారితో మాత్రమే పోరాడే పద్ధతిని పరిమితం చేయాలి. ఇక్కడ ఓపిక అత్యవసరం. వ్యక్తులను చులాగ్గా "అవకాశవాదులు"ని ముద్రవేయడం కానీ, తేలికగా వారిపై పోరాటం ప్రారంభించడం కానీ తప్పు.

*ఐదవది :* కష్టాలలో వారికి సహాయపడాలి. కేడర్లు జబ్బుపడి కష్టాల్లో ఉన్నప్పుడూ, ఆర్థిక ఇబ్బందుల్లోనో, గృహ కలతలలోనో, ఇతర కష్టాలలోనో చిక్కుకుంటే తప్పనిసరిగా సాధ్యమైనంత ఎక్కువ సహాయం అందించాలి.

ఈ విధంగా కేడర్ల గురించి బాగా శ్రద్ధ తీసుకోవాలి. ✶

# ఇంద్రావతి ఏరియాలో మానవత్వపు హద్దుల్ని చెరిపేసిన సీఆర్పీ బలగాల భీభత్సకాండ

## బుద్రీ, చైతూల హత్యలతో విప్లవోద్యమాన్ని అడ్డుకోలేరు !

ఎన్నికలను 'శాంతియుతంగా'', ''నిష్పక్షపాతంగా'' నిర్వహించడానికి మూల్యంగా రెండు నిండు ప్రాణాల్ని బలి ఇవ్వాల్సి ఉంటుందని బహుశా బైరంగఢ్ తాలూకాలోని ధర్మ, పల్లి గ్రామాల ప్రజలు ఎన్నడూ ఊహించి ఉండరు. ఆకలి నుండీ, భయం నుండీ ప్రజలకు విముక్తిని ప్రసాదిస్తానని చెప్పుకునే భాజపా ప్రభుత్వం పంపిన పోలీసులు తమ ఆడపడచులపై సామూహిక అత్యాచారాలకు పాల్పడతారని కూడా ఆ ప్రజలు అంచనా వేయలేకపోయారు. ఇది ఏదో కన్నీటి కథలోని అంశం కాదు... దంతెవాడ జిల్లాలోని ధర్మ, పల్లి అనే గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన వాస్తవ ఘటన. బైల్ గ్రామ పంచాయితీ పరిధిలోనివి ఈ రెండు గ్రామాలు. ఈ గ్రామాలను అనుకుంటూ ప్రవహించే ఇంద్రావతి నది ఇప్పుడు సీఆర్‌పీ బలగాల అమానవీయ కృత్యాలకు మౌన సాక్షి అయ్యింది. విప్లవోద్యమంలో ఈ ప్రాంతం మాడ్ డివిజన్‌లోని ఇంద్రావతి ఏరియా కిందకు వస్తుంది.

లోక్‌సభ ఎన్నికలకు ముందు దండకారణ్యంలోని పోరాట ప్రాంతాలన్నిటా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులు తమ పెట్రోలింగ్‌నూ, కూంబింగ్ ఆపరేషన్లనూ తీవ్రతరం చేశారు. బస్తర్‌లో సీఆర్‌పీఎఫ్, పంజాబ్ కమాండో, బీఎస్ఎఫ్ మొదలైన హంతక బలగాలను వేల సంఖ్యలో మొహరించారు. ఈ బలగాలు స్థానిక పోలీసు బలగాలతో కలిసి ఎన్నికలకు ముందుగానే ప్రజల్లో పెద్ద ఎత్తున భీభత్సకాండను ప్రారంభించారు. తద్వారా ఎన్నికల బహిష్కరణ పిలుపును విఫలం చేయాలన్నది వాళ్ల పథకం. ఇందులో భాగంగా బైరంగఢ్ పోలీసుస్టేషన్ నుండి పోలీసులూ, సీఆర్‌పీ జవాన్లూ మొత్తం 50 మంది ఏప్రిల్ 2న అర్ధరాత్రి ఇంద్రావతి నది దాటి ధర్మ గ్రామంపై మొదట దాడి చేశారు. ఒక సంఘ నాయకుని ఇంటిపై వీళ్లు దాడి చేశారు. అయితే అతనా సమయంలో ఇంట్లో లేకపోవడంతో బతికిపోయాడు. రాత్రి 3.30 గంటల సమయంలో ఆ గ్రామానికి వచ్చే దారులన్నిటిలో మాటు గాచారు. ఆ సమయంలో మర్కాపాల్ జాతర నుండి తిరిగి వస్తున్న ఇద్దరు యువతులనూ, ఆరుగురు యువకులనూ పోలీసులు పట్టుకున్నారు. యువకులందరినీ చేతులు కట్టేసి ఓ పక్కన కూర్చోబెట్టారు. యువతులను వీళ్ల నుండి వేరు చేసి వాళ్లపై సామూహిక అత్యాచారానికి పూనుకున్నారు. ఈలోగా ఒక యువతి ఎలాగోలా తప్పుకొని పారిపోయింది. కానీ రెండో యువతి బుద్రీ పోలీసుల పాశవిక దమనకాండకు బలైంది. మానవత్వమన్న మాటే మర్చిన పోలీసులు ఆమెపై అత్యాచారం జరిపి చంపేశారు. ఆ తర్వాత ఆమె శవంపై ఓ తూటా కాల్చి గాలిలోకి వందలాది తూటాలు కాల్చారు. ఎన్‌కౌంటర్ జరిగిందన్న కథను ప్రచారం చేయడం కోసమే ఇలా చేశారు. మరుసటి రోజు బైరంగఢ్‌లో పోలీసులు విలేఖర్లనూ, డాక్టర్లనూ పిలిచి ఎన్‌కౌంటర్ జరిగిందనీ, ఒక మహిళా నక్సలైటు చనిపోయిందనీ ప్రకటించారు. అయితే పోలీసులు బుద్రీ శవాన్ని తమతో పాటు బైరంగఢ్‌కు తీసుకెళ్లలేదన్నది గమనించాల్సిన విషయం. ఆమె శవాన్ని పల్లి గ్రామస్తులకే అప్పగించారు. పల్లి గ్రామంలో బుద్రీ తల్లిదండ్రులుంటారు. ధర్మ గ్రామం ఆమె అత్తవారిల్లు. పోలీసుల ఈ అమానుష చర్య గురించి తెలియగానే బుద్రీ తండ్రి విజ్జాల్ భోరున ఏడుస్తూ ధర్మకు వెళ్లి అక్కడ క్యాంపు చేసిన పోలీసులను బాగా తిట్టాడు. ఆ ముసలి తండ్రి అంతకన్నా ఏం చేయగలడు!

బుద్రీ అంత్యక్రియలు పూర్తవక ముందే పోలీసులు మరో హత్యాకాండకు పథక రచన పూర్తి చేశారు. పల్లి గ్రామానికి చెందిన చైతూ అనే రైతు ఏప్రిల్ 4న బుద్రీ అంత్యక్రియల తర్వాత ఇంద్రావతి నదిలో స్నానం ముగించుకొని వస్తుండగా పోలీసులు అతన్ని చుట్టుముట్టి పట్టుకున్నారు. నదిలో మందుపాతర పెట్టావంటూ ఆరోపిస్తూ పోలీసులు అతన్ని కొట్టడం మొదలు పెట్టారు. చాలా తీవ్రంగా కొట్టడంతో అతను స్పృహ కోల్పోయాడు. అయినా విడవకుండా నీటిలో ముంచుతూ లేపుతూ అతన్ని వర్ణింపశక్యం కానంత దారుణంగా కొట్టారు. ఆ తర్వాత అతని కాళ్లూ చేతులూ కట్టివేసి వేట జంతువును మోసుకెళ్లినట్టుగా ఒక కర్రకు వేలాడదీసి గ్రామంలోని స్కూలు వరకు మోసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత మళ్లీ కొట్టడం మొదలు పెట్టారు. తలపై రాళ్లతో మోదారు. దానితో అతను ప్రాణాలు కోల్పోయాడు. ఇద్దరు వ్యక్తుల నిండు ప్రాణాలు తీసినప్పటికీ వీరి నెత్తుటి దాహం తీరలేదు. పక్కనే ఉన్న జిల్లి గ్రామానికి చెందిన జెమిలి, పాలి అనే ఇద్దరు యువతులను పట్టుకొచ్చి స్కూలు భవనంలో వాళ్లపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. గ్రామ పటేల్ సహా కొందరు గ్రామస్తుల కళ్ల ముందే పోలీసులు ఈ ఘోరమైన దుశ్చర్యకు పూనుకున్నారు. ఆ అమాయక యువతుల ఆర్తనాదాలు వాళ్ల బండబారిన హృదయాలను కదిలించలేకపోయాయి. మరుసటి రోజు ఉదయం ఆ ఇద్దరు యువతులతో పాటు పల్లి గ్రామానికి చెందిన మంగ్లూ, బుధ్‌రాంలనూ, టాడుం గ్రామానికి చెందిన మరో వ్యక్తినీ అరెస్టు చేసి తమతో పాటు బైరంగఢ్‌కు తీసుకెళ్లారు. పోలీసుల దెబ్బలకు మంగ్లూ చేయి విరిగిపోయింది.

పోలీసుల ఈ అమానుష చర్యలకు వ్యతిరేకంగా చుట్టుపక్కల గ్రామాల్లోని 1,000 మంది ప్రజలు ఏప్రిల్ 6న బైరంగఢ్‌లో నిరసన ప్రదర్శనకై తరలి వెళ్లారు. కానీ తమ ఇన్‌ఫార్మర్ ద్వారా దీని గురించి ముందే తెల్సుకున్న పోలీసులు దారిలోనే ప్రజల్ని ఆపేసి ఎక్కుపెట్టిన తుపాకులతో బెదిరించి వెనక్కి పంపించారు. అక్కడే పోలీసులు చైతు శవాన్ని ప్రజల ముందు పడేసి, అరెస్టు చేసిన వాళ్లను వదిలేశారు. అయినప్పటికీ ప్రజలు పోలీసుల నిర్బంధకాండను నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేసి వెను దిరిగారు. ఆ తర్వాత అతిసారం వల్ల చైతు చనిపోయాడని పోలీసులు ప్రకటించారు. అయితే ఈలోగా స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు కొందరు విలేఖర్లు ఈ గ్రామాలను వచ్చి వాస్తవాలను వెలికి తీస్తూ ప్రముఖ దినపత్రికలలో వార్తల్ని ప్రచురించారు. దీనితో కలెక్టర్ విచారణకు ఆదేశాలు జారీ చేశాడు. రాష్ట్ర వ్యాప్తంగా సీఆర్‌పీఎఫ్ అరాచక చర్యలు పెద్దగా చర్చనీయాంశం కావడంతో ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌కు కూడా విచారణకు ఆదేశిస్తున్నట్టు ప్రకటన చేయక తప్పింది కాదు. మే 17 నుండి 25 దాకా దంతెవాడ కోర్టులో చైతు మరణంపై న్యాయ విచారణ జరిగింది. దీనికన్నా ముందే పోలీసులు చైతు భార్యనూ, సోదరుడినీ పట్టుకెళ్లి మూడు రోజుల పాటు స్టేషన్లో ఉంచుకొని తీవ్రంగా భయపెట్టారు. లంచం ఇచ్చే ప్రయత్నం కూడా చేశారు. దానితో వీళ్లు విచారణ సందర్భంగా పోలీసులు చెప్పినట్టుగానే చైతు మరణం అతిసారం వల్లనే సంభవించిందని వాంగ్మూలం ఇచ్చారు. ఈ విషయం ప్రజలకు తేటతెల్లమవడంతో దీనిపై సీబీఐతో మళ్లీ న్యాయవిచారణ జరిపించాలనే డిమాండ్ లేవనెత్తారు. ప్రజలు ఇంకా చట్టబద్ధంగా పోరాడుతూనే ఉన్నారు. పోలీసులు ప్రజలను ఎలాగైనా

*(తరువాయి 28వ పేజీలో........)*

గోండీ రిపోర్టులు

# జన్ జాగరణ్ మేళావా ముఖియలోర్కు సజా

గడ్చిరోలి జిల్లా భామ్రాగడ్ తహసీల్ తె నీరె ఏప్రిల్-మే మహీన లోప్పొ ఉచువుర్ నేతలోర్ మేళావా లోప్పొ శామిల్ ఆసి జనత తుకు విరుద్ధ్ నిత్తోర్. ఆకిన రేట్ సాటి మీటింగ్ ఇంజి జనత తున్ నాడెకీసి సర్కారీ యోజనాంగ్ పాయిజె ఇంజి, తడాయి-బొడ్డి గావాలింజి, సువ-ఘర్కుల్ గావాలింజి, మేడ్‌పల్లి పులియ గావాలింజి వడుక్తోర్. ఇద్రం తోర్ ముఖియలోరికిన జనత, పీజీఏ తోర్ మిలెమాసి సజా హీతోర్.

సెప్టెంబర్ 2003తె ఇర్పనార్ తె చైతు వడ్డె, కలంసాయి, బాబురావు; కుచ్చేర్ తె గంగారాం కోతారెను; కుక్కమెట్ట సర్పంచ్‌ను; పిట్టెకస్స సోమను ఓసో ఉచువుర్ కినా పొర్రో కార్యవాహి కీత్తోర్. వీరు సబ్బెటోర్ సంగటన్ తుకు విరోధ మంజి పోలీస్ తుకు మదద్ హీందూర్. అదిన్కే వీర లోప్పొ ఉచువుర్ కిన్ పిటాయి కీత్తోర, ఓసో ఉచువురికిన్ చేతావని హీత్తోర. అద్రమే దళంతె భర్తీ ఆసి మంజి పెరికె లోన్ వితిసి పోలీస్‌తుకు మదద్ హీవల్ పరెనార్ తోర్ దౌలత్ ఓసో మహ్కాపాడ్ తోర్ కోమటిను వెనె జనత అల్‌స్తోర్.

## ఈదూర్ నాటెనోర్ బద్మాష్ మాలు డోల్తోర్

గడ్చిరోలి డివిజన్ త భామ్రాగఢ్ ఇలాకా తా ఈదూర్ నాటెనోర్ మాలు పోలీస్ ముఖ్‌బిర్ ఆసి నీరె (2003) తె పీజీఏ కైదె డోల్తోర్. దీన్కు మున్నె ఇదే నాటెనోర్ ఆలం పాండు కమాండో తగ భర్తీ ఆసి దరోగ పద్ తె మత్తోర్. వోర్ నాలువుర్ లోకుర్‌కు నకిలీ ముఠ్‌భేడ్‌తె హూక్తోర్. బచోనో మాన్వన్ గుమ్స్తోర్. ఆణి దళంతోరిన వెనె ముఠ్‌భేడ్ కీసి హూక్తోర్. పయ్యు 1997తె వోను ఛాపామార్‌లోర్ ఆంబుష్‌తె హూక్తోర్. దాన పెరికె ఇదు నాటె సంగటన్ తా కామకాజ్ తాక్సోరె మందు. మతి ఇదు నడుమ మాలు తిమ్మా ఇందనోర్ పోలీస్ తోర పైసన లాలచ్‌తె ముఖ్‌బిర్ బనెమాతోర్. నీరె ఉంది దియ్యా ఐవుర్ ఛాపామార్ దళం సదస్యోర్ ఇదు నాటె హత్తస్కె వీరు పోలీస్ తుకు కబురు హీతోర్. 50-60 పోలీస్‌తోర్ వాసి దళం పొర్రొ పక్క ఫైరింగ్ కీత్తోర్. పోలీస్‌తోర సంగె లడెమాసోరె ఛాపామార్‌లోర్ రిట్రీట్ ఆతోర్. బోన్కే నుక్సాన్ ఆయో మతి ఛాపామార్‌లోరా మూండు కిట్కు, ఉంది 12 బోర్ తుపాయి హత్తాంగ్. దానా పయ్యు దళంతోర ఓసా జనత జాంచ్ కీత్తస్కె పోలీస్ తుకు కబురు హీత్తోర్ మాలు ఆందుర్ ఇంజి సమఝెమాత్త. 23 ఆగస్ట్ 2003 త దియ్యు పీజీఏ సైనిక్‌లోర్ వోన్కు అరెస్ట్ కీసి హూక్సీత్తోర్.

## మేళావా త పెరికె చుగిలితోర పొర్రొ ఆణి జన విరోధీ నేతలోరా పొర్రొ జనతన ప్రతిరోధ్ అభియాన్

గడ్చిరోలి ఎస్పీ రాజవర్ధన్ నక్సల్‌వాదీర్కు గాంవ్‌బందీ కీయన ఇంజి పక్కా ప్రచార్ కీసోరె జన్ జాగరణ్ మేళావా త నాటక్ లగాతార్ కీసోరె మంతోర్. వీరు నార్-నార్ మీటింగ్ కీసి పైస న లాలచ్ తోహ్పా లేవెకి రెయిపి కీసి పార్టీ తుకు ఖిలాఫ్ ఉచువుర్ కిన్ తైయార్ కీసోరె మంతోర్. ఇదు అభియాన్ త పెరికె పార్టీత నేతృత్వతె జనత వీర విరోధ్‌తె ఉంది ప్రతిరోధ్ అభియాన్ తాకి కీత్త. జనతకు విరోధ్ ఆసి నిత్తోరికిన రంగ్-రంగ్‌న సజా కీత్త.

కుచ్చేర్ తోర్ గంగారాం కొతారే – వీన దాదల్ దేవరావ్ మున్నె మావ పార్టీతె దల కమాండర్ మందూర్. తన కమ్‌జోరీ తల వోర్ దళంతల్ హంజి సరెండర్ ఆతోర్. అస్కె గంగారాం వోను పోలీస్ తగ సరెండర్ కీత్తోర్. పెరికె సందేహాస్పద్ పరిస్థితితె వోర్ ఫాంసీ ఆసి డోల్తోర్. అస్కెటాల్ గంగారాం పోలీస్‌తోర సంగె గోతి ఆసి మందూర్. పోలీస్ తగ పైస ఏత్సోరె చుగ్లి కీందూర్. జన్ జాగరణ్ మేళావా లొప్పొ శామిల్ ఆసి పోలీస్ అధికారిలోర సంగె క్రాంతి తుకు ఖిలాఫ్ భాషణ్ హీందూర్. అదిన్కు వీను సెప్టెంబర్ 2003తె పీజీఏత నేతృత్వతె జనత పిటాయి కీత్తోర్.

ఇర్పనార్ తోరు మువుర్ వెనె పోలీస్‌తోర సంగె మిలెమాసి మేళావాతె భాషణ్ హీతోర్. పార్టీ తుకు, క్రాంతి తుకు విరుద్ధ్ వడ్కతోర్. వీరికిన్ చేతావని హీసి విడ్స్తోర్. రానిన్‌పోదూర్ తోర్ వెనె వరోర్ అద్రమే నాటె పోలీస్ వాతస్కె మదద కీయన, హుర్రి తోహనా కీసోరె మత్తోర్. వోన్‌కు వెనె పిటాయి కీసి విడ్స్తోర్. ఇద్రం పోలీస్‌తోర మేళావా తుకు విరుద్ధ్ పార్టీ వెనె విరోధీ అభియాన్ తాకి కీత్తాంకు జనత లొప్పొ ఉత్సాహ్ బేర్స్త. ★

*(......... 27వ పేజీ తరువాయి)*

అణచివేయాలని ప్రయత్నిస్తున్నారు. వర్తమాన న్యాయవ్యవస్థ స్వభావాన్ని దృష్టిలో ఉంచుకున్నట్టయితే ఇందులో తుది విజయం పోలీసులదే అవుతుందని అంచనా వేయడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రజలు ఈ 'పోరాటం'లో ఓడిపోవడం ఖాయం.

అసలు ప్రజలపై ఈ దౌర్జన్యాలూ, అత్యాచారాలూ ఎందుకు జరుపుతున్నారు? ఎందుకంటే నేడు దండకారణ్యంలో ప్రజలు మా పార్టీ నాయకత్వంలో ప్రస్తుత దోపిడీ వ్యవస్థను ధ్వంసం చేసి దోపిడీపీడనలకు తావు లేనట్టి నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పడం కోసం పోరాడుతున్నారు. ప్రస్తుత కాలంచెల్లిన వ్యవస్థ కింద జరిగే ఎన్నికలను ప్రజలు బూటకమైనవిగా భావిస్తూ వాటిని బహిష్కరిస్తున్నారు. సామ్రాజ్యవాదాన్నీ, భూస్వామ్య విధానాన్నీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్నీ కూకటివేళ్లతో పెకిలించి వేసి కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై పీడిత వర్గాలన్నింటి సమైక్య పాలనను నెలకొల్పే నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం దండకారణ్య ప్రజలు నడుం బిగించారు. దోపిడీ పాలకవర్గాలు ఈ ఉద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో మొత్తం దండకారణ్యాన్ని పోలీసు, అర్ధ సైనిక బలగాల శిబిరంగా మారుస్తున్నాయి. ఈ కిరాయి సైనికులు సాధారణంగా పీజీఏ యోధులతో ప్రత్యక్షంగా తలపడడానికి సాహసించకుండా సామాన్య ప్రజలపై కసి తీర్చుకుంటున్నారు. సామాన్య ప్రజలను చంపి ఎన్‌కౌంటర్లుగా ప్రకటిస్తున్నారు. పెద్ద ఎత్తున అరెస్టులూ, చిత్రహింసలూ కొనసాగిస్తున్నారు. ఈ విధంగా ప్రజలలో భయోత్పాతాన్ని సృష్టిస్తూ వాళ్లను విప్లవోద్యమం నుండి వేరు చేయాలనే దారుణమైన కుట్రలో భాగంగానే వీళ్లు ఇలాంటి అమానుష చర్యలకు పూనుకుంటున్నారు. ప్రజల న్యాయమైన పోరాటాలను అణచివేయడంలో పోలీసు, పారా మిలిటరీ కిరాయి బలగాలు మహిళలపై అత్యాచారాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నాయి. కానీ అణచివేత ప్రతిఘటనకే దారి తీస్తుందన్నది చరిత్ర తేల్చిన సత్యం. హంతకులూ, రేపిస్టులూ ప్రజాకోర్టులలో శిక్షలు తప్పించుకోలేరు. అమరులైన ఈ ఇద్దరు కామ్రేడ్ల కుటుంబసభ్యులకు మేం ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాం. ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారా ఈ కామ్రేడ్ల హత్యలకు బదులు తీర్చుకోవాలని మేం ప్రజలకు పిలుపునిస్తున్నాం. ★

# గ్రామీణప్రాంతాల పరిశీలన వ్యాసానికి ఉపోద్ఘాతం

**మార్చి 17, 1941**

ప్రస్తుతం పార్టీ అనుసరిస్తున్న గ్రామీణ పంథా పది సంవత్సరాల అంతర్యుద్ధ కాలంనాటి వ్యవసాయక విప్లవ పంథా కాదు; అది జపాన్ వ్యతిరేక జాతీయ ఐక్యసంఘటనకు అవసరమైన గ్రామీణ పంథా. 1940 జులై 7, డిసెంబర్ 25 తేదీలలో కేంద్రకమిటీ ఇచ్చిన ఆదేశాలనూ రాబోయే 7వ జాతీయ కాంగ్రెస్ ఇచ్చే ఆదేశాలనూ యావత్తు పార్టీ అమలుజరపాలి. సమస్యల అధ్యయనానికి ఒక పద్ధతి కనుగొనడంలో కామ్రేడ్స్‌కు సహాయకరంగా ఉండేందుకు ఈ వ్యాసం ప్రచురిస్తున్నాం. మన కామ్రేడ్స్‌లో చాలా మంది పనివిధానం ఇప్పటికీ మొరటుగానూ, అజాగ్రత్తగానూ ఉంటూంది; వారు విషయాన్ని క్షుణ్ణంగా అర్థంచేసుకోడానికి ప్రయత్నించరు; క్రిందిస్థాయిలలోని పరిస్థితుల గురించి వాళ్లకి ఏమీ తెలిసివుండక పోవచ్చు కూడా; అయినా పనులు నిర్వహించడానికీ నిర్దేశించడానికీ వారే బాధ్యులు. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. చైనా సమాజంలోని వర్గాల వాస్తవ పరిస్థితుల గురించి నిర్దిష్టమైన, నిజమైన పరిజ్ఞానం లేకుండా సరియైన నాయకత్వం రూపొందజాలదు.



వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి, సామాజిక పరిశోధనలు జరపడం, ప్రతి సామాజిక వర్గం యొక్క స్థితిగతులను నిజ జీవితంలో పరిశోధించడం ఒక్కటే మార్గం. నిర్వహణ బాధ్యతల్లో ఉన్నవారు వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలంటే, ఒక పథకం ప్రకారం కొన్ని పట్టణాలపైనా, గ్రామాలపైనా కేంద్రీకరించి మౌలికమైన మార్క్సిస్టు దృక్పథంతో – అంటే వర్గ విశ్లేషణా పద్ధతిలో – అనేక పర్యాయాలు క్షుణ్ణంగా పరిశోధనలు జరపడం ప్రధానమైన పద్ధతి. ఈ విధంగా మాత్రమే మనం చైనా సామాజిక సమస్యల గురించి కనీసం ప్రాథమిక పరిజ్ఞానమైనా పొందగలుగుతాం.

ఈ పని చెయ్యాలంటే ముందుగా మీ దృష్టిని ఆకాశమార్గాల నుండి నేల మీదకు మళ్లించాలి. ఈ విధంగా చూడాలనే ఉత్సాహం, నిశ్చయం లేనివారు వాళ్ల జీవితంలో ఎన్నడూ చైనా వాస్తవ పరిస్థితుల్ని నిజంగా అర్థంచేసుకోలేరు.

రెండవది, వాస్తవ సేకరణ సమావేశాలు జరపండి. కేవలం పోసుకోలు కబుర్లు వినడం ద్వారానూ, పైపై పరిశీలనల ద్వారానూ, పరిపూర్ణమైన జ్ఞానాన్ని సంపాదించలేం. వాస్తవాల సేకరణ సమావేశాల ద్వారా నేను సేకరించిన వివరాలలో హూనాన్, చింకాంగ్‌షాన్ ప్రాంతాలకు సంబంధించినవి పోయాయి. ఇప్పుడు ప్రచురిస్తున్న వివరాలన్నీ ప్రధానంగా "సింగ్‌కువో", "చాంగ్‌కాంగ్ పట్టణం", "సాయిసీ పట్టణ" ప్రాంతాలకు సంబంధించినవి. వాస్తవ సేకరణ సమావేశాలు జరపడం చాలా సులువైన, ఆచరణ సాధ్యమైన, విశ్వసనీయమైన పద్ధతి. దీని ద్వారానే నేను చాలా లాభం పొందాను. ఏ విశ్వవిద్యాలయానికన్నా ఇది మంచి పాఠశాల. అలాంటి సమావేశాలకు హాజరయ్యేవారు నిజంగా అనుభవం గడించిన మధ్య, కింది స్థాయి కేడర్లు, లేదా సాధారణ ప్రజలై ఉండాలి. హూనాన్ రాష్ట్రంలోని ఐదు కౌంటీలలోనూ నికాంగ్‌షాన్ రాష్ట్రంలోని రెండు కౌంటీలలోనూ నేను పరిశోధనలు జరిపినపుడు మధ్యస్థాయికి చెందిన బాధ్యులైన కేడర్లను కలిశాను. సుసీవూ ప్రాంతంలో పరిశోధన చేసినపుడు మధ్య, కింది స్థాయి కేడర్లను, ఒక బీద ప్రాథమిక పట్టభద్రుడిని, దివాళా తీసిన వాణిజ్య మండలి మాజీ అధ్యక్షుణ్ణి, కౌంటీ రెవిన్యూ శాఖలో ఉంటూ ఉద్యోగం పోగొట్టుకున్న ఒక చిన్నస్థాయి ఉద్యోగిని కలిశాను. వీరందరూ ఇంతకు ముందు నేను విననైనా వినని ఎంతో సమాచారాన్ని నాకు అందించారు. చైనా జైళ్లలోని నికృష్ణ పరిస్థితిని గురించి సంపూర్ణంగా నాకు మొట్టమొదటిసారి తెలియజేసిన వ్యక్తి, హునాన్ రాష్ట్రంలోని హెంగ్‌షాన్ ప్రాంతంలో పరిశోధనల సందర్భంగా నేను కలిసిన ఒక చిన్నస్థాయి జైలు ఉద్యోగి. సింగ్‌కువో కౌంటీ, చాంగ్‌కాంగ్, సాయిసీ పట్టణ ప్రాంతాలలో నా పరిశోధనల్లో నేను పట్టణ స్థాయిలో పనిచేస్తున్న కామ్రేడ్స్‌ను, సాధారణ రైతుల్ని కలిశాను. ఈ కేడర్లు, రైతులు, బీద పట్టభద్రుడు, జైలరు, వ్యాపారి, రెవిన్యూ గుమాస్తా – వీళ్ళందరూ నాకు గౌరవనీయులైన ఉపాధ్యాయులు. వాళ్ల విద్యార్థిగా నేను మర్యాద, శ్రద్ధ, సోదరభావమూ గల దృక్పథం కలిగి వుండాలి. అలా కాకపోతే వాళ్లు నాపట్ల శ్రద్ధ చూపి వుండేవారే కాదు. వాళ్లకు విషయాలు తెలసివుండినా నాతో మాట్లాడేవారే కాదు. ఒకవేళ మాట్లాడినా, వాళ్లకు తెలిసిందంతా చెప్పేవారు కాదు. వాస్తవ సేకరణ సమావేశం చాలా ఎక్కువ మందితో జరపాల్సిన అవసరం లేదు. ముగ్గురు నుంచి ఎనిమిది మంది ఉంటే చాలు. చాలినంత సమయం ఇవ్వాలి. పరిశోధన యొక్క రూపురేఖలు

*మావో సంకలిత రచనలు రెండు, మూడు భాగాల్లోంచి ఈ రెండు వ్యాసాలను ఈ సంచికలో ప్రచురిస్తున్నాం. నేడు మన దండకారణ్య ఉద్యమం విముక్తి ప్రాంత లక్ష్యంతో ప్రజల రాజ్యాధికారాన్ని స్థాపిస్తూ ముందడుగు వేస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో మన పార్టీ కార్యకర్తలు చాలా మంది గ్రామాల్లో వర్గ విశ్లేషణా కృషిని చేపట్టారు. ఇందులోని "గ్రామీణ ప్రాంతాల పరిశీలన వ్యాసానికి ఉపోద్ఘాతం" అనే వ్యాసం ఈ కృషిలో ఉపయోగకరంగా ఉండగలదని భావిస్తున్నాం. మే* ***2004****లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సమావేశం త్వరలో అన్ని ప్రాంతాల్లోనూ మన సంస్థను సంఘటితపర్చే క్యాంపెయిన్‌ను చేపట్టాలని నిర్ణయించింది. ఈ కృషిలో ఇక్కడ ప్రచురిస్తున్న "కేడర్ల విధానం" తోడ్పడగలదని ఆశిస్తున్నాం.*

*– సంపాదకవర్గం*

(ఏమేమి తెలుసుకోవాలి వగైరా) తప్పనిసరిగా తయారుగా ఉంచుకోవాలి. తప్పనిసరిగా స్వయంగా ప్రశ్నలు వెయ్యాలి. నోట్స్ రాసుకోవాలి. సమావేశంలో ఉన్నవాళ్లతో చర్చలు జరపాలి. కాబట్టి పరిశోధన చేయాలనే ఉత్సాహం, పట్టుదల, లోతుల్లోకి తరచి చూడాలనే దృఢనిశ్చయం, విజ్ఞానాన్ని పొందాలనే తహతహ లేకుండా, అన్నీ తెలుసనే కపటత్వాన్ని వదలిపెట్టి, విషయాన్ని తెలుసుకోవాలనే ఆసక్తిగల విద్యార్థిగా తయారు కాకుండా ఎవ్వరుగానీ పరిశోధనలు చేయటం, అదీ బాగా చేయటం అసాధ్యం. ప్రజలే నిజమైన వీరులనీ, మనమే తరచు చిన్నపిల్లల్లాగా అజ్ఞానంగా ఉంటామనే విషయాన్ని గ్రహించాలి. ఇది అర్థం చేసుకోకుండా కనీసం ప్రాథమిక పరిజ్ఞానాన్ని కూడా సంపాదించలేం.

కింది స్థాయిలలో వున్న పరిస్థితుల్ని తెలుసుకోడానికి అనుసరించాల్సిన పద్ధతిని సూచించే ముఖ్యోద్దేశ్యంతోనే ఈ వ్యాసాన్ని అచ్చువేస్తున్నామని మళ్లీ గుర్తు చేస్తున్నాను. అంతేకానీ, ఇందులో చెప్పిన విషయాన్నీ సారాంశాన్నీ కార్యకర్తలు బట్టీ వేయటానికి మాత్రం కాదు. సాధారణంగా చెప్పుకోవాలంటే, చైనాలో శైశవావస్థలో వున్న బూర్జువా వర్గం ఐరోపా, అమెరికా, జపానులలోని బూర్జువా వర్గంలాగ సామాజిక పరిస్థితుల గురించి సమగ్రమైన, లేదా కనీసం ప్రాథమికమైన సమాచారాన్ని కూడా సమకూర్చగలిగే సామర్థ్యం కలది కాదు. ముందెన్నటికీ కూడా అది ఆ పని చేయజాలదు. కాబట్టి దీన్ని మనమే సంపాదించుకోవాలి తప్ప వేరే మార్గం లేదు. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే, ఆచరణాత్మక కృషిలో నిమగ్నులై ఉన్నవారు మారుతున్న పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. ఈ విషయమై ఏ దేశంలోని కమ్యూనిస్టు పార్టీ అయినా ఇతరులపై ఆధారపడజాలదు. కాబట్టి ఆచరణలో నిమగ్నమైన ప్రతి ఒక్కరూ కింది స్థాయిలో పరిస్థితుల్ని తప్పనిసరిగా పరిశోధించాలి. సిద్ధాంతం తెలిసి వాస్తవ పరిస్థితుల గురించి నిర్దిష్టంగా తెలియనివారికి ఈ పరిశోధన ప్రత్యేకించి మరీ అవసరం, లేకుంటే వారు సిద్ధాంతాన్ని ఆచరణతో జోడించలేరు. ''పరిశోధన చేయకుండా మాట్లాడే హక్కు లేదు'', అని నేను నొక్కి వక్కాణిస్తే, అది ''సంకుచితమైన అనుభవవాదం'' అని ఎద్దేవా చేశారు. అయినా అలా అన్నందుకు ఇప్పటికీ నేను ఏ మాత్రం చింతించడం లేదు. పైగా, పరిశోధన చేయకుండా మాట్లాడే హక్కు ఉండటం సాధ్యం కాదని ఇంకా నొక్కి చెప్తున్నాను. ''అధికార పీఠం నుంచి దిగిపోయిన'' మరుక్షణమే పెద్ద ఆర్భాటంగా అభిప్రాయాలు ప్రకటిస్తూ, దాన్ని విమర్శిస్తూ, దీన్ని ఖండిస్తూ హడావుడి చేసేవారు చాలామంది ఉన్నారు. కాని నిజానికి వాళ్లు నూటికి నూరు మందీ ఓటమి పొందక తప్పదు. ఎందుకంటే, అభిప్రాయాలూ, విమర్శలూ క్షుణ్ణమైన పరిశోధన మీద ఆధారపడ్డవి కావు; అవి అజ్ఞానంతో కూడిన పిచ్చివాగుడు తప్ప మరేమీ కాదు. ఇలా అటూ ఇటూ పరుగులు తీస్తూ ప్రతిచోటా తలదూర్చే ఇటువంటి ''రాచరిక రాయబారుల'' మూలంగా మన పార్టీ లెక్కలేనన్ని సార్లు నష్టపడింది. ''విప్లవాచరణతో సంబంధం లేని సిద్ధాంతం నిరర్థకం'', అని స్టాలిన్ సరిగ్గా చెప్పారు. ''విప్లవ సిద్ధాంతపు వెలుగుబాట లేకపోతే ఆచరణ చీకట్లో తడుములాటే అవుతుంద''ని కూడా ఆయన సరిగ్గా వివరించారు. లక్ష్యాన్ని గురించిన అవగాహన, దూరదృష్టి లేకుండా చీకట్లో తడుముకుంటూ, ''ఆచరణలో తలమునకలై పోయే మనిషిని'' తప్ప మరెవ్వరినీ ''సంకుచితమైన అనుభవవాది'' అని ముద్ర వేయకూడదు.

చైనా పరిస్థితులు, ప్రపంచ పరిస్థితుల గురించి క్షుణ్ణంగా పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈనాటికీ నేను గట్టిగా భావిస్తున్నాను. అంటే, చైనాను గురించీ, ప్రపంచ సమస్యల గురించీ నాకున్న జ్ఞానం చాలా తక్కువ కాబట్టే తప్ప, నాకు అంతా తెలుసనీ, మిగతావారు అజ్ఞానులనే భావంతో మాత్రం ఇలా అనడం లేదు. పార్టీలోని మిగతా కామ్రేడ్స్ అందరితోపాటు నేను నిరంతరం ప్రజల నుండి నేర్చుకునే విద్యార్థిగా ఉండాలనే కోరుకుంటున్నాను. ★

# కేడర్ల విధానం

**అక్టోబర్ 1938**


చైనా కమ్యూనిస్టు పార్టీ కొన్ని కోట్ల జనాభా గల జాతిలో మహత్తరమైన విప్లవపోరాటాన్ని నడుపుతున్న పార్టీ. సామర్థ్యమూ రాజకీయ నిజాయితీ కలగలసిన నాయకత్వ కేడర్లు ఎంతో ఎక్కువ సంఖ్యలో వుంటే తప్ప అది ఈ చారిత్రక కర్తవ్యాన్ని పరిపూర్తి చేయజాలదు. గత డెబ్బెయ్యేళ్లుగా పార్టీ ఎంతో మంది సమర్థులైన నాయకులకు శిక్షణనిచ్చింది. కనుక మనకు సైనిక, రాజకీయ, సాంస్కృతిక, నిర్మాణ, ప్రజాకృషి రంగాలలో పునాది కేడర్లు వున్నారు. దీనికి పార్టీనీ, యావత్తు జాతినీ అభినందించాలి. కానీ, ఈ పునాది విస్తృతమైన మన పోరాట భారాన్నంతనూ మోయగలిగేటంత బలంగా లేదు. చాలా పెద్ద ఎత్తున సమర్థులైన వారికి శిక్షణ ఇవ్వడం ఇంకా చాలా అవసరం. చైనా ప్రజల మహత్తర పోరాటంలో ఎందరో కార్యకర్తలు ముందుకు వచ్చారు; ఇంకా చాలామంది వస్తున్నారు. వారిని సంఘటితపరచి, శిక్షణనిచ్చి, మంచి శ్రద్ధ తీసుకొని, వారిని సక్రమంగా వినియోగించుకోవలసిన బాధ్యత మనకుంది. ఒకసారి రాజకీయంగా నిర్ణయించబడ్డాక, ఇక కేడర్లే నిశ్చయాత్మకమైన అంశం. కనుక ఒక ప్రణాళిక ప్రకారం కొత్త కేడర్లను ఎక్కువగా తయారుచేయడం మన పోరాట కర్తవ్యం.

పార్టీ కేడర్ల లాగానే మన నాన్-పార్టీ కేడర్లను కూడా పట్టించుకోవాలి. పార్టీ బయట అనేకమంది సమర్థులైన వారున్నారు. వారిని మనం నిర్లక్ష్యం చేయకూడదు. ఒంటెత్తుతనాన్నీ, అహంభావాన్నీ వదలించుకోవడం, నాన్-పార్టీ కేడర్లతో కలిసి బాగా పనిచేయడం, నిజాయితీగా వారికి సహాయపడడం, వారిపట్ల ఆప్యాయత సోదరభావం కలిగివుండడం, జపాన్‌ను ప్రతిఘటించి జాతిని పునర్నిర్మించే మహత్తర ఆశయంలో వారి చొరవను వినియోగించడం... ఇవి ప్రతి కమ్యూనిస్టుకూ విద్యుక్త ధర్మాలు.

కేడర్లను గురించి ఏ విధంగా నిర్ణయించుకోవాలో మనం తెలుసుకోవాలి. కేడర్ల జీవితంలో ఏ కొద్ది కాలానికో లేక ఏ ఐక్య సంఘటనకో మన తీర్పులు పరిమితం కాకూడదు. కేడరు యొక్క జీవితాన్నీ కృషినీ అంతా మొత్తంగా పరిగణనలోకి తీసుకోవాలి. కేడర్లను గురించి నిర్ణయాలకు వచ్చే ప్రధాన సూత్రం ఇది.

కేడర్లను చక్కగా ఎలా ఉపయోగించుకోవాలో మనం తెలుసుకోవాలి. అంతిమ విశ్లేషణలో, నాయకత్వానికి రెండు ముఖ్యమైన బాధ్యతలు ఉన్నాయి. అభిప్రాయాలను రూపొందించడం; కేడర్లను చక్కగా ఉపయోగించడం. ప్రణాళికలు తయారుచేయడం, నిర్ణయాలు చేయడం, ఆజ్ఞలూ ఆదేశాలూ జారీచేయడం ఇవన్నీ ''అభిప్రాయాలను రూపొందించడం'' కిందికి వస్తాయి. ఈ అభిప్రాయాలను ఆచరణలో పెట్టడానికి మనం తప్పనిసరిగా కేడర్లను సంఘటితపరచి, కార్యరంగంలోకి

*(తరువాయి 26వ పేజీలో........)*



*ఝార్ఖండ్‌లో పీఎల్‌జీఏ ఎర్రయోధుల వీరోచిత చర్య*

# సరండా ఆంబుష్ - ఖంగుతిన్న బీజేపీ

ఫాసిస్టు అడ్వానీ 'రథాని'కి స్వాగతం పలకడానికి గాను ఝార్ఖండ్ ముఖ్యమంత్రి అన్నీ సిద్ధపరచుకున్నాడు. విస్తృత ఏర్పాట్లు చేశాడు. అయితే ఝార్ఖండ్‌లోకి రథ ప్రవేశానికి ఒక రోజు ముందు ఒక భారీ పోలీసు, సిఆర్‌పిఎఫ్ కాన్వాయ్‌పై బ్రహ్మాండమైన ఆంబుష్ జరిగింది. దీనితో ముఖ్యమంత్రి జీవం కోల్పోయిన పోలీసు బలగాల నైతిక శక్తిని పెంపొందించే విఫల ప్రయత్నంలో పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని ఆంబుష్ సైట్‌కు పరుగులు తీసాడు. ప్రసార సాధనాలు దీన్ని మావోయిస్టులు సాగించిన అత్యంత సఫలీకృత ఆంబుష్‌గా పేర్కొన్నాయి.

యంసిసిఐ (మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా)కు చెందిన పిఎల్‌జిఏ (ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం) చేసిన ఈ దాడిలో 27 మంది పోలీసులు చావగా, 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇలా తీవ్రంగా గాయపడినవారిలో ఈ ప్రాంతంలో తీవ్రవాద వ్యతిరేక చర్యలకు నాయకత్వం వహిస్తున్న క్రూర ఎస్‌పి ప్రవీణ్ కుమార్ కూడా ఉన్నాడు. 120 మంది పోలీసులు, 90 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్ల భారీ కాన్వాయ్‌తో బయలుదేరిన ఎస్పీ తననెవరేమీ చేయలేరని విర్రవీగాడు. చచ్చినవాళ్లలో ఇద్దరు సీనియర్ అధికార్లు ఉన్నారు – ఒకడు నువామండీ పోలీసు స్టేషన్ అధికారి కాగా, మరొకడు 153వ సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ సబ్-ఇన్‌స్పెక్టర్.

ఏప్రిల్ 7 సాయంత్రం 5.30 సమయం. అవి ఒరిస్సా సరిహద్దున గల పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని దట్టమైన సరండా అడవులు. ఏప్రిల్ 6 నుండే ఈ అటవీ ప్రాంతంలో లాంగ్ రేంజి పెట్రోలింగ్‌లో పెద్ద సేనా దళానికి సారథ్యం వహిస్తున్నాడు ఎస్‌పి. వీరికి ఈ ప్రాంతంలోని మావోయిస్టుల కదలికల గురించి సమాచారం లభించడంలో ప్రజలను నరకయాతనలు పెడుతూ అడవులను గాలిస్తున్నారు. పన్నెండు వాహనాలలో ఉన్న ఆ కాన్వాయ్ విఫలయత్నం తరువాత తిరిగివస్తోంది. ఈ చోటు గువా-బలిబా రోడ్డుకు రెండున్నర కి.మీ.ల దూరంలోనే ఉంది.

గాయపడ్డ గువా పోలీసు స్టేషన్ అధికారి ఎకె రామ్ *ది టెలిగ్రాఫ్* (జమ్‌షెడ్‌పూర్ ఎడిషన్) రిపోర్టర్‌కు ఆ ఘటనెలా జరిగిందో వివరిస్తూ, "అపుడు మేము కాన్వాయ్ రూటు మారుద్దామని మాట్లాడుకుంటున్నాము. ఆ మారుద్దామనుకున్నది అక్కడి నుండి కొన్ని మీటర్ల దూరంలోనే ఉండింది. అప్పుడే ఆపరేషన్‌కు సారథ్యం వహిస్తున్న పశ్చిమ సింగ్‌భూమ్ ఎస్‌పి ప్రవీన్ కుమార్ జీప్పీ వెనుక చెవులు దద్దరిల్లే ప్రేలుడు సంభవించింది. కుమార్ రక్షణ కోసం వచ్చిన ఎస్కార్ట్ పార్టీ జీపు ఆ పేలుడుతో ధ్వంసమైంది. మరికొద్ది సెకండ్లలో మరో పేలుడు సంభవించింది. నువామండీ పోలీసు స్టేషన్ అధికారి కూర్చున్న వాహనం ధ్వంసమైంది. నేనిదంతా గమనించేలోగా మరో పేలుడు సంభవించి నా జీపు టాపారం (బానెట్) ఎగిరిపోయింది. ఈలోగా ప్రవీణ్ కుమార్ జీప్పీ మండుతుండటం, నలుదిక్కుల నుండీ బుల్లెట్ల వర్షం కురవడం చూశాను. ఏ సమయంలోనైనా చావు సంభవించే స్థితిలో ఉన్నాం మేం... మూడు గంటల పాటు పరస్పర కాల్పుల తరువాత తిరుగుబాటుదారులు రిట్రీటు కాసాగారు. అయితే చీకటిపడ్డంతో రక్షణ చర్యలకు ఆటంకమైంది. అప్పటికే ఆ స్థలానికి సిఆర్‌పిఎఫ్ బెటాలియన్‌తో పాటు ఖర్సవాన్, తూర్పు సింగ్‌భూమ్‌ల నుండి అదనపు బలగాలు రావడం, చనిపోయిన/గాయపడిన దేహాలను తొలగించడం ప్రారంభించారు."

ఆ ప్రాంతమంతా ఆ ఎస్‌పి అంటే హడల్. అలాంటిది జీపుకు నిప్పంటుకోవడంతో ఎస్‌పి ప్రాణభీతితో పిరికిపందలా పారిపోయాడు. పారిపోతుండగా చేతికి బుల్లెట్ తగిలింది, గ్రెనేడ్ పేలి ఇనుపముక్కలు కాలికి తగిలాయి. తన తోటి సైనికుల రక్షణను గాలికొదిలేసి తన ప్రాణాలను కాపాడుకోవడానికి తుప్పల చాటుగా పరుగులు తీశాడు. మూడు గంటల సేపు నడిచి ఒక గ్రామం చేరుకున్నాడు. చావు తరుముకొస్తున్నట్టు వాడు ఒక సైకిలు తీసుకొని ఖరంపాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ తొలి గూడ్సు ట్రైన్ రావడంతోనే దానిలోకి దూకి కిరిబూరు వెళ్లాడు. గ్రామస్థులు తననెక్కడ పట్టుకొని పిఎల్‌జిఏకి అప్పగిస్తారోనన్న భయంతో వాడు బిక్కుబిక్కుమనుకుంటూ క్షణాల్ని యుగాలుగా గడిపాడు. పాలకవర్గాల నమ్మిన బంటైన ఈ హంతకుడు వందలాది గ్రామస్థులను హింసించిన వాడు, అనేకమంది మావోయిస్టులనూ, వారి సానుభూతిపరుల్నీ హతమార్చిన వాడు. ఇలాంటి కరడుగట్టిన నరహంతకుడు దాదాపు 6 గంటల తన ఫరారీలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని పడరాని పాట్లు పడ్డాడు.

ఈ దాడిలో మావోయిస్టులు 40 ఆయుధాలు, పెద్దెత్తున ఆయుధ సామాగ్రి స్వాధీనం చేసుకోగలిగారు. అయితే సరండా అడవుల్లో యంసిసిఐ జరిపిన మొదటి యాక్షన్ కాదిది. 2002 డిసెంబర్ 19న ఒరిస్సా సుందరగడ్ జిల్లాకు సరిహద్దునున్న బిట్కిల్‌సోయా గ్రామంలో పీఎల్‌జీఏ గెరిల్లాలు జరిపిన ఇలాంటిదే మరో యాక్షన్‌లో 19 మంది పోలీసులను చంపేశారు.

880 చ.కి.మీ. ప్రాంతంలో విస్తరించియున్న దట్టమైన సరండా అడవులు గెరిల్లా యుద్ధానికి అనుకూల స్థితిని కల్గియున్నాయి. ఏప్రిల్ 9 *టెలిగ్రాఫ్* సంచికలో పేర్కొన్నట్లు, "సరండాలో లాంగ్ రేంజి పెట్రోలింగ్ కొనసాగిస్తున్నప్పుడు పోలీసులు రాత్రిపూట ఆగడానికి గెస్ట్ హౌస్‌లను ఉపయోగించుకునేవారు. ఈమధ్య కాలంలో యంసిసిఐ ఒక క్రమపద్ధతిలో సుమారుగా ఈ గెస్ట్‌హౌస్‌లన్నింటినీ ధ్వంసం చేసింది." ఇక్కడ భూస్వాముల, ఫారెస్టర్ల, వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా యంసిసిఐ ప్రజల్ని కదలించింది. ప్రజానీకం మద్దతును పొందింది. పశ్చిమ సింగ్‌భూమ్ ఎస్‌పిగా ప్రవీణ్ కుమార్ బాధ్యతలు చేపట్టినపుడు సరండాలో నక్సలైట్లు లేకుండా చేస్తానని శపథం బూనాడు, బీభత్సకాండను సాగించాడు. వీడికి ఇపుడు ధీరత్వం అంతా దిగిపోగా భయంతో ఆస్పత్రిలో మూలుగుతున్నాడు. వీడిని టాటా ప్రైవేటు విమానంలో కోల్‌కతాలోని ఓ పెద్ద ఆసుపత్రికి మార్చారంటే పాలకులకు వీడెంత నమ్మకమైన సేవకుడో బాగానే అర్థం చేసుకోవచ్చు.

ఈలోపు అడ్వానీ కూడా తన రథాన్ని ఝార్ఖండ్ నుండి ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా పోనివ్వాలని చూశాడు. ఆయన రథానికి కోడెర్మా సరిహద్దున స్వాగతం పలికారు. అనూహ్య భద్రతా ఏర్పాట్లు చేశారు. కోడెర్మాను ఒక చిన్నపాటి కంటోన్మెంట్‌లా మార్చేసారని సమాచారం. *ది టెలిగ్రాఫ్* ప్రకారం "మెఘాతరి నుండి కోడెర్మా లోయ నుండి ఝుమ్రితలైయా వరకు 30 కి.మీ. పొడవునా రాష్ట్ర సాయుధ పోలీసు, అర్ధ సైనిక బలగాలు ప్రతి కల్వర్ట్, బ్రిడ్జి, రోడ్డు పక్కల, దట్టమైన అడవిని కాపలా కాస్తుండగా చిన్నపాటి కంటోన్మెంట్‌గా మారింది."

*(తరువాయి 35వ పేజీలో........)*

# సామ్రాజ్యవాదులు - కాఫీ సంక్షోభం

యూరపు వలసవాదులు 19వ శతాబ్దం మధ్యభాగంలో ప్రవేశపెట్టినది కాఫీ పంట. ఇది ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లోని పంట. ఒకటిన్నర శతాబ్దాలుగా ఇది ఉత్పత్తి అవుతున్నది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోలియం తర్వాత విస్తృతంగా మార్కెట్ అవుతున్న సరుకు కాఫీనే. ప్రపంచ జనాభాలో 40% మంది కాఫీ తాగుతారు. నిజానికి కాఫీ గింజలను పండించేది మూడవ ప్రపంచ దేశాలే. అయితే దీన్ని ఎక్కువగా (80%) వాడేది మాత్రం సామ్రాజ్యవాద దేశాలే. ప్రపంచవ్యాప్తంగా కాఫీ వినియోగం చూస్తే పశ్చిమ యూరపు 40%, అమెరికా 24%, జపాన్ 10%.

కాఫీ పంట ఉత్పత్తి ప్రధానంగా శ్రమతో కూడుకున్నదే (లేబర్ ఇంటెన్సీవ్) అని చెప్పుకోవాలి. సుమారు 50 లక్షల క్షేత్రాల్లో రెండున్నర కోట్ల మంది రైతాంగం జీవనం దీనితోనే ముడిపడి ఉంది. ఈ పంట మొత్తంలో 70 శాతం ఉత్పత్తి చిన్న కమతాల (హోల్డర్స్)వారిదే. ప్రపంచ కాఫీ ఉత్పత్తి దేశాల్లో మేటిది బ్రెజిల్. ప్రపంచోత్పత్తిలో 30%తో మొదటి స్థానం సంపాదించుకుంది(బ్రెజిల్ ఆర్థిక సంక్షోభం మనందరికీ తెలిసిందే). వియత్నాం 2వ స్థానం, కొలంబియా 1.5%తో 3వ స్థానం, గౌతమాలా, ఇండోనేషియా, ఉగాండాల వెనుక 7 వ స్థానంలో ఇండియా ఉంది. స్థూలంగా చెప్పాలంటే ప్రపంచోత్పత్తిలో లాటిన్ అమెరికా వాటా 60%, ఆసియా వాటా 25% కాగా మిగిలిన భాగం ఆఫ్రికాదేనని చెప్పాలి. ప్రపంచంలో కాఫీని ఉత్పత్తి చేసే 17 దేశాలు ఆఫ్రికాలో ఉన్నాయి. వాటి ఆర్థికవ్యవస్థల్లో 10% ఆదాయం కాఫీ ఎగుమతుల నుండే లభిస్తోంది. అయితే ఈ దేశాలన్నీ ప్రపంచంలో అతి పేద దేశాలుగానే నిలుస్తున్నాయి.

సామ్రాజ్యవాద దేశాలన్నీ దీన్ని వినియోగించడమే కాని పండించకపోవడంతో అణచివేత సాగిస్తున్న ధనికుల దేశాలకూ అణచివేతకు గురౌతున్న పేద ప్రపంచానికీ మధ్య విభజనకు ప్రతిబింబంగా ఈ పంట నిలుస్తోంది.

## సామ్రాజ్యవాదుల చరిత్రతో ముడివడియున్న కాఫీ పంట

రెండవ ప్రపంచ యుద్ధం నాటికి సామ్రాజ్యవాద వలసలుగా వుండే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలన్నింటా (మూడవ ప్రపంచ దేశాలే) కాఫీ గింజల ఉత్పత్తి పెరుగుతూ, వినియోగదారుల మార్కెట్ కూడా పెరుగుతుండడంతో 1955 నాటికి కాఫీ ముడిసరకు ధర అత్యధిక స్థాయికి చేరింది.

గుత్తాధిపత్యం, యంఎన్‌సి/టిఎన్‌సిల దోపిడీతో మార్కెట్ సంక్షోభంలో కాఫీ ఉత్పత్తిదారులు చిక్కుకోలేదా? అంటే అదేమీ లేదు. ఏభైలలో ఆ పరిస్థితి రానే వచ్చింది. అయితే అప్పటికి సోవియట్ సోషలిస్టు కూటమి ఉండడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ పెట్టుబడి ఉనికిని కాపాడుకోవడంలో భాగంగా సామ్రాజ్యవాదులు ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదం చొరవ చేసి అంతర్జాతీయ కాఫీ సంస్థ (ఐసిఒ)ను ఏర్పరచింది.ఇది కోటాలను నిర్ణయించడం ద్వారా అధికోత్పత్తి సంక్షోభం, రేట్ పడిపోవడం లేకుండా సమతుల్యం గావించేది. అలా అమెరికా సామ్రాజ్యవాదం తన కేంపు నుండి చేజారిపోకుండా ఆ రాజ్యాలను కాపాడుకొంది. అదే భారతదేశ మయితే కాఫీ ఉత్పత్తిదారులను ఆదుకోవడానికి, మార్కెట్ విషవలయం నుండి తన రైతాంగాన్ని రక్షించుకోవడానికి 1967లో (నక్సల్బరీ కారణమేమో!)ఇండియన్ కాఫీ బోర్డు (ఐసిబి)ని కూడా ఏర్పర్చింది.

ఐసిఒ ఏర్పడినప్పటి నుండి కాఫీ ఉత్పత్తిదారులకు మార్కెటింగ్‌లో స్థిరత్వం ఉండి, గిట్టుబాటు ధరలు లభించసాగాయి. టిఎన్‌సి కొనుగోలుదారుల వద్ద కాఫీ గింజలు స్టాకు (ప్రోగుబడే స్థితి) పెద్దగా ఉండేది కాదు (మిగులు ఏమి ఉన్నా అది ఉత్పత్తిదారుల వద్ద లేదా ఐసిఒ వద్దే ఉండేది). భారతదేశంలో ఐసిబి అలాంటి పాత్రనే వహించేది. మార్కెట్‌ను నియంత్రిస్తూ (ఉత్పత్తినంతా తానే కొనుగోలు చేసే ప్రభుత్వ గుత్త విధానం ద్వారా), గిట్టుబాటు ధరలు చూసి అమ్ముతుండేది. అలా వచ్చిన లాభాలను (ఖర్చులు పోను) కాఫీ ఉత్పత్తిదారులకు పంట వాసి, రాసిలను బట్టి పంపకం చేస్తుండేది. ఐసిబి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిచింది. ఇదంతా కాఫీ ఉత్పత్తిదారులకు ఉచ్ఛదశగా చెప్పుకోవచ్చు.

## సామ్రాజ్యవాదుల భల్లూకపు పట్టులో కాఫీ రైతాంగం

సోషలిస్టు క్యాంపు విచ్ఛిన్నం కావడంతో తిరుగులేనివారిగా మిగిలిన సామ్రాజ్యవాదులు కుదించబడిన మార్కెట్‌తో తమ దోపిడి కోరలను చాచసాగారు. కాఫీ ఉత్పత్తిదారుల కష్టాలు ప్రారంభమయ్యాయి. తొంభైల తర్వాత పరిణామాలు దీన్నే స్పష్టం చేస్తున్నాయి. సామ్రాజ్యవాదులు ఉద్దేశ్యపూర్వకంగానే వలస దేశాల్లో ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల్లో ఆహార పంటలు గాకుండా తమ కవసరమైన కాఫీలాంటి పంటలను ప్రోత్సహించారు. దీనిలో వాళ్లకు రెండు ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి, ఇవి అధిక జనాభా గల దేశాలు. ఈ పంటలు శ్రమ శక్తితో కూడినవి. కనుక ఉత్పత్తి చౌకగా వస్తుంది. రెండవది - కాఫీ ఎగుమతులపై ఆధారపడిన ఈ దేశాల ఆర్థికవ్యవస్థ తమ గుప్పిట్లోనే ఉంటుంది. ఆహార పదార్థాల దిగుమతుల కోసం తమ దయాదాక్షిణ్యాలపైనే అవి ఆధారపడతాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో విజయం సాధించి, తిరిగి దేశ పునర్నిర్మాణంలో సామ్రాజ్యవాద పంచనే చేరి దిగజారిన వియత్నాం విషయంలో ఇది ఎంత నిజమో, దీనిపై సామ్రాజ్యవాదులు కావాలనే ఎలా కేంద్రీకరించారో వియత్నాం వాస్తవాలు చూస్తే కూడా విదితమవుతుంది.

అమెరికన్ సామ్రాజ్యవాదంతో ఏళ్ల తరబడి పోరాడిన వీరోచిత చరిత్ర వియత్నాంది. అమెరికన్ సామ్రాజ్యవాదుల బాంబులతో నీరు, భూమి విషపూరితమైన ధరిత్రి వియత్నాంది.

దశాబ్దకాల క్రితం వియత్నాంలో కాఫీ ప్లాంటేషన్ కొద్దిగానే జరిగేది. ఫ్రాన్స్, అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాలు, నెసిల్ వంటి టిఎన్‌సిలు, డబ్ల్యుబి వంటి సామ్రాజ్యవాద బ్యాంకులు ఈ దేశంలో కాఫీని ప్రోత్సహించాయి. ఫెడరల్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎఫ్‌డిబి), ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎడిబి) శీఘ్రగతిన కాఫీ ప్లాంటేషన్‌ను విస్తరించేందుకు తోడ్పడ్డాయి. 1998లో ఎఫ్‌డిబి 40 మిలియన్ డాలర్ల అప్పు ఇచ్చి (బాగా వర్షాలకు ఆధారమయిన అడవిని నిర్మూలింపజేసి) 40 వేల ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్ వేయించింది. రోబస్టా రకం (చౌకవి) కాఫీ గింజల అత్యధిక ఉత్పత్తి జరిగేది వియత్నాంలోనే.'95లో గల 1.5 లక్షల హెక్టార్ల ప్లాంటేషన్ 2001 నాటికి 5.5 లక్షల హెక్టార్లయింది. అలాగే ప్రపంచోత్పత్తిలో 12.3% ఉత్పత్తి వియత్నాంలోనే అవుతోంది. నిజానికి వియత్నాం ప్రజలు వాడేది మాత్రం తమ ఉత్పత్తిలో 4% కాగా మిగిలినదంతా సింగపూర్, జపాన్, పశ్చిమ దేశాలకు ఎగుమతే.

సామ్రాజ్యవాది అమెరికా మొదటగానూ, పిదప కెనడా జారుకొని ఐసిఒ కి ఎసరు పెట్టారు. ఆ క్రమంలో 1989లో ఐసిఒ రద్దయింది. అప్పటికే కాఫీ ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో మార్కెట్ సంక్షోభం ప్రారంభమైంది. ధరలు పడిపోసాగాయి. ఈ నేపథ్యంలో '93లో బ్రెజిల్

చొరవ చేసింది. చమురు దేశాలు ఒపెక్ ఏర్పరచుకున్నట్లు కాఫీ ఉత్పత్తిచేసే 14 దేశాలతో కాఫీ ఉత్పత్తి దేశాల సంస్థ (అసోసియేషన్ ఆఫ్ కాఫీ ప్రొడ్యూసింగ్ కంట్రీస్ – ఎసిపిసి) అనే పేరుతో ఒక సంస్థ ను ఏర్పరచింది. దీనిలో ఇండియా సభ్యురాలై కూడా ఊగిసలాట పాత్ర వహించింది. వియత్నాం అయితే అసలు చేరకుండా బయటనే ఉండిపోయింది.. మరోప్రక్క టిఎన్‌సిలు ప్రొక్టర్ & గాంబిల్, ఫిలప్ మార్రిస్, సారె లీ, నెసిల్ మరియు చిబోలు ఐదూ కలసి బీన్ రకం కాఫీ ఉత్పత్తిలో 50% కొంటూ ఎసిపిసి నిబంధనలను (స్ట్రిక్చర్స్) పాటించకుండా లాభాలార్జించసాగాయి. ఫలితంగా ఎసిపిసి ఉనికిని కాపాడుకోవడం అసాధ్యమైంది. ఫలితంగా అదీ నీరుకారిపోయింది.

పోనీ భారత్‌ను చూద్దామంటే టిఎన్‌సిలు ఎందుకు వదలుతారు. ఐసిబి రద్దయ్యే వరకు అమెరికా నిద్రపోలేదు. 1991లో డబ్ల్యుబి-ఐయంఎఫ్‌లు అప్పులు ఇచ్చేటప్పుడు జోడించిన షరతుల్లో ఐసిబి రద్దు ఒకటి. భారత పాలకవర్గాలు అందుకు తలొంచాయి. దీనితో భారత్ ప్రభుత్వం 1942నాటి కాఫీ చట్టాన్ని సవరించింది. 1992లో ఫ్రీ సేల్స్ కోటా అంటే ఉత్పత్తిదారులు స్వేచ్ఛగా అమ్ముకొనే వాటా 30%గా ఉందంటూ కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది. 1994లో మరోసారి సవరించి దాన్ని 50%గా పెంచింది. 1996లో మొత్తం కాఫీ బోర్డు(ఐసిబి)నే రద్దు చేసింది. అప్పటివరకు దేశంలో కాఫీ ఉత్పత్తిదారులకు తగిన ధరలు లభింపజేసే (మార్కెట్‌ను రెగ్యులేట్ చేసి) ఐసిబి రద్దయి కేవలం అది సలహా సంస్థగా మిగిలిపోయింది. దీంతో భారత పాలకవర్గాలకు ఆడింది ఆట పాడింది పాటయింది.

ఆసియాలో కాఫీని అధిక ఉత్పత్తిచేసే వియత్నాం, ఇండోనేషియా, ఇండియాలు 2002 జనవరిలో హనోయ్‌లో సమావేశమై (రొబస్టా కాఫీని ఉత్పత్తిచేసే మూడు లీడింగ్ దేశాలివి) తమ ఉత్పత్తి మార్కెటింగ్‌ను క్రమబద్ధీకరించి నిలదొక్కుకునే ప్రయత్నంలో ఒక సంస్థ నేర్పరుద్దామని ప్రయత్నించాయి. అయితే టిఎన్‌సిల కనుసన్నల్లోని ప్రభుత్వాలకు ఇదెలా సాధ్యం? అదీ ఆదిలోనే హంసపాదై రూపమే తీసుకోలేదు.

ఇలా ఐసిఒ, ఐసిబిల రద్దుతోనూ, ఎసిపిసి ఉనికిని నిలబెట్టుకోజాలని పరిస్థితులవల్ల, ఆసియాలో రోబస్టా కాఫీ ఉత్పత్తిదారుల విఫల ప్రయత్నంతోనూ అంతర్జాతీయ మార్కెట్‌లో కాఫీ అధికోత్పత్తి సంక్షోభం తీవ్రంకాసాగింది. గత నాలుగేళ్లుగా (1999 నుండి)అమ్మకం కాని కాఫీ ఉత్పత్తులు అలాగే ఉండిపోయి, గడచిన జూన్ నాటికి 40 మిలియన్ బ్యాగ్‌లకు చేరుకొంది. ఇది ఒక సంవత్సరం వాడకంలో 40%. వాస్తవంలో కాఫీ ఉత్పత్తి ప్రతి సంవత్సరం 3.6% పెరుగుతుండగా, దాని వినియోగం (ఖర్చు) మాత్రం కేవలం 1.8% పెరుగుతోంది. ఫలితంగా కాఫీ (గింజల/బ్యాగ్‌ల) కొనుగోలు రేటు 1997తో చూస్తే సగానికి సగం పడిపోయింది. దీన్ని గత 30 ఏళ్లలో కనిష్ఠ ధర (నిజ విలువలో చూస్తే 100 ఏళ్లలో కనిష్ఠ ధర)గా చెప్పుకోవాలి. నిజానికి ఈ ధర కాఫీ పంట ఉత్పత్తి ఖర్చు (cost of production)లో 60%మే ఉంది. అంటే కాఫీ ముడిసరకు మార్కెట్ వలయం ఎలాంటిదో ఊహించుకోవచ్చు. అదే సమయంలో విలోమ స్థితిలో టిఎన్‌సిల లాభాలు పెరుగుతున్నాయనేది మన కళ్ల ముందున్న భౌతిక వాస్తవం.

## ఉత్పత్తిదారుల నుండి వినియోగదారుల వరకు..... 'కాఫీ ఆర్థికవ్యవస్థ'

కాఫీ ఆర్థికవ్యవస్థలోని ఈ క్రమాన్ని చూస్తే అంచెలంచెలుగా వాటాదారులు, వారిలో అత్యధిక లాభాలు ఆర్జించేది టిఎన్‌సిలనేది తేటతెల్లమవుతుంది.

బీన్ కాఫీ గింజల ఉత్పత్తి చూడండి. శ్రామికుల శ్రమతో ఉత్పత్తి సాగుతోంది. భూ యజమానులు ఆ ఉత్పత్తిని ఎగుమతిదారులకు అమ్మితే, తిరిగి ఎగుమతిదారులు దాన్ని టిఎన్‌సిలకు విక్రయిస్తారు. టిఎన్‌సిలు అపుడు ఆ కాఫీ గింజల్ని ప్రాసెసింగ్ (అంటే వేయించి, పొడరుగా పట్టించి పాక్ చేయడం) మార్కెట్‌లో హోల్ సేలర్లకు(రిటైల్‌గా కూడా) అమ్మడంతో అది వినియోగదారులకు సరకుగా అందుతుంది.

ఉత్పత్తిదారులకు చెల్లించే రేటు కనీస గిట్టబాటు ధర లేకుండా ఎలా పడిపోయిందో పైన చూశాం. కాని అదే తయారయిన కాఫీ సరుకుకు వినియోగదారులు చెల్లించాల్సి వస్తున్న ధర చూస్తే ఆశ్చర్యం వేస్తుంది, దోపిడీ ఎంతో అని! వినియోగదారులు చెల్లించే దానిలో వాటాలు - శ్రామికులు 8%, ఉత్పత్తిదారులు(భూ యజమాని) 5% పొందుతుండగా మిగిలింది చిల్లర అమ్మకం దారులు 11%, 67% అంటే అధికభాగం టిఎన్‌సిలు (ప్రాసెసింగ్ చేసి వినియోగదారుల మార్కెట్‌కు విడుదలచేసేవి) పొందుతున్నాయంటే సామ్రాజ్యవాదుల దోపిడీ ఎంతో సుస్పష్టమే. శ్రమించేది ఒకరు. లాభించేది మరొకరు. ఇదీ కాఫీ ఆర్థికవ్యవస్థ.

## కాఫీ పంట అంటేనే టిఎన్‌సిల లాభాల పంట

వియత్నాం వంటి దేశాన్ని కాఫీ ఉత్పత్తికి ఎలా ఎగదోసారు అన్నది ఇప్పుడు మనకు తెలిసింది. ఇలా అధికోత్పత్తి సంక్షోభంలో మూడవ ప్రపంచ దేశాలను ముంచివేసి పెరుగుతున్న టిఎన్‌సిల గురించి కొంచెం వివరంగా తెలుసుకుందాం. ప్రపంచవ్యాప్తంగా లక్షోపలక్షల కాఫీ ఉత్పత్తిదారులు ఆకలిచావులతోను, కుటుంబాలు విచ్ఛిన్నమై జీవన వెతుకలాటలో ఆయా ఖండాల్లో ఈమూల నుండి ఆమూలకు వలసపోతుంటే నెసిల్ వంటి టిఎన్‌సి వార్షిక లాభాల వృద్ధి ఇలా ఉన్నాయి - 2000 సంవత్సరంలో నెసిల్ వార్షిక లాభం 22%, అదే 2001లో 26%కు పెరిగింది. అమెరికాకు చెందిని స్టార్ బ్రిక్స్ స్వయంగా తన సంపాదన 40% పెరిగిందని ప్రకటించుకొంది. సారా లీ అయితే 2001లో 17% లాభాలు పొందింది. ఇవీ టిఎన్‌సిల లాభాలు మచ్చుకి.

కాఫీ పంట అధికోత్పత్తితో సంక్షోభం తీవ్రమై ఏడాది ఏడాదికీ మిగులు ఉండిపోవడం, ఉత్పత్తిదారులకు కనీస గిట్టుబాటు ధర కూడా రాని స్థితితో రైతులు దివాళా తీస్తున్న వాస్తవ చిత్రం ఒక ప్రక్క నెలకొనగా, మరోవైపు ఐసిఒ, ఐసిబి, ఎసిపిసిలు ఏవీ తమ దోపిడీకి అడ్డం నిలువకుండా తొలగించుకున్న టిఎన్‌సిలు వినియోగదారులు చెల్లించే మూల్యంలో 67% చేజిక్కించుకుంటూ ఇటు ఉత్పత్తిదారులు అటు వినియోగదారులు ఇరువుర్నీ దోచుకుంటున్న వాస్తవికత మరోవైపున గోచరిస్తోంది.

ఈ సంక్షోభ ఫలితంగా రైతులు, శ్రామికులు ఎలా ఉన్నారు? ఆయా దేశాల ఆర్థికవ్యవస్థలు ఎలా ఉన్నాయి?

## దివాళాతీస్తున్న రైతాంగం, నిరుద్యోగం, కుంగిపోతున్న ఆర్థికవ్యవస్థలు

ఆఫ్రికాలో కాఫీ ఉత్పత్తిచేసే దేశాల ఆర్థికవ్యవస్థలు స్పష్టంగా కాఫీ ఎగుమతితోనే ముడిపడియున్నాయి. అలాంటి 17 దేశాల్లో చాలవాటి కాఫీ ఎగుమతుల ఆదాయం మొత్తం ఎగుమతుల్లో 10% మించే ఉంది. నిజానికి ప్రపంచంలో పేదదేశాల జాబితాలోనివే ఈ దేశాలు. వీటి గురించి చూద్దాం.

ఇథోపియా ఎపుడూ కరువులు, యుద్ధాలతో దశాబ్దాలుగా అతలాకుతలమవుతోంది. 7 లక్షల కమతాల్లో కాఫీ మొక్కలు పెంచుతారు. దీనిపై ఆధారపడిన లక్షలాది రైతాంగం ప్రస్తుత సంక్షోభంతో నాశనమైపోయారు. ఉగాండా, రువాండా రెండు దేశాలు కాఫీ అమ్మకం ద్వారానే 70% ఎగుమతుల ఆదాయం పొందుతున్నాయి. గత కొద్ది

సంవత్సరాలుగా వాటి ఆర్థికవ్యవస్థలు మరింతగా దిగజారిపోయాయి. పొరుగున్న రువాండా దురవస్థ అయితే చెప్పనలవికాదు. దీని 50% ఎగుమతుల ఆదాయం కాఫీ పంట నుండే. దేశంలో 70% కమతాలలో కాఫీనే పండిస్తారు. గడచిన దశాబ్దిలో అమెరికా జారుకోగానే ఉత్పత్తి కోటా పద్ధతి లేదా ఐసిఒ పతనంకావడంతోనూ, ఐయంఎఫ్ ఆ దేశ ఆర్థికవ్యవస్థపై వ్యవస్థాపక సర్దుబాట్ల కార్యక్రమం విధించడంతోనూ, '92లో రువాండా కరెన్సీ విలువ తగ్గించబడడంతోనూ రువాండా కాఫీ ఉత్పత్తి 25% పడిపోయి గ్రామీణ రైతాంగం దురవస్థల పాలయ్యారు. హూటీలు, టుటీల మధ్య అంతర్యుద్ధం కూడా దీనికి తోడు కావడంతో 10 లక్షల రువాండావాసులు ఊచకోతకు గురయ్యారు. లక్షలాది మంది గ్రామాలు, పొలాలు విడిచిపోవలసి వచ్చింది. రువాండా అపరిష్కార పరిస్థితులకు సామ్రాజ్యవాదుల ప్రపంచవ్యాప్త కాఫీ సంక్షోభమే కారణం.

ఇక లాటిన్ అమెరికా దేశాలను చూద్దాం.

మధ్య అమెరికా దేశమయిన నికరాగువాకు వచ్చే బయటి ఆదాయం ఎక్కువగా కాఫీ నుండే. 1978లో శాండినిస్టా విప్లవం తర్వాత భూ సంస్కరణలు అమలై రైతాంగ కో-ఆపరేటివ్‌లు ఏర్పడ్డాయి. కానీ దేశంలోని ప్రతిఘాతుక విప్లవం తర్వాత మిగిలిన కో-ఆపరేటివ్‌లు కూడా ప్రస్తుత కాఫీ సంక్షోభంతో తుడిచిపెట్టుకపోయాయి. నికరాగువా దేశంలో జనాభా 50 లక్షలే కావడంతో 2,50,000 మంది నిరుద్యోగులుగా మిగిలిపోయి, ప్రజల జీవితంలో కాఫీ సంక్షోభ ప్రభావం తేరుకోనంతగా మిగిలిపోయింది.

ప్రపంచ కాఫీ ఉత్పత్తిలో రెండవ అతి పెద్ద దేశమైన కొలంబియా గ్రామీణ ప్రాంతంలో 35% ఉద్యోగాలు కాఫీ పంటతోనే. ఈ సంక్షోభంతో 2001లో 2 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆ ప్రభుత్వమే ప్రకటించింది.

కాఫీ పంట ధరలు పడిపోవడానికి తోడు జనవరి 2001లో భూకంపం రావడంతో ఎల్‌సాల్వడార్‌లో 30 వేల మంది కాఫీ శ్రామికులు (వర్కర్స్) నిరుద్యోగులయ్యారు.

గౌతమాలాలో నయితే కాఫీ ఉత్పత్తిదారులు దివాళా తీస్తున్నారు. తక్కువ రకం కాఫీ పంటను పారిశ్రామిక వంట చెరకుగా అమ్మితే ఆ రకంగానైనా ఎక్కువ రేటు వస్తుందని అమ్మడం ప్రారంభించారు.

కాఫీని అధికంగా పండించే మరో దేశం మెక్సికో. అది గతంలోని ధరలతో పోలిస్తే ఇపుడు మూడవ వంతు ధరలకే అమ్ముతోంది. ఫలితంగా '92లోని 800 మిలియన్ డాలర్ల ఎగుమతులు 2002 నాటికి 250 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. గత సంవత్సరంలోని తీవ్ర కరువు, వినాశకర తుఫానులు మెక్సికో కాఫీ పంటల ప్రాంతాలను దెబ్బతీశాయి. ఈ వినాశకాలు గడచిన సంవత్సరం 80% పంట నాశనం కావడానికి కారణాలయ్యాయి. వీటన్నింటి ఫలితంగా లక్షలాది కుటుంబాలను క్రుంగదీస్తూ 7 లక్షల ఎకరాల కాఫీ పంటను నిలిపివేశారు. అంచనాల ప్రకారం కేవలం గత సంవత్సరం 3 లక్షల రైతాంగం, శ్రామికులు పని వెతుకులాటలో తమ ప్రాంతాల్ని విడిచిపోయారు.

ఇక వియత్నాం. దశాబ్ద కాలంలో 2001నాటికల్లా ప్రపంచంలో అత్యధిక ఉత్పత్తిదారుల్లో 2వ స్థానం సంపాదించి, తన (చౌక రకం) రోబస్టా కాఫీ ఉత్పత్తి పెరుగుదలనంతా 1995-2001 మధ్యనే సాధించింది. దీని వెనుక సామ్రాజ్యవాదుల ఎగదోపు ఎంతవుందో పైనే చూశాం. ఫలితంగా కాఫీ ఉత్పత్తికోసం ప్రపంచంలో ఏదేశంలోనూ జరగనంతగా '90ల్లో వర్షాధార అడవుల నాశనం వియత్నాంలో జరిగాయి. '96 నుండి 4 లక్షలకు పైగా ప్రజలు డాక్ లాక్‌కు వలసపోయారు. ఆగస్టు 2000లో కిన్హ్ కాఫీ ప్లాంటేషన్‌లు తగులబెట్టారు. ఫిబ్రవరి 2001లో ఎడె & జరాయ్ తెగలకు చెందిన వేలాది మంది స్థానికులు జాతీయ రహదారులు దిగ్బంధించి వియత్నాం సైన్యాన్ని ఎదుర్కొన్నారు. అడవుల వినాశనానికి కారణమైన కాఫీ ప్లాంటేషన్ బంద్ పెట్టాలని డిమాండ్ చేశారు.

ధరలు పడిపోవడంతో 2000 సం. నుండి రైతులు తమ కాఫీ చెట్లను కాలబెట్టసాగారు. కేవలం డాక్ లాక్‌లోనే 10,000 హెక్టార్ల కాఫీ పంటను తగులబెట్టడమో లేదా విడిచిపెట్టడమో చేసారు. అదే సమయంలో ప్రభుత్వం డాక్ లాక్‌లోని 70 వేల హెక్టార్లు, లామ్ డంగ్ ప్రావిన్స్‌లోని 40 వేల హెక్టార్లు కలుపుకొని 1.5 నుండి 1.8 లక్షల హెక్టార్లలోని కాఫీ చెట్లను నేలమట్టంచేసి కాఫీ ఉత్పత్తి రాసిని తగ్గించి తద్వారా ధరలు పెరిగేట్లు చేయాలన్న పథకాన్ని ప్రకటించింది.

అలాగే 2001-02 లోని 13.1 మిలియన్ బ్యాగ్‌లున్న కాఫీ ఉత్పత్తి 2002-03లో 32.23 శాతానికి తగ్గి 8.90 మిలియన్ బ్యాగ్ లయిందంటే వియత్నాం రైతాంగం ఎలా క్రుంగిపోయిందో ఊహించుకోవచ్చు.

ఇక భారత్‌ను చూద్దాం. మన దేశంలో కాఫీని పండించే ప్రాంతాలు ప్రధానంగా ఐదు జిల్లాలు. అవి కర్నాటకలోని చిక్‌మగులూర్, హస్సాన్, కొడుగు జిల్లాలు (మొత్తం పంటలో 70%), కేరళలో అధికభాగం వైనాడ్‌లోను (22%), తమిళనాడులో నీలగిరిలో (7%), మిగిలిన భాగం ఆంధ్రప్రదేశ్, ఈశాన్య భారత్‌లోని ప్రాంతాలు. సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే పై ఐదు జిల్లాలు పశ్చిమ కనుమల్లో గల కంటిగ్యుయస్ భూభాగంగా ఉండి మొత్తం కాఫీ ఉత్పత్తిలో 80% పైనే అందిస్తున్నాయి.

మన దేశంలోని వలసపాలన నాటి నుండీ కాఫీ పంట 70% ఎగుమతులకే ఉద్దేశించింది. గడచిన దశాబ్ద కాలంలో దేశంలోని ఉత్పత్తి పెరిగి దేశీ మార్కెట్ పెరగకపోవడంతో ఎగుమతులే 80 శాతానికి పెరిగాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లోని సంక్షోభంతో ఎగుమతులూ ధరలూ రెండు పడిపోయి కాఫీ రైతాంగాన్ని క్రుంగదీసింది. ఉదా: 2000 సం.లో 2.57 లక్షల టన్నులుగా వున్న ఉత్పత్తి 2003 నాటికి 1.86 లక్షల టన్నులకు పడిపోగా, ధరలు రోబస్టా కాఫీ రకం (ఇక్కడి ఉత్పత్తిలో 64%తో అధికంగా పండించబడేది ఇదే) ధర 1998-2002ల మధ్య కిలోకి రు.71.90 నుండి రు.28.70కి పడిపోయింది. అలాగే రెండో రకంది అరేబికా కాఫీ కిలోకి రు.96.80 నుండి రు.36.70కి పడిపోయింది.

చిన్న, మధ్య రైతాంగం (10 హెక్టార్లలోపువారు) ఏ మోతాదులో దివాళాతీస్తూ అప్పుల భారంతో క్రుంగిపోతున్నారో అర్థంచేసుకోవడానికి మరో కోణం నుండి కూడా చూద్దాం. 1997 కొలమానంగా తీసుకుంటే భారత్ కాఫీ ఎగుమతులు 2.64 మిలియన్ బ్యాగ్‌లు ఉన్నది 2002 నాటికి 3.40 మిలియన్ బ్యాగ్‌లకు పెరిగింది. అదే సమయంలో ఎగుమతుల ఆదాయం చూస్తే సాపేక్షికంగా పెరగాల్సింది పోయి రు.2,000 కోట్ల నుండి రు.972 కోట్లకు (అంటే 51%) తగ్గిపోయింది.

అలాగే కాఫీ ప్లాంటేషన్ కమతాల వివరాలు చూస్తే -

| క్రమ సంఖ్య | కమతాల ఏరియా (విస్తీర్ణం) | కమతాల సంఖ్య (శాతంలో) | ప్లాంటేషన్ ఏరియా (శాతంలో) |
|---|---|---|---|
| 1. | 2 హెక్టార్ల లోపు | 1.20 లక్షలు (70%) | 42% |
| 2. | 2-10 హెక్టార్ల మధ్య | 0.34 లక్షలు (28%) | 20% |
| 3. | 10-100 హెక్టార్ల మధ్య (అర్థ భూస్వామ, భూస్వామ్యవర్గాలు) | 2,495 (1.6%) | 23.5% |
| 4. | 100 హెక్టార్ల పైవి (కంపెనీ ఎస్టేట్లు) | 105 (0.1%) | 11.3% |
| 5. | మొత్తం 10 హెక్టార్ల లోపు (పైవి 1 + 2 కలిపితే) | 1.54 లక్షలు (98%) | 62% |
| 6. | మొత్తం 10 హెక్టార్ల పైవి (పైవి 3 + 4 కలిపితే) | 2,600(1.7%) | 34.8% |

కాఫీ ఉత్పత్తీ పెరిగి, ధరలూ పడిపోవడంతో కాఫీ రైతాంగం కనీసం గిట్టుబాటు ధరలు కూడా లభించక అప్పులపాలై భూములు అమ్ముకోసాగాగారు. అలాగైనా అప్పులు తీరుద్దామనే ఆశ అమాయక జీవులది. అయితే అక్కడా గిట్టుబాటు ధరలు లేని స్థితే. భూముల రేట్లు కూడా పడిపోయాయి. అప్పటివరకు ఎకరానికి రు.4.50 లక్షలుగా ఉన్న రేటు రు.1.15 లక్షలకు పడిపోయింది. మన పార్టీ కర్నాటక శాఖ వారి సర్వే ప్రకారం 2001లో చిక్‌మగులూర్ జిల్లాలో కాఫీ ఉత్పత్తిచేసే దిగువ కేటగిరీల రైతాంగ కుటుంబాలు సగటున రు.14,689ల అప్పులతో బాధపడుతున్నారు. దీనిలో 30% అప్పు ద్రవ్య సంస్థల నుండి తెచ్చుకున్నది కాగా మిగిలిన భాగం అంతా భూస్వాముల నుండే. దీనివల్ల ప్రభుత్వం తాత్కాలికంగా రైతులను ఆదుకోవడానికి అప్పుల రీషెడ్యూల్ చేసామన్నా అదంతా భూస్వాములకు లాభించిందే గాని క్రుంగిపోయిన రైతాంగానికి కాదన్నది కనిపిస్తూనే ఉంది. ఫలితంగా ఆంధ్రలో పత్తి రైతాంగం ఆత్మహత్యల్లా కర్నాటకలో 200మందికి పైగా కాఫీ రైతాంగం కూడా ఆత్మహత్యలు చేసుకున్నారన్నది వెలుగుచూడని విషయం.

ఇక కాఫీ కార్మికుల విషయం చూద్దామంటే ఒక్క కర్నాటకలోనే 2000-02 మధ్య కాఫీ రంగంలో 1.54 లక్షల కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. మొత్తంగా కాఫీ ప్లాంటేషన్ పనిలో పర్మనెంట్ క్యాజువల్ లేబరయితే 5.34 లక్షలుందని ఒక అంచనా. దీనిలో కుటుంబ శ్రమ చేర్చబడలేదు. నిజానికి అవన్నీ కలిపి చూస్తే ఈ సంఖ్య 10 లక్షలుంటుందనేది. వీరంతా భూమిలేని పేద రైతాంగం. ఈ సంక్షోభంతో వీరిలో అధికభాగం పనులు కోల్పోయి దుర్భర స్థితిలో ఉన్నవారే.

ఇదే సమయంలో భూస్వామ్య, దళారీ బూర్జువావర్గం వారు మాత్రం ప్రభుత్వ రాయితీల ఫలితాల మొత్తం పొందుతూ, మార్కెట్‌పై గల గుత్తాధిపత్యంతో లాభాలార్జిస్తూ ఆకాశానికి ఎదుగుతున్నారు.

ఉదాహరణకు టాటా కాఫీనే చూద్దా. ఇది ఆసియాలోకెల్ల పెద్ద సముదాయం (కంగ్లామరేట్). కాఫీ బోర్డు కంట్రోళ్లను ఎత్తివేయాలని డిమాండ్ చేసిన వాళ్లలో ముందున్నది. అయితే డబ్ల్యుటిఒ ఇక్కడి దళారీ బూర్జువాలకు ముఖ్యంగా టాటా కాఫీలాంటివారికి బాగా తోడ్పడింది. కర్నాటకలో కొడుగు జిల్లాలో విస్తృత ప్లాంటేషన్‌లు కల్గియుండిన కన్సాలిడేటెడ్ కాఫీ ఎస్టేట్‌ల్ని(సిసిఇ- ఇవి బ్రిటిష్ వలసపాలకులచే 1922లో ఈడెన్‌బర్గ్‌లో స్థాపించబడి ఇక్కడ ఎస్టేట్‌ల వ్యాపించుకున్నది) 1967లో టాటా టీ వారు స్వాధీనపరచుకున్నారు. ఈ ఎస్టేట్ 10,000 ఎకరాలది. దీనితోనేకుడ్లి, కొడగు జిల్లాల్లో కాఫీ గింజలు శుద్ధిపరిచే కర్మాగారాలు కూడ దక్కాయి. ఇలా మాజీ వలస యజమానుల ఎస్టేటు దేశంలో అగ్రభాగాన వున్న దళారీ కుటుంబం వారసత్వమైంది. నిజానికి '98 కాఫీ సంక్షోభ సమయంలో చాలా దూకుడుగా ఆస్తులను పెంచుకున్న దళారీ టాటా కాఫీనే.2000 సంవత్సరంలో కొఠారీల (చెన్నైలోని మార్వాడీ కంపెనీ) నుండి 1300 ఎకరాల కూవర్‌కోలీ ఎస్టేట్‌ని కొనేసింది కూడా టాటా కాఫీనే. కర్నాటకలో ఇతర ఎస్టేట్లు కూడా టాటా గుత్తాధిపత్యంతో పోటీ పడలేక 'తమ ఎస్టేట్లను కూడా దానికే అమ్ముకోవాలనుకుంటున్నట్లు' స్వయంగా టాటా కాఫీ యండినే వెల్లడించాడు. ఈ దళారీ దేశ సరిహద్దులకే పరిమితం కాలేదు. తన విస్తరణలో భాగంగా ఇండోనేషియా, ఆఫ్రికా, ఈ మధ్య శ్రీలంకలో కూడా ప్లాంటేషన్‌లు కొని విస్తరణవాదాన్ని చాటుకుంటోంది. ఇదే ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బొప్పన్న మాటల్లో అయితే "మేము టాటా కంపెనీ వారం, మాకు ఆకాశమే హద్దు".

టాటా కంపెనీ తన ఎస్టేట్లలో ఉత్పత్తి చేసే కాఫీ గింజలనే గాక, దక్షిణ భారత్‌లో వేర్వేరు ప్రాంతాలలో దానికి గల మూడు కర్మాగారాల్లో (ప్లాంట్లు) గింజలను వేయించడం, పొడరుచేసే పని సాగిస్తోంది. ఇప్పటికే టాటా కాఫీ సంవత్సరానికి 32,000 వేల టన్నుల కాఫీను శుద్ధిపరచే సామర్థ్యం కలిగి ఉంది. దానికితోడు కాఫీని శుద్ధిచేసి, తమ బ్రాండ్‌తో చిల్లర అమ్మకాల సామర్థ్యం కల్గిన ఆసియాన్ కాఫీ లిమిటెడ్ (ఎసిఎల్) మరియు కాఫీ లాండ్స్ లిమిటెడ్‌లతో సంలీనమైంది. ఇలా ఎసిఎల్‌తో సంలీనం కావడంతో హైదరాబాద్ ఇన్‌స్టంట్ కాఫీ తయారీ ప్లాంట్‌ను చేజిక్కించుకోగల్గింది.

ఈ సంవత్సరారంభంలో టాటా కాఫీ సామ్రాజ్యవాద కంపెనీ టర్నర్ మోరిసన్‌తో బాటు మారిషస్ కేంద్రంగా నెలకొల్పబడిన బారిస్టా కాఫీ ఇంటర్నేషనల్‌లో 50 కోట్ల విలువ ఈక్విటీని కొనేసింది. ఫలితంగా దీనికి సబ్సిడరీగా ఢిల్లీలో ఉన్న బారిస్టా కాఫీ ఇంటర్నేషనల్‌లో టాటా కాఫీ 34.3% వాటాను పొందగలిగింది. అంతేగాదు బారిస్టా అమ్మకాలన్నీ ఉన్నత వర్గాలవారికే. అదీ మారిషస్ సంబంధాలుండటంతో పన్నుల ఎగవేత కూడ సుసాధ్యమైంది టాటా కాఫీకి. అంతకంటే ముఖ్యంగా టాటా కాఫీ, టాటా టీ లు దక్షిణాసియా, మలేషియా, సింగపూర్, హాంగ్‌కాంగ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో అమ్మకాలకు బారిస్టా సంబంధాలు ఒక మార్గమైంది. మధ్య ఆసియాకు చెందిన గల్ఫ్ కో-ఆపరేషం కౌన్సిల్ (జిఇసి)దేశాలన్నింటితో మార్కెటింగ్ ఒప్పందాలు ఉండనే ఉన్నాయి.

పై పరిణామాలన్నింటి ఫలితంగా ఓ పక్క కాఫీ రైతాంగం మరియు ప్లాంటేషన్ లేబరు అప్పులుపాలై జీవనోపాధికి వెంపర్లాడుతుంటే, భారత దళారీల్లో ఒకటయిన టాటా ఎలా లాభాలార్జిస్తోందో చూడండి. 1995-96ల్లో లాభాలు 24 కోట్ల రూపాయలుండగా, 196-97 నాటికి 26 కోట్లకు, 2000 నాటికి 53 కోట్లకు పెరిగాయి. ఈ మధ్య గణాంకాలు చూడగల్గితే తప్పకుండా మరింతగా పెరిగి వుంటాయనే దాంట్లో సందేహ మక్కరలేదు. అంటే కాఫీ రైతాంగం, కాఫీ లేబర్ జీవితాలు ఏటేటా దిగజారిపోతుంటే యజమానులు బలిసిపోతున్నారు. రైతాంగ సమస్యలపై పోరాడడానికి సంఘటిత రైతాంగ ఉద్యమం పెంపొందాల్సిన అవసరం ఎంతగానో ఉంది. అక్కడి కార్మికులలో ఉన్న ట్రేడ్ యూనియన్లు అనుసరిస్తున్న యాజమాన్య అనుకూల, రివిజనిస్టు విధానాల మూలంగా కాఫీ లేబర్ సమస్యలు పరిష్కారం కావడం లేదు. తమ సమస్యల పరిష్కారం కోసం శ్రామికులు సమరశీల పోరాటాలలోకి రావల్సిన అవసరం ఎంతగానో ఉంది. మరోవైపు పశ్చిమ కనుమల్లో విప్లవ రైతాంగ ఉద్యమం క్రమక్రమంగా బలపడుతోంది. ఆ రైతాంగ బాటలో పోరాడడం ద్వారానే కాఫీ రైతుల, శ్రామికుల సమస్యలు పరిష్కారం అవడమే గాకుండా, అంతిమంగా వారి మౌలిక సమస్యలన్నీ తీరడానికి మార్గం సుగమం అవుతుందని ఆశిద్దాం. ✶

*(......... 31వ పేజీ తరువాయి)*

ఒక్క రోజులోనే ఆ రథం ఛత్తీస్‌గఢ్‌లోకి దాటింది. అయితే ఆ ఒక్క రోజులోనే ఒక్క మనిషి విషపూరితంగా సాగించే ఎన్నికల క్యాంపెయిన్ రక్షణ కోసం కోట్లాది రూపాయిల ప్రజాధనం వెచ్చించారు.

ప్రజలు మౌనంగా ఉన్నంతకాలం ఫాసిస్టు బీజేపీ, దాని పోలీసులూ దూకుడుగా వ్యవహరిస్తూ, భయోత్పాతాన్ని వ్యాపింపజేస్తారు. ఒక్కసారి ప్రజలు మౌనాన్ని ఛేదిస్తూ తిరుగుబాటు బావుటానెగరేస్తే చాలు వీళ్లు మునిగిపోతున్న ఓడపై ఎలుకల్లా పారిపోక తప్పదు. భాజపా అమలు చేస్తున్న ఫాసిజానికీ, రాజ్యహింసకూ కేవలం పోరాట ప్రజలు తమ సాయుధ బలగాల ద్వారానే తగిన జవాబు చెప్పగలరు. గుజరాత్‌లోనే గనుక ఇలాంటి శక్తి ఉన్నట్టయితే భాజపా, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్‌లు 2 వేల మందికి పైగా ముస్లింల ఊచకోత, మహిళలపై సామూహిక అత్యాచారాలు, దోపిడీ, దహనకాండ వంటి హేయమైన, అమానవీయమైన దురంతాలకు పాల్పడే సాహసమే చేయగల్గేవి కావు.✶

# హైతీపై అమెరికా దురాక్రమణను ఖండించండి !

అది ప్రసార మాధ్యమాలు ప్రచారం చేసిన పచ్చి అబద్ధం. అంతర్జాతీయ ప్రసార మాధ్యమాలు దాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుదారుల సాయుధ పోరాటంగా చిత్రించింది. నిజానికి అక్కడ అమెరికన్ దౌత్య కార్యాలయమే సైనిక కుట్రను నడిపి అధికార మార్పిడి జరిపించింది.

రెండు వందల ఏళ్ల హైతీ చరిత్రలో 1994లో మొట్టమొదటి సారి జాన్ బెర్ట్రాండ్ ఆస్త్రైడ్ రాష్ట్రపతిగా ఎన్నికయ్యాడు. ఆయన విముక్తి ధర్మశాస్త్రంతో ప్రభావితుడైన ఒక కాథలిక్ ఫాదర్. 2000లో అతను 90 శాతంకన్నా ఎక్కువ ఓట్లతో మరోసారి ఎన్నికయ్యాడు. హైతీ చాలా చిన్న దేశం. హిస్పానియోనా అనే ద్వీపంలోని సగ భాగం, డొమెనికన్ రిపబ్లిక్‌లోని సగభాగాన్ని కలిపి ఈ దేశాన్ని ఏర్పాటు చేశారు. పశ్చిమ గోళార్ధంలో ఇదే అన్నిటికన్నా పేద దేశం. మొత్తం ప్రపంచంలో ఇది నాల్గో పేద దేశం. దీని అక్షరాస్యత కేవలం 50 శాతమే.




జార్జ్ బుష్ అధికారంలోకి వచ్చినప్పటి నుండీ హైతీ మాజీ క్రూర శాసకుడైన డువెలియర్ సాయుధ దళాలను పెంచి పోషిస్తూ వచ్చాడు. మాజీ సైనికులకూ, పోలీసు అధికార్లకూ, వృత్తి హంతకులకూ, నేరస్త ముఠాలకూ సీఐఏ అమెరికాలోనూ, డొమెనికన్ రిపబ్లిక్‌లోనూ శిక్షణనిచ్చింది. వీళ్లంతా 1994లో ఆస్త్రైడ్ అధికారంలోకి రాగా హైతీ నుండి పారిపోయిన వాళ్లే. వీళ్లకు ఎల్‌సాల్వడార్ కాంట్రాల తరహాలో శిక్షణనిచ్చారు.

ఆధునిక అమెరికన్ ఆయుధాలతో సాయుధమైన ఈ సాయుధ 'దళాలు' ఫిబ్రవరి ప్రారంభంలో హైతీలో చొరబడ్డాయి. పాశ్చాత్య మీడియాలో వీళ్లను 'తిరుగుబాటుదార్లు'గా పేర్కొన్నారు. అమెరికా మీడియాలో ఆస్త్రైడ్‌ను పిచ్చివాడిగా చిత్రించి, హైతీ ప్రజలు ఆస్త్రైడ్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరుపుతున్నారని అబద్ధపు ప్రచారం చేశారు. హైతీలో చొరబడ్డ హంతక, లంపెన్‌దళాలు పట్టణాల్లో విచ్చలవిడిగా హింసాకాండ జరిపారు. అదే సమయంలో అమెరికా మూడు నావలలో 2,000 మంది అమెరికన్ నావికా సైనికులను మొహరించింది. అమెరికా సైనికులు కూడా 'రక్షణ' కల్పించే పేరిట హైతీలో బలవంతంగా చొరబడ్డారు. ఇతర సామ్రాజ్యవాదులు కూడా ఆలస్యం లేకుండా అమెరికాతో కుమ్మక్కయ్యారు. ఫ్రాన్స్, కెనెడాలు తమ వంతు సైనికులను అక్కడికి పంపించాయి. గతంలో హైతీ ఫ్రాన్స్‌కు వలసగా ఉందన్న విషయం గమనించదగినది. అమెరికా కీలుబొమ్మైన ఐక్యరాజ్య సమితి మరోసారి ఆక్రమణదారులకు ఒక అంతర్జాతీయ రక్షణ బలగాన్ని ఏర్పాటు చేసేందుకు హక్కునిచ్చింది. ఇరాక్ ఉదంతానికి భిన్నంగా ఇక్కడ అంతా కేవలం మూడు వారాల్లో పూర్తయింది.

1994 దాకా హంతక పాలకుడైన డొవెలియర్, వాడి కొడుకైన పాపాడాక్‌ల నియంతృత్వాన్ని అనుభవిస్తూ వచ్చింది హైతీ. అప్పటి పేరుమోసిన అధికారులు ఇప్పుడు సాయుధ ముఠాలకు నాయకత్వం వహిస్తున్నారు. 'తిరుగుబాటు' గురించి అంతర్జాతీయ మీడియా ఇది మరో పెద్ద జనసంహారానికి దారితీయబోతున్నట్టుగా గోరంతలు కొండతలు చేస్తూ ప్రచారం చేసింది. 'తిరుగుబాటుదార్లు' రాజధానిలోకి చొరబడి రాష్ట్రపతి భవనాన్ని చుట్టుముట్టారు. ఎలాంటి ప్రతిఘటనా తలెత్తకుండా విదేశీ సైనికులు అన్ని ఏర్పాట్లు చేసి పెట్టారు. ఫిబ్రవరి 28న రాష్ట్రపతిని పదవిలోంచి తప్పించారు. ఆస్త్రైడ్ మూటాముల్లె సర్దుకొనేలా చేసి అతనిని విమానంలో కూర్చోబెట్టి బలవంతంగా ఆఫ్రికాకు పంపించారు. అమెరికా దౌత్య కార్యాలయం ప్రధానమంత్రిని లెక్క చేయకుండా ప్రధాన న్యాయమూర్తిని రాష్ట్రపతిగా నియమించింది.

ఆ తర్వాత ఆస్త్రైడ్ ఆ విషాద దినాన్ని గుర్తు చేసుకుంటూ, తన పట్ల ఎలా వ్యవహరించారో ప్రపంచానికి వెల్లడి చేశాడు. ఫిబ్రవరి 28 రాత్రి సాయుధ బలగాలు పెద్ద ఎత్తున రాష్ట్రపతి భవనంపై దాడి చేశాయి. వాటిలో తెల్లవాళ్లతో పాటు హైతీ వాళ్లు కూడా ఉన్నారు. ఆస్త్రైడ్‌ను కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్ నిజానికి ఒక భౌగోళిక, రాజకీయ కిడ్నాప్. మరో మాటలో ఇది టెర్రరిజమే తప్ప వేరే ఏమీ కాదు. అమెరికా సైనిక అధికార్లు ఆస్త్రైడ్‌పై తుపాకీ గురి పెట్టి, రాష్ట్రపతి భవనంతో పాటుగా రాజధాని నగరమంతటా తిరుగుబాటుదార్లు వ్యాపించిపోయారనీ, ఏ క్షణంలోనైనా దాడి మొదలవవచ్చనీ బెదిరించి, బలవంతంగా రాజీనామా రాయించుకున్నారు. ఒకసారి దాడి మొదలైందంటే ఇక నెత్తుటి హోళీ జరగడం ఖాయం. వేలాది మందిని ఊచకోత కోస్తారు. వాళ్ల మిషన్ పూర్తయ్యే దాకా ఏ శక్తీ వాళ్లనడ్డుకోలేదు. నిజానికి బుష్షూ, వాడి పెంపుడు టెర్రరిస్టులు ఆస్త్రైడ్‌ను ప్రాణాలతో గానీ, చంపి గానీ పట్టుకొని అధికారాన్ని గుంజుకోవాలని కుట్ర పన్నారు. ఆఖరుకు ఆస్త్రైడ్ వాళ్లకు రాజీనామా రాసివ్వక తప్పలేదు. ఆస్త్రైడ్‌ను రాత్రికిరాత్రే హైతీ నుండి వెళ్లగొట్టారు. తోటలూ, మిఠాయి దుకాణాలూ, ఎగుమతులకు ఉద్దేశించిన ప్లాంటులూ హైతీ ఆర్థికవ్యవస్థకు జీవనాడులుగా ఉన్నాయి. అయితే ఇవన్నీ అమెరికన్, ఫ్రెంచ్, కెనెడియన్ బహుళజాతి కంపెనీల చేతిలోనూ, పిడికెడు దళారీ పెట్టుబడిదార్ల చేతిలోనూ ఉన్నాయి. పాపాడాక్ తదితర హంతకుల పాలనను పునః స్థాపించాలని అమెరికా కోరుకుంటోంది. అమెరికా సైనిక దురాక్రమణకూ, ఉదారవాద పాలకులను సైతం సహించలేని దాని అసహనానికీ హైతీ ఒక ఉదాహరణగా మారింది. ఇప్పుడు అది కేవలం కీలుబొమ్మ మాత్రమే... నూటికి నూరు పాళ్ల కీలుబొమ్మ.

అమెరికా ఈ విధంగా దురాక్రమణ జరపడాన్నీ, ప్రభుత్వాలను అస్థిరం చేయడానికి అది అవలంబిస్తున్న క్రూరమైన, హేయమైన విధానాలనూ ప్రపంచ దేశాలు మౌనంగా చూస్తూ ఉండిపోతాయా? హైతీపై అమెరికా దాడినీ, దురాక్రమణనూ ప్రపంచంలోని ఏ ఒక్క ప్రభుత్వం కూడా ఖండించలేదు. సామ్రాజ్యవాదులు ఏకమైనప్పుడు మిగిలిన వాళ్లంతా ఊరకే ఉండిపోతారన్న విషయం దీని ద్వారా స్పష్టమవుతున్నది. అయితే ఈ మౌనం ప్రపంచంలోని పేద దేశాలపై దాడులకూ, దురాక్రమణకూ బహిరంగ ఆహ్వానం కాకతప్పదు. అయితే దళారీ ప్రభుత్వాలు మౌనం వహించడంలో ఆశ్చర్యపోవల్సింది కూడా ఏమీ లేదు. కాబట్టి ప్రపంచ ప్రజలే సామ్రాజ్యవాదుల ఈ క్రూరమైన, పాశవికమైన దాడినీ, దురాక్రమణనూ ముక్త కంఠంతో ఖండించాలి. ఇరాకీ వీర ప్రజానీకం లాగా గట్టిగా ప్రతిఘటించాలి. ★

శ్రద్ధాంజలి

## పశ్చిమ బెంగాల్లో మళ్లీ మొదలైన బూటకపు ఎన్‌కౌంటర్ల పర్వం

# ప్రజా నాయకుడు కామ్రేడ్ అసీందాస్‌కు విప్లవ జోహార్లు !

ఫిబ్రవరి 29న పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం నాయకత్వంలోని సోషల్ ఫాసిస్టు ప్రభుత్వం మన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడైన కామ్రేడ్ అసీందాస్ (కంచన్)ను బూటకపు ఎన్‌కౌంటర్లో హత్య చేసింది. ఇది పోలీసులు కుట్రపూరితంగా చేసిన దారుణ హత్య.

గత శతాబ్దపు ఏడవ దశాబ్దంలో సిద్ధార్థ శంకర్ రే, అతడికి ముందు సీపీఎం పాలనలో వేలాది విప్లవకారులను ఊచకోత కోశారు. కాంగ్రెస్‌తో పాటు కమ్యూనిస్టులమని చెప్పుకునే వాళ్లు కూడా నక్సల్బరీ పోరాట జ్వాలలను ఆర్పివేయాలని తీవ్రంగా ప్రయత్నించారు. విప్లవకారుల పట్ల వీళ్లు నేరపూరిత వైఖరిని అనుసరించినప్పటికీ విప్లవ జ్వాలలు చల్లారిపోలేదు... పైగా అవి దేశమంతటా వేలాది యువజనులకు ప్రేరణనిచ్చాయి. పశ్చిమ బెంగాల్‌లో విప్లవోద్యమానికి తీవ్ర నష్టం జరిగినప్పటికీ అది దేశంలోని ఇతర ప్రాంతాల్లో విస్తరిస్తూ ముందుకు సాగింది. అయితే సుదీర్ఘ విరామం తర్వాత పశ్చిమ బెంగాల్ పోరుగడ్డన మరోసారి విప్లవోద్యమం విస్తరిస్తోంది. కాలంచెల్లిన తమ వ్యవస్థకు అరుణారుణ ప్రత్యామ్నాయం తయారవుతున్నందుకు రాష్ట్రంలోని నకిలీ కమ్యూనిస్టులకు గుండెదడ మొదలైంది. కామ్రేడ్ అసీందాస్ హత్య రివిజనిస్టులలో పెరుగుతున్న భయాందోళనకు సంకేతం. రాష్ట్రంలో విప్లవ ప్రత్యామ్నాయానికి పెరుగుతున్న ప్రజాదరణను సహించలేని రివిజనిస్టులు ఎన్‌కౌంటర్ హత్యలతో ఫాసిస్టు నిర్బంధాన్ని మొదలుపెట్టారు.

కామ్రేడ్ అసీందాస్‌ను పోలీసులు పశ్చిమ మిడ్నాపూర్ లాల్‌గఢ్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఝీట్కా అడవిలో అరెస్టు చేసి ఆ తర్వాత బూటకపు ఎన్‌కౌంటర్లో హత్య చేశారు. వృద్ధులైన అతని తల్లిదండ్రులకు శవాన్ని ఇవ్వడానికి నిరాకరించారు. పశ్చిమ మిడ్నాపూర్‌లోని ఝార్‌గ్రాం ఆసుపత్రి మార్చురీలో శవాన్ని ఉంచారు. పౌర హక్కుల సంఘం (ఏపీడీఆర్), అమరుడి కుటుంబ సభ్యులూ, పనిహాటీ ప్రాంత ప్రజలూ శవం కోసం పోలీసులపై వత్తిడి తెచ్చారు. వాళ్లు శవం కోసం ఉద్యమం మొదలు పెట్టారు. మార్చ్ 4న విప్లవ యువజన సంఘం, ఇతర ప్రజా సంఘాలూ 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. పెద్ద గ్రామమైన పనిహాటీలో బంద్ పూర్తిగా విజయవంతమైంది. కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి.

అజ్ఞాతంలోకి వెళ్లడానికి ముందు కామ్రేడ్ అసీందాస్ బాగా ప్రజాదరణ పొందిన నాయకుడు. విద్యార్థి దశలో విద్యార్థి ఉద్యమంలో పాలు పంచుకున్నాడు. 1980లలో అతను సీపీఎంలో చేరి అందులో పని చేశాడు. అయితే చాలా త్వరగానే సీపీఎం రివిజనిజాన్ని అర్థం చేసుకున్నాడు. విప్లవానికీ సీపీఎంకూ చుక్కెదురనీ, కార్మికోద్యమం పట్ల దానికి నిజాయితీ లేదనీ అర్థం చేసుకున్నాడు. దానితో కామ్రేడ్ దాస్ సీపీఎంను వదిలేసి పనిహాటీ నాగరిక్ సమితి అనే సంస్థలో చేరాడు. ఆ సంస్థ ఆ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం పని చేస్తూ ఉండేది. ఈ సంస్థ బ్యానర్ కింద కామ్రేడ్ అసీందాస్ ప్రజల హక్కుల కోసం పోరాడాడు. ప్రజల ప్రయోజనాల కోసం పని చేస్తున్న క్రమంలో అతనికి విప్లవకారులతో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత అతను విప్లవ శ్రేణుల్లో చేరిపోయాడు. అతను పీపుల్స్‌వార్ సభ్యుడై తొందరలోనే రాష్ట్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగాడు. పీడిత ప్రజల విముక్తి మార్గంలో అంకితభావంతో పని చేస్తున్న క్రమంలో విప్లవకారులతో పరిచయం ఏర్పడడం వల్లనే అలా సాధ్యమైంది.

పోలీసుల పైనా, సీపీఎం ప్రభుత్వం పైనా ప్రజల్లో బాగా కోపం, నిరసన పెల్లుబుకుతుండడంతో పోలీసులు అమరుడి శవాన్ని అంత్యక్రియల కోసం అతని కుటుంబ సభ్యులకు అప్పగించక తప్పలేదు. బంద్ తర్వాత రెండు రోజులకు ప్రజలకు అతని శవం ఓ ఆసుపత్రిలో ఉందన్న విషయం తెల్సింది. దానితో యువజనులు, విద్యార్థులు, పలు ప్రజా సంఘాల వాళ్లతో పాటు ఆ ప్రాంతంలోని సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో కదిలి శవాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎడతెగకుండా పెరుగుతున్న ఊరేగింపుతో వెళ్లిన ప్రజలు కామ్రేడ్ అసీందాస్ అంత్యక్రియలు విప్లవ సాంప్రదాయాలతో జరిపారు.

కామ్రేడ్ అసీందాస్ హత్య సీపీఎం ప్రభుత్వ అప్రజాస్వామిక, ఫాసిస్టు, ప్రజా వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేసింది. పశ్చిమ బెంగాల్‌తో పాటు దేశమంతటా విప్లవోద్యమాన్ని నిర్మించి ప్రజాయుద్ధాన్ని సాగిస్తున్న శక్తులను అణచివేయడానికి ప్రభుత్వం పోలీసు బలగాలకు విచ్చలవిడి అధికారాలప్పగించింది. ఈ హత్యతో భారత పాలక వర్గాలకూ, వాళ్ల సామ్రాజ్యవాద ప్రభువులకూ ఊడిగం చేస్తున్న సీపీఎం తిరోగమన, ప్రజా వ్యతిరేక స్వభావం కూడా బట్టబయలైంది. బూటకపు ఎన్‌కౌంటర్లలో విప్లవకారులను హత్య చేయడమన్నది సామ్రాజ్యవాదుల ఎజెండాలో భాగమే. దీనిని ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంకు కనుసన్నలలో నడిచే చంద్రబాబు ప్రభుత్వం చాలా ముందుగానే ప్రారంభించింది.

గెరిల్లా యుద్ధం సాగుతున్న దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఈ దారుణమైన పద్ధతి అమలవుతోంది. అయితే ప్రజల జీవితం నానాటికీ దిగజారిపోతున్నందు వల్ల, ప్రభుత్వాలు ఈ హత్యలకు పాల్పడుతున్నప్పటికీ గెరిల్లా యుద్ధం కొత్త కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోంది. ఢిల్లీ గద్దెపై కూర్చున్న పాలకులూ, వాళ్ల ప్రాంతీయ ఏజెంట్లూ ప్రజల నుండి రోజురోజుకూ వేరుపడిపోతున్నారు. సీపీఎం దీనికి మినహాయింపేమీ కాదు. అది భారత దోపిడీ పాలక వర్గాల అగ్రగామి దళంగా పని చేస్తున్నది. అది ఈ పనిని ప్రజల రక్తంతో తడిచిన ఎర్రజెండా నీడన చేస్తోంది. కామ్రేడ్ అసీందాస్‌ను సామ్రాజ్యవాదం, ప్రపంచ బ్యాంకు నిర్దేశిస్తున్న విధానాలను పరమానందంతో అమలు చేస్తున్న అతని మాజీ 'కామ్రేడ్లు' హత్య చేశారు. శౌర్యానికీ, త్యాగానికీ ప్రతీకగా నిల్చిన కామ్రేడ్ అసీందాస్‌కు 'ప్రభాత్' వినమ్రంగా జోహార్లు చెబుతోంది. ★

### పాఠకులకు విజ్ఞప్తి

- 'ప్రభాత్'కు మీ సూచనల్నీ, విమర్శల్నీ తప్పక పంపండి.
- రిపోర్టులలో పేర్కొంటున్న ఘటన జరిగిన తేదీని వేయడం మర్చిపోకండి.
- రిపోర్టులతో పాటు పంపించే ఫోటో వెనుక దానికి సంబంధించిన వివరాలూ, తేదీ తప్పక పేర్కొనండి.
- 'ప్రభాత్'ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి. 'ప్రభాత్' బకాయిల్ని ఎప్పటికప్పుడు చెల్లిస్తూ పత్రిక తన కాళ్లపై నిలబడగలిగేందుకు సహకరించండి.

— *సంపాదకవర్గం.*

### ఆంధ్రప్రదేశ్‌లో ఫాసిస్టు చంద్రబాబు ప్రభుత్వ దాడిలో అసువులు బాసిన

# కామ్రేడ్స్ కౌముది, సుగుణ, విశ్వంలకు మా విప్లవ జోహార్లు !

అక్టోబర్ 2003లో ఫాసిస్టు చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు ముఖ్యమైన కామ్రేడ్లను హత్య చేసింది. అక్టోబర్ 1న పీజీఏ యాక్షన్ టీం జరిపిన వీరోచిత దాడిలో చావు తప్పి కన్నులొట్టబోయినట్టుగా బతికి బైట పడ్డ చంద్రబాబు విప్లవకారులను దారుణంగా హతమార్చే తన ఫాసిస్టు క్యాంపెయిన్‌ను మరింత ఉధృతం చేశాడు. తనపై జరిగిన దాడి పట్ల సానుభూతితో ప్రజలు ఓట్లు వేస్తారని ఆశించి అసెంబ్లీని రద్దు చేసిన చంద్రబాబు మరోవైపు విప్లవోద్యమంపై తన నిర్బంధ దాడిని తీవ్రతరం చేశాడు. తన పాలన చివరి రోజుల్లో చంద్రబాబు అనేక డజన్ల మంది విప్లవకారులను హత్య చేశాడు. అయితే వాళ్లలో కొద్ది మంది కామ్రేడ్ల సంక్షిప్త జీవిత చరిత్రలే మాకు అందడంతో వాటినే ఇక్కడ ప్రచురిస్తున్నాం –

## కామ్రేడ్ కౌముది – స్వాప్నికుడు, కవి, విప్లవకారుడు

కామ్రేడ్ కౌముది (సదానందం) వరంగల్ జిల్లాలోని తరాలపల్లి గ్రామంలో పుట్టాడు. తరాలపల్లి కమ్యూనిస్టు విప్లవకారులకు తొలి నుండీ పెట్టని కోటలా నిల్చిన గ్రామం. 1980వ దశకంలో అతను విద్యార్థి దశలోనే విప్లవోద్యమంలో చేరాడు. చాలా కాలం పాటు విప్లవ రచయితల సంఘంలో సభ్యుడిగా కొనసాగాడు. ఆయనను ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం మల్చిన ఒక అద్భుతమైన కవిగా చెప్పుకోవచ్చు.

మొదట్లో ఆయన మెదక్ జిల్లాలో గెరిల్లా దళాల్లో పని చేశాడు. ఆ తర్వాత అదే జిల్లాలో ట్రేడ్ యూనియన్ ఆర్గనైజర్‌గా పని చేశాడు. 2000 సంవత్సరంలో అతను విశాఖపట్నం నగరంలో కార్మికులను ఆర్గనైజ్ చేసే బాధ్యతను స్వీకరించి ఆంధ్ర-ఒరిస్సా స్పెషల్ జోనల్ కమిటీ నాయకత్వంలో పని చేయసాగాడు. సెప్టెంబర్ 2003లో, అమరత్వానికి రెండు నెలల ముందు జరిగిన ప్లీనం అతన్ని ఎస్‌జెడ్‌సి సభ్యునిగా ఎన్నుకుంది. 2001లో అతను కామ్రేడ్ సుగుణను పెళ్లి చేసుకున్నాడు. ఈ ఇద్దరు కామ్రేడ్లను ఒక ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్టోబర్ 24న విశాఖపట్నంలోని ఒక ఇంట్లో అరెస్టు చేశారు. మరుసటి రోజు ఇద్దరినీ గుంటూరు జిల్లాలో దారుణంగా కాల్చి చంపి ఎప్పటిలాగే ఎన్‌కౌంటర్ కథనల్లారు.

కామ్రేడ్ కౌముది రాసిన గొప్ప భావోద్వేగ కవిత్వం ఎప్పటికీ నిల్చిపోతుంది. ఒక కవితలో అతను ఒకనాడు ఎన్‌కౌంటర్లో తానెలా చంపెయ్యబడతాడో, ఏ లక్ష్యం ఈ అత్యున్నత త్యాగానికి తనను పురికొల్పిందో చెబుతాడు. అతను తన తల్లితో కన్నీళ్లు పెట్టొద్దని చెబుతాడు. తన అమరత్వానికి గర్వించుమని కోరతాడు. అందులో అతడు తన చెల్లెళ్లను ఒక గొప్ప పోరాటానికి సిద్ధంగా ఉండమని కోరతాడు. తాను తన తల్లి చేతిలో కత్తిగా, డాలుగా తిరిగి వచ్చే రోజును నిరీక్షించమని చెబుతాడు. ఆయన కోట్లాది శ్రమజీవుల ఆకలి, దారిద్ర్యాల గురించి రాసినా, వ్యక్తుల పట్ల ఆత్మీయతను వ్యక్తం చేస్తూ రాసినా, పోలీసు రాజ్యం అమలు చేస్తున్న నిర్బంధ క్యాంపెయిన్ల గురించి చెప్పినా లేదా కార్మికవర్గపు చారిత్రక కర్తవ్యం గురించి రాసినా, ఏది రాసినా అందులో మానవీయ స్పర్శ అనుభూతి తప్పక కలుగుతుంది. పాఠకులకు భావోద్వేగ ప్రేరణను కలిగిస్తాయతని కవితలు. పాఠకులనవి విప్లవోత్తేజపు అంతులేని శిఖరాల దాకా తీసుకెళ్తాయి.

కామ్రేడ్ కౌముది మరణంతో విప్లవోద్యమం ఒక గొప్ప కార్మికవర్గ ఆర్గనైజర్‌ను కోల్పోయింది. విప్లవ సాహిత్యజగత్తు ఒక గొప్ప స్వాప్నికుడినీ, సృజనాత్మక రచయితనూ కోల్పోయింది.

కామ్రేడ్ కౌముది మరణవార్త వినగానే వేలాది మంది ఆయనను చివరిసారి చూడడానికి తరాలపల్లికి చేరుకున్నారు. ప్రజలలో మంచి పేరున్న నాయకుడాయన. అతని అంత్యక్రియల దృశ్యం అందరి హృదయాల్నీ కలచివేసింది. తరాలపల్లి గ్రామాన్నంతా ఎర్ర బ్యానర్లతో, జెండాలతో అలంకరించారు. 27వ తేదీన జరిగిన ఆయన అంత్యక్రియలలో పాల్గొనడానికి చాలా మంది రచయితలు కూడా తరాలపల్లి చేరుకున్నారు. పోలీసులు ప్రజలను రాకుండా నిరోధించడానికి గ్రామానికి వచ్చే దారులన్నీ మూసేసి వాహనాల్ని సోదా చేశారు. అయినప్పటికీ ప్రజలు అడ్డంకులన్నీ ఛేదించుకొని ఆ అమరవీరుడిని కడసారిగా చూసుకోవడానికి వచ్చారు. విప్లవ రచయితలు ఆయన శవం ముందు నిలబడి ఆయన రాసిన కవితలు చదివి వినిపించారు. పేద ప్రజల కోసం జీవించి వాళ్ల కోసమే చనిపోయిన ఇలాంటి కొడుకును కన్నందుకు నాకు గర్వంగా ఉందని ఆయన తల్లి మాట్లాడింది. తన కొడుకు హత్యకు ప్రజలు తప్పక బదులు తీర్చుకుంటారని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. శవాన్ని తీసుకొని ఊరేగింపు మొదలవ్వగానే విప్లవ గీతాలతో, నినాదాలతో మొత్తం గ్రామమంతా మారుమోగింది. "బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించండి", "కామ్రేడ్ కౌముది అమర్ రహే", "అమరవీరుల హత్యలకు బదులు తీర్చుకుందాం", "ఒక యోధ మరణిస్తే వేల కొలది ప్రభవింతురు" అంటూ ప్రజలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ★

## కామ్రేడ్ సుగుణ – ప్రజాదరణ గల మిలిటెంట్ నాయకురాలు

పార్టీలో రాధక్క, లత అనే పేర్లతో ప్రజాదరణ పొందిన కామ్రేడ్ సుగుణ గత రెండు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమంలో పని చేస్తూ వచ్చింది. 1974-76లో మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల పట్టణంలో ఇంటర్మీడియట్ చదువుతూ ఆమె విప్లవ రాజకీయాల్లో ప్రవేశించింది. ఆమె తండ్రి రామిరెడ్డి కర్నూల్ జిల్లా మిత్తూర్ గ్రామం నుండి గద్వాలకు వచ్చి స్థిరపడ్డాడు. ఆయన ఎల్ఐసీలో డెవలప్‌మెంట్ అధికారిగా పని చేసేవాడు. ఆయన మార్క్సిస్టు-లెనినిస్టు రాజకీయాలను సమర్థించేవాడు, సీపీ రెడ్డి అనుయాయుడు. అందుకే ఆయన తన పిల్లలను ప్రగతిశీల సాహిత్యం చదివేలా, కార్యకలాపాలలో పాల్గొనేలా బాగా ప్రోత్సహించాడు.

ఎమర్జెన్సీ చీకటిరోజుల్లో ఆమె తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. 18 నెలల పాటు జైల్లో నిర్బంధించారు. ఇంట్లో సంపాదించేవాడు తనొక్కడే కావడం వల్ల ఆయన అరెస్టుతో కుటుంబం ఆర్థికంగా అనేక చిక్కుల్నెదుర్కోవల్సి వచ్చింది. పిల్లల చదువులు ఆగిపోయాయి. కామ్రేడ్ సుగుణ ఇంటర్మీడియట్ చదువు కూడా దాదాపు రెండేళ్లు నిలిచిపోయింది.

ఆ పట్టణంలో ఆర్గనైజేషన్ మొదలవగానే దానిలో చేరిన మొట్ట మొదటి మహిళా కామ్రేడ్లు సుగుణా, ఆమె చెల్లెల్లే. కామ్రేడ్ సుగుణ అందరితోనూ కలుపుగోలుగా ఉండేది. ఆమె చాలా మంది విద్యార్థినీవిద్యార్థులనూ, స్నేహితులనూ ఆర్ఎస్‌యూలో చేర్పించింది.

విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు ఆమె సమర్థవంతంగా నాయకత్వం వహించింది. ఆ రోజుల్లో విద్యాలయాల్లో మహిళలనూ, గ్రామీణ నేపథ్యం గల విద్యార్థులనూ పలు రకాలుగా వేధించేవాళ్లు. సుగుణా, ఆమె సహచరులూ కలిసి అలాంటి గూండా శక్తులకు వణుకు పుట్టించారు. కామ్రేడ్ సుగుణలోని మిలిటెంట్ స్వభావం వల్లనే విద్యార్థులు పలు విజయాలు సాధించగలిగారు.

కొద్ది కాలంలోనే ఆమె బాగా గుర్తింపు పొందిన విద్యార్థి నాయకురాలిగా ఎదిగింది. అనేక మంది విద్యార్థులను ఆర్గనైజ్ చేసింది. కేవలం విద్యార్థుల సమస్యల వరకే పరిమితం కాకుండా ఆమె శ్రామిక మహిళలను కూడా ఆర్గనైజ్ చేసింది. వాళ్ల కోసం రాత్రి పాఠశాలలను నడిపింది. అందులో టీచర్లుగా పని చేసేలా తన తోటి విద్యార్థులను ప్రోత్సహించింది. ఆమె శ్రావ్యంగా పాటలు కూడా పాడేది. దాంతో ఆమె అనేక మంది విద్యార్థి, యువజనులకు సాంస్కృతిక రంగంలో పని చేసేందుకు ప్రేరణనిచ్చింది.

బ్లాక్ మార్కెటింగ్‌కు వ్యతిరేకంగా ఆ పట్టణంలో ఒక పెద్ద ఉద్యమం రాగా కామ్రేడ్ సుగుణ దానికి సమర్థవంతంగా నాయకత్వం వహిస్తూ దొంగ వ్యాపారుల అక్రమ నిల్వలపై దాడులు చేసి సామాన్లు ప్రజలకు పంచిపెట్టింది. అధికధరలకు వ్యతిరేకంగా గానీ, ఇంకా అనేక సమస్యలపై జరిగిన ప్రజా ఉద్యమాలకు కామ్రేడ్ సుగుణ ముందు వరుసలో నిలబడి నాయకత్వం వహించింది. ఒకసారి ఆ పట్టణంలో జరుగాల్సి ఉన్న జననాట్యమండలి కార్యక్రమానికి అనుమతినివ్వడానికి ఆర్‌డీవో నిరాకరించగా సుగుణ నాయకత్వంలో మహిళలు వాడిని రెండు గంటల పాటు ఘెరావ్ చేశారు. దాంతో వాడికి అనుమతి మంజూరు చేయక తప్పింది కాదు. 'గ్రామాలకు తరలండి' అంటూ పార్టీ విద్యార్థియువజనులకు పిలుపునివ్వగా కామ్రేడ్ సుగుణ కొంత మంది విద్యార్థులను వెంటేసుకొని అప్పటి గద్వాల తాలూకాలోని అనేక గ్రామాలు పర్యటించింది. పట్టణ మధ్య తరగతి నేపథ్యం ఉన్నప్పటికీ ఆమె రైతాంగంలో బాగా కలగలిసి పోయేది.

1983లో ఆమె పార్టీ సెల్ సభ్యురాలైంది. పట్టణంలో విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేయడంలో ఆమె ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. పట్టణంలో ప్రతి ఒక్కరికీ సుగుణ సుపరిచితురాలే. ఆమెకు ప్రజలలో ఉన్న పలుకుబడిని చూసి పోలీసులు అరెస్టు చేయడానికి భయపడేవాళ్లు. 1985లో డిగ్రీ పూర్తవగానే ఆమె పూర్తికాలం విప్లవకారిణి అయ్యింది. ఆ తర్వాత ఆమె రాయచూర్ లా కాలేజీలో అడ్మిషన్ తీసుకున్నప్పటికీ పార్టీ ఆమెను రహస్య జీవితానికి వెళ్లాల్సిందిగా కోరగానే దాన్ని అర్ధాంతరంగా వదిలేసింది.

మొదట్లో పార్టీ పూర్తికాలం పనిచేసే మహిళా కామ్రేడ్లకు తగిన పని ఇవ్వలేకపోయేది. దానితో ఆమె మొట్టమొదట షెల్టర్‌లోనే ఉండాల్సి వచ్చింది. అప్పుడు ఆమె తనను అటవీ ప్రాంత దళాల్లోకి పంపించాల్సిందిగా పార్టీని కోరింది. తర్వాత ఆమెను పార్టీ నల్లమల అడవులలోకి పంపించింది. కొద్ది కాలంలోనే ఆమె 'అరుణక్క'గా చెంచు మహిళల్లో మంచి పేరు సంపాదించింది.

కామ్రేడ్ సుగుణ మన పార్టీలో మొట్టమొదటి మహిళా కమాండర్. తన జీవిత భాగస్వామి కామ్రేడ్ సుదర్శన్ చెరువులో మునిగిపోతున్న తోటి కామ్రేడ్‌ను రక్షించబోయి తాను కూడా మునిగి అమరుడైన తర్వాత కామ్రేడ్ సుగుణలో చివరి ఊపిరి ఉన్నంత దాకా పోరాడాలన్న సంకల్పం మరింత గట్టిపడింది. 1989లో నల్లమల దళానికి కమాండర్‌గా ఎన్నికైంది. అటవీ ప్రాంతంలో ఉండే కఠినమైన పరిస్థితులకు అనుగుణంగా ఆమె తనను తాను మల్చుకుంది. పలు మార్లు మలేరియా, టైఫాయిడ్‌ల బారిన పడడం, సరైన తిండి దొరకకపోవడం వంటి సమస్యలేవీ ఆమె పట్టుదలను ఏ మాత్రం ప్రభావితం చేయలేకపోయాయి. ఆమె పట్టణ జీవితం నుండి వచ్చినదైనప్పటికీ శారీరకంగా, మానసికంగా అనేక ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొంది. తన్ను తాను ఎదిగించుకోవడానికి పట్టుదలగా కృషి చేసింది. ఒక కార్మికవర్గ విప్లవకారిణిగా తనను తాను మల్చుకొని ప్రజలతో మమేకం కావడానికి ఆమె నిరంతరాయంగా చైతన్యపూరితంగా కృషి చేసింది. ఈ క్రమంలో ఆమె సీరియస్ అనారోగ్య సమస్యలనెదుర్కోవల్సి వచ్చింది. ఆమెకు తరచూ ఫిట్స్ కూడా వస్తూండేవి. అయినా కూడా ఆమె అటవీ ప్రాంతాన్ని వదిలి బైటికి పోవాలని కోరుకోలేదు. చెంచు మహిళల జీవితంపై ఆమె వ్యాసాలు రాసింది. ఆమె విప్లవ కవయిత్రి కూడా. ప్రజల జీవితాలపైనా, అమరవీరులపైనా ఆమె ఎన్నో కవితలూ, పాటలూ రాసింది.

ఆ తర్వాత మెదక్ జిల్లాకు వచ్చి ఇందుప్రియాల్ దళానికి కమాండర్‌గా పని చేసింది. కొంత కాలం తర్వాత ఆమె జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎన్నికైంది. 1999లో ఆ జిల్లాను వదిలిపెట్టే దాకా ఆమె రెండు బాధ్యతలనూ నిర్వర్తించింది. ఆ సమయంలో తెలంగాణా ప్రాంతంలో క్రూర నిర్బంధం అమలవుతూ ఉండింది. ఇండ్లల్లో షెల్టర్ తీసుకునే దళాలకు దళాలే శత్రు దాడుల్లో పూర్తిగా దెబ్బతినసాగాయి. అయినప్పటికీ కామ్రేడ్ సుగుణ ఎప్పుడూ ప్రజలను వదిలిపెట్టలేదు. ఆమె పార్టీ శ్రేణులలో, ప్రజలలో విశ్వాసాన్ని పెంపొందింపజేసింది. అక్కడ ప్రతి రోజూ యుద్ధం వంటి వాతావరణం నెలకొని ఉండేది. ఎప్పుడు ఎక్కడ శత్రువు శత్రు దాడినెదుర్కోవల్సి వస్తుందో తెలియని పరిస్థితి. ఇలాంటి పరిస్థితిలో ఆమె జీవిత భాగస్వామి పోలీసుల చేతిలో చిక్కి జైలు పాలయ్యాడు. (తన మొదటి జీవిత భాగస్వామి అమరుడైన తర్వాత ఆ కామ్రేడ్‌ను కామ్రేడ్ సుగుణ పెళ్లి చేసుకుంది.) చాలా ఏళ్ల పాటు ఆయనను పోలీసులు జైల్లోనే ఉంచారు. ఇలాంటి పరిస్థితిలో మరో పెళ్లి చేసుకోవాలా వద్దానని ఆమెలో తీవ్రమైన అంతర్గత సంఘర్షణ జరిగింది. జీవిత భాగస్వామి శత్రు నిర్బంధంలో చిక్కి ఎప్పుడు విడుదలవుతాడో ఏ మాత్రం తెలియని పరిస్థితిలో మరో పెళ్లి చేసుకునే హక్కు మహిళకు ఉండాలని పార్టీలో పోరాడిన మొదటి కామ్రేడ్ ఆమె.

ఆ తర్వాత ఆమె గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యింది. అక్కడ శత్రువుకు వ్యతిరేకంగా చేపట్టిన ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్‌లో ఆమె చాలా ప్రముఖ పాత్ర పోషించింది. ఆ జిల్లాలో మొట్టమొదటి సారి రామిడిచెర్ల వద్ద పోలీసులపై ఆంబుష్ చేసి ఏడుగురిని మట్టుబెట్టిన ఘటనకు ఆమె నాయకత్వం వహించింది. ఆ జిల్లాలో కొందరు కామ్రేడ్లు పార్టీలోంచి వెళ్లి పోతుండగా, పార్టీలో అంతర్గత సమస్యలు తీవ్రమైన పరిస్థితిలో ఒక నాయకురాలిగా కామ్రేడ్ సుగుణ చాలా బాధ్యతాయుతమైన పాత్రను పోషించింది. ఆ విధంగా పార్టీ శ్రేణుల విశ్వాసాన్ని గెల్చుకుందామె. కామ్రేడ్ సుగుణ అమరత్వం ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమానికీ, దేశంలో సాగుతున్న విప్లవోద్యమానికీ చాలా పెద్ద నష్టం. ★

## కామ్రేడ్ విశ్వం – దోపిడీ వ్యవస్థపై పెన్నునూ, గన్నునూ ఎక్కుపెట్టిన యోధుడు

కామ్రేడ్ విశ్వం వరంగల్ జిల్లాలోని తిమ్మాపూర్ గ్రామంలో పుట్టాడు. నగరానికి సమీపంలో గల ఈ గ్రామంపై మొదటి నుండీ విప్లవ రాజకీయాల ప్రభావం ఉంది. నగర విద్యార్థులు 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌ను ప్రారంభించిన తర్వాత నుండి ఈ గ్రామానికి విప్లవోద్యమంతో ప్రత్యక్ష సంబంధాలేర్పడ్డాయి. ఇంట్లో ఆయన పేరు జనార్ధన్. ఆయన మిత్రులంతా ఉన్నత చదువులు చదివి కెరియర్ కోసం ప్రయత్నిస్తుంటే కామ్రేడ్ జనార్ధన్ అన్నిటినీ వదిలి సృజనాత్మక రాజకీయాలను తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్నాడు. సృజనాత్మక రాజకీయాలంటే ఆయన దృష్టిలో విప్లవ రాజకీయాలే. అమరులు రామకృష్ణ, నాగేశ్వరరావులకు ఆయన సమకాలికుడు. ఈ కామ్రేడ్లను ప్రభుత్వం 1986లో ఒక బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపింది. వాళ్లు

అమరులైనప్పుడు కామ్రేడ్ జనార్దన్ 'లాల్ సలాం' అనే శీర్షికతో ఒక కవిత రాశాడు. 1984-90 మధ్య కాలం ఎన్‌టీఆర్ ప్రభుత్వం ఆట, మాట, పాటలపై అప్రకటిత నిషేధం విధించిన కాలం. బహిరంగ కార్యకలాపాలకు ఎలాంటి అవకాశాలు లేని కాలం. అయితే ఈ కాలంలో కామ్రేడ్ జనార్దన్ సాహిత్య రచనను కొనసాగించాడు. ఆయన విప్లవ రచయితల సంఘానికి వరంగల్ జిల్లా కన్వీనర్‌గా ఉంటూ తోటి రచయితలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేశాడు. 1990లో వరంగల్ నగరంలో జరిగిన రైతుకూలీ సంఘం చారిత్రాత్మక మహాసభల నిర్వహణలో కా. జనార్దన్ క్రియాశీలంగా పాల్గొన్నాడు. ఈ మహాసభలకు లక్షలాది ప్రజలు హాజరయ్యారు. విప్లవోద్యమ చరిత్రలోనే చిరకాలం నిల్చిపోయే ఈ సభల నిర్వహణ కోసం వందలాది కార్యకర్తలు నెలల పాటు అవిశ్రాంతంగా కృషి చేశారు. ఈ క్రమంలో కామ్రేడ్ జనార్దన్ శత్రువుకు కంటిలో నలుసయ్యాడు.

నిజాయితీ, కర్తవ్యదీక్ష కామ్రేడ్ జనార్దన్ ఒక గొప్ప కార్యకర్తగా తీర్చిదిద్దాయి. ఒక రచయితగా, కవిగా సున్నిత మనస్కుడైన కామ్రేడ్ జనార్దన్‌ను వర్గ పోరాటం ఒక పరిణతి చెందిన సాహిత్య, రాజకీయ కార్యకర్తగా తీర్చిదిద్దింది. రోజురోజుకీ ప్రభుత్వ నిర్బంధం పెరుగుతుండడంతో ఇక బహిరంగంగా పనిచేసే అవకాశాలేవీ లేకుండా పోవడంతో ఆయన అజ్ఞాతంలోకి వచ్చి పూర్తికాలం కార్యకర్తగా మారాడు.

విశాఖ నగరంలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆయన విశ్వం పేరుతో, ఇంకా అనేక మారుపేర్లతో ప్రజల మధ్య పని చేశాడు. ఒక దశాబ్దానికి పైగా కార్యకర్తగా, నాయకుడిగా, ప్రజలకు మార్గదర్శకత్వం వహించే మేధావిగా ఆయన పీడిత ప్రజల మధ్యనే జీవించాడు... పని చేశాడు. అతనిలోని సున్నితత్వం సాహిత్య రచనలో, విప్లవాచరణలో మానవ సంబంధాల అవగాహన రూపంలో వ్యక్తమవుతుండేది. ఆయన తన సూటియైన విమర్శకూ, లోతైన పరిశీలనకూ ఎప్పుడూ విప్లవ ప్రయోజనాన్నే గీటురాయిగా ఎంచుకున్నాడు. బహిరంగంగా ఉన్నప్పుడు గానీ, అజ్ఞాత జీవితానికి వెళ్లాక గానీ ఆయన ప్రతి క్షణం ప్రజల కోసం పని చేశాడు... తన శక్తినంతా విప్లవ ప్రయోజనం కోసమే కేంద్రీకరించాడు.

ఒక చేత్తో పెన్నునూ, మరో చేత్తో గన్నునూ పట్టి పోరాడి అమరులైన సుబ్బారావు పాణిగ్రాహి, ఆయన వారసత్వాన్ని కొనసాగించిన సముద్రుడు, ఎమ్మెస్సార్, భూమిపుత్రుడు, తదితరుల సరసన ఇప్పుడు కౌముది, విశ్వంలు కూడా చేరిపోయారు. ఒకే సమయంలో తమ జిల్లాకు చెందిన ఈ ఇద్దరు యువ విప్లవ రచయితలు అమరులవడంతో వరంగల్ జిల్లా పీడిత ప్రజానీకం తీవ్రంగా కలత చెందింది. ఈ ముగ్గురు కామ్రేడ్ల అమరత్వం విప్లవోద్యమానికి, ప్రత్యేకించి విప్లవ సాహిత్యోద్యమానికి చాలా నష్టదాయకమే. ✶

# దండకారణ్య అమరులు కామ్రేడ్స్ బిచ్చూ, సోమాల్‌లకు జోహార్లు !

## కామ్రేడ్ బిచ్చూ ఆత్రం

కామ్రేడ్ బిచ్చూ గడ్చిరోలి జిల్లా పెరిమిలి ఏరియాలోని గట్టపల్లి గ్రామానికి చెందిన వాడు. ఈ కామ్రేడ్ గత ఫిబ్రవరి నెలలో అనారోగ్యంతో అమరుడయ్యాడు. 1997 నుండీ ఈ కామ్రేడ్ ప్రజా సంఘంలో పని చేస్తూ వచ్చాడు. తీవ్ర నిర్బంధం కారణంగా ప్రజలు సంఘాల్లో చేరడానికి బాగా భయపడే కాలంలో కామ్రేడ్ బిచ్చూ ధైర్యంగా ముందుకొచ్చి తన గ్రామంలో సంఘాన్ని పునఃస్థాపించాడు. 2000లో ఆయనను డీఏకెఎంఎస్ రేంజ్ కమిటీ నాయకుడిగా ఎన్నుకున్నారు. 2001లో ఆయన పార్టీ సభ్యుడయ్యాడు. ఆయన సంఘంలో చాలా క్రియాశీలంగా పని చేసేవాడు. తన నుండి ఎలాంటి తప్పులు జరిగినా తన కమిటీలో వినయంగా ఆత్మవిమర్శ చేసుకునే వాడు. పార్టీ ఏ పని అప్పగించినా తన ఇంటి పనులన్నీ పక్కన బెట్టి పూర్తి చేసేవాడు. ఈ ప్రాంతంలో శత్రువును చికాకుపర్చడంలో భాగంగా జరిగిన అనేక చర్యలలో ఆయన క్రియాశీలంగా పాల్గొన్నాడు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ పార్టీ చక్కాజాంకు పిలుపునివ్వగా కామ్రేడ్ బిచ్చూ ప్రజలను కదిలించి అమలు చేశాడు. పోలీసు నిర్బంధం తీవ్రతరమవడంతో ఆయన పూర్తికాలం విప్లవోద్యమంలో పని చేయడానికి సిద్ధమయ్యాడు. పెరిమిలి ఏరియాలోని కనీసం 10-15 గ్రామాల్లో ఆయన ప్రజా సంఘ కార్యకలాపాలకు బాధ్యత వహించాడు. ఆయన ప్రజలతో నమ్రతగా వ్యవహరించేవాడు. నాయకుడినన్న అహం ఆయనలో కానవచ్చేదే కాదు. ఆయన మరణంతో ఈ ప్రాంత ఉద్యమానికి చాలా నష్టం జరిగింది. అనారోగ్యం ఆయన్ను మన నుండి భౌతికంగా దూరం చేసింది. దోపిడీ ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా ఆదివాసీ ప్రాంతాల్లో ప్రజలు చిన్న చిన్న రోగాలతో అకాల మరణాల పాలు కావడం సాధారణమైన విషయం. కామ్రేడ్ బిచ్చూ స్మృతిలో ఈ ప్రాంత ప్రజలు సభను జరుపుకున్నారు. ఇందులో అనేక గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. సభలో పార్టీ, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. ✶



కామ్రేడ్ బిచ్చూ

## కామ్రేడ్ సోమాల్

దక్షిణ బస్తర్ డివిజన్ కిష్టారం రేంజ్ ఎల్మగొండ గ్రామ వాసియైన కామ్రేడ్ పొడియం సోమాల్ కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో అసువులు బాశాడు. అతను బాలల సంఘంలో సభ్యుడైన నాటి నుండి విప్లవోద్యమంలో పాల్గొంటూ వచ్చాడు. ఈ గ్రామ సర్పంచ్ పాండుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సోమాల్ ముందు నిలబడ్డాడు. పాండు ప్రజా వ్యతిరేకిగా ఉండేవాడు. గ్రామంలో కామ్రేడ్ సోమాల్‌తో పాటు ప్రజా సంఘంలో పని చేసిన కామ్రేడ్లలో చాలా మంది వెనక్కి తగ్గడమో లేదా పతనమవడమో జరిగినప్పటికీ ఆయన మాత్రం చివరి దాకా విప్లవోద్యమాన్ని అంటిపెట్టుకొని ఉన్నాడు. పార్టీ నిర్వహించిన పలు రాజకీయ, మిలిటరీ శిక్షణా తరగతుల్లో ఆయన విద్యార్థిగా పాల్గొన్నాడు. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, పొలం పనులు చేస్తూనే పార్టీ అప్పగించిన పనులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చేవాడు. ఆయన గ్రామంలో పార్టీ సభ్యుడిగా, గ్రామ రక్షణ దళం కమాండర్‌గా ఎదిగాడు. కామ్రేడ్ సోమాల్ అమరత్వం గ్రామ ప్రజలను బాగా కదిలించింది. ప్రజలందరూ ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన శవంపై ఎర్రజెండా కప్పి విప్లవ సాంప్రదాయాలతో ఊరేగింపుగా వెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆయన స్మృతిలో ప్రజలు ఒక పాట కూడా రాసి పాడారు. స్థానిక కిష్టారం ఏరియా కమిటీ కామ్రేడ్ సోమాల్‌కు జోహార్లర్పించి ఆయన లక్ష్యాన్ని పరిపూర్తి చేయడానికై ప్రతిన పూనింది.✶

శ్రద్ధాంజలి

*ఫాసిస్టు చంద్రబాబు నాయుడి కావలి కుక్కలైన గ్రేహౌండ్స్‌తో వీరోచితంగా పోరాడుతూ అమరురాలైన*

# వీరనారి కామ్రేడ్ పోర్తేటి పెంటీ (స్వరూప)కి లాల్ సలాం !

కోరాపుట్ రెయిడ్ నిమిత్తం ఏర్పడిన స్పెషల్ కంపెనీలో సభ్యురాలైన కా.స్వరూప నవంబర్ 17 తేదీన అమరురాలైంది. స్పెషల్ కంపెనీ బ్యాచ్ ఆనుపానులు పసిగట్టిన బత్‌నూర్ గ్రామ ఇన్‌ఫార్మర్ పిజిఏ గెరిల్లాలను నమ్మించి రహస్యంగా పోలీసులను తీసుకువచ్చాడు. గుట్టుచప్పుడు కాకుండా వచ్చిన పోలీసులు హఠాత్తుగా దళంపై ఫైరింగ్ చేశారు. ఈ ఫైరింగ్‌లో కామ్రేడ్ స్వరూప కాలుకు తూటా తగిలి కదలలేని పరిస్థితిలో అక్కడే ప్రోన్ పొజిషన్ తీసుకుంది. రెండు గంటల సేపు గ్రేహౌండ్స్ బలగాలతో వీరోచితంగా పోరాడుతూ అమరురాలైంది. ఈ వీరోచిత పిజిఏ యోధకు మా ఎర్రెర్రని జోహార్లు.



కా.స్వరూప గడ్‌చిరోలి జిల్లా ఐరి ఏరియాలోని కరంచ అనే గ్రామంలో ఒక పేద రైతు కుటుంబంలో 22 ఏళ్ల క్రితం పుట్టింది. తల్లితండ్రులు ఒక కొడుకులాగ పెంచి పెద్ద చేశారు. స్వరూపకు ఒక చెల్లెలు, ఒక తమ్ముడు ఉన్నారు. కరంచ గ్రామం మొదటి నుండీ పార్టీకి ప్రాణం లాంటి గ్రామం. ఇలాంటి గ్రామంలో పుట్టిన స్వరూప పోరాటాల మధ్యే పుట్టి పెరిగిందనాలి. ఆ పోరాట యోధురాలు చిన్నప్పటి నుండి పార్టీ సంబంధంలో ఉంటూ ఎంతో ప్రభావితమైంది. చిన్ననాటి నుండీ స్వరూపకు పోరాట పాటలన్నా, కథలన్నా ప్రాణం. ఎంతో ఉత్సాహంగా, చురుకుగా ఉండే స్వరూప బాలల సంఘంలో సభ్యురాలైంది. పెరిగి పెద్దయ్యాక కెఎయంఎస్‌లో చేరి చురుగ్గా పనిచేయసాగింది. కా.స్వరూపను దళంలోకి పూర్తికాలం కార్యకర్తగా రావాలి అని పార్టీ చెప్పడంతో ఎలాంటి శషభిషలు లేకుండా పార్టీలోకి వచ్చింది. కా.స్వరూప 2000 సంవత్సరం మధ్యలో దళంలోకి వచ్చింది. పిజిఏ సభ్యురాలైంది. ఇదే గ్రామం నుండి కా.లక్ష్మి కూడా వచ్చింది. ఇద్దరూ మంచి స్నేహితులు. ఒకేసారి దళంలోకి వచ్చారు. కానీ కా.లక్ష్మి దళంలోకి వచ్చిన ఒక నెల రోజుల్లోనే చాముర్షి ఏరియాలో ఒక ఫైరింగ్‌లో అమరురాలైంది. ఈ సంఘటన కా.స్వరూపలో మరింత పట్టుదలను పెంచింది. తానూ లక్ష్మిలాగే పోరాడుతూ చివరివరకు ఉద్యమంలో నిలబడాలని, ప్రజల కోసం ప్రాణమివ్వాలని నిర్ణయించుకొంది. పార్టీ నిర్ణయం ప్రకారం 2001 నుండి ప్లాటూన్-3లో సభ్యురాలిగా ఉంటూ, అనారోగ్య సమస్యలున్నా లెక్కచేయకుండా, తన కర్తవ్య నిర్వహణలో ముందుంటూ వచ్చింది.

కామ్రేడ్ స్వరూప దండకారణ్య ప్రాంతంలో పిజిఏ నాయకత్వంలో జరిగిన పలు దాడుల్లో పాలుపంచుకొంది. 2001లో ఇక్కడ చేపట్టిన మొదటి టిసిఓసిలో భాగంగా బాందే రెయిడ్‌లో తనకు అప్పగించిన బాధ్యతలను ధైర్యంగా నిర్వహించింది. అలాగే గడ్‌చిరోలి డివిజన్‌లోని కోఠి దగ్గర ఎస్‌పి రాజ్‌వర్ధన్ కాన్వాయ్‌పై జరిగిన ఆంబుష్ సందర్భంగా కూడా ధైర్యంగా నిలిచి పోరాడింది. సిరొంచ ఏరియాలో మన ఆర్గనైజేషన్ వర్క్ తిరిగి ప్రారంభించాలని పార్టీ ఎల్‌జిఎస్‌ను పంపినపుడు, ఇది తెలిసిన ఆంధ్రా పోలీసులు దళాన్ని ఆదిలోనే తుదముట్టించాలని అడ్డుకొనే ప్రయత్నాలు చేశారు. దాడులకు దిగారు. దీన్ని గ్రహించిన పార్టీ శత్రు దాడులను నిలువరించడానికి పిఎల్-3, ఎల్‌జిఎస్‌లను కలిపి పంపించింది. ఆ సందర్భంగా జరిగిన 'కొప్పెల' ఆంబుష్‌లో కూడా కా. స్వరూప ధైర్యంగా పోరాడుతూ నిలిచింది.

పార్టీపై శత్రువు సాగించే నిరంతర దాడులను ఎదుర్కోవాలంటే మన బలగాలకు సైనికపరంగా ప్రత్యేక కేంద్రీకరణ, శిక్షణ అవసరం అని భావించిన పార్టీ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను తయారు చేయాలనుకుంది. ఆ శిక్షణా క్యాంపుకు పిఎల్-3 నుండి కా.స్వరూప విద్యార్థినిగా ఎంపికయింది. పార్టీలో, ముఖ్యంగా మన దండకారణ్యంలో పెరుగుతున్న పిజిఏ బలగాలకు ఆయుధాల అవసరం ఎంతైనా ఉంది. ఈ అవసరాలను తీర్చుకోవడానికి పార్టీ కొన్ని సైనిక దాడులు చేయాలని నిర్ణయించుకుంది. అలా గీదం పోలీసు స్టేషన్‌పై జరిగిన రెయిడ్‌లో కా.స్వరూప స్టాఫ్ పార్టీ సభ్యురాలిగా ఉండి, శత్రువును అడుగు ముందుకు వేయనీయకుండా వీరోచితంగా నిలువరించింది.

కా.స్వరూప పేద కుటుంబంలో జన్మించినందున చదువుకోలేక పోయింది. ఇంటి పనుల్లో తల్లితండ్రులకు కొడుకూ, కూతురూ అంతా తానే అన్నట్లు తోడుగా ఉండేది. ఆ శ్రమజీవి పార్టీలోకి వచ్చి అదే ఆదర్శాన్ని నిలబెట్టుకొంది.

కేంద్ర రాష్ట్ర బలగాలు సమన్వయంతో, సంఘటితంగా సాగిస్తున్న దాడులను తిప్పికొట్టడానికి పిజిఏ ఉన్నత నిర్మాణాలు ఏర్పర్చుకోవలిసిన సమయంలో కా.స్వరూప లాంటి సాహసవంతురాలైన సైనిక కార్యకర్తను, యువ మహిళా గెరిల్లాను కోల్పోవడం మన పార్టీకి ముఖ్యంగా పిజిఏకు ఎనలేని లోటు. అమరవీరుల పోరాట సాంప్రదాయాన్ని నిలబెట్టి రక్తాన్ని ధారపోసిన కా.స్వరూప ఎర్రజండాను మరింత ఎరుపెక్కించి మరో వేగుచుక్కగా నిలిచింది. ఈ దోపిడీ సమాజాన్ని మార్క్సిజం-లెనినిజం-మావోయిజం గైడెన్స్‌లో నిర్మూలించి నూతన సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో కా.స్వరూప పార్టీలోకి వచ్చింది. ఆ లక్ష్య సాధన కోసం ఎన్నో కలలు కన్నది. ఆ అమరురాలి కలల్ని నిజం చేయడానికి పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడమే ఆమెకు అర్పించే నిజమైన శ్రద్ధాంజలి. కా.స్వరూప ఆశయాలను నెరవేర్చుతామని మరోసారి ప్రతినబూనుదాం.

***కా. పెంటీ (స్వరూప) అమర్ హై !***

*(......... చివరి పేజీ తరువాయి)*

దేరారు. బాగా దూరం ఉన్న గ్రామాల వాళ్లు దాదాపు వారం రోజుల ముందే కాలినడకన బయలు దేరారు. జట్లు జట్లుగా బయలు దేరిన జనం తమ వెంట బియ్యం, ఉప్పు, కారం తదితర తిండి సామాన్లూ, వంట గిన్నెలు కూడా తెచ్చుకున్నారు. అంతా 9 సాయంత్రానికల్లా నేల్‌నార్‌కు చుట్టూ ఉన్న పలు గ్రామాలలో పోగయ్యారు. ఇక వాగుల్లో, సెలయేటి తీరాలపై బస చేసిన ప్రజలు ఎక్కడి వాళ్లక్కడే 10వ తేదీ ఉదయం వంటలు వండుకొని తిని ఆఖరు మజిలీయైన నేల్‌నార్ వైపుగా నడక సాగించారు. అప్పటికి నేల్‌నార్‌లో ప్రజా సంఘాల కార్యకర్తలు సభా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటల నుండే ప్రజలు నేల్‌నార్‌కు రావడం మొదలైంది. జట్లు జట్లుగా చేతిలో ఎర్ర జెండాలతో, బ్యానర్లతో, ప్లాకార్డులతో నినాదాలు చేస్తూ సభా స్థలానికి చేరుకోవడం మొదలైంది. ప్రతి ఊరి నుండి ప్రజలు తమతో డోలు, నగారా, తుడుం, అక్కుం (కొమ్ము) వంటి సాంప్రదాయ వాయిద్యాల్ని కూడా తెచ్చారు. విశాలమైన స్థలంలో అనేక జట్లుగా విడిది చేసిన ప్రజల పాటలతో, నినాదాలతో, నాట్య ప్రదర్శనలతో మొత్తం వాతావరణమంతా కోలాహలంగా మారింది. మధ్యాహ్నం రెండు గంటలకు ఊరేగింపు మొదలైంది. ఇద్దరేసి చొప్పున బారులు తీరి సాగిన ఆ ఊరేగింపు ఒక కొస నుండి మరో కొస దాకా కొన్ని కిలోమీటర్ల పొడవే అయింది. మొత్తం ప్రజల సంఖ్య 10 వేల దాకా ఉంటుంది. ఇందులో కనీసం 4 వేల మహిళలుంటారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఈ కార్యక్రమానికి రావడం మరో విశేషం. చాలా దూర గ్రామాల నుండి మహిళలు తక్కువ సంఖ్యలో రాగా, పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో వచ్చారు. వందలాది మహిళలు ఒడిలో తమ బిడ్డలనెత్తుకొని మరో చేత ఎర్రజెండా పట్టుకొని ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్న తీరును వర్ణించడానికి మాటలు సరిపోవు. తమ ముందటి తరాలు చేసిన ఒక గొప్ప పోరాట వారసత్వాన్ని ఆ తల్లులు తాము స్వయంగా కొనసాగిస్తూ తమ ఒడిలోని పిల్లలకు కూడా ఉగ్గుపాలతో రంగరించి అందిస్తున్నట్టుగా ఉందా దృశ్యం.

'భూంకాల్ పోరాటం జిందాబాద్', 'వీర గుండాధూర్‌కు జోహార్', 'భూంకాల్ పోరాటాన్ని ముందుకు తీసుకెళదాం', 'నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం', 'ప్రపంచ ప్రజల మొట్టమొదటి శత్రువైన అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలి', 'అమెరికా బలగాలు ఇరాక్ నుండి వెళ్లిపోవాలి', 'ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పుకుందాం', 'దోపిడీ వర్గాల పాలనను కూలదోయాలి' అంటూ గోండీ, హిందీ, హల్బీ తదితర భాషల్లో ప్రజలు పెద్ద పెట్టున చేసిన నినాదాలకు నేల్‌నార్ చుట్టూ పెట్టని కోటల్లా నిల్చిన కొండకోనలు కూడా శృతి కలిపాయి. అనేక గ్రామాల్లోని బాలల సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వందలాది మంది పిల్లలు కూడా చేతిలో జెండాలు పట్టుకొని దూరభారాన్ని లెక్కచేయకుండా ఈ సభకు వచ్చారు. ఊరేగింపు గ్రామానికి ఉత్తర దిశలో ఏర్పాటైన సభా స్థలం నుండి బయలు దేరి గ్రామంలోని ఒక మర్రిచెట్టు దాకా వెళ్లి తిరిగి సభా వేదికకు ఎదురుగా ఉన్న 'భూంకాల్' అమరుల స్తూపం వరకు చేరుకుంది.

నేల్‌నార్ గ్రామంలోని ఈ మర్రిచెట్టుకూ ఒక విశిష్టత ఉంది. నిజానికి నేల్‌నార్ గ్రామం 'భూంకాల్' తిరుగుబాటుకు ఆయువుపట్టుగా నిల్చిన పదుల గ్రామాల్లో ఒకటి. బ్రిటిష్ వాళ్ల అత్యాచారాలకూ, అమానుష హింసాకాండకూ బలైన గ్రామాలలో ఇది కూడా ఒకటి. బ్రిటిష్ వాళ్లు ఈ గ్రామంలో జరిపిన హింసాకాండ ఇప్పటికీ ఈ గ్రామంలోని వృద్ధతరం స్మృతిపథంలో సజీవంగా ఉంది. బ్రిటిష్ సైన్యాలు ఈ గ్రామాన్ని పూర్తిగా కాల్చి వేశారట. అనేక మందిని తుపాకులతో కాల్చి చంపారట. మహిళలపై అత్యాచారాలు జరిపారట. ఇక్కడ ప్రజల రక్తం కాల్వలు గట్టిందట. అయితే ప్రజల రక్తం ధారకట్టిన చోట ఆనాడు ఒక చిన్న మర్రి మొక్క ఉండేదట. బ్రిటిష్ అధికార్లు ఈ రక్తంతో ఈ మొక్క చనిపోతుందనీ, అట్లాగే ఈ హింసాకాండతో 'భూంకాల్' తిరుగుబాటు కూడా అణగిపోతుందనీ వ్యాఖ్యానించారట. అప్పటి తిరుగుబాటు ఓడిపోయింది. అయితే ఆ మొక్క మాత్రం ఇప్పుడు మహా వృక్షమై నిలిచి ఉంది – సరిగ్గా ఈ ప్రాంత ప్రజల్లో స్వాతంత్ర పిపాస, దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాట సంకల్పం నేటికీ సజీవంగా నిల్చినట్టుగానే.

ఊరేగింపు స్తూపం వద్దకు చేరిన తర్వాత ఆ గ్రామ డిఏకెఎంఎస్ అధ్యక్షుడు డిఏకెఎంఎస్ జెండానెగురేసి 'భూంకాల్' పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లు తెలిపారు. ఆ వెంటనే 'చేతనా నాట్య మంచ్' కళాకారుల బృందం 'భూంకాల్' పోరాటంలో అమరులైన ప్రజలకూ, పోరాటకారులకూ, తిరుగుబాటు నాయకులకూ జోహార్లు తెలిపే పాట పాడింది. ఆ తర్వాత సభా వేదికపైకి అధ్యక్షవర్గాన్ని ఆహ్వానించడంతో సభా కార్యక్రమాలు మొదలయ్యాయి. స్థానిక డిఏకెఎంఎస్, కెఏఎంఎస్ నాయకులు అధ్యక్షత వహించిన ఈ సభలో ప్రజా సంఘాల నాయకులూ, పార్టీ నాయకులూ ప్రసంగించారు.

ముందుగా ఏరియా పార్టీ కమిటీ సభ్యుడు కామ్రేడ్ విజయ్ మాట్లాడారు. 'భూంకాల్' పోరాటంలో ఈ ప్రాంత ప్రజలు నిర్వహించిన వీరోచిత పాత్రను గుర్తు చేస్తూ ఆ వారసత్వాన్ని కొనసాగించాలని ప్రజల్ని కోరాడు. నేల్‌నార్, ఝూర, దుర్వేడ తదితర గ్రామాలకు చెందిన అనేక మంది ప్రజలు ఆనాటి పోరాటంలో పాల్గొని తమ ప్రాణాల్ని అర్పించారనీ, అయితే వాళ్లు ఏ దోపిడీపీడనలు లేని సమాజం కోసమైతే కలలు గన్నారో అవింకా పూర్తి కాలేదనీ చెబుతూ, అందుకే నేడు దేశంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమంలో భాగంగా ఈ ప్రాంత ప్రజలు తమ వంతుగా త్యాగాలకు వెనుదీయక పోరాడాలని పిలుపునిచ్చాడు.

ఆ తర్వాత ఏరియా కార్యదర్శి కామ్రేడ్ రాధక్క ప్రసంగించారు. ఆమె తన ప్రసంగంలో నాటి 'భూంకాల్' తిరుగుబాటులో మాడ్ ప్రాంత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారన్న విషయాన్ని ప్రజలకు గుర్తు చేసారు. "భూంకాల్‌కన్నా ముందు జరిగిన పరాల్‌కోట్ తిరుగుబాటులో కూడా మహిళలు గణనీయమైన పాత్రనే పోషించారు. చరిత్రకారులు చెప్పే ప్రకారం ఆ తిరుగుబాటులో ఒక మహిళ ప్రజలకు పోరాటంలో నాయకత్వం కూడా వహించిందట. అట్లాగే 'భూంకాల్' తిరుగుబాటులో మహిళలు మరింత పెద్ద ఎత్తునే పాల్గొన్నారు. నాటి బ్రిటిష్ పాలకులు ఆ పోరాటాన్ని అణచడానికి మహిళలపై అత్యాచారాన్ని ఒక సాధనంగా వాడుకున్నారు. నేటి దళారీ బూర్జువా, భూస్వామ్య పాలకులు కూడా పోరాడే మహిళాశక్తిని నిర్వీర్యం చేయడానికి బ్రిటిష్ పాలకుల విధానాలనే మరింత క్రూరంగా అమలు చేస్తున్నారు. కనుక 'భూంకాల్' అమరుల వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఆ అమరులు కలలు గన్న దోపిడీ లేని వ్యవస్థను నిర్మించేందుకు పురుషులతో సమానంగా మహిళలు కూడా పెద్ద ఎత్తున ముందుకు రావాలి" అంటూ కా. రాధక్క ముఖ్యంగా అక్కడ హాజరైన మహిళాలోకానికి పిలుపునిచ్చారు.

ఆ తర్వాత మాడ్ డివిజన్ పార్టీ కార్యదర్శి కా. పాండు ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో నాటి 'భూంకాల్' పోరాటం ఎట్లా సాగిందీ, ఆనాటి ప్రజల పరిస్థితులేంటీ, ప్రజలపై ఎలాంటి నిర్బంధకాండ సాగిందీ వివరంగా మాట్లాడాడు. "ఈరోజు పాలకవర్గాలు కూడా 'భూంకాల్' నాయకుడైన గుండాధుర్ పేరెత్తుకుంటున్నాయి. అతని పేరిట స్తూపాల్ని కడతామని మాట్లాడుతున్నాయి. ఆఖరుకు పోలీసులు కూడా ప్రజలపై సాగిస్తున్న అణచివేత క్యాంపెయిన్‌కు 'జయ్ గుండాధుర్ అభియాన్' అని పేరు పెట్టుకున్నారు. దోపిడీ పాలకవర్గాలు మార్చ్ 8న మహిళా దినం జరపడంలోనూ, మే 1న కార్మికులకు శుభాకాంక్షల సందేశాలివ్వడంలోనూ ఎంత మోసం ఉందో గుండాధుర్ పేరెత్తుకోవడంలోనూ

అంతే మోసం ఉంది. నిరుడు పోలీసులు కొనసాగించిన 'జయ్ గుండాధుర్ అభియాన్'లో ఇక్కడికి దగ్గర్లోనే ఉన్న ఝూర గ్రామానికి చెందిన జోగా వంజామి అనే సాధారణ రైతు ప్రాణాలు కోల్పోయాడు. అతన్ని పట్టుకొని కాల్చేశారు. ఈ ఝూర గ్రామం ఒక నాడు బ్రిటిష్ సైన్యాల దురాగతాలకు సాక్ష్యంగా నిలిచిన చరిత్ర గలది. అయితే ఇలాంటి ఎన్నో గ్రామాలు ఇప్పుడు నేటి దళారీ పాలకవర్గాల పాశవిక నిర్బంధకాండను చవి చూస్తున్నాయి. పోల్చి చెప్పాల్సి వస్తే ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదం ప్రత్యక్షంగా పాలనను కొనసాగిస్తూ ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తే, ఈరోజున దళారీ బూర్జువా, భూస్వామ్య పాలకుల ప్రభుత్వాలు సామ్రాజ్యవాదంతో చెట్టాపట్టాలు వేసుకొని దేశ ప్రజల్ని చెప్పనలవి కాని దోపిడీపీడనలకు గురి చేస్తున్నాయి. కనుక 'భూంకాల్'ను గుర్తు చేసుకోవడమంటే, 'భూంకాల్' అమరులకు జోహార్లు తెలపడమంటే నేటి దోపిడీ వ్యవస్థను కూకటివేళ్లతో కూల్చివేయడానికి ప్రతిన బూనడమే తప్ప మరేమీ కాదు. ఇక్కడి ప్రజలకు దోపిడీ, అణచివేత, ఆకలి, పేదరికం, జబ్బులు, నిరుద్యోగం, నిరక్షరాస్యతల్ని మిగిల్చి పబ్బం గడుపుకుంటున్న దోపిడీ పాలకులకు అసలు 'భూంకాల్' పేరెత్తే హక్కు గానీ, గుండాధుర్ గురించి మాట్లాడే హక్కు గానీ లేదు. దోపిడీ పీడనల నుండి విముక్తి పొందాలంటే నేడు అనేక ప్రాంతాలలో, ముఖ్యంగా ఆంధ్ర, దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో రైతు-కూలీ రాజ్యం కోసం సాగుతున్న పోరాటంలో పాల్గొనడం తప్ప మరో మార్గమే లేదు. అందుకే నాటి 'భూంకాల్' పోరాటాన్నీ, అది నెలకొల్పిన వీరోచిత త్యాగసాంప్రదాయాల్నీ మననం చేసుకుంటూ ఇప్పుడు సాగుతున్న ప్రజాయుద్ధంలో మరింత దృఢంగా కొనసాగుదామని మనమంతా ప్రతిన బూనుదాం'' అంటూ కా. పాండు తన ప్రసంగాన్ని ముగించారు.

చివరన పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి కా. కోస మాట్లాడారు. ఆయన తన ప్రసంగంలో ఆనాడు 'భూంకాల్' వంటి ఒక గొప్ప తిరుగుబాటు ఓడిపోవడానికి దారి తీసిన కారణాలను పేర్కొన్నాడు. ''ఆనాటికి శాస్త్రీయ సిద్ధాంతంతో సాయుధమైన ఒక పార్టీ లేకపోవడం, సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడం వల్ల బస్తర్ ప్రజలు చేసిన తిరుగుబాట్లన్నీ కూడా చివరకు ఓటమినే చవి చూడాల్సి వచ్చింది. కానీ ఈనాడు మనం మార్క్సిజం-లెనినిజం-మావోయిజం అనే ఒక శాస్త్రీయ కమ్యూనిస్టు సిద్ధాంతంతో సాయుధమై పోరాడుతున్నాం. మనకీనాడు మన సైన్యం – ప్రజా గెరిల్లా సైన్యం– ఉంది. ఇంకా మన ఉద్యమం ఈనాడు అనేక గ్రామాలలో ప్రజారాజ్యాధికార అంగాల్ని నిర్మించి మొత్తం దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మార్చే దిశగా పురోగమిస్తోంది. నాటి ప్రజలు తమకున్న పరిమిత చైతన్యంతో నిర్మించిన 'మాడియా రాజ్యం' బలవంతుడైన శత్రువు ముందు ఎక్కువ కాలం నిలవలేకపోయింది. కానీ ఈనాడు మనం గ్రామ స్థాయిలో నిర్మిస్తున్న 'జనతన సర్కార్' (విప్లవ ప్రజా కమిటీ) ఉన్నత చైతన్యంతో అభివృద్ధి చెందుతూంది. ఈనాడు మనం గ్రామస్థాయిని దాటి మరింత విశాల పరిధిలో ప్రజా రాజ్యాధికార అంగాల్ని నిర్మించుకునే స్థితికి చేరుకున్నాం. ఈరోజు మనం 'భూంకాల్' దినాన్ని జరుపుకుంటున్నామంటే కార్మిక-కర్షక రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే లక్ష్యంతో మన విప్లవోద్యమాన్ని మరింత దృఢంగా పురోగమింపజేయాలనే మన సంకల్పాన్ని నొక్కి చెప్పడానికే. మావో చెప్పిన మూడు మంత్రదండాలైన బలమైన పార్టీ, బలమైన ప్రజా సైన్యం, ఐక్య సంఘటనలను మనం బలోపేతం చేసుకుంటూ ప్రాంతాలవారీగా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుంటూ, విముక్తి ప్రాంతాల్ని నిర్మించుకుంటూ దేశవ్యాప్త విజయాన్ని సాధించడానికి పురోగమిద్దాం.''

ప్రజాసైన్య విజయాలను ప్రస్తావిస్తూ కా. కోస ఈ సభకు సరిగ్గా నాలుగు రోజుల ముందు కోరాపుట్‌లో పీజీఏ సైనికులు జరిపిన సాహసోపేతమైన దాడిని ప్రజల విజయంగా అభివర్ణించాడు. ప్రజా గెరిల్లా సైన్యం ప్రజల మద్దతుతో అక్కడ దాడి చేసి వందలాది తుపాకుల్ని స్వాధీనం చేసుకున్న ఈ చర్య చరిత్రలో చిరకాలం గుర్తుండిపోయేదని అన్నాడు. శత్రువెంతటి బలవంతుడైనా ప్రజలపై ఆధారపడ్డ సైన్యం వాణ్ని తను బలమైన కోటలనుకునే చోట్ల కూడా చొరబడి దెబ్బతీయగల్గుతుందని ఈ దాడి ద్వారా పీజీఏ యోధులు నిరూపించారని చెబుతూ వారికి లాల్ సలాం చెప్పాడు.

ప్రభుత్వ సంస్కరణల బూటకత్వాన్ని వివరిస్తూ కా. కోస ''ప్రజలను విప్లవోద్యమం నుండి పక్కదారి పట్టించడానికి ప్రభుత్వాలు కోట్ల కొద్దీ డబ్బు గుమ్మరించి అనేక సంస్కరణల్ని ముందుకు తెస్తున్నారు. ఒకవైపు పోలీసు బలగాల్ని దించి హత్యలకూ, దౌర్జన్యాలకూ పాల్పడడం, మరోవైపు డబ్బులు వెదజల్లి సంస్కరణలు చేయడం పాలకులకే చెల్లింది. మన మౌలిక సమస్యలను పరిష్కరించలేని ఈ బూటకపు సంస్కరణలను తిప్పికొట్టాల''ంటూ ప్రజలకు పిలుపునిచ్చాడు.

రానున్న 14వ లోక్‌సభ ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ కా. కోస ''కూడూ, గూడూ, గుడ్డా, పనీ, విద్యా, వైద్యం వంటి ప్రజల మౌలిక సమస్యలను ఏ మాత్రం పరిష్కరించకుండా 'ఫీల్ గుడ్' అంటూ, 'షైనింగ్ ఇండియా' అంటూ పాలకవర్గాలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. పిడికెడు మంది దోపిడీదార్ల అభివృద్ధినే దేశాభివృద్ధిగా నమ్మబలుకుతున్నారు. మన విప్లవోద్యమాన్ని అణచడంలో ఒకరిని మించి ఒకరుగా పోటీ పడుతున్న పాలకవర్గ పార్టీలు ఇప్పుడు ఓట్ల కోసం మన దగ్గరికి రావాలని చూస్తున్నాయి. కనుక ఓట్ల కోసం వచ్చే పార్టీల బూటకత్వాన్ని ఎండగడదాం. ఎన్నికలను బహిష్కరిద్దాం. ప్రజల పాలనాంగాలైన 'జనతన సర్కార్'ను గ్రామగ్రామాన నిర్మిస్తూ పటిష్టం చేస్తూ వాటిని పెద్ద ఎత్తున విస్తరింపజేద్దాం. ఇదే మన దేశ పీడిత ప్రజలంతా అనుసరించాల్సిన ప్రత్యామ్నాయం'' అంటూ కా. కోస తన ప్రసంగాన్ని పూర్తి చేశాడు.

ఈ సభలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల గురించి ప్రత్యేకంగానే పేర్కొనాల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమం కోసం సిఎన్ఎం కళాకారుల బృందాలు అనేక రోజుల ముందే సన్నాహాలు మొదలు పెట్టాయి. నిజానికి 'భూంకాల్' దినానికి హాజరైన 10 వేల మందిలో అందరూ కళాకారులేనని చెప్పొచ్చు. ఎందుకంటే ఆటా, పాటా ఆదివాసీల జీవితంలోనే ఒక భాగం. ఒక చోట రాగం ఎత్తుకుంటే మరో చోట కోరస్ అందుకోవడం, పాటతో పాటుగా కాలు కదపడం ఆదివాసీ ప్రజలకు చాలా సహజంగా అబ్బే విద్య. అందుకే ప్రజలు సభకు రావడానికి బైలుదేరిన నాటి నుండే విడివిడిగా అనేక సాంస్కృతిక ప్రదర్శనలు మొదలయ్యాయని చెప్పొచ్చు. అనేక జట్లు తమంతట తాము గ్రామాల్లో పాడుకుంటూ, ఆడుకుంటూ 'భూంకాల్' గురించి ప్రచారం చేస్తూ సభకు చేరుకున్నాయి.

సిఎన్ఎం కళాకారులు సందర్భానికి తగినట్టుగా 'భూంకాల్' తిరుగుబాటుపై ఒక 'పీటో' (నాట్య రూపకం) తయారు చేసి ప్రదర్శించారు. ఇంకా అనేక పాటలు పాడి, ఆడి ప్రజలను ఉత్సాహపర్చారు. సాయంత్రం ఏడు గంటల నుండి మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు రాత్రి 11 గంటల దాకా సాగాయి. ప్రజలంతా ప్రదర్శనలను చివరి దాకా శ్రద్ధగా చూశారు. అమరవీరులకు జోహార్లు తెలుపుతూ చేతుల్లో దీపాలతో సిఎన్ఎం కళాకారులు చేసిన నాట్యం ప్రజలను బాగా ఆకట్టుకుంది. ఇటు వేదికపై సిఎన్ఎం కళాకారుల చేతుల్లో దీపాలు ప్రకాశిస్తుండగా, అటు వేలాది మంది ప్రజలు కొన్ని వందల చోట్ల నెగళ్లు వేయడంతో సభా స్థలమంతా దీపాలమయమైంది. సిఎన్ఎం కళాకారుల ప్రదర్శనలు పూర్తయింతర్వాత ప్రజలు అనేక జట్లుగా వేదిక పైకి వచ్చి తమ సాంప్రదాయ నాట్య రీతుల్ని ప్రదర్శించారు. 'భూంకాల్' పోరాటాన్ని కొనసాగించాలనే సంకల్పంతో, ప్రజా రాజ్యాధికారాన్ని నెలకొల్పి పటిష్టపర్చుకోవాలనే దీక్షతో ప్రజలు అక్కడి నుండి తిరుగు ప్రయాణమయ్యారు. ★

# మాడ్ ప్రాంతంలో విప్లవోత్సాహంతో జరిగిన 'భూంకాల్' దినం

బస్తర్ జిల్లాలోని మాడ్ ప్రాంతానికి చారిత్రికంగా విశిష్ట స్థానం ఉంది. ఎత్తైన కొండలకూ, దట్టమైన అడవులకూ, విలువైన ప్రకృతి సంపదలకూ పేరుగాంచిన ఈ ప్రాంతంలో బ్రిటిష్ వలసవాద పాలనకు వ్యతిరేకంగా ప్రజలు అనేక తిరుగుబాట్లు జరిపారు. బస్తర్‌లో జరిగిన కొన్ని తిరుగుబాట్లకు ఈ ప్రాంతం కేంద్రంగా ఉండేది. భారత ప్రథమ స్వాతంత్ర సంగ్రామానికి చాలా ముందుగా, 1825లో జరిగిన పరాల్‌కోట్ తిరుగుబాటు నాయకుడు గేంద్‌సింగ్ ఈ ప్రాంతం వాడే. ఆంగ్ల-మరాఠా పాలకులు గేంద్‌సింగ్‌ను బంధించి ఉరితీశారు. తిరుగుబాటును అణచివేశారు. అయినా ప్రజల స్వాతంత్రేచ్ఛ అణగారిపోలేదు. 1910లో బస్తర్ ఆదివాసీ ప్రజలు జరిపిన మరో గొప్ప తిరుగుబాటు – 'భూంకాల్' పోరాటంలో కూడా మాడ్ ప్రాంతం గొప్ప కేంద్రంగా ఉండింది. 'భూంకాల్' అంటే విస్తృత ప్రకంపన అనీ, సామూహిక తిరుగుబాటు అనీ అర్థం. బస్తర్ ప్రజలు జరిపిన అనేకానేక తిరుగుబాట్లలో 'భూంకాల్'ను తీవ్రత రీత్యా, విస్తృతి రీత్యా ఉన్నత శ్రేణికి చెందినదిగా చెప్పుకోవచ్చు. 'భూంకాల్' పోరాటంలో ఈ ప్రాంతంలోని ఊళ్లకు ఊళ్లే తిరుగుబాటు జెండానెగురేసి గొప్ప త్యాగసాంప్రదాయాలను నెలకొల్పాయి. ఆధునిక ఆయుధాలను కలిగి ఉన్న బ్రిటిష్ సైన్యాన్ని ఇక్కడి ఆదివాసీ ప్రజలు విల్లుబాణాలు, భర్మార్లు వంటి తమ సాంప్రదాయ ఆయుధాలతో వీరోచితంగా ఎదుర్కొన్నారు. అయితే బ్రిటిష్ పాలకులు తమ పశు బలంతో ఈ తిరుగుబాటును కూడా అణచివేశారు. ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన గుండాధూర్ బస్తర్ ప్రజల తిరుగుబాటుగా సంకేతంగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.



మరో భూంకాల్‌కు సిద్ధమంటున్న మాడ్‌వాసి

'భూంకాల్' పోరాటానికి మరో విశిష్టత కూడా ఉంది. ప్రజలు తమపై ఆంగ్ల-మరాఠా పాలకులు సాగిస్తున్న దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాడి తమ రాజ్యాన్ని తామే ఏలుకుంటామని ప్రకటించారు. ఫిబ్రవరి 7న 'మాడియా రాజ్యాన్ని' ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ 'మాడియా రాజ్యం' ఎక్కువ కాలం మనలేకపోయింది. 12వ తేదీకల్లా అది బ్రిటిష్ సైన్యాల అణచివేతకు బలైపోయింది. ఆ విధంగా 'భూంకాల్' పోరాటాన్ని ఆదివాసులు తమ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడం కోసం సాగించిన పోరాటంగా చెప్పుకోవచ్చు. ప్రజా రాజ్యాధికార స్థాపనా లక్ష్యంతో ఇక్కడ సాగుతున్న విప్లవోద్యమం మొట్టమొదటి సారిగా ఈ సంవత్సరం ఫిబ్రవరి 10న 'భూంకాల్' దినం జరుపుకోవాలని నిశ్చయించింది. స్థానిక ప్రజా సంఘాలు అందుకు సముచితమైన స్థలంగా నేల్‌నార్ అనే గ్రామాన్ని ఎంపిక చేశాయి. ఈ గ్రామానికి చెందిన అనేక మంది ఆనాటి తిరుగుబాటులో తమ ప్రాణాల్ని త్యాగం చేశారు.

అయితే అప్పటి వలస పాలకులూ, ఈనాటి దళారీ పాలకులూ కూడా ఈ ప్రాంత ప్రజల తిరుగుబాట్లకు చరిత్రలో సముచిత స్థానం కల్పించకుండా ద్రోహమే చేశారు. ఇంతటి గొప్ప పోరాట చరిత్ర కలిగిన ఈ ప్రాంతం ఇప్పటి దాకా బైటి వాళ్ల దృష్టిలో 'అబూర్ఝ్‌మాడ్'గా ఉండిపోవడం దోపిడీ పాలకుల కుట్ర ఫలితమే తప్ప మరేమీ కాదు. ('అబూర్ఝ్' అంటే 'తెలియని' లేదా 'అర్థం కాని' అని అర్థం) 1980లో దండకారణ్యంలోకి ప్రవేశించిన విప్లవోద్యమానికి ఈ ప్రాంతం దాకా విస్తరించడానికి మరో ఐదేళ్లు పట్టింది. 1985 నుండి ఈ ప్రాంత ప్రజలు క్రమక్రమంగా విప్లవోద్యమంలో సంఘటితపడుతూ వచ్చారు. విప్లవోద్యమ కృషి ఫలితంగా 1999 నుండి ఇక్కడి ప్రజలు వెనుకబాటుకూ, అవమానానికీ మారుపేరుగా నిలిచిన 'అబూర్ఝ్' అనే విశేషణాన్ని తీసి పక్కన పడేసి తమ ప్రాంతాన్ని 'మాడ్'గానే పిలవాలని బైటి ప్రపంచాన్ని కోరుతున్నారు. ఆఖరుకు బూర్జువా మీడియా కూడా ఇప్పుడు 'అబూర్ఝ్' అనకుండా 'మాడ్'గానే వ్యవహరించడం మొదలు పెట్టాయి.

స్థానిక ప్రజా సంఘాలు దాదాపు నెల రోజుల ముందు నుండే గ్రామగ్రామానికీ, ఇంటింటికీ వెళ్లి 'భూంకాల్' దినం గురించి ప్రచారం మొదలు పెట్టాయి. డిఏకెఎంఎస్, కెఏఎంఎస్ కార్యకర్తలు వందల సంఖ్యలో కదిలి ఈ ప్రచార క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు. దాదాపు 50 మంది వలంటీర్లు సభ జరిగే స్థలంలో వేదిక నిర్మాణం, స్తూపం అలంకరణ వగైరా పనుల్లో పాల్గొన్నారు. దాదాపు 10 ఎకరాల స్థలాన్ని చదును చేసి అందులో మట్టితో విశాలమైన వేదిక నిర్మించారు. సభా స్థలాన్నంతా ఎర్ర తోరణాలతోనూ, బ్యానర్లతోనూ అలంకరించారు. పిజిఏ బలగాలు ఈ సభ నిర్వహణకు పూర్తి రక్షణ కల్పించడం కోసం రాత్రింబవళ్లూ ఒళ్లంతా కళ్లు చేసుకొని అన్ని దారుల్నీ కాపలా కాశాయి. సభ స్థలానికి 30-25 కిలోమీటర్ల దూరంలో నారాయణ్‌పూర్, చోటాడోంగర్‌లలో వందలాది పోలీసు, పారా మిలిటరీ బలగాలు తిష్ట వేసి గస్తీని ముమ్మరం చేసినప్పటికీ సభ జరిగే స్థలం గురించి ఎలాంటి సమాచారం తెలియనివ్వకుండా ప్రజలు రహస్యాన్ని పాటించారు. నిజానికి ఇక్కడి ప్రజలకు రహస్యాన్ని కాపాడడం కొత్తేమీ కాదు. గతంలో జరిగిన తిరుగుబాట్ల చరిత్రను అధ్యయనం చేస్తే ఒక ఊరి నుండి మరో ఊరికి తిరుగుబాటు సందేశం ఎంతో గోప్యంగా, పకడ్బందీగా చేరవేసే వాళ్లని తెలుస్తుంది. అదే సాంప్రదాయాన్ని ఇప్పుడు మరింత చైతన్యంతో పాటిస్తూ ప్రజలు మాడ్ ప్రాంత చరిత్రలోనే మొదటి సారి నిర్వహించిన ఈ అతి పెద్ద కార్యక్రమం గురించి పాలకవర్గాలకూ, వాళ్ల తొత్తు బలగాలకూ ఎలాంటి సమాచారం దొరక్కుండా జాగ్రత్త పడ్డారు. ఇక పిజిఏలో పునాది బలగమైన ప్రజా మిలిషియా యూనిట్లు శత్రు బలగాలను అడ్డుకోవడానికి చేసిన ఏర్పాట్లు చీమ కూడా జొరబడలేనంత విస్తృతంగా, పకడ్బందీగా ఉన్నాయి. ఇక్కడి ప్రజా సంఘాల ఆహ్వానంపై 'సహారా సమయ్', 'బీబీసీ' ఛానళ్ల విలేఖర్లు కూడా ఈ కార్యక్రమం కవరేజ్ కోసం వచ్చారు.

ఫిబ్రవరి 10న సభ జరిగే నేల్‌నార్ గ్రామానికి చేరుకునేందుకు దూరాన్ని బట్టి రెండు, మూడు రోజుల ముందుగానే ప్రజలు బయలు

*(తరువాయి 42వ పేజీలో........)*